వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

సంపుటి : 11 సంచిక : 9 హైదరాబాద్ 146 సెప్టెంబర్ 2013 పేజీలు : 68 రు. 15

- 1956 విలీనం రద్దా? రాష్ట్ర విభజనా?
  - ప్రజాభిప్రాయాలు - ఏడు వ్యాసాలు
- గ్రామ పంచాయతీ ఎన్నికలు
- దిగజారుతున్న రూపాయి విలువ
- మత విద్వేషాల 'మోడీ'కరణ
- ఢిల్లీ ఎన్‌కౌంటర్ - దెబ్బతిన్న న్యాయం
- ఈజిప్ట్‌లో వాడిపోయిన వసంతం

ISSN 2231-6892

146

వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

సెప్టెంబర్ 2013

సంపుటి : 11

సంచిక : 9

లోపలి పేజీల్లో...

అసహజ మరణాల సూచి జిల్లాల కరస్పాండెంట్లు

ఆదిలాబాద్ – సి.ఎచ్. శ్రీమన్నారాయణ మూర్తి; హైదరాబాద్ – డి. విజయభాస్కర్; కరీంనగర్ – ద్యామర రేణుక; ఖమ్మం – సి.ఎచ్. గిరిజ; మెదక్ – ఎన్. భగవాన్‌రెడ్డి; మహబూబ్‌నగర్ – మహమ్మద్ ఇక్బాల్; నల్గొండ – గొడిశాల వెంకటేశ్వర్లు; నిజామాబాద్ – ఎం. నర్సయ్య; రంగారెడ్డి – వి. శంకరయ్య; వరంగల్ – ఎ.కుమార్; అనంతపూర్ – కె. నాగేశ్వరాచారి; చిత్తూరు – పలమనేరు బాలాజి; కర్నూలు – జి.వి. సుధాకర్ రెడ్డి; నెల్లూరు – బాలగురువయ్య; విజయనగరం – డి. సుధాకర్; విశాఖపట్నం – పి.వి. రమణ; శ్రీకాకుళం – డి. రవికుమార్

ప్రింటర్స్
డక్కన్ ప్రెస్ / చరితా ఇంప్రెషన్స్
ఆజామాబాద్, హైదరాబాద్
ఫోన్ : 040 - 27678411

డిస్ట్రిబ్యూటర్స్
ఆనంద్ ఏజన్సీస్
హైదరాబాద్
ఫోన్ : 98484 28516
92468 26191

'వీక్షణం' పేరిట ఎం.ఓ.లు, చెక్కులు, డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం
మైత్రి రెసిడెన్సీ, 3-6-394,
స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029.
ఫాక్స్, ఫోన్ : 040-66843495
Email : veekshanam2003@gmail.com
www.veekshanam.wordpress.com

వీక్షణం చందా వివరాలు

	సంస్థలకు / లైబ్రరీలకు	వ్యక్తులకు	విద్యార్థులకు
విడి ప్రతి	రు. 15	రు. 15	రు. 15
సంవత్సరం	రు. 180	రు. 150	రు. 120
మూడు సంవత్సరాలు	రు. 500	రు. 400	రు. 350
ఐదు సంవత్సరాలు	రు. 800	రు. 650	–
పది సంవత్సరాలు	రు. 1500	రు. 1300	–

వీక్షణం అకౌంట్ నెంబర్ - **013911011002175**

ఆంధ్రాబ్యాంక్, గగన్‌మహల్ బ్రాంచ్, హైదరాబాద్

ఇతర బ్యాంకులలో వేసేవారు **ANDB 000/0139** నెంబర్ రాసి వేయవచ్చు.

పాఠకుల వీక్షణం - ఒక గమనిక, ఒక విజ్ఞప్తి

పత్రికా సంపాదకులకు పాఠకులు రాసే ఉత్తరాల మీద వీక్షణంకు చాల గౌరవం ఉంది. ఆ ఉత్తరాలలో ప్రజాభిప్రాయం వ్యక్తమవుతుందని, ఆ అభిప్రాయం ఆ ఉత్తర రచయిత ఒక్కరిదే కాకపోవచ్చునని, అటువంటి అభిప్రాయం ఉండేవారు మరికొందరైనా ఉంటారని వీక్షణం భావిస్తుంది. అలా మరెందరికో ప్రాతినిధ్యం వహించే అభిప్రాయ వ్యక్తీకరణ స్వేచ్ఛగా, నిరాటంకంగా జరిగితే మంచి చర్చకు అవకాశం ఉంటుందని కూడ వీక్షణం భావిస్తుంది. కొన్ని ఇంగ్లిష్ పత్రికలలో లెటర్స్ టు ది ఎడిటర్ శీర్షికలో డజన్ల కొద్దీ ఉత్తరాలు వేసే మంచి సంప్రదాయం ఉంది. ఆ సంప్రదాయం తెలుగులోకి ఇంకా పూర్తిగా రాలేదు. అందుకే వీక్షణం రచనల మీద వ్యక్తిగతంగానూ, ఫోన్లలోనూ మాట్లాడే వందలాది మందితో 'ఒక్క వాక్యమైనా సరే ఉత్తరం రాయండి, మీ అభిప్రాయానికి చాల విలువ ఉంది. అది మరొకరిలో సమాన భావనలను గాని, వ్యతిరేకతను గాని, కనీసం ఆలోచనను గాని ప్రేరేపిస్తుంది. తద్వారా సమాజానికి అవసరమైన విషయాల మీద చర్చ జరుగుతుంది' అని మేం చెపుతుంటాం. అయినా ఇప్పటికీ వీక్షణంకు వస్తున్న ఉత్తరాల సంఖ్య తక్కువే. తెలుగు పత్రికలలో ఈ సంప్రదాయమే పెద్దగా లేదు గనుక, ఇప్పుడే ఇంగ్లిష్ పత్రికలలో లాగ ఉత్తరాలను ఎడిట్ చేయడం, కత్తిరించడం, కుదించడం చేయగూడదని మేం అనుకుంటున్నాం. నాలుగైదు సంవత్సరాల కింద ఒక ఉత్తరాన్ని కేవలం స్థలాభావం దృష్ట్యా కుదిస్తే, ఆ ఉత్తర రచయిత తీవ్రంగా ప్రతిస్పందించారు. తన అభిప్రాయాన్ని కత్తిరించారని సంపాదకులకు దురభిప్రాయాలు ఆపాదించారు. అప్పటినుంచీ ఉత్తరాల శీర్షికలో రచయితలు రాసినదంతా దాదాపుగా అచ్చువేస్తున్నాం. కాని ఈ అవకాశాన్ని తీసుకుని ఈ మధ్య ఉత్తరాల రచయితలు, వ్యాస రచయితల మీద, తోటి ఉత్తరాల రచయితల మీద వ్యక్తిగత విమర్శలు, దాడులు, నిందలు సాగిస్తున్నారు. విషయాన్ని గంభీరంగా, వస్తుగతంగా చర్చించడం చాల అవసరమే గాని అటువంటి వ్యక్తిగత విమర్శలతో, దాడులతో సాధించగలిగేదేమీ ఉండదు. ఉత్తర రచయితలందరికీ తమ అభిప్రాయాల్ని, వాదనల్ని స్వేచ్ఛగా చెప్పుకునేందుకు అవకాశం ఉంది కాని దాన్ని దుర్వినియోగం చేసి ఇతరుల మీద పరుషవ్యాఖ్యలు చేయడం మంచిది కాదు. ఇక నుంచి అయినా ఉత్తర రచయితలు ఈ జాగ్రత్తను పాటించాలని సవినయంగా విజ్ఞప్తి చేస్తున్నాం. ఆ జాగ్రత్తను ఉత్తరాల రచయితలు పాటించక పోతే, ఉత్తరాలను కత్తిరించే, కుదించే, ఎడిట్ చేసే హక్కును సంపాదకవర్గం వినియోగించుకోవలసి వస్తుంది. ఉత్తరాల ఎడిటింగ్ మీద చర్చోపచర్చలకు అవకాశం ఉండదు. ఉత్తరాలు రాసేటప్పుడు ఇతరుల అభిప్రాయాల పట్ల ప్రజాస్వామిక దృక్పథాన్ని, చర్చా సంప్రదాయపు మర్యాదలను, పద్ధతులను, సంపాదకుల ఇబ్బందిని గమనంలో ఉంచుకోవలసిందిగా పాఠకులకు, ఉత్తరాల రచయితలకు, వ్యాస రచయితలకు అందరికీ విజ్ఞప్తి చేస్తున్నాం. **- సం.**

వీక్షణం ఆర్థిక స్థితి గురించిన విజ్ఞప్తికి ప్రతిస్పందనగా పి. బాలాజి వరప్రసాద్ (హైదరాబాద్) రు. 2,500; వి. మధుసూదన్ రెడ్డి రు. 3,000 ఆర్థిక సహాయం అందించారు. వారికి కృతజ్ఞతలు.

'దిగ్విజయ మాయాజాలంలో తెలంగాణం' వ్యాసం, కేంద్ర ప్రభుత్వ ప్రకటన తరువాత, కొంత కాలం చెల్లిన విషయం లాగ ఉంది. పిట్ట పోరు పిట్ట పోరు పిల్లి తీర్చినట్లుంది. కెసిఆర్ మొదటి ప్రకటనలోనే పెట్టుబడులు వరదలాగ రావాలని అన్నట్లు పత్రికల్లో చదివాను. ఇక రెండు రాష్ట్రాల నడుమ పెట్టుబడులు ఆకర్షించే పోటీ, దానికి బహుళజాతి సంస్థలకు, దేశీయ పెట్టుబడిదారులకు రాయితీలు, సౌకర్యాలు, వనరులు సమకూర్చే పోటీ మొదలవుతుందేమో. ప్రజల ప్రాథమిక అవసరాలు తీర్చలేనపుడే, ఏదో ఒకరి మీద ద్వేషం పెంచి పబ్బం గడుపుకోవాలి. ఇంతకాలం ఈ సమస్యతో తలపడిన విప్లవకారులు, దీనికి ఒక ఉన్నతమైన పరిష్కారం వైపు నడిపించే రాజకీయ, సైద్ధాంతిక శక్తి ప్రదర్శించలేదనే భావించాలి.

కారణాలు ఏమైనా, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ప్రకటన జరిగింది. కొంత సంతోషించాల్సిన విషయం. టిఆర్ఎస్‌తో, కెసిఆర్‌తో సంబంధం లేకుండా జరిగింది. తెలంగాణ ఏర్పాటుకు హైదరాబాదే ఆటంకం - సమైక్య రాష్ట్రం అనే సెంటిమెంట్ మాత్రమే ఆందోళనకు మూలం కాదు. మూడు ప్రాంతాలకు ఆయువు పట్టు అయిన ప్రాంతం ఒకరి అధికారంలో కాకుండా సమష్టి అధికారంలో, లేదా మూడవ వారి అధికారంలో ఉండాలని కోరుకోవడం తెలంగాణ కోరుకోవడం లాగానే ప్రజాస్వామికం. ప్రజాస్వామిక హక్కులు అమూర్తంగా కాకుండా నిర్దిష్ట పరిస్థితి మీద ఆధారపడి ఉంటాయి. రోజూ కోస్తా, రాయలసీమ ప్రాంతాల నుండి (సీమాంధ్ర అనే తిట్టుగా మారిన పదం కాకుండా) హైదరాబాద్‌కు వచ్చే రెండు వేలకు పైగా బస్సులే హైదరాబాద్‌తో ఏర్పడిన సంబంధానికి నిదర్శనం.

అర్ధ-ఫాసిస్ట్ ధోరణిలో టిఆర్ఎస్ ఇప్పటికే రూపం దిద్దుకుంది. దీనికి అవసరమైన దురభిమానం, విద్వేషాన్ని పెంచే ప్రకటనలు, కళాకారుల పాటలు (ఇందిరా పార్కు వద్ద ప్రదర్శనలకు వెళ్లిన వారెవరైనా విని ఉంటారు). తెలంగాణ ప్రాంతం, సంస్కృతి అనేవి వైరుధ్యాలు లేని శిలాసదృశం అనే ఫాసిస్ట్ భావన పరోక్షంగానైనా మాజీ విప్లవకారులు, వామపక్ష మేధావులు పెంచి పోషించారు. టిఆర్ఎస్‌కు అవసరమైన లంపెన్, దిగువ మధ్యతరగతి, ఉద్యోగుల సామాజిక పునాదికి ఇప్పటికే అరచేతిలో వైకుంఠం కెసిఆర్ చూపించాడు - ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లు, ఉద్యోగాలు, విద్యా, భూమి, దేశంలో ప్రథమ స్థానం రూపంలో - సామాజిక ఉత్పత్తి మీద పెట్టుబడి విధించే బంధనాలు విచ్ఛిన్నం చేయకుండా ఇవి సాధ్యం కాదు అనే విషయం కెసిఆర్‌కు, ఆ సంస్థ వెనుక ఉన్న నయా ధనిక వర్గానికి (వీరిలో మాజీ విప్లవకారులు ఉన్నారు) తెలుసు. ఇక మిగిలింది, చూపించిన ఆశలు ప్రలోభాలకి అడ్డం ఇక్కడ ఉన్న కోస్తా, రాయలసీమ ప్రాంతీయులేనని ప్రచారం చేయడం. తెలుగు శివసేనగా మారడం. వాళ్లు వెళ్లకపోతే మనకు ప్రమోషన్లు రావు అనే ప్రకటన ఈ నేపథ్యంలోనే చూడాలి. ఉదాహరణకు, కోస్తా, రాయలసీమ ప్రజల్లో ఓటర్ జాబితా, రేషన్ కార్డులు తారుమారు చేయాలంటే వీరి సహకారం అవసరం. దాడులు జరపాలంటే లంపెన్ శ్రేణులు ఇప్పటికే ఉన్నాయి. ఇది ఇదే క్రమంలో జరగాలని లేదు. టిఆర్ఎస్ దారిలో దానికంటే ఫాసిస్ట్ లక్షణాలు ఉన్న సంస్థను ఈ వర్గాలు నిలబెట్టవచ్చు. విప్లవకారులు ఈ ప్రమాదాన్ని ఎదిరించి - ప్రస్తుతం ఉన్న సంస్థలు, వాటి ఆచరణ, భవిష్యత్తులో ఉండగల సంస్థల గురించి ఊహాగానాలు చేయలేం - నిలబడగలరనే విశ్వాసం ఏదీ లేదు. హైదరాబాద్ రెండు, మూడు దశాబ్దాల పాటు కేంద్ర పాలిత ప్రాంతంగానో, ఉమ్మడి రాజధానిగానో ప్రకటించి ఈ ప్రమాదాన్ని కొంత నిలవరించవచ్చు.

ముంబాయి విషయంలో అంబేడ్కర్ ఏనాడో చెప్పిన దానిని తారక మంత్రం లాగా జపించనవసరం లేదు. నల్లగొండ, మహబూబ్‌నగర్‌లోని ప్రాంతాలను హైదరాబాద్ పరిధిలోకి తీసుకు వస్తే కోస్తా, రాయలసీమలతో భౌగోళిక సంబంధం ఏర్పడుతుంది. హైదరాబాద్‌లోని కోస్తా, రాయలసీమ వాసుల సంగతి ఎలా ఉన్నా, దొడ్డి కొమురయ్య, షోయబుల్లా ఖాన్ గురించి మాత్రం ఆందోళన పడవలసిందే.

- కె. నరేంద్రమోహన్, *ఆస్ట్రేలియా*

'దిగ్విజయ మాయాజాలంలో తెలంగాణం' అన్న నా వ్యాసంలో ప్రస్తావించిన విషయాలకు కేంద్ర ప్రభుత్వ ప్రకటన తర్వాత కాలం చెల్లిపోయిందని నరేంద్ర మోహన్ తమ లేఖలో స్పందించారు. నిజమే, ప్రకటన అయితే వచ్చింది కాని తెలంగాణ ప్రజల భయాలకు ఇంకా కాలం చెల్లిపోలేదు. ఒకసారి దెబ్బతిన్న ప్రాణం కదా! ఒకసారి కాదు ఎన్నో సార్లు. 1956లో ఫజుల్ అలీ కమీషన్ రిపోర్ట్ ఇచ్చినపుడు నెహ్రూ, సర్దార్ పటేల్ లాంటి హేమాహేమీలనే ఏమార్చారు. 1969 తెలంగాణ ఉద్యమానికి బదులుగా 1972 జై ఆంధ్రా ఉద్యమం లేవనెత్తారు. 2009 చిదంబరం ప్రకటనను పూర్వ పక్షం చేస్తూ శ్రీ కృష్ణ కమిటీ అన్నారు, సంప్రదింపులు అన్నారు. స్వతంత్రంగా ఎగరాలనుకుంటున్న తెలంగాణ బంగారు పిచ్చుకను సీమాంధ్ర రాజకీయ డేగలు తమ రెక్కలతో కమ్మి వేయాలని, తమ రక్కసి కాలి గోళ్ల కింద అణిచి పెట్టాలని కాచుకునే ఉన్నారు. పిట్ట పోరు పిట్ట పోరు అని చాల సింపుల్‌గా తీసి పారేసే ప్రయత్నం చేసారు నరేంద్రగారు. ఇది పిట్టకు పిట్టకు మధ్య పోరు కాదు. పిట్టకు డేగకు మధ్య పోరు. చలిచీమల చేత చిక్కిన బలవంతమైన సర్పంలా ఉంది ఇప్పుడు సీమాంధ్ర రాజకీయ నాయకుల పరిస్థితి. రెండు రాష్ట్రాల మధ్య బహుళ జాతి సంస్థలకు, పెట్టుబడి దారులకు రాయితీలు సమకూర్చే పోటీ మొదలు అవుతుందేమోనని ఎద్దేవా చేసారు నరేంద్ర మోహన్. తెలంగాణ ఉద్యమాన్ని విమర్శించే పండితులంతా ఒక్క విషయం గుర్తు పెట్టుకోవాలి. కెసిఆర్ గాని, కోదండరాం గాని ప్రజాస్వామ్య తెలంగాణనో, దోపిడీకి పీడనకు తావు లేని తెలంగాణనో సాధిస్తామని చెప్పలేదు. భారత రాజ్యాంగం పరిధిలో భౌగోళిక తెలంగాణ కోసం ఈ ఉద్యమం అన్నారు. రాబోయే తెలంగాణలో సర్వసుఖాలు అందరికి లభిస్తాయని, దోపిడీ ఉండదని, సమ సమాజం పరిఢవిల్లుతుందని తెలంగాణ ఉద్యమకారులకేమి భ్రమలు లేవు. మాకు పోయేదల్లా సీమాంధ్రుల

(మిగతా 63వ పేజీలో...)

సిడబ్ల్యుసి తీర్మానం తర్వాత ...

తెలుగుజాతి చాల ప్రగతిశీలమైనదనీ, న్యాయాన్యాయ విచక్షణ చేస్తుందనీ, సామాజిక న్యాయభావనతో సొంత లాభం కొంత మానుకుని పొరుగువాడికి తోడుపడుతుందనీ, దేశమంటే మట్టికాదు, మనుషులని అనుకుంటుందనీ వంద సంవత్సరాలుగా చెప్పుకుంటున్న గొప్పలన్నీ ధ్వంసమవుతున్న నిరాశామయ పరిస్థితులు ఇవాళ రాష్ట్రంలో నెలకొన్నాయి. మా న్యాయమైన వాటా మాకు రావాలి అనే సహజ న్యాయసూత్రంపై ఎవరైనా ఆందోళన చేయవచ్చు, కాని అంతా మాకే కావాలి, ఇతరులకు ఏ హక్కులూ ఉండగూడదు అనీ, ఇప్పటిదాకా సాగిన దోపిడీ పీడనలను ఇకముందు కూడ కొనసాగించే హక్కు కావాలి అని ఆందోళనలు సాగడం, పిడికెడు మంది స్వార్థపరుల కుటిల ప్రయత్నాలకు, అబద్ధాలకు, వాస్తవాల దాటవేతకు సమాజంలో అత్యధికులు అమాయకంగా బలి కావడం ఆధునిక తెలుగుజాతి విషాదం. ఈ పరిణామం ఆలోచనాపరుల కళ్ల మీద కూడ ఎటువంటి పొరలు కప్పుతున్నదంటే, విజ్ఞులూ నిపుణులూ తాత్వికులూ బుద్ధిమంతులూ అని పేరుపడిన మేధావులు కూడ న్యాయాన్యాయ భావనను పక్కనపెట్టి తాము పుట్టిన ప్రాంతంలోని అన్యాయమైన ఆందోళనకు వంత పాడుతున్నారు. కళ్లముందర భయోద్విగ్నంగా సాగిన చరిత్రనూ, పరిణామాలనూ మరచిపోతున్నారు. ఆరు దశాబ్దాల దోపిడీనీ, పీడననూ, వాగ్దాన భంగాలనూ, వివక్షనూ, అన్యాయాలనూ చూసీచూడనట్టు నటిస్తూ, ఆ అక్రమ విధానాల పాలకుల కన్న ఎక్కువ దుర్మార్గానికి పాల్పడుతున్నారు.

ప్రగతిశీల ఆలోచనాపరులు పాటించవలసిన కనీస విలువ పాలకులకూ ప్రజలకూ మధ్య తేడా చూడగలగడం. ప్రజల ఆశలను, ఆకాంక్షలను సమర్థిస్తూనే, పాలకుల స్వార్థప్రయోజనాల నుంచి వాటిని వేరు చేయడం. చారిత్రక, సాంస్కృతిక తేడాలు ఎన్ని ఉన్నప్పటికీ తెలుగు నేల ప్రజలంతా ఒకటే. ఒకరు ఎక్కువా కాదు, ఒకరు తక్కువా కాదు. కాని 1956 విలీనం తర్వాత ఆంధ్ర ప్రాంతపు పాలకులు, రాజకీయ నాయకులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం సాగించిన అక్రమ విధానాల వల్ల తెలంగాణ ప్రజా జీవనం అస్తవ్యస్తమైపోయింది. ఆ నేపథ్యంలో తెలంగాణ ప్రజలు తమ హక్కులను కోరుతున్నారు. ఆ హక్కులను సమర్థించడం ఆలోచనాపరులందరి బాధ్యత. గతంలో జరిగిన అన్యాయాన్ని సరిదిద్దుతున్న సమయంలో వర్తమానంలో మరొక అన్యాయం జరగగూడదని, ఒక తప్పును మరొక తప్పుతో సవరించలేమని జాగ్రత్త చెప్పవచ్చు. కాని పాత అన్యాయాలు, పాత తప్పులు అలాగే కొనసాగాలని వాదించడం అనైతికం, అక్రమం. దురదృష్టవశాత్తూ ఇవాళ తెలుగుసీమలో అత్యధిక ప్రాంతాలలో జరుగుతున్న ఆందోళన అటువంటి అనైతిక, అక్రమ ప్రాతిపదిక మీద సాగుతున్నది.

చర్విత చర్వణమే అయినా ఇవాళ్టి సందర్భంలో గడిచిన చరిత్రను మళ్లీ ఒకసారి పునరుక్తం చేయవలసి ఉంది. తెలుగుజాతి అనేక చారిత్రక కారణాల వల్ల మధ్యయుగాలలో వేరు వేరు పాలనల కిందికి వెళ్లింది. రెండు ప్రాంతాలలోను ఆధునిక యుగ వికాసమంతా వేరు వేరు పాలనల కింద, వేరు వేరు వాతావరణాలలో సాగింది. ఒకచోట భూస్వామ్య, రాచరిక పాలకులు, మరొకచోట వలసవాద, స్థానిక దళారీ పాలకులు ఆధిపత్యం సాగించారు. రాచరిక పాలకులు తమ ప్రజల విద్యావికాసాల అవకాశాల మీద పరిమితులు విధించగా, వలస పాలకులు తమ అవసరాల కోసమైనా విద్యావికాసం కలిగించారు. రెండు ప్రాంతాల సామాజిక చలనాలు భిన్నంగా సాగాయి. ఒకచోట భూస్వామ్య స్థిరత్వం, మందకొడితనం, మరొకచోట పెట్టుబడిదారీ, దళారీ కదలిక, చలాకీతనం సాగాయి. సమస్థాయిలో లేని ఈ రెండు ప్రాంతాలను, సమూహాలను మళ్లీ ఏకం చేయాలనే ఆలోచన వచ్చినప్పుడు, ఆ విలీనం షరతుల మీద సాగడం అవసరమనేది ఒక సహజ న్యాయ సూత్రం. భారత రాజ్యాంగం ఆమోదించిన రక్షణాత్మక విచక్షణ సూత్రానికి లోబడిన షరతులు అవి. కాని ఆంధ్ర ప్రాంత పాలకులు ఆ షరతులను పదేపదే ఉల్లంఘించారు. ఎన్నిసార్లు ప్రజల నుంచి ఆ ఆకాంక్ష వెల్లుబికినా అన్ని సార్లూ తొక్కిపట్టారు, అణచివేశారు, కొత్త వాగ్దానాలు చేసి, మళ్లీ నమ్మకద్రోహం చేశారు. తెలంగాణ నాయకత్వాన్ని కొనివేశారు. ఈ చరిత్రలో తెలంగాణ నాయకుల దగుల్బాజీతనం పాత్ర తక్కువదేమీ కాదు.

ఇలా ఆంధ్ర ప్రాంత నాయకుల పాలనా విధానాల వల్ల తెలంగాణ ప్రాంత ప్రజల న్యాయమైన వాటాకు, అభివృద్ధికి కొరత ఏర్పడింది. ఆ పాలకులు తెలంగాణ ప్రజలను, వనరులను దోచి ఆంధ్ర ప్రాంత ప్రజలకు పెట్టినదేమీ కూడ లేదు. సమైక్య రాష్ట్ర పాలకులు రెండు ప్రాంతాల ప్రజలనూ దోచి తాము బాగుపడ్డారు. వేల, లక్షల కోట్ల రూపాయల ఆస్తులకు పడగెత్తారు. తమకు సామాజిక పునాది కల్పించుకోవడం కోసం కొన్ని ఉద్యోగాలో, కొన్ని నీళ్లో, కొన్ని అవకాశాలో ఆంధ్ర ప్రాంత ప్రజలకు విదిలించారు. నిజానికి అది కూడ ఆంధ్ర ప్రాంత ప్రజలకు న్యాయంగా దక్కవలసిన వాటాకన్న చాల తక్కువ. సమైక్య రాష్ట్రంలో ఇటు తెలంగాణ ప్రజలకూ అన్యాయం జరిగింది. ఆంధ్ర ప్రజలకూ రావలసినంత రాలేదు. ఆంధ్ర పాలకులు, వారి మోచేతి నీళ్లు తాగిన తెలంగాణ పాలకులు ఇబ్బడిముబ్బడిగా లాభపడ్డారు.

ఆ పాలక విధానాల కింద తమ వాటా తమకు దక్కడం లేదని, వాటా ఇస్తామని పదే పదే చేసిన వాగ్దానాలు మళ్లీ మళ్లీ ఉల్లంఘనకు గురవుతున్నాయని, అందువల్ల విలీనం రద్దయి, తమ పాత రాష్ట్రం తమకు వస్తే అప్పుడు మరొకరిని వాటా అడగడం కాకుండా తమకు తామే అనుభవించవచ్చునని తెలంగాణ ప్రజలు భావించారు. అన్ని ప్రాంతీయ ఆకాంక్షలలో లాగనే ఈ పరిస్థితిని వాడుకోవడానికి స్థానిక పాలకవర్గాలు ముందుకు వచ్చాయి. కాని పాలకులు కూడ పాల్గొంటున్నంత మాత్రాన ప్రజల ఆకాంక్షను వ్యతిరేకించనక్కర లేదు.

అలా 1956 నాటి షరతులతో కూడిన విలీనం, ఆ షరతులను పాలకులు పాటించనందువల్ల, రద్దయిపోక తప్పని అనివార్య స్థితి వచ్చింది. పర్యవసానంగా ఏర్పడే రెండు రాష్ట్రాలలోను తెలుగు ప్రజలే ఉంటారు. వారి మధ్య మైత్రి, సోదర భావాలు కొనసాగుతాయి. కొనసాగాలి. అలా కొనసాగాలని వాంఛిస్తే విలీన రద్దు ప్రక్రియ శాంతి సుహృద్భావాలతో సాగడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలి. ఎంత పెద్ద సమస్యలయినా చర్చలతో, కేంద్ర జోక్యంతో గాని, ఇరు ప్రాంతాలకు విశ్వాసం ఉండే పెద్దమనుషుల సహాయంతో గాని పరిష్కరించుకోవచ్చు. కనుక రాజకీయ నాయకుల, స్వార్థపరుల రెచ్చగొట్టే వ్యాఖ్యలకు, అబద్ధ ప్రచారాలకు బలి కాకుండా ప్రజల మధ్య ఐక్యత, పాలకుల నిలదీత ప్రాతిపదికగా రెండు ప్రాంతాల ప్రజలు సమన్వయంతో మెలిగి తెలుగుజాతి ఘనతను మరొకసారి ప్రపంచానికి చాటిచెప్పవలసిన సమయం ఇది.

వీ

దిగజారి దిగజారి ఎక్కడికి పోనుంది రూపాయి?

డాలర్ తో రూపాయి విలువ దిగజారడం ఎప్పుడో ప్రారంభమయింది గాని ఇటీవల అది మరింత వేగంగా జరుగుతూ పాలకవర్గాలలో, ఆస్తిపరవర్గాలలో కూడ ఆందోళన సృష్టిస్తున్నది. మధ్యతరగతి మీద ప్రత్యక్ష ప్రభావం లేకపోయినా, స్వల్పంగా ఉన్నా ఆ వర్గపు ఆందోళనతో ఇది పెద్ద చర్చనీయాంశంగా మారింది. ఒక దేశపు ద్రవ్యానికి విదేశీ ద్రవ్యంతో పోల్చినప్పుడు విలువ తగ్గిపోవడం తప్పనిసరిగా విపరీతమైన, విచారకరమైన పరిణామమే. ఆ పరిణామానికి అనేక సాంకేతిక కారణాలున్నాయి. అలాగే ఆ పరిణామాన్ని నిరోధించడానికి, నివారించడానికి కూడ అనేక పరిష్కార మార్గాలున్నాయి. ఇవాళ నిర్దిష్టంగా చెప్పుకోవాలంటే యూరోజోన్ సంక్షోభం, అంతర్జాతీయ స్టాక్ మార్కెట్లలో సాగుతున్న పతనం వంటి కారణాలవల్ల ప్రపంచంలో ఎక్కడెక్కడి డబ్బు డాలర్లను, పౌండులను వెతుక్కుంటూ సాగిపోతున్నది. ప్రతి దేశంలోనూ డాలర్లకు గిరాకీ పెరిగిపోతున్నది. విలువైన విదేశీ మారకద్రవ్యాన్ని అనవసరమైన దిగుమతులకు వెచ్చిస్తున్నందు వల్ల, పెరిగిపోతున్న ఎగుమతి–దిగుమతుల వ్యత్యాసం వల్ల, వర్తమాన ఖాతాలో పెరిగిపోతున్న లోటు వల్ల, చెల్లింపుల సంక్షోభం వల్ల, డాలర్లతో వ్యవహరించే భారత వ్యాపారవేత్తలు డాలర్ ధర పెరిగితేనే తమకు లాభాలని భావిస్తుండడం వల్ల భారత దేశంలో డాలర్ల కోసం వెంపర్లాట మరీ ఎక్కువగా ఉన్నది. గిరాకీ ఎక్కువైన కొద్దీ దాని ధర పెరగడం అనివార్యమే. ఇక వ్యవస్థాత్మక, దీర్ఘకాలిక కారణాలు ఎలాగూ ఉన్నాయి. అవి సంపన్నులకు, బహుళజాతి సంస్థలకు అనుకూలమైన రాజకీయార్థిక విధానాలు. అమెరికన్ పాలకవర్గాలకు, అమెరికన్ డాలర్ కు దాసోహమంటున్న దళారీ పాలక విధానాలు. స్వతంత్ర పెట్టుబడిదారీ వర్గం అభివృద్ధి చెంది సొంత దేశీయ మార్కెట్ ను సృష్టించుకోకుండా, ప్రతిదానికీ విదేశీ సంస్థలకు దళారీగా వ్యవహరించడం. దేశంలో వ్యవసాయోత్పత్తినీ, వ్యవసాయాధార పరిశ్రమలనూ పెంచి, శాస్త్ర సాంకేతిక అన్వేషణలు సాగించి స్వతంత్ర పారిశ్రామికాభివృద్ధిని, స్వావలంబనను, స్వయంసమృద్ధిని సాధించకపోవడం. ఈ దీర్ఘకాలిక కారణాలు విదేశీ మారక ద్రవ్య సమస్యలను మరింతగా పెంచుతున్నాయి. ప్రస్తుతం అధికారంలో ఉన్న పాలకవర్గాల పాలన సాగినంతకాలం ఈ దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారం కావడం అసాధ్యం. నిజమైన ప్రజాస్వామిక, దేశభక్తియుత, సర్వసత్తాక, స్వావలంబన విధానాలు అనుసరించే ప్రజా ప్రభుత్వం ఏర్పడితే గాని అది సాధ్యం కాదు. కాని ఈలోగా తమను తాము ప్రజాస్వామికమని, సర్వసత్తాకమని చెప్పుకుంటున్న ప్రభుత్వాలు తాత్కాలిక, తక్షణ ఉపశమనం కలిగించవచ్చు. ఎగుమతి దిగుమతుల విధానాన్ని సమీక్షించి అనవసరమైన సరుకుల, సేవల దిగుమతులు నిషేధించవచ్చు. దేశీయ అవసరాలకు దెబ్బతగలని రీతిలో ఎగుమతులు పెంచవచ్చు. విదేశీ మారక ద్రవ్య దుబారాను ఆపి చెల్లింపుల సంక్షోభాన్ని నివారించవచ్చు. అక్రమ వ్యాపారుల దొంగ ఎత్తులను అరికట్టవచ్చు. కాని ఆ కనీస పనులు చేయడానికి కూడ వెన్నెముక లేని పాలకవర్గాల రాజ్యం ఇది. వేగంగా కిందికి జారిపోతున్న రూపాయి తనతోపాటు ఈ పాలకుల ప్రతిష్ఠను మాత్రమే కాదు, ఉనికిని కూడ అగాథంలోకి లాగుతుంది. ఆ పని సామ్రాజ్యవాద సేవలోని రూపాయి చేసే బదులు, సామ్రాజ్యవాదాన్ని, దళారీలను తోసివేసే చైతన్యయుతమైన ప్రజాశక్తులు చేస్తే ఎంత బాగుండును. వీ

కైరో, డమాస్కస్ వీధుల్లో నెత్తురు

రెండు సంవత్సరాలకు పైగా అంతర్యుద్ధంతో, ప్రజాందోళనలతో అతలాకుతలమవుతున్న ఈజిప్ట్, సిరియాలు ఈ ఆగస్టులో మరింత రక్తసిక్తమయ్యాయి. వందలాది మంది ప్రజలు ఊచకోతకు గురయి నెత్తురుటేర్లు పారాయి. ఈజిప్ట్ రాజధాని కైరోలో సైనిక బలగాలు సాగిస్తున్న కాల్పులలో, బాంబుదాడులలో వందలాది మంది మరణిస్తున్నారు. సిరియా రాజధాని డమాస్కస్ శివార్లలో జనావాసాలమీద తిరుగుబాటుదారులు ఆశ్రయం తీసుకున్నారనే సాకుతో ప్రభుత్వ బలగాలు రసాయనిక ఆయుధాల దాడులు, బాంబుదాడులు నిర్వహించి వేలాది మంది ప్రజలను బలి తీసుకున్నాయి. సరిగ్గా ఐక్యరాజ్య సమితి నుంచి రసాయనిక ఆయుధాల నిఘా బృందం పర్యటన జరుగుతున్నప్పుడే జరిగిన ఈ దాడి తాము చేయలేదని, తిరుగుబాటుదారులే చేశారని ప్రభుత్వ బలగాలు ఆరోపిస్తున్నాయి. ఈ ఉత్తర ఆఫ్రికా, పశ్చిమ ఆసియా దేశాలలో ప్రస్తుతం కనబడుతున్న దృశ్యం సంక్లిష్టమైనది. రెండు చోట్లా శతాబ్దాల పాటు కొనసాగిన వలసవాదుల, సామ్రాజ్యవాదుల కుట్రలు, రెండో ప్రపంచ యుద్ధం తర్వాత పక్కలో బల్లెంలా సామ్రాజ్యవాద తైనాతీ ఇజ్రాయెల్‌ను స్థాపించడం, విస్తారమైన, సంపన్నమైన చమురు నిలువలు ఉండడం, లోతైన మత భావాలతో మత విద్వేషాలు రగిలి, మత ఛాందసం పెల్లుబకడానికి అవకాశం దొరకడం, ప్రగతిశీల ఆలోచనాధారలు కూడ తగినంతగా వ్యాపించడం వంటి వైవిధ్యపూరిత పరిణామాల వల్ల ఇవాళ అక్కడ సాగుతున్న అంతర్యుద్ధాలలో ఏ శక్తులనూ బేషరతుగా సమర్థించలేని, ఖండించలేని విచిత్ర స్థితి ఏర్పడుతున్నది. సామాజికంగా, మతపరంగా వెనుకబడిన ఛాందస శక్తులు, నిరంకుశ శక్తులు సామ్రాజ్యవాద వ్యతిరేకతను కనబరుస్తున్నాయి. మత, నిరంకుశ శక్తులను తొలగించే శక్తి సంతరించుకోని స్థానిక ప్రగతిశీల శక్తులు సామ్రాజ్యవాద జోక్యమైనా సరే అనే వినాశకరమైన ఆలోచనకు సిద్ధపడుతున్నాయి. సిరియాలో ఒకప్పుడు ఫ్రెంచి, అమెరికా సామ్రాజ్యవాదుల బంటుగా ఉండి, ఇరాక్ యుద్ధం తర్వాత అమెరికాను వ్యతిరేకించడం ప్రారంభించిన సైనిక నియంత అసాద్ ప్రభుత్వం, బాతిస్ట్ పార్టీ ఒకవైపు, ఆ నిరంకుశ పాలనను వ్యతిరేకించి తాము అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తున్న మతఛాందస, సైనిక శక్తుల ఫ్రీ సిరియన్ ఆర్మీ మరొకవైపు ఉండగా ఈ రెండు ప్రజావ్యతిరేక శక్తుల మధ్య ప్రజలు నలిగిపోతున్నారు. ప్రజల మీద దాడిని సాకుగా చూపి సిరియాలో చొరబడడానికి అమెరికా సైన్యం సిద్ధంగా ఉన్నది. సిరియా ఉత్తర ప్రాంతంలో కుర్దిష్ విప్లవకారులు విముక్తి ప్రాంతాలను కూడ ఏర్పరచుకుని ఈ రెండు శక్తులకూ వ్యతిరేకంగా ప్రజా ప్రత్యామ్నాయానికి పిలుపునిస్తున్నారు గాని వారి మీద కత్తిగట్టిన టర్కీ ప్రభుత్వం సామ్రాజ్యవాదులతో, సిరియా ప్రభుత్వంతో చేతులు కలిపి వారి మీద దమనకాండ సాగిస్తున్నది. ఇరాక్ విషయంలో లాగనే ఐక్యరాజ్యసమితి తన మౌనంతోనూ, మాటలతోనూ కూడ సామ్రాజ్యవాదుల కుటిలయత్నాలకు మద్దతునిస్తున్నది. రష్యా, చైనాలు ఈ శవదహనంలో పేలాలు వేయించుకోవడానికి తహతహలాడుతున్నాయి. ప్రజల పక్షం వహించే, కనీసం ప్రజల మీద దుర్మార్గ హంతక దాడులను ఖండించే ఒక్క అధికారిక గళం కూడ లేకపోవడం ఇవాల్టి ప్రపంచ దుస్థితికి అద్దం పడుతున్నది. వీ

వర్తమాన చరిత్ర గమనం - రాజకీయార్థిక దృష్టి

గత సంచికలో ప్రారంభమైన ఈ శీర్షికకు పాఠకులనుంచి విశేషాదరణ లభిస్తున్నది. సమకాలీన సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక ఘటనల మీద, పరిణామాల మీద ఇటువంటి రాజకీయార్థిక విశ్లేషణ అవసరమని చాల మంది పాఠకులు భావిస్తున్నారు. ఈ క్రమంలో మౌలికంగా రాజకీయార్థిక శాస్త్ర అవగాహన అంటే ఏమిటో మరింతగా వివరించాలని కూడ కొందరు పాఠకులు కోరారు.

రాజకీయార్థ శాస్త్రం – పొలిటికల్ ఎకానమీ – అనే మాటను మొదటిసారిగా 1615లో ఫ్రెంచి ఆర్థికశాస్త్రవేత్త ఆంటొయిన్ ద మోంట్ క్రెస్టీన్ ప్రవేశపెట్టాడు. పారిశ్రామిక విప్లవ వెల్లువలో, అప్పుడప్పుడే తలెత్తుతున్న పెట్టుబడిదారీ వర్గం ప్రకటిస్తున్న ప్రగతిశీల ఆదర్శాల యుగంలో మొత్తం సమాజమే కదిలిపోయింది. ఆ సామాజిక పరివర్తనలో పాత విలువలు ధ్వంసమై కొత్త విలువలు రావడం ప్రారంభమైంది. సమాజగతికి సామాజిక ఉత్పత్తి క్రమమే పునాది అనే అంశం నానాటికీ స్పష్టం కావడం మొదలయింది. సామాజిక ఉత్పత్తి క్రమాన్ని స్థూలంగా ఆర్థిక పరిణామాలలో గుర్తించవచ్చునని, అందువల్ల ఆర్థిక అంశాల పరిశీలనే సామాజిక అధ్యయనానికి ప్రధాన భూమిక అని తత్వవేత్తలు, సామాజిక శాస్త్రవేత్తలు భావించారు. అయితే అరిస్టాటిల్ నాటి నుంచీ ఏదో ఒక రూపంలో అధ్యయనం చేస్తున్న ఆర్థిక శాస్త్రాన్ని కేవలం ఆర్థిక అంశాలకు కుదించగూడదని, అరిస్టాటిల్ చేసినట్టుగా రాజకీయాలకూ ఆర్థికానికీ సంబంధం తెగగొట్టగూడదని అవగాహన కూడ పెరిగింది. అసలు కేవలం ఆర్థిక అంశాలేవీ ఉండవని, వాటికి రాజకీయాలతో, సమాజంతో, పాలనతో, చరిత్రతో, న్యాయశాస్త్రంతో అవినాభావ సంబంధం ఉంటుందని గుర్తించడం మొదలైంది. ఈ ఆలోచనలన్నిటి సమాహారంగా రాజకీయార్థిక శాస్త్రం పుట్టుకు వచ్చింది. అప్పటివరకూ సమాజ అధ్యయనం చేస్తూ వచ్చిన నైతిక తత్వశాస్త్రం అనే శాఖలో భాగంగా విశ్వవిద్యాలయాలలో రాజకీయార్థిక శాస్త్రం అనే కొత్త శాఖ ప్రారంభమయింది. ఇటలీలోని నేపుల్స్ విశ్వవిద్యాలయంలో 1754లో మొట్టమొదటి రాజకీయార్థిక శాఖ ఏర్పడింది. ఆ తర్వాత ఫ్రెంచి ఫిజియోక్రాట్లు (పద్దెనిమిదో శతాబ్దం), ఆడమ్ స్మిత్ (1723–1790), డేవిడ్ రికార్డో (1772–1823), థామస్ మాల్థస్ (1766–1834) వంటి ఆర్థిక శాస్త్రవేత్తలెందరో రాజకీయార్థిక శాస్త్రాన్ని అభివృద్ధి చేశారు.

అయితే ఈ రాజకీయార్థిక శాస్త్రానికి బూర్జువా వర్గ ఆవిర్భావ వికాసాలలో మూలాలున్నాయని గుర్తించిన కార్ల్ మార్క్స్ (1818–1883) దానిమీద ఆ మేరకు విమర్శ ఎక్కుపెట్టాడు. అందుకే ఆయన 1859లో ఎ కాంట్రిబ్యూషన్ టు ది క్రిటిక్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ (రాజకీయార్థిక శాస్త్రం పై విమర్శకు ఒక చేర్పు) ప్రచురించాడు. తన ఉద్గ్రంథం కాపిటల్ కు కూడ క్రిటిక్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ అనే ఉపశీర్షిక ఉంచాడు. కాని అదే సమయంలో రాజకీయార్థిక శాస్త్రం ఇచ్చిన సమగ్ర, సమాహార దృక్పథాన్ని ఆయన గ్రహించాడు. 'నా అన్వేషణ ద్వారా నేనొక నిర్ధారణకు చేరాను. అదేమంటే చట్టపరమైన సంబంధాలను గానీ, రాజకీయ రూపాలను గానీ వాటంతటవే అర్థం చేసుకోలేం. సాధారణ మానవ మేధో అభివృద్ధి అనబడేదాని ఆధారంగా కూడ అర్థం చేసుకోలేం. చట్టపరమైన సంబంధాలూ రాజకీయ రూపాలూ కూడ భౌతిక జీవన పరిస్థితులలోనే పుట్టుకు వస్తాయి. ఈ భౌతిక జీవన పరిస్థితులను హెగెల్ .... 'పౌరసమాజం' అని పిలిచాడు. ఐతే ఈ పౌరసమాజ శరీరాన్ని విప్పి చూడడం రాజకీయార్థిక శాస్త్రంలోనే జరుగుతుంది' అని మార్క్స్ రాజకీయార్థిక శాస్త్ర సారాంశాన్ని, ప్రాధాన్యతను వివరించాడు.

ఆ సమగ్రతను తన తాత్విక దృక్పథంలో భాగం చేసుకోవడం ద్వారా ఒకరకంగా మార్క్స్ పొలిటికల్ ఎకానమీని బూర్జువావర్గం చేతుల్లోనుంచి లాక్కుని శ్రామికవర్గానికి అందించాడు. సామ్రాజ్యవాద దశలోకి ఎదుగుతున్న బూర్జువావర్గం కూడ సామాజిక అధ్యయనాన్ని శకలాలు శకలాలుగా విడగొట్టి అధ్యయనం చేయదలచింది గనుక పొలిటికల్ ఎకానమీ అనే సమగ్రమైన మాటను వదులుకోదలచుకుంది. పొలిటికల్ ఎకానమీలో సమాజాన్ని, ఉత్పత్తి విధానాన్ని సమగ్రంగా, చరిత్రతో, రాజకీయాలతో, న్యాయశాస్త్రంతో, పాలనతో కలిపి చూసే దృక్పథం ఉన్నది గనుక, దాన్ని వదిలేసి, ఆర్థిక శాస్త్రం అనే సంకుచిత శాస్త్రాన్ని బూర్జువావర్గం తయారు చేసుకుంది. బూర్జువా అర్థశాస్త్రవేత్త ఆల్ఫ్రెడ్ మార్షల్ (1842–1924) ప్రిన్సిపుల్స్ ఆఫ్ ఎకనమిక్స్ అనే పాఠ్యపుస్తకంతో 1890లో ఈ సంకుచిత శాస్త్రానికి తెరతీశాడు. ఇక దాదాపుగా పాశ్చాత్య దేశాలలోని అన్ని విశ్వవిద్యాలయాలలో ఒక పాఠ్యాంశంగా పొలిటికల్ ఎకానమీ బోధించడం మానివేసి, దాని స్థానంలో అర్థశాస్త్రాన్ని ప్రవేశపెట్టారు. ఎక్కడైనా పొలిటికల్ ఎకానమీ చెప్పినా దాన్ని ఆర్థిక శాస్త్ర భావాల చరిత్రగా కుదించారు.

ఈలోగా 1917లో రష్యాలో బోల్షివిక్ విప్లవం విజయం సాధించడంతో, సోవియట్ యూనియన్ లో అన్ని విశ్వవిద్యాలయాలలోను పొలిటికల్ ఎకానమీ బోధన ప్రారంభమయింది. సోషలిస్టు దేశాలన్నిటిలో ఆర్థిక శాస్త్ర శాఖ బదులు పొలిటికల్ ఎకానమీ శాఖలే ఏర్పడ్డాయి. పొలిటికల్ ఎకానమీ అనే మాట మార్క్సిస్టు రాజకీయార్థిక శాస్త్రానికి పర్యాయపదంగా మారిపోయింది.

1960లలో ప్రపంచమంతా కొత్త ప్రశ్నలు పుట్టుకొస్తున్నప్పుడు, కోపోద్రిక్త యువతరం పాత, నిలువనీటి విలువలను సవాల్ చేస్తున్నప్పుడు పాశ్చాత్య ప్రపంచంలో కూడ మళ్లీ ఒకసారి ఆర్థిక శాస్త్రం స్థానంలో పొలిటికల్ ఎకానమీ ప్రవేశించింది. సమాజాన్ని సమగ్రంగా చూడాలని, బూర్జువా అర్థశాస్త్రం బోధించే సంకుచిత నవ్యసంప్రదాయవాద, సూక్ష్మ ఆర్థిక విశ్లేషణకు అర్థం లేదని, అది మనిషికి అవగాహన కల్పించే బదులు కళ్లు కప్పడానికి, తప్పుడు చైతన్యం కలిగించడానికి ప్రయత్నిస్తుందని వాదనలు మొదలయ్యాయి. అప్పటినుంచీ ప్రతి విషయాన్నీ లోతుగా, అన్ని వైపులనుంచి పరిశీలించడమంటే రాజకీయార్థిక దృక్పథం నుంచి పరిశీలించడమే అనే అర్థం స్థిరపడింది. గత యాభై సంవత్సరాలలో పొలిటికల్ ఎకానమీ అనే మాటతో సామాజిక అంశాలన్నిటి అధ్యయనం సాగుతున్నది. మార్క్సిస్టు, మార్క్సిస్టేతర మౌలిక ఆలోచనాధారలన్నీ కూడ పొలిటికల్ ఎకానమీ దృక్పథాన్ని అనుసరించడానికి ప్రయత్నిస్తున్నాయి. మాస్ మీడియా, వాయిలెన్స్, టెర్రరిజం, హ్యూమన్ హాప్పీనెస్, స్లేవరీ, మిడిల్ ఈస్ట్, లాటిన్ అమెరికా వంటి ఏ విషయానికైనా పొలిటికల్ ఎకానమీ ఆఫ్ అనే పదం జోడించి వందలాది గ్రంథాలు వెలువడ్డాయి. తెలుగులో కూడ ఈశాన్య భారత ప్రజా ఉద్యమాలను వివరిస్తూ సి వి సుబ్బారావు రాసిన రగులుకొనే రాక్షసిబొగ్గు పుస్తకానికి 'రాజకీయార్థిక పరిచయం' అనే ఉపశీర్షిక ఉంచారు.

రాజకీయార్థిక దృక్పథాన్ని వివరించాలంటే, అది సమాజాన్ని సమగ్రంగా దర్శిస్తుంది. పైపైన, ముక్కలుముక్కలుగా అర్థం చేసుకోదు. సమాజం అంటే మనుషులు సమష్టిగా ప్రకృతితో కలిసి, ప్రకృతితో పోరాడుతూ సాగించే

ఉత్పత్తి, పునరుత్పత్తి ప్రక్రియల, మానవసంబంధాల సమాహారం అని ఈ దృక్పథం భావిస్తుంది. ఈ అవగాహనలో మనుషుల పాత్ర, ప్రకృతి పాత్ర, ప్రకృతిని ఉపయోగించుకుని మనిషి మనుగడకు అవసరమైన ఉత్పత్తి సాగించడమూ అన్నీ ఉంటాయి. మనుషులు నిరంతరాయంగా పునరుత్పత్తి కావడమూ ఉంటుంది. ఆ మనుషుల మధ్య సామూహికత వల్ల సంబంధాలు నెలకొనడమూ ఉంటుంది. ఆ సంబంధాలలో ఐక్యతా, ఘర్షణా ఉన్నాయని, ఘర్షణే సమాజ చలనానికి చోదకశక్తి అని, సమాజం నిరంతరం మార్పుకు లోనవుతున్నదని అవగాహనా ఉంటుంది. అందువల్లనే ఇది కేవలం రాజకీయ దృష్టో, ఆర్థిక దృష్టో మాత్రమే కాదు, చరిత్ర, సామాజిక పరిణామం, సంస్కృతి, ఉత్పత్తి విధానాలు, పాలనా విధానాలు, న్యాయ, చట్ట నిబంధనలు వంటి అంశాలన్నీ ఇందులో భాగమవుతాయి.

ఉల్లిపాయల ధరలు ఈ సంవత్సరం జనవరి నుంచీ క్రమక్రమంగా పెరుగుతూ వచ్చిన ఉల్లిపాయల ధరలు ఆగస్ట్ చివరి వారానికి విపరీతమైన స్థాయిలో కిలోకు రు. 70–80 కి చేరుకున్నాయి. ఈ ధరల పెరుగుదలకు డిమాండ్ – సప్లై ఎగుడుదిగుళ్లే కారణమనే శుష్క ఆర్థిక శాస్త్ర వివరణనే ప్రధాన స్రవంతి ప్రచారసాధనాలన్నీ అందిస్తున్నాయి. కాని ఈ ఆర్థిక శాస్త్ర వివరణ నిజం కాదు. ఉల్లిపాయల ధరల పెరుగుదలలో డిమాండ్, సప్లై లను మించిన విశాల అంశాలెన్నో ఇమిడి ఉన్నాయి. దేశంలో ఉల్లిపాయల సప్లై (దిగుబడి) గురించి స్పష్టమైన గణాంకాలు ఉన్నాయి గాని, ఏ సమయంలో ఎంత డిమాండ్ ఉందో, వార్షిక డిమాండ్ ఎంతో అటు ప్రభుత్వం గాని, ఇటు స్వతంత్ర పరిశోధకులు గాని ప్రకటిస్తున్న అంచనా లేదు. ప్రతి అంశం గురించీ అనవసరమైన గణాంకాలెన్నో పోగుచేసే ప్రభుత్వ శాఖలు ఉజ్జాయింపుగానైనా దేశంలో వార్షికంగా ఉల్లిపాయల డిమాండ్ ఎంత ఉంటుందో అంచనా వేయలేదు. అటువంటి అంచనా లేనందువల్ల ఎంత పండించవలసి ఉంటుందో ప్రణాళికాబద్ధమైన వ్యూహం ఏమీ లేదు. రైతులు మార్కెట్ ధరలను బట్టి, అలవాటును బట్టి, కాలాన్ని బట్టి పండించడం మాత్రమే జరుగుతున్నది.

దేశవ్యాప్తంగా 2011–12 ఆర్థిక సంవత్సరంలో పది లక్షల హెక్టార్లలో, ఒక కోటీ యాభై లక్షల టన్నుల ఉల్లిపాయల దిగుబడి ఉండింది. అందులో పదిహేను లక్షల టన్నుల దాకా ఎగుమతి అయింది. ఉత్పాదకతలో కూడ కొరియా అత్యధికంగా హెక్టారుకు 68 టన్నులు సగటు దిగుబడి సాధించగా, భారతదేశం 10 టన్నులతో ముప్పయవ స్థానంలో ఉంది. ఎగుమతులు పోగా మిగిలిన దిగుబడి అంతా వినియోగమవుతున్నదా, మిగులు ఉంటున్నదా, అది అక్రమ నిలువగా మారి, కృత్రిమ ధరల పెరుగుదలకు అవకాశమిస్తున్నదా ఎవరి దగ్గరా లెక్కలు, వివరాలు లేవు. అరవై రోజుల నుంచి ఎనభై రోజులలో వచ్చే ఈ పంట దిగుబడి ఏడాదిలో మూడు నెలలు మినహా ఏడాది పొడుగునా ఉంటుంది. కనుక ప్రభుత్వం తలచుకుంటే ఆ దిగుబడి సరఫరాను క్రమబద్ధీకరించి కృత్రిమ కొరతలను నివారించడం అసాధ్యం కాదు


కొన్ని కులాలలో, కొన్ని మత సంబంధమైన రోజులలో ఉల్లిపాయ వాడకం మీద నిషేధం ఉన్నా, భారతీయ ఆహారంలో అతి ముఖ్యమైన దినుసు ఉల్లిపాయ. ఉల్లిపాయ దిగుబడిలో భారతదేశం ప్రపంచంలో రెండో స్థానంలో ఉంది. కాని సగటు తలసరి వినియోగంలో మాత్రం ఉల్లిపాయ అసలే పండని దేశాల కన్న ఎంతో దిగువన ఉంది. ఇతర దేశాల సగటు వినియోగం లెక్కల ప్రకారం 33 కిలోలతో లిబియా అగ్రభాగాన ఉండగా, భారతదేశంలో తలసరి దిగుబడి 12 కిలోలుగా ఉంది. వినియోగం ఇందులో సగం కూడ ఉందో లేదో తెలియదు. అలా ప్రపంచ సగటు తలసరి వినియోగం కన్న తక్కువ వినియోగంలో ఉన్నా, సగటు మనిషి ఆహారంలో దాన్ని తగ్గించడం గాని, పూర్తిగా తొలగించడం గాని అసాధ్యం. దాని సరఫరా తగ్గినా, దాని ధరలు పెరిగినా ప్రజలలో ఆందోళన పెరుగుతుంది. గతంలో ఎన్నో ఎన్నికలలో ఉల్లిపాయల ధరల పెరుగుదల అధికారంలో ఉన్న పార్టీలను గద్దె దించడానికి దారి తీసింది. ప్రస్తుతం కూడ అటువంటి పరిస్థితి ఏర్పడినందువల్ల 2014 ఎన్నికల మీద ఉల్లిపాయ ప్రభావం గురించి చాల చర్చలు జరుగుతున్నాయి.

అయితే అధికార పార్టీ పట్ల అభిప్రాయాన్ని రూపొందించడంలో ఉల్లిపాయ పాత్ర ఏమైనా, అసలు వేల ఏళ్లుగా వాడుతున్న ఈ ముఖ్యమైన పంటలో ఇంతగా ఎగుడు దిగుళ్లు ఉండడానికి కారణాలు పాలకవర్గాల అస్తవ్యస్త విధానాలలో, నిర్లక్ష్యంలో, అక్రమాలలో, వ్యాపార అనుకూల విధానాలలో ఉన్నాయి.

ఉల్లిపాయల రైతులు వరి, గోధుమ, చక్కెర, పొగాకు రైతుల లాగ బలమైన శక్తిగా సంఘటితమై లేరు. ఉల్లిపాయల ధరలు పెరిగినప్పుడల్లా ఎగుమతులు నిషేధించడం, దిగుమతులు పెంచి ధరలు తగ్గించడానికి ప్రయత్నించడం, కొద్ది మంది వ్యాపారుల గిడ్డంగుల మీద నామమాత్రమైన సోదాలు జరపడం వంటి తాత్కాలిక చర్యలు మినహా పాలకుల దగ్గర శాశ్వత, దీర్ఘకాలిక పరిష్కార మార్గాలు లేవని ఎన్నో దశాబ్దాల అనుభవం చూపుతున్నది. ధరల పెరుగుదలకు శాశ్వత, దీర్ఘకాలిక, వ్యవస్థాపరమైన కారణాలూ ఉన్నాయి, సరఫరా, డిమాండ్ ల మధ్య వ్యత్యాసం కూడ ఒక కారణమే. కాని డిమాండ్ ను సక్రమంగా, శాస్త్రీయంగా అంచనా వేయడం, అందుకు తగిన సరఫరా సాగేట్టు చర్యలు తీసుకోవడం, ప్రణాళికాబద్ధంగా సాగుకు ప్రోత్సహించడం పాలకులు చేయవలసిన పనులు. పంట వచ్చిన తర్వాత సరైన రవాణా సదుపాయాలు, నిలువ ఉంచే సౌకర్యాలు, పంపిణీ ఏర్పాట్లు కల్పించడం, మార్కెట్ ఒడిదొడుకుల నుంచి రైతులకు రక్షణ కల్పించడం, అక్రమ నిలువలకు, కృత్రిమ ధరల పెరుగుదలకు వ్యతిరేక చర్యలు తీసుకోవడం వంటి చర్యలన్నీ ప్రభుత్వ విధులు. ప్రభుత్వం ఈ విధులేవీ నిర్వర్తించడం లేదు.

మరొకపక్క రైతుకూ వినియోగదారుకూ మధ్య ఉల్లిపాయల వ్యాపారంలో కనీసం ఏడు మజిలీలు ఉన్నాయి. అంటే ఏడు స్థాయిలలో మధ్యవర్తులు, దళారీలు, కమిషన్, అడ్తి వ్యాపారులు, టోకు వర్తకులు, చిల్లర వర్తకులు ఉన్నారు. ఏ సంవత్సరమైనా దిగుబడితో, సప్లైతో సంబంధం లేకుండా రైతులకు క్వింటాల్ కు ఆరువందల రూపాయలకన్న తక్కువ అందుతుండగా, చివరి మార్కెట్లలో వినియోగదారులు మాత్రం కిలోకు సగటున ఇరవై రూపాయల కన్న ఎక్కువే చెల్లించవలసి వస్తున్నది. ఈ సారి అది ఎనభై రూపాయలదాకా కూడ వెళ్లి, కాస్త తగ్గి అరవై రూపాయల దగ్గర స్థిరపడింది. సరఫరా గొలుసులో ఎన్నో మజిలీలు ఉండడంతో ప్రతి మజిలీ దగ్గరా సగటున ఐదు శాతం లాభం వేసుకున్నా రైతుకు అందే ప్రతిఫలానికీ వినియోగదారు చెల్లించవలసిన ఖరీదుకూ మధ్య నలభై శాతం ఎక్కువ ఉండే అవకాశం ఉంది. ఈ మధ్య దళారీ గొలుసులో చాల శక్తిమంతులైన మార్కెట్ నిర్ణేతలు, టోకు వ్యాపారులు, నిలువదారులు అతి లాభాపేక్షతో ధరలను ఇబ్బడి ముబ్బడిగా పెంచుతున్నారు. ఈ దళారీ వ్యవస్థకూ రాజకీయ నాయకులకూ సన్నిహిత సంబంధం ఉంది.

విస్తీర్ణం పెంచి గాని, ఉత్పాదకత పెంచి గాని దిగుబడి పెంచడం, రవాణా, నిలువ సౌకర్యాలు పెంచడం, రైతులకు రక్షణ కల్పించడం, మధ్య దళారీ వ్యవస్థను తొలగించడం, లేదా తగ్గించడం, ధరలను స్థిరీకరించడం, సప్లై డిమాండ్ లను వాస్తవికంగా, శాస్త్రీయంగా అంచనా వేసి ప్రణాళికాబద్ధ వ్యూహాన్ని రచించడం, అక్రమ నిలువదారుల మీద, కృత్రిమ ధరల పెరుగుదలను సృష్టించేవారి మీద కఠిన చర్యలు తీసుకోవడం వంటి ఎన్నో పనులు చేసి, సాధారణ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించడానికి అవకాశం ఉంది. కాని ప్రస్తుత పాలకవర్గాలకు ఈ పనుల్లో ఏ ఒక్కటయినా చేయాలనే కోరికా లేదు, చేసే సామర్థ్యమూ లేదు. వీ




❖ **శ్రీశ్రీ మరో ప్రపంచ కవి విషయాలూ.. విశేషాలూ.. సంపుటి-1** - సింగంపల్లి అశోక్ కుమార్, ప్రచురణ : శ్రీశ్రీ సాహితీ నిధి- 135 పేజీలు, 1/8 డెమీ, రు : 60, ప్రతులకు : శ్రీశ్రీ సాహిత్య నిధి, 305, ప్రగతి టవర్స్, వీరయ్య వీధి, మారుతినగర్, విజయవాడ - 520004, ఫోన్ : 0866-6617375, సెల్:9246277375, ఇమెయిల్: srisri_sahityanidhi@yahoo.com



❖ **తెలంగాణ రాష్ట్ర ఉద్యమం ప్రజలు- ప్రజా సంఘాలు - పార్టీలు - ఐక్య సంఘటన** - ఎం. రత్నమాల, ప్రచురణ: నూతన ప్రచురణలు - 96 పేజీలు, 1/8 డెమీ, రు : 80, ప్రతులకు : ఎం. రత్నమాల, మేఘా అపార్ట్‌మెంట్స్, ఫ్లాట్ నెం. 302, నల్లకుంట, హైదరాబాద్ - 500 044, ఫోన్ : 27662957, సెల్ : 9440329445




❖ **కరీంనగర్ కవిత 2012** - సాహితీ సోపతి - 161 పేజీలు, 1/8 డెమీ, రు : 100, ప్రతులకు : నాగనూరి శేఖర్, ఫ్లాట్ నెం : 24, ఇం. నెం. 1-3-117/10, సాయి జయంతి అపార్ట్‌మెంట్స్, పద్మశాలి స్ట్రీట్, కరీంనగర్-505 001, సెల్ : 9985411275



❖ **కులం - సామాజిక, ఆర్థిక దోపిడి** - డా. కత్తి పద్మారావు, ప్రచురణ : లోకాయత ప్రచురణలు - 207 పేజీలు, 1/8 డెమీ, రు :100, ప్రతులకు : కత్తి స్వర్ణకుమారి, లోకాయత ప్రచురణలు, లుంబినీ వనం, అంబేద్కర్ కాలని, పొన్నూరు - 522 124 ఫోన్ : 08643 421421 ఇమెయిల్: padmaraokathi@yahoo.co.in



❖ **ఆస్ట్రేలియా** - తంగెడ జనార్ధనారావు, ప్రచురణ : ప్రజాహిత ప్రచురణ - 146 పేజీలు, 1/8 డెమీ, రు : 65, ప్రతులకు : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ అన్ని కేంద్రాలలో, బుక్‌బర్డ్, హనుమకొండ, నవోదయ బుక్ హౌస్ కాచిగూడ, హైదరాబాద్




❖ **వేగుచుక్కల వెలుతురులో అమరుల బంధు మిత్రుల సంఘం దశాబ్ది ప్రస్థానం** - గంటి ప్రసాదం, ప్రచురణ : ఎబిఎంఎస్ ప్రచురణ - 23 పేజీలు, 1/8 డెమీ, రు : 10, ప్రతులకు : దిశ పుస్తక కేంద్రం, చిక్కడపల్లి, హైదరాబాద్, సహచర బుక్ మార్క్, బాగ్ లింగంపల్లి, హైదరాబాద్, నవోదయ బుక్ హౌస్, హైదరాబాద్.



❖ **నేనున్నాను-కామ్రేడ్ గంటి ప్రసాదం స్మృతిలో**- అమరుల బంధు మిత్రుల సంఘం, ప్రచురణ : అమరుల బంధు మిత్రుల సంఘం104పేజీలు,18డెమీ, రు : 30, ప్రతులకు : దిశ పుస్తక కేంద్రం, చిక్కడపల్లి, హైదరాబాద్, నవోదయ బుక్ హౌస్, కాచిగూడ, హైదరాబాద్.




❖ **గంటి ప్రసాదం రచనలు** - విప్లవ రచయితల సంఘం ప్రచురణ: విప్లవ రచయితల సంఘం - 48 పేజీలు, 1/8 డెమీ, రు : 25, ప్రతులకు: దిశ పుస్తక కేంద్రం, చిక్కడపల్లి, హైదరాబాద్, నవోదయ బుక్ హౌస్, కాచిగూడ, హైదరాబాద్.



❖ **అనుధ్వని - అనువాద కవితలు** - నాగరాజు రామస్వామి, ప్రచురణ: పాలపిట్ట బుక్స్ - 124 పేజీలు, 1/8 డెమీ, రు : 60, ప్రతులకు : పాలపిట్ట బుక్స్, 16-11-20/6/1/1, 403, విజయసాయి రెసిడెన్సీ, సలీంనగర్, మలక్‌పేట్, హైదరాబాద్-500036; ఫోన్: 27678430 ఇమెయిల్:palapittabooks@gmail.com



❖ **పోరాడితేనే రాజ్యం (తెలంగాణ మహిళా ఉద్యమ గాథలు)**- కవిని, ప్రచురణ: ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక - 54 పేజీలు, 1/8 డెమీ, రు : 30, ప్రతులకు : కవిని కెరాఫ్ ఆలూరి లలితా పరమేశ్వరి, ఇ.నెం: 26-33-34/1, 7వ లైను, ఎ.టి. అగ్రహారం, గుంటూరు- 522 004 సెల్: 8185738702




❖ **కొర్రాయి కవిత్వం**- డా. దామెర రాములు, ప్రచురణ : పాలపిట్ట బుక్స్ - 192 పేజీలు, 1/8 డెమీ, రు : 70, ప్రతులకు : పాలపిట్ట బుక్స్, 16-11-20/6/1/1, 403, విజయసాయి రెసిడెన్సీ, సలీంనగర్, మలక్‌పేట్, హైదరాబాద్-500036; ఫోన్: 27678430 ఇమెయిల్:palapittabooks@gmail.com




❖ **వెలుతురు కొలను - సాహిత్య వ్యాసాలు**- గుమ్మన్నగారి బాలశ్రీనివాసమూర్తి, ప్రచురణ: పాలపిట్ట బుక్స్-102 పేజీలు, 1/8 డెమీ, రు: 60, ప్రతులకు : పాలపిట్ట బుక్స్, 16-11-20/6/1/1, 403, విజయసాయి రెసిడెన్సీ, సలీంనగర్, మలక్‌పేట్, హైదరాబాద్-500036; ఫోన్: 27678430 ఇమెయిల్:palapittabooks@gmail.com



❖ **రామకృష్ణ ద్విశతి** - ధర్మవరం సాకె రామకృష్ణ - ప్రచురణ :పాలపిట్ట బుక్స్- 119 పేజీలు, 1/8 డెమీ, రు : 70, ప్రతులకు : పాలపిట్ట బుక్స్, 16-11-20/6/1/1, 403, విజయసాయి రెసిడెన్సీ, సలీంనగర్, మలక్‌పేట్, హైదరాబాద్-500036; ఫోన్: 27678430 ఇమెయిల్:palapittabooks@gmail.com



❖ **నెలబాల రత్నమాల** - టాగూరు కవిత్వానికి అనుసృజన- రత్నమాల, ప్రచురణ: పాలపిట్ట బుక్స్, 99 పేజీలు, 1/8 డెమీ, రు : 50, ప్రతులకు: పాలపిట్ట బుక్స్, 16-11-20/6/1/1, 403, విజయసాయి రెసిడెన్సీ, సలీంనగర్, మలక్‌పేట్, హైదరాబాద్-500036; ఫోన్: 27678430 ఇమెయిల్:palapittabooks@gmail.com



❖ **ఒక కథకుడు - నూరుగురు విమర్శకులు**- తుమ్మేటి రఘోత్తమరెడ్డి కథల చర్చా సర్వస్వం, ప్రచురణ : సౌభాగ్య ప్రచురణలు, 576 పేజీలు, 1/8 డెమీ, రు : 400, ప్రతులకు : పాలపిట్ట బుక్స్, 16-11-20/6/1/1, 403, విజయసాయి రెసిడెన్సీ, సలీంనగర్, మలక్‌పేట్, హైదరాబాద్-500036; ఫోన్ : 27678430 ఇమెయిల్:palapittabooks@gmail.com



❖ **నైనా** - ఆలూరి భుజంగరావు, ప్రచురణ : రాహుల్ సాహిత్య సదనం- 64 పేజీలు, 1/8 డెమీ, రు. 50, ప్రతులకు : ఆలూరి లలితా పరమేశ్వరి, ఎ.టి.అగ్రహారం, 8వ లైను, 26-34-33/3, గుంటూరు-522 004

కాటా నారాయణ రావు మృతి

కవి, రచయిత, విప్లవ రచయితల సంఘం (విరసం) వ్యవస్థాపక సభ్యులు కాటా నారాయణరావు (70) అనారోగ్యంతో తూర్పు గోదావరి జిల్లా, దోసకాయలపల్లి గ్రామంలో జూలై 27న చనిపోయారు. కాకతీయ వైద్య కళాశాల తొలితరం విద్యార్థి. ఆయన రాజమండ్రిలో ప్రజా వైద్యశాలతో పాటు 'చైతన్య స్రవంతి' అనే సాహిత్య సంస్థను ఏర్పాటు చేశారు. శబరి గోదారి అనే కవితా సంకలనం వీరి ప్రసిద్ధ రచన.

న్యాయవాది పద్మనాభరెడ్డి మృతి

సీనియర్ న్యాయవాది సి. పద్మనాభరెడ్డి (82) ఆగస్టు 4న అనారోగ్యంతో హైదరాబాదులోని ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీలో చికిత్స పొందుతూ గుండెపోటుతో చనిపోయారు. ఆయన 1931 మార్చ్ 18న అనంతపురం జిల్లా, యాడిలో జన్మించారు. ఆయన అనంతపురం జిల్లా, గుత్తిలో ఎస్ఎస్ఎల్‌సి చదివారు. గుంటూరు జిల్లా ఎసి కాలేజిలో ఇంటర్, అనంతపురం ప్రభుత్వ కాలేజిలో బిఎస్‌సి పట్టా పొందారు. మద్రాసు యూనివర్సిటీ లా కాలేజిలో న్యాయశాస్త్రంలో పట్టా పొందారు. పౌరహక్కుల నేత కన్నబీరన్‌కు సహ విద్యార్థి. డిఫెన్స్ కమిటీలో సభ్యులుగా, డెమోక్రటిక్ లాయర్స్ అసోసియేషన్‌కు అధ్యక్షుడిగా పని చేశారు. రాజకీయ ఖైదీల హక్కుల కోసం పోరాడారు.

నవ భారత యువభేరి

హైదరాబాద్‌లోని ఎల్.బి. స్టేడియంలో ఆగస్టు 11న బిజెపి రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో 'నవ భారత యువ భేరి' బహిరంగ సభ జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిగా గుజరాత్ ముఖ్యమంత్రి నరేంద్ర మోడీ హాజరైనారు. ఈ సభలో నరేంద్రమోడీ తెలంగాణకు సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సభకు వెంకయ్యనాయుడు, బండారు దత్తాత్రేయ, రాష్ట్ర బిజెపి అధ్యక్షులు కిషన్‌రెడ్డిలతో పాటు ఇతర నాయకులూ, కార్యకర్తలూ, ప్రజలూ భారీగా హాజరయ్యారు.

పౌరహక్కుల సంఘం మహా సభలు

హైదరాబాద్‌లోని రాంకోఠిలోని సరోజిని దేవి భవన్‌లో ఆగస్ట్ 10, 11 తేదీలలో ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం 16వ మహాసభలు జరిగాయి. ఈ సభలలో ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘాన్ని, పౌర హక్కుల సంఘంగా మారుస్తూ తీర్మానం చేశారు. నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శేషయ్య, ప్రధాన కార్యదర్శిగా చిలుక చంద్రశేఖర్, ఉపాధ్యక్షులుగా బి. తిరుమలరావు, వి. చిట్టిబాబు, ప్రొ. జి. లక్ష్మణ్, సంయుక్త కార్యదర్శులుగా శ్రీమన్నారాయణ, వి. రఘునాథ్, ఎన్. నారాయణ్‌రావు, అన్నపూర్ణ, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ప్రొ. జి. హరగోపాల్, ఆంజనేయులు, రాజారావ్, వి. బోస్‌తో పాటు మరో ఆరుగురు సభ్యులను ఎంపిక చేశారు. ఈ సభలకు వివిధ ప్రజా సంఘాల నాయకులూ, ప్రజలూ హాజరయ్యారు.

జొన్నలగడ్డ రాధాకృష్ణ మృతి

సీనియర్ పాత్రికేయులు జొన్నలగడ్డ రాధాకృష్ణ (70) ఆగస్టు 19న హైదరాబాద్‌లో ఆయన స్వగృహంలో గుండెపోటుతో చనిపోయారు. ఆయన ఆంధ్రపత్రిక, ఉదయం, ఆంధ్రజ్యోతి, దూరదర్శన్‌లతో పాటు యుఎన్ఐ, పిటిఐ, వంటి వార్తా సంస్థల్లో కూడా పని చేశారు. అలాగే ఆల్ ఇండియా రేడియోలో న్యూస్ రీడర్‌గా పని చేశారు. ఆయన కథకుడు కూడా.

జూనియర్ డాక్టర్ల సమ్మె

తమ హక్కుల సాధన కోసం జూనియర్ డాక్టర్లు జూలై 30 నుంచి ఆగస్టు 19 వరకు నిరవధికంగా, రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేశారు. దీంతో అన్ని ప్రభుత్వ హాస్పిటల్లలో నిత్యవసర సేవలు నిలిచి పోయాయి. ప్రభుత్వం వారి డిమాండ్లను ఒప్పుకోలేదు. చివరికి రాష్ట్ర హైకోర్టు జోక్యం చేసుకొని, వారి డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వానికి సూచిస్తూ, వారిని తమ విధులలో చేరాలని కోరింది.

రాష్ట్ర విభజనకు మద్దతుగా ర్యాలీ

రాష్ట్ర విభజనను స్వాగతిస్తూ, ఆగస్టు 21న గుంటూరులో ఎస్‌సి, ఎస్‌టి. ఎంప్లాయిస్ ఫెడరేషన్, బహుజన ఆంధ్రా జెఎసి, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో 'అగ్రకుల పెట్టుబడిదారుల సమైక్యాంధ్ర ఉద్యమాన్ని తిప్పికొట్టాలి. బహుజనుల ఆంధ్రాకోసం నడుంకట్టాలి' అనే నినాదంతో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో దళిత, బహుజనులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. బహుజన కెరటాలు ఎడిటర్ పల్నాటి శ్రీరాములుతో పాటు మరికొంత మంది నాయకులను అరెస్టు చేశారు.

కొనసాగుతున్న సమైక్యాంధ్ర ఉద్యమాలు

యుపిఎ సమన్వయ కమిటీ, కాంగ్రెసు వర్కింగ్ కమిటీలు తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని జూలై 30న ప్రకటించాయి. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ప్రధానంగా రాయలసీమ, ఆంధ్ర ప్రాంతాల్లో రాష్ట్రం సమైక్యంగానే ఉండాలని జూలై 31 నుంచి ఉద్యమాలు కొనసాగు తున్నాయి. ఈ ఉద్యమాలలో రాజకీయ నాయకులు, ఎపిఎన్‌జిఒ, ఆర్‌టిసి, ఉపాధ్యాయ సంఘాలతో పాటు విద్యార్థులు పాల్గొంటున్నారు.

విశాఖ ఎచ్‌పిసిఎల్‌లో అగ్ని ప్రమాదం

విశాఖపట్నంలో ఉన్న హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేట్ లిమిటెడ్ (ఎచ్‌పిసిఎల్) సంస్థకు చెందిన విశాఖ రిఫైనరీలో ఆగస్టు 23న భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో పది మందికి పైగా చనిపోయారు. 37 మందికి పైగా గాయపడ్డారు. ఈ ప్రమాదం సాంకేతిక లోపం వల్లే జరిగిందని అధికారులు అంటున్నారు.

మాలతీ చందూర్ మృతి

ప్రముఖ రచయిత్రి మాలతీ చందూర్ (83) ఆగస్టు 21న చెన్నైలోని ఇసబెల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆమె గత కొంత కాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నారు. 1930లో కృష్ణా జిల్లాలోని నూజివీడులో పుట్టారు. ఆమె ప్రాథమిక విద్యను నూజివీడు, ఏలూరులలో ఎస్.ఎల్.సి చెన్నైలో చదివారు. ఆమె 'జగతి' మాస పత్రికకు ఎడిటర్‌గా పనిచేశారు. 25కు పైగా నవలలు, 150కి పైగా కథలు రాశారు. ఇతర భాషల నుండి 300కు పైగా రచనలను తెలుగులోకి అనువాదించారు. ఆమె తొలి తెలుగు కాలమిస్టుగా గుర్తింపు పొందారు. 'హృదయనేత్రి' నవలకు ఆమె కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందారు. వీ

'రాష్ట్ర విభజన' - మూడు ప్రాంతాల ప్రజాభిప్రాయాలు

జూలై 30 కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీర్మాన నేపథ్యంలో వీక్షణం మూడు ప్రాంతాలలో సాధారణ ప్రజల అభిప్రాయాలను సేకరించడానికి ప్రయత్నించింది. పదకొండు జిల్లాల ప్రజాభిప్రాయాలను ఇక్కడ ప్రచురిస్తున్నాం. మిగిలిన జిల్లాల ప్రజాభిప్రాయాలు వచ్చే సంచికలో... - సం.

నా కొడుకు చెప్తాంటే బాగ సంతోసమైంది. ఆనికిద్దరూ బిడ్డలే. వాకిటికి ఎకురంనర బీడున్నది. గదీనికి సాలుకు గిన్నన్ని నీల్లచ్చినా మనువరాల్లిద్దరు ఎల్లిపోతరు. నా ఎరకల ఇందిరమ్మ గంతే, ఎన్టీరు గంతే. ఎవ్వరూ మాకేం జేసిన పాపాన పోలే. గీ తెలంగాణ అస్తెనన్న గింతేమన్న మెతుకు దొర్కుతదేమో, సూడాలె.

– గొర్ల పోశవ్వ *(75), ఎస్టీ కాలని, జమ్మికుంట*

ఈ ఇచ్చే తెలంగాణ ఏదో ముందే ఇస్తే వెయ్యి మంది పిల్లలు బతికుండే వాళ్లు. తెలంగాణ వస్తే చాలు బాధలు పోతాయి. గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గుతాయని ఆశగా ఉంది. పేదవాళ్లు, మాలాంటి మామూలు వాళ్లు బతకడానికి కొంచెం వీలుగా ఉంటాయోననే నమ్మకముంది.

– కడెం సావిత్రి *(42), సాయిబాబా దేవాలయం రోడ్, కోరుట్ల*

జై తెలంగాణ! తెలంగాణ రాష్ట్రం సాకారమైందనగానే నేను, మా ఫ్రెండ్స్ ఎంతో సంతోషపడ్డం. ఎన్నో ఉద్యోగాలు కొత్తగా ఏర్పడతాయి. పోటీ తగ్గుతుంది. కొత్త రాష్ట్రానికి పెట్టుబడులు ఎక్కువగా వచ్చి వ్యాపార సంస్థలు ఏర్పడి ఉపాధి అవకాశాలు చాలా పెరుగుతాయి. మా భవిష్యత్తు మీద మాకు ఇప్పుడిప్పుడే ఎన్నో ఆశలు చిగురిస్తున్నాయి.

– సాకేగారి సుదీప్త్ *(21), విద్యార్థి శ్రీచైతన్య కళాశాల, కరీంనగర్*

ఇల్లలకగానే పండగ కాదు. పార్లమెంట్ సాక్షిగా వాగ్దానమిచ్చిన మనుషులు నెల కూడా తిరగకముందే వెనక్కు పోయారు. ఇప్పుడు మాత్రం పోరని ఏం నమ్మకం? కాంగ్రెస్‌ను నమ్మడమంటే కుక్క తోక పట్టుకుని గోదావరి ఈదినట్టే. మాట నిలుపుకుంటేనే నమ్మగలం. తెలంగాణ రాష్ట్రం రాగానే అన్ని సౌకర్యాలూ సిద్ధిస్తాయనే నమ్మకమైతే లేదు. కరెంట్ విషయమే చూడండి, చాలా కొరత ఏర్పడుతుంది. అన్ని విషయాల్లోనూ ఇలాంటి ఇబ్బందులే ఉంటాయి. ఎన్నో కష్టాలు అనుభవిస్తేనే గాని ఒక దీర్ఘకాలం తర్వాత సుఖాలను అనుభవించగలం.

– ఎం.డి. మునావర్ హుస్సేన్ *(43), మంకమ్మతోట, కరీంనగర్*

ఒకవైపు తెలంగాణ ఏర్పడిందనే సంతోషం ఉంది గానీ, మరోవైపు వ్యాపారాలు కుంటు పడతాయని, రిలయన్స్ లాంటి పెద్ద సంస్థలు చిన్న పట్టణాలకు వ్యాపిస్తాయని, కొన్ని వ్యాపారాలు పూర్తిగా మూత పడతాయని అంటున్నారు. అదే జరిగితే మా లాంటి చిన్న వ్యాపారుల పరిస్థితి దారుణంగా ఉంటుంది. అయినా మా వ్యాపారాలు ఎలా ఉన్నా సరే, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందంటే చాలా ఆనందంగానే ఉంది.

– కోల వైకుంఠం *(51), కరీంనగర్*

ప్రత్యేక తెలంగాణ ఒక న్యాయమైన డిమాండ్. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిపార్ట్‌మెంట్‌లలో మనకు ఉండవలసిన ఉద్యోగాల పంపిణీలో తీవ్ర అన్యాయం జరుగుతోంది. ఒక సచివాలయంలోనే మనకు 48 శాతం ఉద్యోగులు ఉండాలి. కాని ఇప్పుడు ఉన్నవి మాత్రం 15 శాతం ఉద్యోగాలే. విభజన జరిగిన తరువాత 100 శాతం మన తెలంగాణ వాళ్లే సచివాలయంలో ఉద్యోగులుగా ఉంటారు. విభజన అయినంత మాత్రాన సీమాంధ్ర వాళ్లకు అన్యాయం అవుతుందంటే అది అపోహ మాత్రమే. వాళ్లకు వాళ్ల ప్రాంతంలో 100 శాతం ఉద్యోగాలు వాళ్లకే ఉంటాయి కదా!

– దేవేందర్ రెడ్డి, *టీచర్, చిగురుమామిడి*

ప్రత్యేక తెలంగాణ రావలసిందే. ఎందుకంటే తెలంగాణలో ఎంతో మంది అర్హత ఉన్నా, చదువులో నైపుణ్యం ఉండి కూడా ఉద్యోగం సంపాదించలేక పోతున్నారు. అదే ఆంధ్ర వాళ్లు రికమెండేషన్స్‌తో ఉద్యోగాలు సంపాదిస్తున్నారు.

– శ్రీకాంత్, *ఎంబిఎ విద్యార్థి, కేశవపూర్*

రాష్ట్రం కలిసి ఉంటే సీమాంధ్ర నేతలు వాళ్ల ప్రాంతానికే అభివృద్ధి కోసం ఎక్కువ ఖర్చు చేస్తారు. మన ప్రాంత నాయకులు మన అభివృద్ధి పట్టించుకోరు. విభజన జరిగితే సీమాంధ్ర నాయకులకు మన సంపదను దోచుకునే అవకాశం ఉండదు. మన ఆదాయం మనమే ఖర్చు పెట్టి అభివృద్ధి చేసుకోవచ్చు.

– కుమారస్వామి, *వ్యాపారి, హుస్నాబాద్*

తెలంగాణ వస్తే మంచిదే. చిన్నప్పుడు మనం చదువుకోలేదు. కనీసం మన పిల్లలను మంచిగా చదివించాలి. ఇప్పుడు పిల్లలను చదివించాలంటే పైసలు బాగా అవుతున్నయి. తెలంగాణ వత్తె పిల్లలందరికి ఇంగ్లిష్‌తో కూడిన విద్య డిగ్రీ వరకు చదివించుతానని కెసిఆర్ చెప్పిండు కదా.

– రాంచంద్రం, *లేబర్, జనగామ*

చిన్న రాష్ట్రాలు ఉంటేనే అభివృద్ధి సాధించవచ్చని డా. బి.ఆర్. అంబేద్కర్ అన్నారు. ముఖ్యంగా అనగారిన వర్గాలను ఎప్పుడూ అగ్రవర్ణ కులాల వాళ్లు అణగదొక్కుతునే ఉంటారు. రాష్ట్రం విడిపోతే ఒక దళిత ముఖ్యమంత్రి అయితేనే మా హక్కులు సాధించుకునే అవకాశం ఉంటది. సమైక్య రాష్ట్రంలో దళితుడు ముఖ్యమంత్రి కాలేదు. ఒకవేళ రాష్ట్రం విడిపోకపోతే దళితులను ఇంకా అణచివేస్తారు. అందువల్ల తెలంగాణ రాష్ట్రం తప్పకుండా రావాలి.

– రవి, *ఆటోడ్రైవర్, ఇందుర్తి*

ఇంతకు ముందు బ్రిటిష్ వాళ్లు మనల్ని ఏ విధంగా బానిసలుగా ఇప్పుడు సమైక్య రాష్ట్రంలో సీమాంధ్ర నేతలు మనల్ని బానిసలుగా చేస్తున్నారు. స్వయం పరిపాలనా ఉంటే మనల్ని మనం పాలించుకోవచ్చు. అప్పుడు కచ్చితంగా తెలంగాణ అభివృద్ధి చెందుతుంది. ఇతర ప్రాంత నాయకులకు మన ప్రాంతం మీద అంతగా ప్రేమ ఉండదు. ఏ ప్రాంత

నాయకులకైనా వాళ్ల ప్రాంతాన్నే అభివృద్ధి చేయాలని ఉంటది. మన రాష్ట్రంలో ఎస్‌టిలు 8 శాతం సీమాంధ్రలో 3 శాతం తెలంగాణలో ఉన్నారు. కాని రిజర్వేషన్ విషయంలో ఇరు ప్రాంతాల ఎస్‌టిలను కలిపి రిజర్వేషన్ ఇస్తారు. అట్లాంటప్పుడు 3 శాతం ఉన్న తెలంగాణ ఎస్‌టిలకు అన్యాయం జరుగుతుంది. సీమాంధ్ర ఎస్‌టిలకు ఎక్కువ ఉద్యోగాలు పోతున్నయి.

– ***తిరుపతి రెడ్డి,*** *టిఆర్‌ఎస్ నాయకులు, హుస్నాబాద్*

తెలంగాణ ఒకప్పుడు రాష్ట్రమే కాని 1956లో ఆంధ్రలో కలిపినారు. అప్పుడు కలిపేటప్పుడు కొన్ని ఒప్పందాలు జరిగినాయి. విద్య, ఆరోగ్యం, ఉపాధి వీటి మీద ఒప్పందాలు జరిగినాయి కాని సమైక్య రాష్ట్రంలో ఆ ఒప్పందాలు అమలు జరగడం లేదు. వాళ్లు మన ఉద్యోగాలు దోచుకుని, మనల్ని నిరుద్యోగులుగా మారుస్తున్నారు. మన తెలంగాణలో అన్ని డిపార్ట్‌మెంట్‌లలో సీమాంధ్ర ఉద్యోగులే ఎక్కువగా ఉన్నారు. మనకు ఉద్యోగాలు తక్కువ. ప్రమోషన్స్ కూడా వాళ్లకే ఎక్కువ ఉన్నాయి. రాష్ట్రం విడిపోతే కచ్చితంగా మన ఉద్యోగాలు మనకే ఉంటాయి. నిరుద్యోగ సమస్య కొంతైనా తీరుతుంది.

– ***రాజమౌళి,*** *ఎంబిఎ, నిరుద్యోగి, హుస్నాబాద్*

(సమాచార సేకరణ : లోకే రాజ్‌పవన్, దేవేందర్, కరీంనగర్)

ఐకమత్యమే బలం అనేది ప్రతి విషయంలోనూ రుజువవు తోంది. ఇప్పుడు తెలంగాణ సీమాంధ్ర విభజన అనేది ఎవరికీ ఎంత లాభం ఎవరికీ ఎంత నష్టం అనే విషయాన్నీ ఆలోచించే ముందు ఎడబాటు లేదా విడిపోవడం అనేది ఒక కుటుంబానికైనా, వ్యవస్థకైనా ఎప్పుడూ నష్టమే అని చరిత్ర చెప్తోంది. కావున రాష్ట్రం సమైక్యంగా ఉండడమే మేలు.

– **చేనమల్లు విశ్వేశ్వరరావు** *(36), ఆంగ్ల అధ్యాపకులు, శ్రీకాకుళం*

కొన్ని కారణాల వల్ల విడిపోయిన ఎన్నో సంస్థలు, దేశాలు మరలా ఏకమవుతున్నాయి. యుఎన్‌ఒ, ఇయు, బ్రిక్స్ లాంటి సంస్థలు, జర్మనీ లాంటి దేశాల ఆవిర్భావం జరిగాయి అంటే విడిపోయి కలవడం వల్లనే అని గుర్తుంచుకోవాలి. కాబట్టి తెలంగాణ కలిసివుంటేనే ప్రయోజన మెక్కువ.

– ***పి. ఆనందరావు*** *(45), హెల్త్ అసిస్టెంట్,హరిపురం.*

సీమాంధ్రలో జరుగుతున్న ఆందోళనలో రాజకీయ నాయకులు అక్కడో మాట మాట్లాడుతున్నారు. ఈ ఆందోళనను ప్రజలు సరిగా అర్థం చేసుకోవడం లేదు. ప్రస్తుతం న్యాయంగా విభజించాలని విజయమ్మ డిమాండ్ చేస్తున్నారు. చంద్రబాబు నాలుగు లక్షల కోట్లు డిమాండ్ చేస్తున్నారు. అంటే రాష్ట్రాన్ని విభజించాలనే చెప్తున్నారు. విభజన జరపాలంటూనే ఉద్యమాల్లో పాల్గొంటున్నారు. కావాలనే నాయకులు అస్పష్టత సృష్టిస్తున్నారు. వీళ్లను చూసి ఆందోళన చేసిన వారికి నిరాశే మిగులుతుంది. ఉద్యమం ఎగిసిపడినప్పుడు నాయకులు ముందుకొచ్చి, తీవ్రత తగ్గినప్పుడు వెనక్కి వెళతారు. చివరకు నష్టపోయేది ఉద్యోగులే.

– ***సి. హెచ్. దుర్గాప్రసాద్ (34),*** *జర్నలిస్ట్, నరసన్నపేట*

సీమాంధ్ర ప్రాంత ఆకాంక్ష ఎన్నికల ద్వారా నిరూపణ కావాలి. అది తెలంగాణలో టిఆర్‌ఎస్ మెజారిటీ సీట్లు దక్కించుకోవడం ద్వారా జరిగింది.

– ***కె. కరుణ (29),*** *ఉపాధ్యాయురాలు, నరసన్నపేట*

హైదరాబాద్ లేని తెలంగాణను ఎంత వేగం వీలైతే అంత వేగం ఏర్పాటు చేయాలి. హైదరాబాద్ తెలంగాణ ప్రాంతం అయితే కావచ్చు గాక, అది ఆంధ్రకు గుండెకాయ. అది లేకపోతే ఆంధ్ర లేనట్టే.

– ***బన్నాన లక్ష్మణ రావు (25),*** *విద్యార్థి, రాజాం*

వేర్పాటువాదం జాతీయవాదానికి చేటు. ఉన్నపళంగా రాష్ట్రాన్ని ముక్కలు చేయాల్సిన అవసరం లేదు. ప్రజల మనోభావాలు తెలుసుకుని విభజించడం మంచిది. ఇది కేవలం రాజకీయ కాంక్ష మాత్రమే. విభజిస్తే అందరికీ మిగిలేది శోకమే. ఏకారణం వల్లనైనా ప్రజల మనోభావాలను దెబ్బ తీసే హక్కు ఏ పార్టీకి లేదు.

– ***ఎ. శోభారాణి (30),*** *గృహిణి, టెక్కలి*

తెలంగాణ తెలుగు తల్లి ముద్దు బిడ్డ. బిడ్డను ఒడిలో పెట్టుకుని లాలించిన మన తెలుగు తల్లి తల్లడిల్లింది. శోక సంద్రమైంది.

– ***ఎమ్. పాపినాయుడు (35),*** *ఉపాధ్యాయుడు, పాతపట్నం*

అత్యున్నతమైన రాజ్యాంగం ప్రకారం ఒక ప్రాంతానికి అన్యాయం జరిగినట్టు భావిస్తే దాన్ని అభివృద్ధి పరచడానికి తగిన చర్యలు తీసుకోవాలి గాని ఇలాంటి చిన్న చిన్న రాష్ట్రాలుగా విడిపోతే అభివృద్ధి మాట పక్కన పెడితే రాజరిక వ్యవస్థ, బానిస బతుకులు మళ్లీ మొదలవుతాయి.

– ***మామిడి రూప్ సుందర్ (27),*** *మార్కెటింగ్ మేనేజర్, సోంపేట*

శ్రీకృష్ణ కమిటీ సూచనలు విధిగా అనుసరించాలి. హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా వందేళ్లపాటు వుంచాలి. హైదరాబాద్ జనాభా ప్రాతిపదికను బట్టి అక్కడి రెవిన్యూను ఇద్దరూ పంచుకోవాలి. పారిశ్రామికవేత్తలు, ప్రవాస భారతీయులు ఇకపై సీమాంధ్రలో పెట్టుబడులు పెట్టాలి.

– ***ప్రొ. దాసరి యుగంధర్ (42),*** *శ్రీకాకుళం.*

(సేకరణ: దుప్పల రవికుమార్, శ్రీకాకుళం)

వాళ్లు కల్సి ఉందామనుడు దోసుక తినేతందుకే. ఎవల్ది వాళ్లు చేసుకునే దాన్కి లొల్లి ఎందుకు? గరీబోళ్లం కిందా మీదపడి సదివితే లాభమేంది? వాళ్లు ఉద్యోగాలు దొబ్బుకపోతుంటే మా పోరగాండ్లు ఉత్తగనే తిరుగవట్రి. మా రాష్ట్రం మాకొస్తే పది మందిలో ఒక్కరికొచ్చినా నయమే గదా! పోరగాండ్ల బత్కులన్నా బాగుపడ్తాయ్ గదా!

– ***చామంతుల భూమయ్య,*** *రైతుకూలి, ఎల్లారెడ్డిపేట*

గిన్ని దినాలకోలె కొట్లాడవడ్తిమి. మనది మనకొత్తె నాయెం జరుగుద్దని కాట్లాడ్తిమి. వచ్చిందాన్ని వద్దనటానికి గాళ్లెవలు. ఎన్నో తీర్ల బాధలు వడ్తిమి. మళ్లా ఎన్కక్కు పోతే, ఇడ్సిపెడితే ఎట్లుంటది? వొచ్చేదాక కొట్లాడుడే.

– ***కర్రె కనకవ్వ,*** *కూలీ, పుల్లూరు*

రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేస్తూ, సీమాంధ్ర నాయకులు కృత్రిమ ఉద్యమం సృష్టిస్తుండ్రు. ఆంధ్ర రాష్ట్రానికి రాజధాని వస్తే వేలాది మంది విద్యార్థులకు ఉపాధి, ఉద్యోగావకాశాలొస్తాయి. అక్కడ అభివృద్ధి జరుగుతది. హైదరాబాద్‌లో అక్రమంగా ఆస్తిపాస్తులు సంపాయించినోళ్లు హైదరాబాద్‌ను సాకు సూపుతుండ్రు. ఇక్కడి రైతులు బోర్ల మీద బోర్లు వేసి అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకుంటే ఏనాడైనా ఆదుకుంటా మన్నారా? అక్కడ వరదలొస్తే ఇక్కడ మన వాళ్లు విరాళాలు ఇయ్యలేదా? కల్సి ఉండి కూడ బాగు చేసిందేమీ లేదు. వాళ్లు బాగుపడ్డరు తప్ప. అందుకే తెగ బాధపడ్తున్నట్లు నటిస్తుండ్రు. ఎవరిది వాళ్లు చేసుకునుడే మంచిది. అక్కడి ప్రజలు అర్థం చేసుకోవాలె. వాళ్ల పెత్తనం ఎక్కువై ఆత్మగౌరవం దెబ్బతిందనీ, నీళ్లు, నిధులు, నియామకాల్లో అన్యాయం

జరిగిందని స్వరాష్ట్రాన్ని కోరుతున్నం. విడిపోతే నష్టమేంటో తెల్పకుండా, ద్వేషాన్ని వెళ్లగక్కుతూ సమైక్యమంటా ఆందోళన చేయడం అర్థ రహితం. ఆత్మీయంగా ఉండాలంటే విడిపోక తప్పదు.

– **స్వర్ణలత,** ఉపాధ్యాయురాలు, మిరుదొడ్డి

విడిపోతే వాళ్లకొచ్చె నష్టం చెప్పాలి గాని విడిపోతమంటే కల్సి ఉండమనుడేంది? పెద్ద పెద్దోళ్లు, నాయకుల కుట్రలే ఇవన్నీ. ఎన్నో ఏండ్లుగా మాది మాగ్గావాలని కొట్లాడ్తుంటే అడ్డం పడుడేంది? గాళ్లకు భయపడి ఎన్కకుపోతే ఉద్యమాన్ని ఉధృతం చేసుడే, ఊకునే సమస్యే లేదు.

– **ఆటో యాదగిరి,** ఎల్లారెడ్డిపేట

మనతో కల్సి ఉంటే వాళ్లకు లాభాలేవో బాగున్నయ్. అందుకే సమైక్యమంటున్నరు. అయిందేదో అయింది. ఎవరిది వాళ్లు చేసుకోవటానికేంది? ఇప్పుడన్నా మన రాష్ట్రం మనకొస్తే భవిష్యత్తులో పిల్లలకన్నా మేలు జరుగుద్ది కదా! నాయకులు సరిగా ఉండాలి.

– **చెరుకు శ్రీనివాస్‌రెడ్డి,** రైతు, తుక్కాపూర్

విద్యారంగంతో పాటు నీటిపారుదల వంటి ఏ రంగంలోనైనా సీమాంధ్ర పాలకులు తెలంగాణ ప్రాంతం పట్ల వివక్ష చూపిస్తూ వచ్చింద్రు. విద్యా సంస్థలు, కాలేజీలు, మెడికల్ కాలేజీల సంఖ్యతో పాటు ఉద్యోగాల్లో వివక్ష చూపింద్రు. రైతులకు నష్టపరిహారంలో, అభివృద్ధిలో వివక్షను పాటించింద్రు. హైదరాబాద్‌లో భూముల్ని ఆక్రమించి ఆస్తుల్ని కూడబెట్టుకొని హైదరాబాద్‌తో అనుబంధం పెంచుకున్నమని లేని సానుభూతిని ఒలకబోస్తున్నరు. ఎవరి ప్రాంతాన్ని వాళ్లు పాలించుకుంటే ఇద్దరికి మంచిది.

– **మౌనిక,** *విద్యార్థి, అనంతసాగర్*

కల్సి ఉండుడు కుదరకపోతే విడిపోవచ్చని నెహ్రూ ఆనాడే చెప్పిండు. వాళ్లిప్పుడు లొల్లి చేసే అవసరమే లేదు. విశాఖపట్నమో, విజయవాడనో రాజధానిగా ఏర్పడితే, పరిశ్రమలు పెట్టుకుంటే అక్కడి ప్రజలకు లక్షలాది ఉద్యోగాలొస్తయ్. మనల్ని అభివృద్ధి చేసినమనుడెందుకు? వాళ్లను వాళ్లు అభివృద్ధి చేసుకోవచ్చు కదా? ఇక్కడి ఉద్యమాన్ని చూపించని మీడియా అక్కడి ఉద్యమాన్ని రెచ్చగొట్టేలా చూపిస్తుంది.

– **నాగుల గోపాల్,** వ్యాపారస్తుడు, ఎన్సాన్‌పల్లె

(సేకరణ : ఎన్. భగవాన్ రెడ్డి, మెదక్)

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రమైతే ట్రాన్స్‌పోర్ట్ ఖర్చులు పెరుగుతాయి. వ్యాపారంలో ఇప్పటికే పోటీ ఎక్కువ ఉంది.లాభాలు తగ్గిపోతాయి.

– **నర్సింహారెడ్డి** *(40), మినరల్ వాటర్ సప్లయర్, అనంతపూర్*

ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే మనకు రావాల్సిన నీళ్లు రావు. హైదరాబాద్‌లో ఇదివరకు దొరికినట్లు ఉద్యోగాలు దొరకవు. నీళ్లుకు ఇప్పటికే ఇబ్బందిగుంది. అది ఇంకా క్లిష్టమయితది.

– **రామ్మూర్తి** *(40), కిరాణం వ్యాపారి, రాయల చెరువు*

హైదరాబాద్‌పోతే నీళ్లే రావు. హైదరాబాద్ కావాలె, నీల్లు కావాలె. హైదరాబాద్ నుంచే నీల్లు వస్తయి.

– **వెంకన్న** *(70),* రైతు, ముప్పాలగుత్తి

ఎట్లాగు కలుసుండే అవకాశం లేదు. న్యాయమయిన పద్ధతిలో విభజన జరగాలి. అనంతపురం జిల్లాకు ఎక్కువ నీటి కేటాయింపులు ఉండాలి.

– **నరేందర్‌రెడ్డి** *(45),* అడ్వకేట్, అనంతపూర్

(సేకరణ కె. నాగేశ్వరాచారి, అనంతపూర్)

తెలంగాణ వస్తే మంచిదే. గాడ్డి కష్టం చేస్తే నాలుగు మెతుకులు దొర్కుతున్నయి. పిల్లలు వాళ్ల సదువులు, పెండ్లిండ్లు, అప్పుల నిండ దిగబడ్డది బతుకు. ఇది మారాలె. అట్లైతే లాభమే.

– **ముంతాజ్ బేగం,** వ్యవసాయ కూలీ, కొల్లాపురం

చీకట్లను దూరం చేసే వృత్తి నాది. కాని బతుకంతా చీకటే. అడుగడుగునా ప్రమాదమే. సంబరాల్లో రంగు రంగుల జిలుగు వెలుగులు నింపే మా బతుకుల తెలంగాణలో మారుతై.

– **నిరంజన్,** ఎలక్ట్రీషియన్, వరిదేల

ప్రాణ త్యాగాలు తప్ప అభివృద్ధి ఆశలు కన్పిస్తలేవు. ఇన్ని త్యాగాలు చేసినా కనికరం లేకపాయే. నోరు మూసుకొని కలిసి పడి ఉండాల్సిందే అని గొడవ జేస్తున్నరు. ఇంత కుళ్లా!

– **ఆస్మా,** *గృహిణి, జటప్రోలు*

మనకు సమృద్ధి వనరులున్నయి. సద్వినియోగం చేసుకొని జనానికి అండగా నిలిచే నిజమైన నాయకులు కావాలి.

– **ఫణికుమార్‌రెడ్డి,** ఎం.ఎ., వ్యవసాయం, పెద్దదారూర్

తెలంగాణ రావడం చాలా అవసరం. నదుల నీళ్లు మన వాటా మనకు దక్కించుకుంటాం. మన కరెంటు మనం ఉత్పత్తి చేసుకొని ఎన్నో పరిశ్రమలు స్థాపించుకోవచ్చు. ఇది జరగక పోతే తెలంగాణ వచ్చినా లాభం లేదు.

– **ఈసూఫ్,** *బిఇడి ట్రైనీ,* కొల్లాపురం

తెలంగాణ వస్తే ఏమి? రాకపోతే ఏమీ? నా బాధలు నాకు తప్పవు. నా బతుకు నాకు తప్పలే. ఏలోటోల్లంతా మళ్లా ఈల్లే ఉంటే ఏం లాభం?!

– **ఉస్మాన్ మియా,** కార్పెంటర్, కొల్లాపురం

తెలంగాణ రావాల్సిందే. నష్టమైనా కానీ లాభమైనా కానీ, ఇప్పటిదిప్పుడు, మార్పు రాకపోయినా, పది ఇరవై ఏండ్లు బాగా కష్టపడాల్సి రావచ్చు. బానిస బతుకులే ఇంకా ఎన్నాళ్లని?

– **చింత రేవులయ్య,** నందిన్నె

ఏమో.. అనుమానమే. ఇంకా పరిస్థితి దిగజారొచ్చు. తెలంగాణ కావాలని గట్టిగా కోరుకున్న వాణ్నే. కానీ ఈ రాజకీయ నాయకుల మీద నాకైతే నమ్మకం లేదు. వీళ్లు ఆకలిగొన్న పులుల్లాగున్నరు. కొత్త తరం మేల్కొనాలే!

– **ఉస్మాన్,** *ప్రైవేట్ లెక్చరర్ గద్వాలు*

అయ్యో! ఇదేం సార్. ఇంగా లాభమా నష్టమా అని మాట్టాడుకుందామా! ఏది ఏమైనా తెలంగాణ రావాల్సిందే. మనింట్ల మనం పస్తులుండైనా సరే గౌరవంగా బతుకుదాం. కష్టపడి మనం, మన పిల్లలూ పైకి వద్దాం!

– **మంగలి కిష్టప్ప,** అలూరు, *గట్టు*

ఏమో సూడబ్బా.. పిల్లలెంత సక్కగుండిరి. పానాలు బోగొట్టుకునిరి తెలంగాణ కోసం. ఒక్క ఎంఎల్ఎ గాని. మంత్రిగాని పానమిచ్చిరా! వాల్లంతా బాగానే ఉన్నరు. త్యాగాలు చేసి నోల్లు ఎక్కడ ఉన్నరోగాని ఈల్లే ముందుర్కి పూనుకున్నరు. మల్ల పీక్కతిననీకే.

– **కోమటి వీరన్న** *(70), అలూరు గ్రామం, గట్టు మండలం*

తెలంగాణ రావాలబ్బా. పాలమూరు ఎత్తి పోతల స్కీముల్లాంటివి ఇంగా శానా సాధించుకొని బీళ్లు పచ్చగ జేసుకోవాలె! సదువులు, ఉద్యోగాలు మన పిల్లలకు, సేతినిండ పని మన పెద్దలకు దొర్కుతవి. నాయకుల మీద ఓ కన్నేసి ఉండాలి. మంచి నాయకులు రావాలె.

– **గోవిందప్ప,** *రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి, గట్టు గ్రామం*

తెలంగాణ వచ్చినందుకు ఆనందపడుతున్న. మా పిల్లలకు ఉద్యోగాలు వస్తయి. మా ఊళ్లకు నీళ్లొస్తయి. మన రాష్ట్రం మాకొస్తే బాగుపడుతం. కల్వకుర్తి ఎత్తి పోతల పథకం ప్రతి ఒక్కరు అమలు చేస్తనన్నరు. కాని ఏ ఒక్కరు దాని పూర్తి చేయలేదు. ఎన్నేళ్లాయే దాని కోసం ఎదురు చూడబట్టి. ఇకనైన దాని పూర్తి చేయాలని వేడుకుంటున్న. మన తెలంగాణ ఇవ్వద్దని ఆంధ్రోళ్లు అడ్డుపడుతుర్రు. వాళ్లది తొండి లెక్క. మనది మనకు కావాలని కొట్లాడాలి.

– సల్వాది జంగయ్య *(45) రైతు, అజిలాపురం*

తెలంగాణ మనది మనకు కావాలి. మన రాజకీయ నాయకులు కట్టుబడి ఉండాలి. 50 రూపాయలు మారిస్తే ఒక్క రోజు కూడా సరిపోవు. అదే తెలంగాణ వస్తే తక్కువ ఖర్చులు చేయాలి. మన కంటే ముందువారు ఐదు రూపాయల కూలీ చేసిర్రు. ఇప్పుడు వంద, రెండు వందల కూలీ అయింది. దానికి తగ్గట్టు ఖర్చులైనవి. బతకడమే భారమైంది.రోజు కూలీ చేసిన ఇల్లు గడవడం కష్టంగుంది. పేదోళ్లను బాగుచేసే తెలంగాణ వస్తే మంచిది. మన నాయకులు కూడా ఆంధ్ర నాయకుల్లాగా పేదల్ని దోచుకుంటే తెలంగాణ వచ్చిన ఏం లాభం లేదు. ఆంధ్రోళ్లు ఎందుకు కలిసుండా మంటున్నరంటే ఇంకా మనల్ని దోచుకొని ఇంకా పెద్దవుదామను కుంటాన్నారు.

– మద్దెల యాదమ్మ *(40) కూలీ, మాలేపల్లి*

తెలంగాణ ఇచ్చినందుకు చాలా సంతోషంగా ఉంది. త్వరగా పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లు పాసుచేస్తే ఇంకా మంచిదని భావిస్తున్నాను. మన తెలంగాణ కోసం వేయి మందికి పైగా చనిపోయారు. వారికే తెలంగాణ అంకితం చేయాలి. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాజకీయ నాయకులు ప్రజలకు మంచి చేయాలని కోరుతున్నాను.

– ఎస్. ప్రవీణ్ *(21), పాలిటెక్నిక్ విద్యార్థి, అజిలాపురం*

తెలంగాణ ఇచ్చినందుకు ఆనంద పడుతున్న. ఇప్పుడు బయటికెళ్లి ఆటో నడుపుకొద్దామంటే పెట్రోల్ ఖర్చులు పెరిగిపోతున్నవి. రోజు ఆటో నడుపుతుంటే వచ్చే పైసలు కొంత అందులో పెట్రోల్‌కు, కూరగాయలకే పోతున్నయి. తెలంగాణ ఏర్పడిన తరువాత ధరలు పెరగకుండా చూడాలి.

– శ్రీను *(28), ఆటో డ్రైవర్, ఆమన్‌గల్*

తెలంగాణ వచ్చినందుకు చాలా ఆనందంగా ఉంది. తొందర తొందరగా ఇంకా తెలంగాణకు సంబంధించిన పనులు ఏమైన ఉంటే వాటిని పూర్తి చేయడం మంచిది. వ్యాపారం చేయాలంటే చాలా కష్టంగా ఉంది. తెలంగాణ ఏర్పాటైన తరువాత ఇలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలి. ఆంధ్రోళ్లదంతా దొంగ ఉద్యమాలు. వారి ఆస్తులు పోతయని వారి భయం.

– రవి *(30), వ్యాపారి, అజిలాపురం*

(సేకరణ – ఇక్బాల్, ఎస్. శ్రీశైలం, మహబూబ్‌నగర్)

చిన్నరాష్ట్రాల ఏర్పాటు ఆహ్వానించదగ్గ విషయమే. రాజ్యాంగ బద్ధంగానే జరుగుతున్న విభజనను స్వాగతిద్దాం. మన దేశంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 30 కోట్ల జనాభా ఉన్నప్పుడే, దేశాన్ని 100 రాష్ట్రాలుగా విభజించాలనే అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. అవినీతి రహిత సమాజం కావాలన్నా, పరిపాలన అందరికీ అందుబాటులో ఉండాలన్నా, సామాన్యులకు సత్వరన్యాయం అందాలన్నా చిన్నారాష్ట్రాల ఏర్పాటే మార్గం. ఈ క్రమంలో తెలంగాణా రాష్ట్రం ఏర్పాడటం ఎంతో ఆహ్వానించదగ్గ పరిణామం.

– డా. నాగలూరు దయాకర్, *అంబేద్కర్ అధ్యయన కేంద్రం కన్వీనర్, తిరుపతి*

తెలంగాణ రాష్ట్ర విభజనపై సిడబుసి చేసిన తీర్మానాన్ని ఉపసంహరించుకోవాలి. అన్ని ప్రాంతాల ప్రజల మనోభావాలను అనుసరించి నిర్ణయం తీసుకోవాలి. రాష్ట్రంలో ఎక్కువ రాజకీయపార్టీలు దాగుడుమూతల ధోరణిని అవలంభిస్తున్నాయి. ఒక వేళ తెలంగాణ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని కాంగ్రెస్ తెలంగాణ ప్రకటన చేసినట్లైతే, ఇప్పుడు సీమాంధ్ర ప్రాంతంలోనూ తీవ్రస్థాయిలో ఉద్యమం జరుగుతోంది కదా? దీనికి ప్రభుత్వం ఏమి సమాధానం చెబుతుంది. ప్రజాస్వామ్య బద్ధంగా అన్ని ప్రాంతాలకు పాలకులు సమన్యాయం పాటించాలని కోరుతున్నాము.

– మాసూమ్ ఇండియా, న్యాయవాది, *తిరుపతి*

రాష్ట్ర విభజన ద్వారా దేశంలోని మిగతా రాష్ట్రాలకంటే మన రాష్ట్రం పూర్తిగా వెనుకబడే ప్రమాదం ఉంది. దక్షిణాదిలో ఓ సమీప రాష్ట్రానికి చెందిన కొందరు కీలకనేతలు ఆంధ్రరాష్ట్రాన్ని విభజించేందుకు కుట్రపన్నుతున్నారు. ఈ పరిస్థితిని అధిగమించాలంటే ఆంధ్రప్రదేశ్ సమైక్యంగా ఉండటమే మార్గం. కేంద్ర ప్రభుత్వం దీనికి చొరవ తీసుకోవాలి. ఆంధ్రప్రదేశ్‌ను సమైక్యంగా ఉంచేందుకు ప్రజలు డిమాండ్ చేయాలి. రాజకీయ, ప్రజాసంఘాలు బాధ్యతతీసుకొని ప్రజలను ముందుకు నడిపించాలి. తెలంగాణా రాష్ట్ర ఏర్పాటుతో నక్సలైట్ల ప్రాభల్యం పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే దేశంలో ఎక్కడ ఎన్‌కౌంటర్లు జరిగినా ఎక్కువగా తెలంగాణ ప్రాంతానికి చెందిన వారే ఉండటం గమనించదగింది. దీని ద్వారా జరిగే మంచి, చెడ్డలను ఒకసారి ఆలోచించాల్సిన అవసరం ఉంది.

– వి. మాధవరెడ్డి, *పరిశోధక విద్యార్థి, ఎస్‌వియు, తిరుపతి*

అంబేద్కర్ ఆలోచనలను అనుసరించి చిన్న రాష్ట్రాల ఏర్పాటుకు మేము మద్దతు తెలియజేస్తున్నాము. అయితే విశాల ప్రజల ఆకాంక్షలను బట్టి ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకోవాలి. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తే, హైద్రాబాద్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా చేయాలి. లేకపోతే హైద్రాబాద్‌లో ఒక ప్రాంతంవారి ఆధిపత్యంపెరిగి భవిష్యత్తులో మరింతగా ప్రాంతీయ విద్వేషాలు పెచ్చరిల్లే అవకాశం ఉంది.

– కె. అక్కులప్ప నాయక్, *గిరిజన విద్యార్థి సంఘంనేత, తిరుపతి*

రాష్ట్ర విభజన మంచిదే. ఈ రోజు మన రాష్ట్రంలో జరుగుతున్న ఉద్యమాల వల్ల లాభనష్టాలు రెండూ ఉన్నాయి. అయితే రాష్ట్రం విడిపోతే ఎక్కువగా నష్టపోయేది రాజకీయనాయుకులే. రాష్ట్ర విభజనవల్లా సామాన్య ప్రజలకు వచ్చే నష్టం ఏమిటో నాకు అర్థంకాదు. సాధారణ ప్రజలకు ఎప్పుడూ కష్టాలు తప్పడం లేదు. ఈ రాష్ట్రం కలిసున్నా, విడిపోయినా వారికున్న కష్టాలు వారికుండనే ఉంటాయి. రాష్ట్రవిభజన వల్ల బడాపెట్టుబడిదారులకు చెంపపెట్టు. ప్రజాస్వామిక ఆకాంక్షల ప్రతిఫలనం అది. ఎక్కడైనా, ఎక్కడైనా ఏమైనా సాధిస్తారు అనేందుకు తాజా ఉదాహరణ తెలంగాణపై సీడబ్లూసీ నిర్ణయం. విభజన మంచిదే.

– పాండురంగశెట్టి, *టీచర్, టి.కె.ఎం.పురం, చిత్తూరు*

కలిసుంటేనే రాష్ట్రాభివృద్ధి. రాష్ట్రవిభజనకు నేను వ్యతిరేకిని. విభజన

వల్ల అన్యాయం, మోసం, నష్టం, కష్టం వంటివి ఓ ప్రాంతానికే జరిగే అవకాశం ఉంది. అయినా రాష్ట్రాన్ని విభజించేంత దారుణమైన పరిస్థితులు ఏమీ ప్రస్తుతం కనిపించడం లేదు. ఆంధ్రప్రదేశ్ ప్రజలంతా కలిసి మెలసి జీవించాలని నేను కోరుకుంటున్నాను.

– ***అశోక్‌కుమార్ చౌదరి,*** *కోచింగ్ సెంటర్ నిర్వహకుడు, తిరుపతి*

హైదరాబాద్ అందరిదీ. 23 జిల్లాల సమిష్టి కృషి ఫలితమే హైద్రాబాద్. అన్ని హంగులతో తీర్చిదిద్దిన తర్వాత ఇప్పుడు హైదాబ్రాద్ మాదని ఒక్క తెలంగాణ వారు అనడం న్యాయం కాదు. హైద్రాబాద్‌లో ఆంధ్ర ప్రజలంతా కలిసి మెలసి అన్నదమ్ముల్లా కలిసుండాలని భావిస్తున్నా.

– ***గంగారామ్,*** *ఉద్యోగి, తిరుపతి*

(సేకరణ – ఎం. ఆదిశేషయ్య, తిరుపతి, చిత్తూరు)

రాష్ట్ర ప్రజలందరు సమైక్యాంధ్రనే కోరుకుంటున్నారు. నీటి పారుదల, విద్య, వైద్య రంగాల అభివృద్ధి జరగాలంటే తెలుగు వారందరు కలిసుండాలి. లేదంటే ఇరువైపులా నష్టమే.

– ***డా. జి. ప్రసాద్*** *(27) మెడికల్ ఆఫీసర్, కడప*

తెలంగాణ రాష్ట్రం ఇవ్వడం రాజ్యాంగ పరంగా న్యాయమయినదే. నిజాం పాలన తరువాత మూడేళ్లు తెలంగాణకు రాజ్యాంగ పరమయిన హక్కులు వచ్చాయి. నిజాం ప్రభుత్వాన్ని ఆంధ్రలో కలిపి ఉంటే ఈ సమస్య వచ్చి ఉండేది కాదు. తెలంగాణ విడిపోవడం వల్ల రాయలసీమకు చాలా అన్యాయం జరుగుద్ది. బచావత్ ట్రిబ్యునల్ ప్రకారం రాయలసీమకు దక్కాల్సిన నీరు ఇప్పటికే దక్కలేదు. రేపు తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే ఇంకా ఏమి దక్కుతది. రాయలసీమను ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేయాలి. సమైక్యాంధ్ర పేరుతో చేస్తున్న ఉద్యమానికి ప్రాతిపదిక లేదు. సమైక్యాంధ్ర వాదులు హైదరాబాద్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా లేదా దేశానికి రెండో రాజధానిగా చేయాలంటున్నారు. అలాంటప్పుడు కలిసి ఉండాలని చేస్తున్న సమైక్యాంధ్ర ఉద్యమంలో న్యాయం ఎక్కడుంది. దానికి ఒక కమిటీ లేదు. నాయకత్వం లేదు. రాజకీయ నాయకుల భవిష్యత్తుకోసం ప్రజలకు హైదరాబాదే భవిష్యత్తు అని చూపిస్తూ తప్పుదారి పట్టిస్తున్నారు.

– ***జి.వి. సుదాకర్‌రెడ్డి*** *(49) కాశీపురం, రాయలసీమ రైతు సంఘీభావ కమిటి కన్వీనర్, కర్నూలు*

(సేకరణ – ఎల్ సుబ్బయ్య, కర్నూలు)

తెలంగాణ పోరాటం ఇప్పటిదా, అప్పటిదా ఎప్పుడో తెలంగాణ ఇవ్వాల్సింది. తెలంగాణ కోసం మొదలు ఎంతో మంది చనిపోయింద్రు. ఇప్పుడు తెలంగాణకోసం ఆత్మహత్యలు చేసుకొని చనిపోతుంద్రు. తెలంగాణ కోసం మస్తుగనే కష్టపడ్డరు. తెలంగాణ ఇస్తమని కేంద్ర ప్రభుత్వం ప్రకటించగానే ఆంధ్ర ప్రజలు ఉద్యమాలు చేస్తుంద్రు. రాజకీయ నాయకులు వాళ్ల స్వార్థంకోసం వెనుక నుండి నడిపిస్తుంద్రు. మళ్లా ఆంటోని కమిటీ అని ఏర్పాటు చేసింద్రు. ఇట్లా కమిటీలు ఏస్తే ఇంకా చాలా రోజులైతది. ఇంకా కాలయాపన వద్దు. మన తెలంగాణ మనకు వస్తే తరువాత వచ్చే తరానికి ఒక మేలు జరుగుతది. ఎప్పుడు తెలంగాణ వస్తదోనని ఎదిరి చూస్తున్నం.

– ***శ్రీహరి*** *(60), బీరువా మేకర్, నిజామాబాద్*

తెలంగాణ కోసం మస్తుకొట్లాడింద్రు. సకల జనుల సమ్మెజేసింద్రు. అప్పటి నుంచి ఇప్పటి వరకు తెలంగాణ ఇస్తనని కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తుంది. తెలంగాణ కోసం చంద్రబాబు మద్దతు ఇస్తానండు, ఇప్పుడేమో అడ్డం తిరుగుతుండు. మరి తెలంగాణ గిప్పుడన్న ఇస్తరో లేకుంటే మళ్లా మోసం చేస్తరో. మళ్లా మోసం చేస్తే రాజకీయ నాయకులను ఇగ జోపుడే ఉంటది. ఇది ఎరిగి మసులుకుంటే మంచిది.

– ***రాజు*** *(56), టైలర్, నిజామాబాద్*

(సేకరణ – ఎం. నర్సయ్య టీచర్, నిజామాబాద్)

సమైక్యాంధ్రప్రదేశ్ మంచిది. ఉన్నవాళ్లు, లేనివాళ్లు, కుల, మత భేదాలు లేకుండా కష్టానికి, సుఖానికి మనకు హైదరాబాద్ ఉంది అనే నమ్మకం ఉండేది. విడదీస్తే ఖచ్చితంగా స్థానికుల వల్ల గొడవలు వస్తాయి. ఎంతో మంది ఉద్యోగాలు పోతాయి.

– ***పెక్కె నూకరాజు*** *(35), కార్మికుడు, కాకినాడ*

రెండు రాష్ట్రాలుగా విడదీస్తే ఎటుచూసిన సీమాంధ్ర విద్యార్థులే నష్టపోతారు. ప్రైవేట్ జాబులు రావాలన్న హైదరాబాద్‌లోనే దొరుకుతాయి. రాష్ట్రం విడదీయడం వల్ల స్థానికేతరులకు ఉద్యోగాలు పోతాయి. ఒక వేళ హైదరాబాద్ కేంద్రపాలిత ప్రాంతం చేసిన రాష్ట్రాలకు సంపద దక్కదు. అందువల్ల కేంద్రపాలిత ప్రాంతం చేయడం అనవసరం. కలిసుంటేనే నిరుద్యోగులకు ఉపాధి దొరికే అవకాశం ఉంటుంది.

– ***అడపరూతు*** *(21) ఎం.బి.ఎ. విద్యార్థి, కాకినాడ*

ప్రజలందరు సమైక్యాంధ్ర కావాలని కోరుకుంటున్నరు. అనివార్య పరిస్థితుల్లో తెలంగాణ ఇవ్వాలనుకుంటే పది సంవత్సరాలు కాకుండా శాశ్వతంగా రెండు రాష్ట్రాలకు హైదరాబాద్ రాజధానిగా ఉండాలి. నీటి సమస్య పరిష్కారం కానిదే రాష్ట్రాల విభజన సరికాదు.

– ***డా. మల్లిక్*** *(45) సీనియర్ మెడికల్ ఆఫీసర్, కాకినాడ*

ఆంధ్రులంతా కలిసుంటేనే మంచిది. ఎలాగో ప్రకటన చేశారు కాబట్టి హైదరాబాద్‌ను కేంద్ర పాలిత ప్రాంతంగా చేస్తే మంచిది. దీనివల్ల ఉద్యోగులకు నష్టం ఉండదు.

– ***రాయుడు శ్రీనివాసరావు*** *(45) ప్రభుత్వ ఉద్యోగి, కాకినాడ*

హైదరాబాద్ అభివృద్ధికి ధనవంతులే కాదు, పొట్టచేతపట్టుకొని బతకడానికి వెళ్లినోళ్లు లక్షలాది మంది ఉన్నరు. వారంతా హైదరాబాద్ అభివృద్ధిలో భాగమే. కేవలం సాఫ్ట్‌వేర్ ఉద్యోగులే కాదు. ఇక్కడంతా బతుకలేనోళ్లు ఏ దారిలేక బతకడానికి హైదరాబాద్ వెళ్లారు. వాళ్ల పరిస్థితేంటి? వారి భవిష్యతేంటి? అనవసరమైన గొడవల వల్ల బీదల జీవితాలకు కష్టమవుద్ది. ముందు నాయకులు అది ఆలోచించాలి.

– ***మహమ్మద్ ఖాదర్ భాషా*** *(47), ప్రైవేట్ ఉద్యోగి, కాకినాడ*

(సేకరణ మహమ్మద్ ఇబ్రహీం, కాకినాడ, తూర్పుగోదావరి)

తెలంగాణ వస్తుంది. ఎంతో లాభమైతది. పొలాలు పండే భాగ్యం కల్గితే పండుగనే గద. సదువుకొని ఉద్యోగాలు చిక్కినోల్ల బాధలు ఉండవు.

– ***జయసూర్య,*** *విద్యార్థి, అనంతపురం*

పొలాలకు నీళ్లొచ్చి మన పిల్లలకు ఉద్యోగాలు దొర్కితే సొతంత్ర మొచ్చినంత సంబరం గద సార్. ఊర్లన్నీ పండగ కళతోని కళకళలాడవా

– ***సువిత్రాదేవి,*** *గృహిణి, అనంతపురం*

ఒక దిక్కు సంతోషం ఉంది. ఇంగో దిక్కు దుఃఖం కూడా ఉంది. తెలంగాణ మాత్రం రావాలనే ఉంది. పెద్ద పెద్ద సదువుల సదివి నిరాశతోని ఉన్న మా అన్నల, అక్కల కండ్లల వెలుతురు సూడాలని ఉంది.

– ***శ్రీకృష్ణ,*** *విద్యార్థి, అనంతపురం*

రాష్ట్రం పేరున సంపదంతా ఒక్క వర్గం, ప్రాంతం చేతుల్లో కేంద్రీకృతం అయి ఉంది. ఉదాహరణకు సినిమా, పత్రికా, విద్యా సంస్థలు, పరిశ్రమ రంగాలు. తెలంగాణ వొచ్చిన తరువాత ఈ పోరాట ఫలితాలు కూడా మళ్లీ ఏదో ఒక వర్గం చేతుల్లో చిక్కుకు పోకుండా జాగ్రత్త పడాలి.

– బజారు చిన్నయ్య, *టీచర్, గద్వాలు*

తెలంగాణ రావాల్సిందే. పుట్టెడు అప్పు చేసి గంపెడాశతో చదివిస్తే నా కొడుకును. బ్యాంకులు సదువుకు అప్పిస్తయంటే తిరిగి తిరిగి తిక్కలేపుకుంటి. సమైక్య రాష్ట్రంల అన్ని జూట మాటలే. రేపు తెలంగాణ రానీ బ్యాంకులు ఎట్ల మారవో, నీల్లెట్ల రావో సూస్కుందం.

– లాలు, *ఆలూరు*

సీకటి బతుకులు మారి వెలుగొస్తదని ఎదురు జూస్తున్నం. నేను నా ఆరుగురు పిల్లలు! కట్టుకున్నోడు కసాయోడై మోసం జేసే. ఈ రాజ్జెం ఆని కన్నా కసాయిదై ఆని దిక్కు నిల్సె. తెలంగాణలనన్న నా బతుకు ఎల్తురు సోకదా అని ఆశతో ఉన్న.

– భాగ్యమ్మ, *గృహిణి, గద్వాలు*

తెలంగాణ వొస్తూనే అన్ని కష్టాలు తీరవు. చాలా త్యాగంతో కష్టంతో చెమటను నెత్తురు చేసి పారించాల్సి రావొచ్చు. అవమాన జీవితాలు మారి పరువుతో ఆత్మ గౌరవంతో పస్తులు ఉండైనా మన ఇంట్లో మనం అనుభూతి లభిస్తే ఇది గొప్పదే కదా.

– ఫరిదా బాను, *ఎల్కూరు*

తెలంగాణ వస్తే ఉద్యోగాలు చెట్లకు కాయవు. కష్టపడి పని చేసే తత్వం పెంచుకోవాలె. మన కన్నా లేనోని కోసం కొంత త్యాగం జేయాలే! అన్యాయం జరుగుతుంటే నోరెల్లబెట్టి సూడరాదు. దళితులు, మహిళలు, గిరిజనులు దిక్కులేనోళ్లందరికి అండగ పోరాడాలె!

– షమ, *విదార్థిని, గద్వాలు*

నా కొడుకో వెంగళ్‌రెడ్డి. పై దేశం పోతవ కొడుక. ఎడ్ల జతనన్న దెస్తవ కొడుక. తెలంగాణ వస్తది కొడక మంచి సేద్యం చేద్దం కొడుక.. నా చిన్న తనంల మా నాన్న నన్ను ఎద మీద గూసవెట్కోని ఇట్లా పాటపాడ్తుండె. అరవై ఏండ్లాయె. ఆయన కాలం కూడా అయిపాయె. ఆ కలలు నిజమయ్యే రోజు వస్తుందని ఆనందంగా ఉంది. ఇప్పుడు మనం బతికి సూపించాలె!

– వెంగళ్‌రెడ్డి, *స్వచ్ఛంద సంస్థ, షేక్‌పల్లి, ఇటిక్యాల*

ప్రజల ఆకాంక్ష నెరవేరుతందని అనుకుంటున్న సందర్భంలో మళ్లీ తెలంగాణ సమస్య మొదటికొచ్చినట్టున్నది. పోలవరంకు జాతీయ హోదా అంటేనే తెలంగాణను బొందపెట్టినట్లు అయినా అమరుల కల సాకారమవుతుంది అనుకుంటే అది పార్లమెంట్‌లో బిల్లు పెట్టినపుడే.

– కె. సంతోష్, *ఓరియంట్ సిమెంట్ కంపెనీ కార్మికుడు, దేవాపూర్*

వచ్చిందన్నట్టేకాని ఏం లాభంలేదు. చాట్ల తవుడు పెట్టి కుక్కలకు కొట్లాట పెట్టినట్టు, ఇస్తనని ఇయ్యకపోవడం కాంగ్రెస్‌కు అలవాటే. తెలంగాణ ఏర్పడితేనే మంచిగుంటది.

– రాజవ్వ, *అసంఘటిత కార్మికురాలు, బెల్లంపెల్లి*

వేయిమంది బలిదానాలతో తెలంగాణ ఏర్పడుతుందని అనుకుంటే కమిటీల మీద కమిటీలు వేసి కాలయాపన చేస్తుంది కేంద్ర ప్రభుత్వం. వెంటనే పార్లమెంట్‌లో బిల్లు పెట్టి ఆమోదింపజేయాలి. అప్పుడే కాంగ్రెస్‌ను నమ్మాలి.

– జనార్దన్, *విద్యార్థి, మంచిర్యాల*

చాల మంది తల్లులు తెలంగాణ కోసం అమరత్వం పొందిన కొడుకుల కల నిజమయిందని సంతోషపడ్డరు కానీ తెలంగాణ బిల్లు పార్లమెంట్‌లో పెట్టి ఆమోదింపచేసిన నాడే ఆనందం.

– కళావతి, *విద్యార్థిని, మంచిర్యాల*

వచ్చిందన్న సంతోషమే కాని పార్లమెంట్‌లో బిల్లు ఆమోదింపజేస్తేనే నమ్ముతం. అప్పుడే తెలంగాణ అమరుల కల నిజమవుతుంది. 60 సంవత్సరాల నుండి తెలంగాణ ప్రజలు సీమాంధ్ర పెట్టుబడిదారీ పాలన కింద మగ్గుతుండ్రు. ఆర్.టి.సి లాభాలు తెలంగాణ నుండే వచ్చినా మా కార్మికులకు లాభంలేదు. సీమాంధ్రలో పెట్టుబడిదారుల బస్సులతో అక్కడ ఆర్.టి.సి నష్టాల్లో ఉంది. తెలంగాణ ఏర్పడితే తెలంగాణ ఆర్.టి.సి ముందంజలో ఉంటుంది.

– ఆదెపు సమ్మయ్య, *కండక్టర్ , మంచిర్యాల*

ఇన్ని రోజుల చర్చలు జరిపినాంక ప్రకటన వచ్చింది. బిల్లుపెట్టే వరకు అనుమానాలే ప్రభుత్వ పరంగా నిర్ణయం జరిగి పార్లమెంట్‌లో బిల్లు పెడ్తేనే కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్ముతరు.

– ఎన్. కాంతయ్య, *టీచర్ పి.ఇ.టి, జన్నారం*

కేంద్రం ఒక చిన్న ఆశకల్పించింది. దానిని ఖచ్చితంగా నెరవేర్చాల్సిన బాధ్యత తెలంగాణ ప్రాంత కాంగ్రెస్ మంత్రులు, ఎం.ఎల్.ఎల పైన వుంది. హైదరాబాద్ లేని తెలంగాణ అక్కర్లేదు. 60 సంవత్సరాల సుదీర్ఘపోరాటం నిజమవడానికి పార్లమెంట్‌లో బిల్లుపెట్టి ఆమోదింప చేయడమే.

– కె. శశికళ, *టీచర్, లక్షెట్టిపేట*

(సేకరణ శ్రీమన్నారాయణ మూర్తి, టీచర్, మంచిర్యాల, ఆదిలాబాద్)

ఆంధ్ర రాష్ట్రాన్ని విభజపై ఉపాధి అవకాశాలు తక్కువై నిరుద్యోగులు పెరుగిపోయే ప్రమాదం ఉంది.

– కోమకం సత్యనారాయణ, ఉపాధ్యాయులు జిలుగుమిల్ల

రాష్ట్రాన్ని విభజిస్తే ఆర్థికంగా రాష్ట్రం కుంటుపడుతుంది.

– సమయమంతులు రాము, కిరాణ వ్యాపారి, కామయ్యపాలెం

ఆంధ్ర రాష్ట్రాన్ని ముక్కలు చేస్తే అభివృద్ధి జరగదు. అన్ని రకాల నిత్యవసర సరుకుల రేట్లు ఆకాశంకు వెళ్లే ప్రమాదం ఉంది.

– కోక్కురాల రామ్, వ్యాపారి, జిలుగుమిల్ల

రాష్ట్ర విభజన వలన ఎరువులు, నీటి సమస్యలు విద్యుత్ సమస్యలు పెరిగి చిన్న సన్నకారు రైతులందరికి జరగకూడని నష్టం వాటిల్లుతుంది.

– నక్కా చంద్రశేఖర్, రైతు, కామయ్యపాలెం

తెలుగు రాష్ట్రాన్ని ఓటు కోసం విడదీసి రాష్ట్ర అభివృద్ధి కుంటుపడుతుంది. ఇప్పటికి ఎరువులు, విత్తనాలు, కరెంటు, నీటి సమస్యలు అధికంగా ఉన్నాయి. కాబట్టి రైతు వ్యవసాయం చేయలేదు.

– బేతి దుర్గరావు, మాజీ సర్పంచ్, ములగలంపల్లి

తెలంగాణ, సమైక్యాంధ్ర ఉద్యమాలు వల్ల నిత్యవసర ధరలు పెరిగి మాలాంటి వారు బతికే పరిస్థితులు లేవు.

– జూలా వీరయ్య, *కూలీ, జంగారెడ్డిగూడెం*

బందులు, ఉద్యమాలు వల్ల సామన్య జనం రోజువారి పనులు దొరకక చాలా ఇబ్బందులు పడుతున్నారు.

– ఎచ్చు దుర్గారావు, కూలీ, తాడువాయి

(సేకరణ – కె. జాన్‌సుందరం, పశ్చిమ గోదావరి)

రెండు ప్రాంతాల్లోనూ అసమానతలు

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం నాయకుల స్వార్థంతో కూడిందనీ, తెలంగాణ ఏర్పడినా దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఉన్న పరిస్థితుల లాగే ఉంటాయనీ అంటున్నారు వి. హనుమంతరావు

దేశానికి 66 సంవత్సరాల క్రితం స్వాతంత్ర్యం నాయకులకు వచ్చిందే కాని ప్రజలకు ఎట్లా రాలేదో, రేపు తెలంగాణ రాష్ట్రం ఏర్పడినా, అది నాయకులకే గాని ప్రజలకు కాదు. మద్రాసు రాష్ట్రం నుంచి విడివడి ఆంధ్ర రాష్ట్రం, ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ ఏర్పడి ప్రజలకు ఏమి ఒరిగింది? ప్రజలు కేంద్ర బిందువుగా లేనన్నాళ్లు రాష్ట్రం విభజించినా, విభజించక పోయినా ప్రజల జీవన స్థితిగతులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుంటాయి.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే ఫలానా ఫలానా సౌకర్యాలు, మేలు జరుగుతాయని తెలంగాణ ఉద్యమ నాయకులు ఒక మానిఫెస్టో విడుదల చేసినట్లు నేను పత్రికల్లో ఎక్కడా చదివిన గుర్తు లేదు. ఎంతసేపు తెలంగాణ జిల్లాలకు ఆంధ్ర ప్రాంత నాయకులు అన్యాయం చేశారనే ఉపన్యాసాలే గాని, తెలంగాణ వస్తే కడుపు నిండా భోజనం చేయవచ్చు. విద్య, వైద్య సదుపాయాలు మస్తుగా ఏర్పాటు చేసుకోవచ్చు. అందరికీ గృహ వసతి కల్పించవచ్చునని నాయకులు ఎక్కడైనా చెప్పారా? అవన్నీ ఆంధ్ర ప్రాంతంలోనే అరవై ఆరు సంవత్సరాల తర్వాత కూడా లభ్యం కాలేదు. అలాంటిది ఇప్పుడు తెలంగాణ ఏర్పడితే, పై సౌకర్యాలు ఎప్పటికి లభ్యమవుతాయో? ఉమ్మడి మద్రాస్ రాష్ట్రం నుంచి విడివడి 1953లో కర్నూలు రాజధానిగా ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినపుడు కూడా ఇలాగే జరిగింది. ఆంధ్ర జిల్లాలకు ఫలానా అన్యాయాలు జరిగాయని అన్నారే కానీ, ప్రజలకు ఏమి సౌకర్యాలు, మేలు జరుగుతాయని చెప్పారా? 1947లో దేశానికి స్వాతంత్ర్యం వచ్చే ముందు అప్పటి నాయకులూ అంతే. తెలంగాణ జిల్లాలను ఆంధ్ర ప్రాంతానికి జత చేసి ఆంధ్రప్రదేశ్ ఏర్పడినపుడు ఉభయ ప్రాంతాల నాయకులు చేసుకొన్న పెద్ద మనుషుల ఒప్పందం తూచా తప్పకుండా అమలు జరిపారా? తెలంగాణ ప్రాంతం నుంచి అధికారంలోకి వచ్చిన తెలంగాణ నాయకులైనా తెలంగాణ జిల్లాల అభివృద్ధిపై దృష్టి సారించారా? చెప్పొచ్చేదేమంటే ఇవి నాయకుల ఉద్యమాలు. కాని ప్రజా ఉద్యమాలు కావు. ఇప్పుడైనా తెలంగాణ ప్రజలు నాయకులను నిలదీసి తెలంగాణ వచ్చింది, మాకేమిటి అని నిలదీయాలి.

ప్రాథమికంగా వేయాల్సిన ప్రశ్న ఏమిటంటే, తెలంగాణలో అభివృద్ధి జరిగిందా, లేదా? ఆంధ్ర జిల్లాలన్నీ ముందుకు పోయాయా? ఆర్థిక రంగంలో అభివృద్ధి అంతరాలు బేరీజు వేయాలంటే స్థూల జిల్లా ఆదాయ గణాంకాలు తోడ్పడుతాయి. తులనాత్మక విశ్లేషణ చేస్తే, ప్రజల జీవన ప్రమాణ స్థాయిని తెలుసుకోవడానికి ఉపయోగపడుతుంది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం 1993-94లలో తలసరి ఆదాయంలో రంగారెడ్డి ప్రథమ స్థానం, మెదక్ రెండో స్థానం, గుంటూరు మూడో స్థానం. నెల్లూరు నాలుగో స్థానంలో ఉన్నాయి. విజయనగరం, వరంగల్, శ్రీకాకుళం అట్టడుగున ఉన్నాయి. లేదా 2006-07లలో విశాఖ ప్రథమ, హైదరాబాదు రెండవ, కడప మూడవ స్థానాల్లో ఉన్నాయి. కృష్ణా జిల్లాలో మార్పు లేదు. కాని దక్షిణ కోస్తాంధ్రలో, మొత్తం మీద పశ్చిమ, గుంటూరు, నెల్లూరు జిల్లాల్లో ర్యాంకులు దిగజారగా, రాయలసీమలో కడప మినహా మిగతా జిల్లాల ర్యాంకులు దిగజారాయి. తెలంగాణలో రంగారెడ్డి, మెదక్, నిజామాబాదు, ఖమ్మం జిల్లాల ర్యాంకులు వెనుకబడ్డాయి. వెనుకబడిన జిల్లాలు, ర్యాంకులు దిగజారిన జిల్లాలు రెండు ప్రాంతాల్లోనూ ఉన్నాయి. మరో విషయం పైన ఉదహరించిన కాలంలో స్థూలంగా నీటి పారుదల కింద ఉన్న విస్తీర్ణం సీమాంధ్రలో 5.51 లక్షల హెక్టార్లు పెరగగా, తెలంగాణ ప్రాంతంలో ఇదే కాలంలో 11.70 లక్షల హెక్టార్లు పెరగడం గమనార్హం. కాగా తెలంగాణను లక్ష్యంగా పెట్టుకొని అభివృద్ధిని కుంటుపరచారని ఆరోపణ చేయడం రాజకీయం అవుతుంది కాని వాస్తవం కాదు. శ్రీకృష్ణ కమిషన్ ముందు ఇరు ప్రాంతాల వారు గణాంకాలను పుంఖాను పుంఖాలుగా కుమ్మరించారు. ఈ గణాంకాలన్నీ కేంద్ర కాంగ్రెస్ నాయకత్వానికి అందుబాటులో ఉన్నాయి. వాటిని అభివృద్ధి, వెనుకబాటుతనం అనే కోణాల నుంచి విశ్లేషించకుండా తెలంగాణను ప్రత్యేక రాష్ట్రంగా ప్రకటించడం రాజకీయం అవుతుంది. రాజకీయాల ఆధారంగా రాష్ట్రాలను విడదీయవచ్చునని రాజ్యాంగంలో ఎక్కడా లేదు. అలాంటపుడు రాష్ట్రాన్ని రెండు ముక్కలు చేయడం నీతి బాహ్యమైన చర్య.

గత రెండు, మూడు సంవత్సరాలుగా తెలంగాణ వాదులు జరుపుతూ వచ్చిన సభలను టివిలో చూస్తుంటే పంచె పైకెగ్గట్టి, నెత్తిన తలపాగా చుట్టి వచ్చిన పల్లె జనం ఎవరూ ఆ సభల్లో కనిపించ లేదు. స్కూలుకు వెళ్లే పిల్లలు, విద్యార్థులు, తెల్ల చొక్కాల వాళ్లే కనిపించారు.

కాంగ్రెస్ పార్టీ ప్రముఖ నాయకులు వచ్చినపుడు జరిపే సభలకు జనాన్ని ఎలా సమీకరిస్తారో మనందరికీ తెలిసిన విషయమే. ఆ కాంగ్రెస్ నుంచి ఊడిపడ్డ వారే తెలంగాణ వాదులు కాబట్టి, ఆ సాంప్రదాయాన్ని పుణికి పుచ్చుకొన్న వారే కాబట్టి, వారు చేసిన సమీకరణాలు ఎలాంటివో వేరే చెప్పాల్సిన పనిలేదు. అయినా మీటింగులకు వచ్చిన జనం ఆధారంగా అంచనాలు, నిర్ణయాలు చేసే నాయకుల గురించి ఎంత తక్కువ ఆలోచిస్తే అంత మంచిది. అలాగని తెలంగాణలో ప్రజలు ప్రత్యేక రాష్ట్రం గురించి అజ్ఞానంలో ఉన్నారని అనబోవడం లేదు. ఈ నినాదం గ్రామాల వరకు పాకిందనే విషయం నిస్సందేహం. కాని అది నలుగురిలో నారాయణ అన్నట్లుంది కాని మరొకటి కాదు. వారిప్పుడే వెనుకబడి ఉన్నారు. వారికి తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే ఈ వెనుకబాటు తనం పోతుందని ఏ తెలంగాణ నాయకుడూ వారిని ఎడ్యుకేట్ చేయలేదు. రాయలసీమ జిల్లాలు 1969లో చెన్నారెడ్డి తెలంగాణ రాష్ట్రం అనే నినాదాన్ని ఇవ్వకముందే. కొన్ని దశాబ్దాల పాటు వెనుకబడే ఉన్నాయి. బ్రిటిష్ పాలకుల నాటి నుంచి అదే పరిస్థితి. కాని వారు వేరే రాష్ట్రం అడగలేదు. అభివృద్ధి కావాలనేదే వారు కోరుతూ వచ్చారు. తెలంగాణ

వి.ఎచ్ కాలమ్

పేదరికం హుష్‌కాకి

గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి నలుగురిలో ఒక్కరే పేదవాడని ప్రణాళికా సంఘం అంటోంది. ఆ సంఘం ఉపాధ్యక్షుడు అహ్లువాలియా చేతిలో ఏదో మంత్ర దండం ఉండి ఉండాలి. ప్రణాళికా సంఘం లెక్కల ప్రకారం పేదరికం ఇలా ఉంది.

	2009 -10	2011-12 (శాతం)
గ్రామాల్లో	33.8	25.7
పట్టణాల్లో	20.9	13.7
మొత్తం దేశంలో	29.8	20.9

ఇంతవేగంగా రెండే రెండు సంవత్సరాల్లో పేదరికం తగ్గిపోవడం ఎప్పుడూ లేదు. ఇదివరకు ఇదే సంఘం నియమించిన కమిటీలు దేశంలో సుమారు 40 శాతం వరకు పేదలున్నారని లెక్కలు చెప్పాయి.

గత మూడేళ్లుగా ధరలు చుక్కలు చూస్తున్నాయి. ఫలితంగా ప్రజల ఆదాయాలు నేల చూపు చూస్తున్నాయి. పేదరికం మరింత దీనావస్థకు చేరుతుందని వేరే చెప్పాల్సిన పని లేదు. మొత్తం ఆర్థిక పరిస్థితే సంక్షోభంలో కూరుకపోయింది. అలాంటప్పుడు పేదరికం మరింత దారిద్ర్యంలోకి దిగజారుతుంది కదా. కాని అహ్లువాలియా లెక్కలు మరో విధంగా ఉన్నాయి. ఎన్నికలొస్తున్నాయి కదా. మంత్ర దండం విసిరారు. హుష్ కాకీ అన్నారు. పేదరికం తగ్గిపోయిందా!

దాని వెనుక ఉన్న అసలు సంగతి ఏమంటే ఆహార భద్రత గురించిన బిల్లు పార్లమెంట్‌లో చర్చకు రానుంది. ఇంత వరకూ ఇస్తున్న సబ్సిడీ పెరుగుతుంది. అసలే ప్రభుత్వం దివాళా వైపుగా పయనిస్తోంది. ధరల పెరుగుదల మూలంగా ప్రజల సేవింగ్స్ తగ్గుతున్నాయి. అంచనా వేసుకొన్న ఆదాయం వచ్చే సూచనలు లేవు. పరిపాలనా వ్యయాన్ని తగ్గించుకోలేరు. దేశంలో, బయట నుంచి రుణాలు పెరుగుతున్నాయి. ఖజానా వోటి మోత మోగుతుంది. అలాంటపుడు ప్రభుత్వం సామాజిక సంక్షేమ పథకాలకు బడ్జెట్‌లో చేసే కేటాయింపుల్లో కోత విధిస్తుంది. అలాంటపుడు పేదల సంఖ్య తగ్గిస్తే సబ్సిడీ భారం తగ్గుతుంది. పేదల పేరుతో అనేక సంక్షేమ పథకాలను ప్రకటించి నిధులు కేటాయిస్తుంది. ఆ ఖర్చు కూడా తగ్గుతుంది. మరో విషయం కూడ గమనించాలి. 2009-10 సంవత్సరం అంతకు ముందు 37 సంవత్సరాలతో పోలిస్తే, వర్షాభావం వల్ల అత్యంత దరిద్రగొట్టు సంవత్సరం అలాంటి సంవత్సరాన్ని ప్రణాళికా సంఘం బెంచ్ మార్క్‌గా తీసుకొని, 2011-12లో పేదరికాన్ని లెక్క వేయడం మరింత దారుణం.

పేదరికం ఏ స్థాయిలో ఉంది అనేది నిర్ధారించడానికి, వివిధ కమిటీలు వివిధ ఫార్ములాల ప్రకారం లెక్కలు వేస్తున్నాయి. ఉదాహరణకు హైదరాబాదులోని జాతీయ పోషకాహార సంస్థ శారీరక కష్టం చేసేవారు, ఇతరులు ఎంత ఆహారం తినాలో అని ఒక ఫార్ములాను తయారు చేశారు. అలాగే తిండి గింజల విషయంలో కూడా ఒక ఫార్ములా తయారు చేసి దాని ఆధారంగా పేదరికాన్ని నిర్ధారించే పద్ధతి ప్రవేశ పెట్టాలి. పేదరికం అంటే కేవలం తిండి గింజలు మాత్రమే కాదు. ఆహారం, ఆరోగ్యం, ఆవాసం, ఉపాధి కూడా పేదరిక నిర్ధారణ లెక్కలో చేర్చాలి. వీ

వాదులు వేర్పాటు కావాలని చేసిన ఆందోళన కోసం వినియోగించిన శక్తిని అభివృద్ధి కోసం ఉపయోగించి ఉంటే, కాస్తో కూస్తో అభివృద్ధి జరిగి ఉండేది. కాని తెలంగాణ వాదులకు కావాల్సింది రాజకీయాధికారం, పదవులు. ప్రజలను పావులుగా వాడుకొన్నారు. ఈ విషయంలో ఆంధ్ర ప్రాంత కాంగ్రెస్ నాయకులూ దొందూదొందే.

క్లుప్తంగా చెప్పాలంటే ప్రత్యేక తెలంగాణ ఉద్యమం కాదు. అధికారం కోసం నాయకులు రెచ్చగొట్టిన ఉద్యమం. ఎవరైనా తెలంగాణలో ఏ గ్రామానికైనా వెళ్లి పొలాల్లో పని చేసే రైతును గాని, వ్యవసాయ కూలిని గాని తెలంగాణ రాష్ట్రం అంటే ఏమిటి? నీకు ఏమి లాభం అని అడగండి.

ప్రస్తుతానికి వస్తే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేయాలని నిర్ణయించింది కేంద్ర ప్రభుత్వం కాదు. కాంగ్రెస్ పార్టీ మాత్రమే. ఆ కాంగ్రెస్ పార్టీ కొంతమంది మంత్రులతో కలిపి ఒక కమిటీని నియమించి విభజన ఫలితంగా వచ్చే సమస్యలేమైనా ఉంటే చెపుకోమంటున్నారు. ఆంధ్ర ప్రాంతం వాళ్లు విభజనకు సుతరాం ఒప్పుకోబోమని ఆందోళన చేస్తుంటే, ఈ కమిటీ విభజన క్రమంలో వచ్చే సమస్యలేమైనా ఉంటే చెప్పుకోమంటారేమిటి? తలకాయ ఉండే మాట్లాడుతున్నారా? పైన చెప్పినట్లు మద్రాసు రాష్ట్రం నుంచి విడిపోయినపుడుగాని, ఆంధ్ర ప్రాంతంలో తెలంగాణ జిల్లాలను కలిపి ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు చేసినపుడుగాని ఇలా కమిటీలు వేశారా? కెసిఆర్ మంత్రి పదవి కావాలని అడిగినపుడు, ఆ రొట్టె ముక్క కాస్త పారేసి ఉంటే ఇంత గొడవ, రాద్ధాంతం జరిగి ఉండేది కాదు కదా? విభజన అనే సమస్య ఉత్పన్నం అయి ఉండేది కాదు కదా? ఆయన మంత్రి పదవి కోర్కె పుణ్యమా అంటూ కొన్ని వందల మంది ప్రాణాలు తీసుకున్నారు. వీరిలో అత్యధికులు యువకులు, విద్యార్థులు. ఉద్రేకం సహజం. వారి ఉద్రేకాన్ని సరైన మార్గంలో పెట్టడం నాయకుల బాధ్యత. నాయకుల వైఫల్యానికి వారు బలైపోయారు. నిలబడి వీరుల్లా పోరాడాలి. కాని ఇలా ప్రాణాలు తీసుకోవడం వీరుల లక్ష్యం కాదు. తెలంగాణ వచ్చింది కదా అని అనవచ్చు. రేపు పార్లమెంటు ఎన్నికల్లో గెలవడం అనే లక్ష్యంతో కాంగ్రెస్, తెలంగాణ ఇస్తాను అన్నదని అందరూ అంటున్న విషయమే. మరో ఐదేళ్లు పరిపాలన కొనసాగించు కోవాలనేది కాంగ్రెస్ నాయకుల లక్ష్యం. అందుకోసం అన్నదమ్ములను విడగొట్టడం నీతి బాహ్యమైన ఆలోచన.

సమైక్యాంధ్ర కావాలని ఉవ్వెత్తున ఆంధ్ర ప్రాంతంలో జరుగుతున్న ఉద్యమం వెనుక కాంగ్రెస్ నాయకత్వం ఉందని మాట వినపడుతోంది. ఆ ప్రాంత ప్రజలు ఎంతకైనా తెగిస్తారు. ఏమైనా చేస్తారు. తెలంగాణ నాయకత్వం లాగే, వారికి కూడా అధికారమే లక్ష్యం. ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని ఉద్యమం వారి చేతుల్లోకి వెళ్లిందంటే నట్టేట్లో ముంచేస్తారు.

మనది ఫెడరల్ వ్యవస్థ. కాని ఆచరణలో యూనిటరీ వ్యవస్థగా కేంద్రం ఇప్పటికే మార్చేసింది. రాష్ట్రాల అధికారాలను ఆచరణలో కుదించేస్తుంది. రాష్ట్రాలు చిన్నవైతే వారి కాళ్ల మీద వాళ్లు నిలబడలేరు. కేంద్రం వైపు సహాయం కోసం చూస్తారు. ప్రత్యేక తెలంగాణ ఇవ్వడం ఈ కుట్రలో భాగమే. ఇటు తెలంగాణ, అటు ఆంధ్ర ఇద్దరూ కేంద్రం వైపు అర్రులు చాస్తారు. తెలంగాణ ఇవ్వడం ఫెరడల్ వ్యవస్థను మరణశయ్య మీదకు చేర్చడమే అవుతుంది. ఆంధ్రులకు ఆరంభశూరత్వం ఎక్కువ అంటారు. అది నిజం కాదని ఆంధ్ర ప్రాంత ప్రజలు నిరూపించు కోవాలి.

(వీక్షణం వ్యవస్థాపక సంపాదకులు) వీ

తెలంగాణ రాష్ట్రం : కొన్ని ఆలోచనలు

విభజన వల్ల తలెత్తే సమస్యలను చర్చించకుండా ప్రత్యేక రాష్ట్ర ప్రకటన కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే జరిగిందనీ, దీని వల్ల ప్రజల సమస్యలు ఇంకా జటిలం అవుతాయనీ అంటున్నారు **డా. ఇమ్మానేని సత్యసుందరం**

విశాలమైన దేశాలలో ప్రాంతీయ అసమానతలు సహజం. అయితే అభివృద్ధి వ్యూహాలు అన్ని ప్రాంతాలకూ, ప్రజలకూ ప్రయోజనం చేకూర్చాలి. దీనినే సమ్మిళిత వృద్ధి అంటున్నాం. ప్రభుత్వం 12 పంచవర్ష ప్రణాళికలు అమలు పరచినా ప్రాంతీయ అసమానతలు తగ్గలేదు. పైగా అవి పెరిగి కొన్ని రాష్ట్రాలలో ఉద్యమాలకు దారితీశాయి.

పది జిల్లాలతో కూడిన ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు జూలై 30న యుపిఎ సమన్వయ కమిటీ, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఏకగ్రీవ తీర్మానాలు చేశాయి. అయితే ఇది చాలా త్వరితగతిన జరిగింది. కేవలం 2014 సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొనే ఈ ప్రకటన జరిగిందని భావించాలి. ఎందుకంటే తెలంగాణ 'సకల జనుల సమ్మె'ను కూడా కాంగ్రెస్ హైకమాండ్ లెక్క చేయలేదు.

రాష్ట్ర విభజన వల్ల ఏర్పడే సమస్యలను చర్చించకుండా (ఇవి శ్రీకృష్ణ కమిటీ నివేదికలో ఉన్నాయి) కాంగ్రెస్ హైకమాండ్ రాష్ట్ర విభజనను ప్రకటించడం దురదృష్టకరం. దీని వలన ఉన్న సమస్యలకు మరికొన్ని సమస్యలు చేరుతాయి. బిల్లుకు ముందే రాష్ట్ర విభజన వల్ల సీమాంధ్రులు ఎదుర్కొనే సమస్యలపై ఒక కమిటీ ఏర్పాటు చేసింది.

తెలంగాణ వాదం సబబే

అనేక కారణాల వల్ల తెలంగాణ సమస్య పరిష్కరించలేదు. వీటిపై ఈ రచయిత తన అభిప్రాయాలను గతంలో కూడా చెప్పారు.(వీక్షణం 2006 ఫిబ్రవరి, 2010 మార్చ్ సంచికలలో, ఆంధ్రభూమి దిన పత్రికలో 2011 జనవరి 31, 2012 జనవరి 5). తెలంగాణ అంశం సున్నితమైనది, క్లిష్టతరమైనది కూడా. మిగతా రాష్ట్రాల విభజనకు తెలంగాణ ఏర్పాటు వాదానికి పోలిక లేదు.

చిన్న రాష్ట్రాలు అనేక సమస్యలు ఎదుర్కొంటాయని ఒక వాదన. ఈ వాదన సరైనదైనా తెలంగాణకు వర్తించదు. పది జిల్లాలతో కూడిన తెలంగాణ పెద్ద రాష్ట్రమే కాగలదు. పైగా రాజధాని కూడా ఈ ప్రాంతంలోనే ఉంది. 1956 ఆంధ్రప్రదేశ్‌కు ఇప్పటి ఆంధ్రప్రదేశ్‌కు పోలిక లేదు. జనాభా బాగా పెరిగింది. రాజధానిపై ఒత్తిడి పెరిగింది. భారీ వర్షం వస్తే రాజధాని ప్రజలకు అనేక ఇబ్బందులను కలుగ జేస్తోంది. హైదరాబాద్ అభివృద్ధి ప్రణాళికా బద్ధంగా జరగలేదు. ప్రస్తుత పరిస్థితులలో ఏ రాష్ట్రానికైనా 12 నుండి 15 జిల్లాలు ఉంటే చాలు. కొన్ని ప్రత్యేక పరిస్థితులలో 8 నుండి 10 జిల్లాలు ఉండవచ్చు.

ఇంకొక విషయం హైదరాబాద్ కొన్ని ప్రాంతాలకు బాగా దూరంగా ఉంది. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుండి రాజధానికి రావాలంటే చాలా కష్టం. ప్రజలు రాజధానికి ఇంత దూరంలో ఉండడం అంత శ్రేయస్కరం కాదు. రాష్ట్రం పెద్దదవడం వల్ల సుపరిపాలనకు ప్రజలు దూరంగా ఉన్నారు. ఆర్థిక, రాజకీయ రంగాలలో వికేంద్రీకరణ తగినంతగా లేదు. పంచాయితీరాజ్ వ్యవస్థ బలహీనంగా ఉంది. ఎన్నికలు లేక కేంద్ర నిధులు కూడా కోల్పోవలసి వచ్చింది. సుపరిపాలనకు దూరమవడం వల్ల అవినీతి స్థాయి హెచ్చుగా ఉంటుంది. ఇటీవలే యువ రాజకీయ నాయకుడు (పారిశ్రామిక వేత్త అంటే బాగుంటుంది) లక్ష కోట్ల రూపాయల ఆస్తి సంపాదించినట్లు ఆరోపణలు. మనది పెద్ద రాష్ట్రం అవడం వల్లే ఇది సాధ్యపడింది.

తెలంగాణ నాయకుల వ్యూహాలు సరిగ్గా లేవు. దీని వలన కూడా రాష్ట్ర ఏర్పాటు ఆలస్యమయింది. ఈ ప్రాంతం ప్రజలు తమకు అన్యాయం జరిగిందని అంటున్నారుగాని సమస్యను ఎలా పరిష్కరించాలో సూచించలేదు. వారు ప్రత్యేక రాష్ట్రం కోరుకుంటున్నారు. కాబట్టి వారే చొరవ చూపాలి. కీలక సమస్యలను పరిష్కరించే మార్గం చూపాలి. ఉదాహరణకు హైదరాబాద్ పరిస్థితి ఏమిటి? నీటి వనరులను ఎలా పంచుకోవాలి? ఇటువంటి ప్రతిపాదనలను కేంద్రం ముందు ఉంచితే బాగుండేది. విడిపోవాలని కొందరు, కలిసుందామని కొందరు వాదించడం వల్ల ప్రయోజనం లేదు. ఇచ్చిపుచ్చుకునే వాతావరణాన్ని కేంద్రం కల్పించలేదు. సమస్య క్లిష్టతరమని వాయిదా వేసుకొంటూ వేళ్తే, అది మరింత క్లిష్టతరమవుతుంది. మరొక విషయం విడిపోవడం వల్ల ఒక రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్న గ్యారంటీ లేదు. ఆర్థికాభివృద్ధి అనేక అంశాలపై ఆధారపడి ఉంటుంది.

అనేక సమస్యలు

పది జిల్లాలతో తెలంగాణ ఒక రాష్ట్రంగా ఏర్పడవచ్చు. అయితే అసలు సమస్య అది కాదు. రాష్ట్ర రాజధాని విడిపోవాలనుకున్న తెలంగాణ ప్రాంతంలో ఉంది. పైగా అది 56 సంవత్సరాలకు పైగా మూడు ప్రాంతాలకు రాజధాని. ఇదే పరిస్థితి కొనసాగుతుందని సంకేతాలు ఉండడం వల్ల సీమాంధ్ర పారిశ్రామికవేత్తలు హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టారు. తెలంగాణ రాష్ట్రం వస్తే వారి పెట్టుబడులు వేరే రాష్ట్రంలో ఉన్నట్లే కదా. ఏ పారిశ్రామికవేత్తలయినా తన రాష్ట్రంలో పెట్టుబడి పెట్టకుండా వేరే రాష్ట్రంలో పెట్టుబడి పెట్టరు (బలమైన కారణం ఉంటే తప్ప). ప్రస్తుత పరిస్థితిలో కొత్త రాజధాని ఏర్పరచడం అంత తేలిక కాదు. విభజన వల్ల తెలంగాణ ప్రాంతం కూడా దెబ్బతినే ప్రమాదం ఉంది. సీమాంధ్ర పారిశ్రామికవేత్తలు పెట్టుబడులను తమ ప్రాంతాలకు తరలిస్తే హైదరాబాద్ పరిస్థితి ఏమిటి? గుజరాత్‌కి కొత్త రాజధాని గాంధీనగర్ వచ్చాక అహ్మదాబాద్ పరిస్థితి పూర్తిగా మారింది.

విపత్కర విభజన రాజకీయాలు

రాజకీయ పార్టీల ఓటు బ్యాంక్ రాజకీయాల మోసపూరిత విధానాలకు తెరదించి రాజ్యాంగబద్ధ రాష్ట్ర విభజనకు అందరూ సహకరించాలని అంటున్నారు ఉ.సా.

'**రా**మునిది ఒకే బాణం, రామునికి ఒకే భార్య'. ఇది పురాణాలు చెప్పే ధర్మనీతి. రాజకీయ నాయకుడు ఒకే మాటకి, రాజకీయ పార్టీ ఒకే విధానానికి కట్టుబడి ఉండాలి. ఇది ప్రజాస్వామ్య రాజనీతి శాస్త్రం చెప్పే రాజనీతి. కుటిల నీతి తప్ప ఏ నీతి నియమాలు లేని అనైతిక రాజకీయ నాయకులకు దుర్నీతి తప్ప ఏ నీతి పట్టదు. వారి దృష్టిలో ఎప్పటికప్పుడు మాట మార్చని నాయకుడు రాజకీయ నాయకుడే కాదు, ఏ ఎండకి ఆ గొడుగు పట్టని పార్టీ రాజకీయ పార్టీయే కాదు, అంది వచ్చిన అవకాశాన్ని అంది పుచ్చుకొని అందలమెక్కడంలో బాగా ఆరితేరిన ఘనాపాటీలే నేటి మేటి రాజకీయ నాయకులు. ఏ విధి విధానాల్ని పాటించకుండా ప్లేటు ఫిరాయించడంలో ఘనత వహించిన పార్టీలే ఘనమైన రాజకీయ పార్టీలు.

అలాంటి అనుచితమైన అవకాశవాదాన్నే అవసరార్థవాదంగా అనుసరిస్తున్న దగాకోరు రాజకీయ నాయకులు చివరికి రాజకీయాల్ని మోసానికి మారుపేరుగా మార్చి దిగజార్చారు. ఈ అవకాశవాద రాజకీయాలను ఒక మాటలో 'ఓటు బ్యాంక్ రాజకీయాలు' అని అభివర్ణించవచ్చు. ఓటింగ్ లేని రాజకీయ పార్టీ, రేటింగ్ లేని టివి ఛానల్ మనుగడ సాగించలేవు అన్నట్లే ఓటింగ్ కోసం ఏ అడ్డదారి తొక్కినా అది దొడ్డ దారిగానే చలామణి అయిపోతున్నది. ఈ అవకాశవాద రాజకీయాలు తెచ్చిపెట్టే అనర్థదాయక పర్యవసనాలకు ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ తోడుకావడంతో ఎలాంటి విపత్కర పరిస్థితి ఏర్పడుతుందో నేటి విభజన రాజకీయాలను పరిశీలిస్తే తెలుస్తుంది. రాజ్యాంగబద్ధమైన రాష్ట్ర విభజన ప్రక్రియ రాజ్యాంగేతర అనర్థదాయక రాజకీయ విభజనకు ఎలా దారి తీస్తుందో అర్థమవుతోంది.

మంచోళ్ల సంగతి మాంసం కూర పంచే కాడ తెలుస్తుందన్నట్లు 29వ రాష్ట్రంగా ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుపై కాంగ్రెస్ సిడబ్ల్యుసి, యుపిఎ సమన్వయ కమిటీ నిర్ణయం తీసుకున్నట్లు జూలై 30న అధికారికంగా ప్రకటించడంతో రెండు పడవలపై కాళ్లు పెట్టిన రెండు కళ్ల సిద్ధాంతులు ఒక్కసారిగా రెంటికి చెడ్డ రేవడిగా మారారు. కాంగ్రెస్ పార్టీ అంత పని చేయలేదులే అనే భరోసాతో రాజకీయ లబ్ధి కోసం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సరేనన్న టిడిపి, వైసిపి లాంటి ప్రధాన ప్రతిపక్ష పార్టీలు ముందు నుయ్యి వెనుక గొయ్యి లాంటి సంకట స్థితిలో పడ్డాయి. అందుకే సమైక్యాంధ్రప్రదేశ్‌ని విభజించి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పరిస్తే మిగతా సీమాంధ్ర ప్రాంతం వారికి ఎనలేని నష్టం వాటిల్లుతుందని వారి సానుభూతి పొందే ప్రయత్నం మొదలెట్టారు. 2009 డిసెంబర్ 9 ప్రకటన సందర్భంగా గతంలో రెచ్చగొట్టిన అపోహలు, సీమాంధ్ర సామాన్య ప్రజల్లో ఆందోళన రేపి అభద్రతాభావ సమైక్యతతో సమైక్యాంధ్ర ఉద్యమం ఆరంభమైంది. ఈ విషయంలో అందరికంటే ముందుగా మేల్కొన్న వైసిపి గతంలో లాగా ప్రజా ప్రతినిధుల రాజీనామా అస్త్రం ప్రయోగించి రాజకీయ సంక్షోభానికి నాంది పలికింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను ఆటంకపర్చి సమైక్యాంధ్ర వాదానికి వెన్నుదన్నుగా నిలిచింది. దానితో తెలంగాణ ప్రాంతానికి చెందిన వైసిపి నేతలు ఆ పార్టీ నుండి వైదొలగడంతో తెలంగాణలో అది తుడిచి పెట్టుకుపోయింది. ఈ దెబ్బతో తెలంగాణతో సహా మొత్తం ఆంధ్రప్రదేశ్‌కి ముఖ్యమంత్రి కావాలని కలలు గన్న జగన్ కలలు కల్లలయ్యాయి. తెలంగాణ పోతే పోయిందిలే అని ఇక సీమాంధ్ర ప్రాంతంలోనైనా ఎదురులేని శక్తిగా మారడానికి ఏమాత్రం ఆలస్యం

ఏం చేయాలి?

కాంగ్రెస్ హైకమాండ్ కూడా చిక్కుల్లో పడింది. కొత్త రాష్ట్రానికి తాను చేయవలసింది చాలా ఉందని, కాంగ్రెస్‌లో తెలంగాణ రాష్ట్ర సమితి (తెరాస)ని విలీనం చేయడం ఇప్పట్లో జరగదని కె. చంద్రశేఖర్‌రావు ప్రకటించారు. ఇటువంటి ప్రకటనల వల్ల కొత్త సమస్యలు తలెత్తుతాయి.

సీమాంధ్ర ప్రజలకు కొత్త రాజధాని ఎంత త్వరగా ఏర్పరిస్తే అంత మంచిది. కొత్త రాజధాని అన్ని ప్రాంతాల ప్రజలకు వీలుగా ఉండాలి. గన్నవరం విమానాశ్రయాన్ని అంతర్జాతీయ స్థాయిలో తీసుకెళ్లాలి. కొత్త రాజధాని మంగళగిరి దగ్గర (ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రాంతంలో) ఏర్పరచడం బాగుంటుంది.

సీమాంధ్ర ప్రజలను రెచ్చగొట్టే విధంగా తెలంగాణ నాయకులు ప్రసంగాలు చేయకూడదు. ఆంధ్ర ఉద్యోగులు హైదరాబాద్ వీడాలని కెసిఆర్ ప్రస్తుత పరిస్థితులలో మాట్లాడడం విచారకరం. ఎన్నో సమస్యలను ముందుంచుకొని ఇటువంటి ప్రసంగాలు చేయకూడదు.

రాష్ట్ర విభజన వల్ల ఏర్పడే సమస్యలను పరిష్కరించడానికి ఒక ప్రత్యేకమైన స్వయం ప్రతిపత్తి గల కమిషన్ ఉండాలి. ఒప్పందాలకు చట్టబద్ధత కల్పించాలి. అన్యాయం జరిగితే కోర్టుకు వెళ్లే వీలుంటుంది.

వెనుకబడిన జిల్లాలపై కేంద్రం దృష్టి పెట్టాలి. ఈ ప్రాంత ప్రజలు తమకు న్యాయం జరుగుతుందని భావించేటట్లు పథకాలను అమలు చేయాలి. రాయలసీమ ప్రజలు తమను అందరూ నిర్లక్ష్యం చేశారని భావిస్తున్నారు. చిన్న రాష్ట్రాలపైనే ప్రజలు మొగ్గు చూపుతున్నారు. సుపరిపాలనకు ప్రాధాన్యం పెరిగింది. అయితే ఏ రాష్ట్ర విభజనలో ముందుకురాని అనేక సమస్యలు తెలంగాణ రాష్ట్రం విషయంలో వస్తాయి. వీటిపై అన్ని ప్రాంతాల నాయకులకు పూర్తి అవగాహన ఉండాలి.

(రచయిత రిటైర్డ్ ఎకనామిక్స్ లెక్చరర్) వీ

చేయకూడదు అని నిశ్చయించుకొన్న వైసిపి దూకుడు ఎత్తుగడలతో టిడిపిని, కాంగ్రెస్‌ని డిఫెన్స్‌లో పడవేసింది. విభజన నిర్ణయాన్ని నేరుగా ప్రశ్నించకుండా విభజన ప్రక్రియను విమర్శించే సాకుతో గొంతెత్తింది. కాంగ్రెస్, టిడిపిలు కుమ్మక్కై సీమాంధ్రకి ఎనలేని నష్టం కలిగించాయని వాటిని దోషులుగా చిత్రించి వాటిపై ధ్వజమెత్తింది. సీమాంధ్రకు సమన్యాయం చేయలేని కాంగ్రెస్‌కి తెలంగాణ రాష్ట్రాన్ని విభజించే అర్హత లేదని సమైక్యవాదానికి సరికొత్త భాష్యం చెప్పింది.

సీమాంధ్ర సామాన్య ప్రజల్లో ఉన్న అపోహల్ని, అభద్రతా భావాన్ని మరింత రెచ్చగొట్టి వారి ఆగ్రహాన్ని కాంగ్రెస్‌పైకి మళ్లించి, కాంగ్రెస్ జాతీయ నేతలైన ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ విగ్రహాలను ధ్వంసం చేయించింది. వైసిపి లాగే టిడిపి, కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు కూడా రాజీనామా చేయాలనే డిమాండ్‌ని సీమాంధ్ర జనం డిమాండ్‌గా మార్చి జనాగ్రహాన్ని వారిపైకి మళ్లించింది.

మరోవైపు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు నిర్ణయం తదనంతర పరిస్థితులపై ఆచితూచి స్పందించాలనే ఉద్దేశంతో వారం రోజుల పాటు వ్యూహాత్మక మౌనం పాటించిన చంద్రబాబుపై సొంతపార్టీలోనే అసమ్మతి వెల్లువెత్తే పరిస్థితి ఏర్పడింది. ఇరు ప్రాంతాల్లో పార్టీ ప్రయోజనాలు కాపాడుకొనేందుకు చంద్రబాబు సృష్టించిన రెండుకళ్ల సిద్ధాంతం రెండు ప్రాంతాల్లో నష్టం తెచ్చే ధృతరాష్ట్ర సిద్ధాంతంగా పరిణమించింది. నిర్ణయం వెలువడిన పది రోజుల తర్వాత సీమాంధ్ర ఎన్‌జిఓలు సమ్మెకు దిగడంతో సమైక్యాంధ్ర ప్రతికూల ఉద్యమం మరో మలుపు తిరిగి అగ్గి రాజుకుంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినాక సీమాంధ్ర ఉద్యోగులు హైదరాబాద్ నుండి వెళ్లిపోవాల్సిందేనని వారికి ఎలాంటి ఆప్షన్లు ఉండవని కెసిఆర్ చేసిన అసందర్భ ప్రకటన అగ్నికి ఆజ్యం పోసినట్లయింది. సమైక్యాంధ్ర ప్రతివాద ఉద్యమం మరింత ఉధృతంగా మారింది.

ప్రతిపక్ష పార్టీల సంగతి అలా ఉంచి తెలంగాణ రాష్ట్ర సాధనే ఏకైక లక్ష్యంతో ఏర్పడిన తెరాసతో కూడా సంప్రదించకుండా, తెలంగాణ తెచ్చిందీ, ఇచ్చిందీ తామేనని ఆ క్రెడిట్ అంతా ఒక్క కాంగ్రెస్ పార్టీయే కొట్టేయ్యాలని చూడడంతో కడుపు మండిన కెసిఆర్ వెంటనే తన తడాఖా చూపించి తాను కూడా కేంద్ర బిందువుగా మారాడు. హైదరాబాద్ నుండి ఆంధ్రోళ్లని వెళ్లగొడతామనే అభద్రతా భావాన్ని ప్రేరేపించే సంచలన ప్రకటన చేయడంతో అప్పటి దాకా సోనియా దిష్టిబొమ్మల్ని తగలబెట్టడానికి పరిమితమయిన సమైక్యాంధ్రుల ఆగ్రహం కెసిఆర్ పైకి మళ్లీ కెసిఆర్ దిష్టిబొమ్మల్ని కూడా తగలబెట్టే పరిస్థితి ఏర్పడింది. తెలంగాణ ఇస్తే తెరాసను కాంగ్రెస్‌లో విలీనం చేస్తామని గతంలో కెసిఆర్ వాగ్దానం చేశారు గనుక, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు నిర్ణయించారు గనుక విలీనంపై కెసిఆర్‌తో చర్చిస్తాం అని కాంగ్రెస్ ప్రకటించింది. మరోవైపు తెరవెనుక మంతనాలతో తెరాస నేతల్ని కాంగ్రెస్‌లోకి ఆకర్షించి తెరాసను దెబ్బ తీసే ప్రయత్నం చేసింది. ఇది గ్రహించిన తెరాస కాంగ్రెస్‌ని ఎదురుదెబ్బ తీసేందుకు సన్నద్ధమైంది. కాంగ్రెస్ నుండి, టిడిపి నుండి తెరాసకు వలస వచ్చిన నేతలతోనే ఆయా పార్టీలను టార్గెట్ చేస్తోంది. మొదట్లో కాంగ్రెస్ అధినేతలైన రాజీవ్ గాంధీ, ఇందిరాగాంధీ విగ్రహాలను ధ్వంసం చేయించిన వైసిపి ముందు చూపుతో విగ్రహ ధ్వంసాన్ని ఆపి సీమాంధ్ర ప్రజల అనుగ్రహాన్ని పొందే పనికి పూనుకుంది.

2014 ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని, కేంద్రంలో రాహుల్‌ని ప్రధానిని చేసే లక్ష్యంతోనే కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సిద్ధమైందని, రాజకీయ లబ్ధి కోసమే తెలుగునాట చిచ్చుపెట్టిందని చంద్రబాబు కూడా కాంగ్రెస్‌పై ధ్వజమెత్తడం ప్రారంభించాడు. భాషా ప్రయుక్త రాష్ట్రాలను బలహీనపర్చి, టిడిపి లాంటి ప్రాంతీయ పార్టీలను దెబ్బ తీసి దేశాన్ని ఏకచ్ఛత్రాధిపత్యంగా ఏలడానికే కాంగ్రెస్ ఈ పన్నాగం పన్నిందని కాంగ్రెస్‌ని టార్గెట్ చేయడం మొదలుపెట్టాడు. తెరాసని, వైసిపిని కూడా వదలకుండా భవిష్యత్‌లో అవి కాంగ్రెస్‌లో విలీనమై కాలగర్భంలో కలిసి పోతాయని జోస్యం చెపుతున్నాడు. ఎన్నికలకి ముందే తెరాస, ఎన్నికల తర్వాత వైసిపి కాంగ్రెస్‌లో విలీనం కావడం ఖాయమని, భవిష్యత్‌లో కాంగ్రెస్‌ని నిలకడగా ఎదిరించి పోరాడే ఏకైక పార్టీ టిడిపియేనని గొప్పలు చెపుతూ ఆత్మస్తుతి, పరనిందలతో పార్టీని కాపాడుకునే ప్రయత్నంలో పడ్డాడు. అలా అనుకొన్నా ఎన్నికల ముందు తెరాసను విలీనం చేసుకోవడం ద్వారా తెలంగాణ తెచ్చిందీ, ఇచ్చిందీ తామేనని ఇరువురూ కలిసి తెలంగాణలో ఓట్లు స్వీప్ చేస్తే అక్కడ టిడిపి పరిస్థితి ఏమిటి? టిడిపితో రహస్య మంతనాలడుతున్న బిజెపి పరిస్థితి ఏమిటి? తెలంగాణ పోతే పోయిందనుకొని సీమాంధ్ర ప్రయోజనాల కోసం పోరాడుతున్న పార్టీగా మెప్పు పొందుతున్న వైసిపి సీమాంధ్రలో స్వీప్ చేస్తే అక్కడ టిడిపి పరిస్థితి ఏమిటి? ఎన్నికల అనంతరం వైసిపి కాంగ్రెస్‌లో విలీనమైతే రెండు చోట్లా అధికారాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకుంటుంది కదా! రెండు కళ్ల సిద్ధాంతాన్ని నమ్ముకున్న తెలుగుదేశం రెంటికి చెడ్డ రేవడిగా మారుతుంది కదా!

అందుకే, ఆరకంగా ఆత్మరక్షణలో పడినందుకే సీమాంధ్ర పట్టు కోల్పోకుండా కాపాడుకొనేందుకే చంద్రబాబు తెలుగుజాతి ఆత్మగౌరవ యాత్ర ప్రారంభించాలని సంకల్పించాడు. అంతలో ఎన్టీఆర్ పుత్రరత్నం హరికృష్ణ సమైక్యాంధ్ర పరిరక్షణ కోసం రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా సమర్పించి ఆమోదం పొందటంతో చంద్రబాబు బస్సు యాత్రకు బ్రేకు పడింది. ఎన్‌టిఆర్ జన్మస్థలం అయిన నిమ్మకూరు నుండి హరికృష్ణ బస్సు యాత్ర ప్రారంభిస్తానని ప్రకటించడంతో చంద్రబాబు గుండెల్లో రాయిపడింది. అంతేకాదు, వైసిపి అధినేత్రి షర్మిల చంద్రబాబు యాత్రకు పోటీ యాత్ర చేపట్టనున్నట్లు వార్తలు రావడంతో చంద్రబాబు యాత్రకు పోటీ తలెత్తింది. జగన్ జైలు దీక్ష ప్రారంభించడంతో చంద్రబాబు కూడా యాత్రలు ఆపి సమైక్యాంధ్ర కోసం దీక్షకు కూర్చోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

హరికృష్ణ లాగే టిడిపి ఎంపిలు కూడా రాజీనామా చేయాలని వైసిపి అధినేతలు జగన్, విజయమ్మ లాగా చంద్రబాబు కూడా తన ఎం.ఎల్.ఎ పదవికి రాజీనామా ఇవ్వాలని సీమాంధ్ర జనం పట్టుబడితే ఇబ్బందిలో పడాల్సి వస్తుంది. 2008లో తెలంగాణకి అనుకూలంగా చంద్రబాబు ఇచ్చిన లేఖ వెనక్కి తీసుకోవాలనే డిమాండ్ ముందుకు వస్తుంది. టిడిపి అండ జూసుకునే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కాంగ్రెస్ ధైర్యం చేసిందని వైసిపి చేస్తున్న ప్రచార ప్రభావంతో ఆ లేఖల్ని వెనక్కి తీసుకోవాలని సీమాంధ్ర జనం పట్టుబడితే తెలంగాణకి వ్యతిరేకంగా మారాల్సి వస్తుంది. చివరికి తెలుగుజాతి 'ఆత్మగౌరవ యాత్ర' ఆత్మవంచన యాత్రగా మారిపోతుంది. అంతేకాదు కేంద్రం గుత్తాధిపత్యానికి, కాంగ్రెస్ ఏకచ్ఛత్రాధిపత్యానికి వ్యతిరేకంగా తెలుగుజాతి ఆత్మగౌరవ యాత్రతో జైత్రయాత్ర చేసిన ఎన్‌టిఆర్ స్ఫూర్తి రివర్స్ ఎఫెక్ట్ ఇస్తుంది.

'వచ్చాడన్నా వచ్చిందన్నా వరాల తెలుగు ఒకటేనన్నా, తెలుగుజాతి

మనది, నిండుగ వెలుగుజాతి మనది' అంటూ తెలంగాణ, ఆంధ్ర, రాయలసీమ ప్రాంతీయ తత్వాలను వేర్పాటువాద తత్వాలుగా ప్రచారం చేసిన ఎన్టీఆర్ సమైక్యాంధ్ర వాదాన్ని తెలుగుజాతి ఆత్మగౌరవానికి ప్రతీకగా మార్చారు. ఈ స్ఫూర్తికి విరుద్ధంగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ఆమోదం తెలిపి 2009లో తెరాసతో పొత్తు పెట్టుకోవడం చర్చనీయాంశం అవుతుంది. అధికారదాహంతో ముఖ్యమంత్రి కావాలనే పదవీ వ్యామోహంతో తెలుగుజాతి ఆత్మగౌరవాన్ని తాకట్టుపెట్టిన చంద్రబాబు ఆ లేఖని వెనక్కి తీసుకుని, ఆ పొత్తు చారిత్రక తప్పిదాన్ని ఆత్మవిమర్శ చేసుకోకుండా బస్ యాత్రకి బయలుదేరితే అది ఆత్మవంచనా యాత్ర అవుతుందేగాని ఆత్మగౌరవ యాత్ర కాదు అనే విమర్శలకు చంద్రబాబు సంజాయిషీ చెప్పుకోవాల్సి వస్తుంది. అలా చెప్పుకుంటే అది తెలంగాణ వ్యతిరేక వైఖరి అవుతుంది. అపుడు చంద్రబాబు రెండుకళ్ళ సిద్ధాంతం ధృతరాష్ట్ర సిద్ధాంతంగా మారిపోతుంది. అందుకే కనీసం కొంతమంది ప్రజా ప్రతినిధులతోనైనా రాజీనామా చేయించి గుడ్డిలో మెల్ల అనిపించుకున్నాడు. సమైక్యాంధ్ర కోసం విజయమ్మ ఆమరణ దీక్షకు దిగుతుందని తెలిసి పొన్నూరులో ధూళిపాళని, బెజవాడలో దేవినేని ఉమని ఆమరణ నిరాహారదీక్షకి దించి ఆత్మరక్షణకి పూనుకున్నాడు. ఏం చేసినా ఎన్ని చేసినా టిడిపి రాజకీయ భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారితే వచ్చే ఎన్నికల్లో తెలంగాణ అనుకూల బిజెపితో పొత్తుపెట్టుకునే యోచన ఉన్నట్లు సంకేతాలిస్తున్నాడు. పార్లమెంట్ ఉభయసభల్లో ఆందోళన చేస్తున్న టిడిపి ఎంపిలు సస్పెండ్ అయినపుడు బిజెపి వారికి మద్దతుగా నిలబడడం, హైదరాబాద్‌లో నవభారత భేరి జరిగినపుడు నరేంద్రమోడీ ఎన్టీఆర్‌ని, తెలుగుదేశాన్ని ఆకాశానికెత్తడం అందుకు సంకేతాలుగా కనిపిస్తున్నాయి. కానీ గతంలో టిడిపి అభ్యంతరం చెపితే తెలంగాణ ఇవ్వకుండా ఆగిపోయిన బిజెపి చరిత్ర మళ్లీ పునరావృతం అయ్యే స్థితి ఏర్పడితే దానికి తెలంగాణలో కూడా పుట్టగతులుండవు. అలాంటి బిజెపితో టిడిపి పొత్తు పెట్టుకుంటే కుక్క తోకపట్టుకొని గోదావరి ఈదినట్లు మరోసారి భంగపడక తప్పదు.

2014లో బిజెపి కేంద్రంలో అధికారంలోకి వస్తే 100 రోజుల్లో తెలంగాణ ఇస్తుంది అని ప్రధాని అభ్యర్థి నరేంద్ర మోడీచేత హైదరాబాద్ భేరీలో వాగ్దానం చేయిద్దామనే ఓటుబ్యాంక్ ఎత్తుగడపై ఆశ పెట్టుకుంటే మోడీ భేరీకి ముందే కాంగ్రెస్ కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు నిర్ణయాన్ని ప్రకటించడంతో బిజెపి తెలంగాణ విషయంలో రాజకీయ లబ్ధి పొందే అవకాశం కోల్పోయింది. తనకు దక్కాల్సిన రాజకీయ లబ్ధి కాంగ్రెస్‌కి దక్కటం సహించలేని బిజెపి చివరికి ఉభయసభల్లో సమైక్యాంధ్ర వాదులకు దన్నుగా నిలబడి తెలంగాణ శ్రేణుల ఆగ్రహానికి గురైంది. ఆ రకంగా బిజెపి పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది.

ఇక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు నిర్ణయం తీసుకొని సీమాంధ్ర ప్రాంతం వారి ఆగ్రహానికి గురవుతున్న కాంగ్రెస్ ఈ తిలా పాపాన్ని తలా పిడికెడు పంచే పన్నాగంతో కాంగ్రెస్‌తో పాటు మిగతా పార్టీలను కూడా దోషులుగా బోనులో నిలబెట్టింది. మిగతా పార్టీలన్నీ సరే అన్నందువల్లే కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు పూనుకొందని చెప్పి, స్వతహాగా కాంగ్రెస్ సమైక్యవాద పార్టీయేనని చాటి చెపుతున్నది. కొంతమంది సీమాంధ్ర కాంగ్రెస్ ప్రతినిధులచేత రాజీనామాలిప్పించి సీమాంధ్రలో సైతం ప్రజల మన్నన పొందే మార్గాలు వెతుకుతోంది. ఈ ఎత్తుగడతోనే ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి సమైక్యాంధ్ర గళం వినిపించి సీమాంధ్రుల మన్ననలు పొందాడు. అయినా పరిస్థితులు చేజారిపోతే ఎన్నికల అనంతరం వైసిపిని విలీనం చేసుకొని సిఎం పదవి జగన్‌కే అప్పగించవచ్చు. అందుకు కలిసిరాని పరిస్థితి వుందనుకొంటే రాయలసీమను తెలంగాణతో కలిపి రాయల తెలంగాణ ఏర్పాటు చేసి, లేదా రాయలసీమను రెండు ముక్కలు చేసి ఏకంగా వైసిపిని వైండప్ చేయడానికి సైతం వెనుకాడదు. ఈ పాచికలు పనిచేయకపోతే సీమాంధ్ర మనోభావాల పేరిట కాంగ్రెస్ పార్టీయే 'సమైక్యాంధ్ర ఇందిరా కాంగ్రెస్ పార్టీ' స్థాపించి రెండు ప్రాంతాల్లో లబ్ధిపొందే ప్రయత్నం చేసినా ఆశ్చర్య పోనక్కర్లేదు.

ఈ పరిణామాల పర్యవసానంగా, ఈ అవకాశవాద రాజకీయ విభజన కారణంగా రాజ్యాంగబద్ధమైన రాష్ట్ర విభజన ప్రక్రియ ప్రతిష్టంభనలో పడిపోయింది. ఇందుకు రాజకీయ పార్టీల ద్వంద్వ వైఖరి ఒక కారణమైతే, కేంద్ర ప్రభుత్వ అనిశ్చిత వైఖరి మరో కారణం. సిడబ్ల్యూసి, యుపిఎ నిర్ణయం చేసినా కేబినెట్ నిర్ణయం చేయకపోతే తెలంగాణ బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టలేరు. ప్రతిపక్షాలతో పాటు కాంగ్రెస్ పక్ష సీమాంధ్రనేతలు కూడా అడ్డం తిరగడంతో వారిని సంతృప్తి పర్చటం కోసం హైదరాబాద్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా మార్చాలా లేక శాశ్వతంగా ఉమ్మడి రాజధానిని చేయాలా? ఢిల్లీ తరహాలో శాంతి భద్రతలను కేంద్రం చేతిలో ఉంచుకోవాలా? అని తర్జనభర్జనలు చేస్తున్నది.

హైదరాబాద్ రాజధానిగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే హైదరాబాద్‌లో స్థిరపడిన సీమాంధ్ర ప్రాంతం వారికి రక్షణ కరువవుతుందనే అభద్రతా భావం కృత్రిమమైంది. హైదరాబాద్‌లోని సీమాంధ్ర పెట్టుబడిదారుల అక్రమాస్తుల రక్షణే వారి అసలు సమస్య. కనుక శాంతిభద్రతలు కేంద్రం చేతిలో ఉన్నా వారికి సంతృప్తి లేదు. తెలంగాణపై, హైదరాబాద్‌పై సీమాంధ్ర వలసపెత్తందార్ల ఆర్థిక రాజకీయ గుత్తాధిపత్యం కోల్పోవాల్సి వస్తే, తెలంగాణ వారికి కూడా స్వయంపాలనాధికారం దక్కకుండా చేయాలనేదే వారి గొంతెమ్మ కోరిక. అందుకే పిట్టపోరు, పిట్టపోరు పిల్లి తీర్చినట్లు తెలంగాణకు తలమానికమైన హైదరాబాద్‌ను కేంద్రపాలిత ప్రాంతంగానో లేక మరో రాష్ట్రంగానో మార్చాలని డిమాండ్ చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌ని తెలంగాణ సీమాంధ్ర రాష్ట్రాలుగా విభజించటమే గాక హైదరాబాద్‌ని మూడో రాష్ట్రంగా విభజించాలని కోరే సీమాంధ్ర పెత్తందార్ల సమైక్యాంధ్ర వాదం బూటకత్వం ఏమిటో స్పష్టమవుతూనే ఉంది. కనుక చావు భయంపెట్టి లంకణానికి ఒప్పించే ఎత్తుగడతోనే సమైక్యాంధ్ర నినాదం ఇస్తున్నారనేది స్పష్టం. హైదరాబాద్‌ను తెలంగాణకు దక్కకుండా చేస్తే సీమాంధ్రుల సమైక్యాంధ్ర ఉద్యమం దానంతట అదే ఆగిపోతుంది. గతంలో 1973 లో చెలరేగిన ఆనాటి జై ఆంధ్ర ఉద్యమం కూడా ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రాన్ని డిమాండ్ చేసినా ముల్కీరూల్స్‌ని నీరుగార్చి జోనల్ విధానం ప్రవేశపెట్టగానే ఆగిపోయింది. 2013 సమైక్యాంధ్ర ఉద్యమం కూడా జై ఆంధ్ర ఉద్యమం లాంటి ఎత్తుగడల ఉద్యమమే కనుక చివరికి సమైక్యాంధ్ర సెంటిమెంట్ నిజమైన కమిట్‌మెంట్ అని భ్రమించే సామాన్యాంధ్రులే భంగపడతారు. కనుక ఇకనైనా అంబేద్కర్ సూచించినట్లు చిన్నరాష్ట్రాల ఏర్పాటు, వికేంద్రీకృత అభివృద్ధికి తోడ్పాటు ఇస్తుందని గ్రహించి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుతో పాటు సీమాంధ్ర మరో రాష్ట్రంగా ఏర్పాటుచేసుకుందాం. రాజ్యాంగబద్ధ ప్రక్రియకు సహకరిద్దాం.

(రచయిత సామాజిక ఆంధ్ర, రాయలసీమ, తెలంగాణ సమన్వయ కమిటీ కోఆర్డినేటర్) వీ

గతి తప్పిన రాజకీయం

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు అన్ని రాజకీయ పక్షాలు సమ్మతించి తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ప్రకటన రాగానే ఇప్పుడు సమైక్యాంధ్ర ఉద్యమాలు చేయడం అవకాశవాదమంటున్నారు విద్యాభూషణ్

'ప్రజాహితమే ప్రజాస్వామ్యానికి పునాది' అన్నది గతం. మనుగడే రాజకీయానికి మూలమన్నది నేటి నేతల ఉవాచ. ప్రపంచంలో కెల్లా అతిపెద్ద ప్రజాస్వామ్యం భారతదేశానిదే అని కీర్తించిన ప్రజాస్వామ్యం, సున్నితంగా రాచరికానికి పునాది వేస్తుంది. అందుకు ప్రాతిపదికగానే రాష్ట్ర విభజనకు నిర్ణయం తీసుకున్నారు. దశాబ్దాలుగా నలుగుతున్న తెలంగాణ అంశానికి అనివార్యంగా విభజన నిర్ణయం తీసుకున్నారు. మూడున్నరేళ్లుగా అట్టుడికిస్తున్న ప్రత్యేక తెలంగాణకు నిర్ణయం తీసుకోవడంలో మీన మేషాలు లెక్కించిన పాలకులు తొందర పడ్డారనడంలో అర్థం లేదు. ప్రజా మూలల్లోకి వెళ్లిన విభజన వాదం-పరిణామాలను అనేక కమిటీల రీత్యా కూలంకషంగానే చర్చించారు. ఇంత చర్చ జరుగుతున్న వేళ 'సమైక్యవాదం' మిన్నకుండి, నిర్ణయం వెలువడిన తరువాత రోడ్డెక్కడం వింతగా ఉంది. అంత వరకు నేడు సమైక్యవాదాన్ని వినిపిస్తున్న నేతలు అధిష్టాన నిర్ణయానికి తాము కట్టుబడి ఉంటామంటూనే, నేడు సమైక్య రాష్ట్ర తీర్మానాన్ని బలపరుస్తూ సంతకాలు చేయడం అనైతికం. ఇందులో ప్రధానంగా రాష్ట్ర సిఎం, పిసిసి అధ్యక్షులు సంతకాలు చేయడం గమనార్హం. ఈ నేపథ్యంలో ఆంధ్ర ప్రాంతంలోని రాజకీయ నేతలను రాజీనామా చేయాలంటూ డిమాండ్ చేస్తున్నారు. అది వృథా ప్రయాసగానే మిగులుతుంది తప్ప వీసమెత్తు ప్రయోజనం ఉండదు. పూర్వాపరాలను యోచించకుండా తమ వాదానికి కట్టుబడి ఉండే నైతికత నేతల్లో లేదు. గనుక తమ ప్రాంతీయుల ప్రయోజనాలను విశాల దృక్పథంతో బాధ్యతా యుతంగా యోచించి వ్యవహరించాల్సి ఉంటుంది. అధికారమే పరమావధిగా భావిస్తున్న నేతలు ఇలా వ్యవహరిస్తారనుకోవడం అత్యాశే. మరి ప్రజలు శాంతియుతంగా తమ హక్కుల సాధన కోసం ఉద్యమించాలి.

ఇక రాష్ట్ర రాజధాని విషయంలో ఉమ్మడి రాజధానిగా కాల పరిమితితో ప్రకటించడం సైతం అవసరమే. ఈ ప్రకటన కారణంగా తమ పిల్లలకు గాని, వారి ఉపాధి అవకాశాలకు గాని వచ్చే నష్టమేమి ఉండదు. దేశ పౌరులుగా దేశంలో ఏప్రాంతంలోనైనా స్థిరపడి జీవనం వెళ్లదీసుకునే వీలు అందరికి ఉంటుంది. ఈ వాస్తవాన్ని తెరమరుగు చేసి, అభద్రత భావాన్ని రెచ్చగొట్టడం కేవలం ఓ రాజకీయ ఎత్తుగడే. రోజు రోజుకి తీవ్రమవుతున్న ప్రపంచీకరణ నేపథ్యం ప్రభుత్వ కొలువులకు ఏనాడో నీళ్లు ఒదులుకునేలా చేసింది. విస్తరిస్తున్న కార్పోరేటీకరణతో ప్రైవేటు కొలువులే శరణ్యం. ఈ ప్రైవేటు కొలువులకు సమర్థత గీటురాయి కాని ప్రాంతీయ వాదాలు కాదు. ఇతరత్రా రిజర్వేషన్లు వంటివి కూడా పరిగణనలోకి రావు. మరోవైపుగా రాష్ట్ర విభజన తరువాత ప్రభుత్వ కొలువులు నియామకాల్లో ఆయా రాష్ట్రవాసుల నియమాల మేరకు ఉద్యోగ అవకాశాలు ఉండనే ఉంటాయి. రాబోయే అంశం పట్ల ఇప్పుడింతగా ఆందోళన పడాల్సిన అవసరం లేదు. దేశాంతరంగా కొలువులు పొందిన ప్రవాస భారతీయుల ఉదంతాన్ని మననం చేసుకోవాల్సి ఉంటుంది. అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశంలోనే నాలుగో వంతు భారతీయులేనన్న సంగతిని గుర్తించాలి.

ఉమ్మడి రాజధాని నిర్ణయానికి కాల పరిమితి ముగిసేలోగా నూతన రాజధాని ఎక్కడ ? ఎలా ? అన్న నిర్ణయాలను నిదానంగా యోచించాలి. అవి నిర్ణయాత్మకంగా ఉండాలి. పోతే, ప్రజలు ఆందోళన చెందుతున్న ఇతర అంశాలు సాగునీటి పంపకం అంటే జల వనరుల పంపకమన్న మాట. జల వనరుల పంపకాన్ని నిర్దేశించే కమిషన్లు-ప్రత్యేక న్యాయ సలహా సంఘాలు ఎన్నో ఉన్నాయి. వీటి ఆధీనంలో అంతర్రాష్ట్ర-అంతర్దేశీయ వివాదాలు ఎన్నో నలుగుతుండగా, ఆంధ్ర-తెలంగాణ రాష్ట్రాల అంశాలు అంత జటిలమైనవి కానేకావు. ఇందుకు అవసరమయ్యే నిబంధనలు ఉన్నాయి. ఇదే కోవలో విద్యుత్ - ఉత్పాదన పంపకాలు. తరువాత ప్రస్తావన కొచ్చేది ఆదాయ వనరుల పంపకం. ఈ వనరుల పంపకాంశం నిర్దిష్ట నిపుణులు నిర్ణయించాల్సిందే. కాని రాజకీయ పరిధికి అతీతమైంది. అనివార్యంగా ఇరు ప్రాంతాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకునే నిర్ణయించాల్సి ఉంటుంది. ఎవరు లాభ పడతారు, ఎవరు నష్ట పోతారని కాకుండా జనాభా ప్రాతిపదికనో, దామాషా ప్రాతిపదికనో నిర్ణయించాల్సి ఉంటుంది. సహజంగా ఒకరు లాభ పడాలంటే, వేరొకరు నష్ట పోవాల్సి ఉంటుందన్న సహజ న్యాయ నేపథ్యంలో నిర్ణయం తీసుకోవాలి. కనీసం ఇప్పుడైనా ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. అయితే ఈ విషయాలన్నీ విభజన ప్రక్రియ మొదలైన తరువాత ప్రస్తావనకు వస్తాయి గాని, విభజనకు ముందు వ్యూహాత్మకంగా ప్రస్తావించలేనివి. ఈ కారణంగా వీటి గురించి ముందుగా ఆందోళనలను చేపట్టడం శ్రేయస్కరం కాదు.

అసలు విభజన ప్రక్రియను చట్టబద్ధం చేసేందుకు పార్లమెంటులో ప్రవేశ పెట్టేందుకు ముందుగా, పైన ప్రస్తావించే పంపకాల విషయంలో సూత్రబద్ధమైన రేఖామాత్ర విధి విధానాలను సూచించడం అవసరం. లేకుంటే పార్లమెంటు ఉభయ సభల్లోను సభ్యులు అడ్డు తగిలే వీలుంది. అదే జరిగితే సమస్య మళ్లీ మొదటికొచ్చే ప్రమాదం ఉంది. ఇందుకు కేంద్రం నిర్దేశించిన ఆంటోని కమిటీ పరిష్కారం చూపుతుందని ఆశించలేం. అయితే ఆంటోని కమిటీ రేఖామాత్రంగా వివిధ వర్గాల ప్రజల అభిప్రాయాలను, అభీష్టాలను సేకరిస్తుంది. వీటి ప్రాతిపదికన అంతిమ నిర్ణయాలను రూపొందించే ముందు ఇరు రాష్ట్రాల నేతలను సమష్టిగా కూర్చోపెట్టి నిర్ణయాలను తీసుకోవాలి. రాజకీయ లబ్ధికి

అతీతంగా అన్ని పార్టీల నేతలను సంప్రదించడం అత్యావశ్యకం. లేకుంటే ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం ఇంకా కొనసాగుతూనే ఉంటుంది.

ఇదంతా ఇక ముందు జరగాల్సింది కాగా, ఇప్పటి వరకు జరిగిందాన్ని సమీక్షించుకుంటే అసలు నిబద్ధత లేదా పార్టీల పరంగా తీసుకున్న నిర్ణయాలకు ఆయా పార్టీలు కట్టుబడే కనీస ఇంగితం ఉందా అన్న ప్రశ్న ఎదురౌతుంది. అన్ని పార్టీలు ప్రత్యేక రాష్ట్ర అంశంపై తమ, తమ నిర్ణయాలను వెల్లడించడానికి సంవత్సరాల కాలం పట్టింది. ఎవరి నిర్ణయం ఎవరికి దోహదపడుతుందో ననుకుని 'నువ్వు చెప్పంటే', 'నువ్వు చెప్పు' అని కొంతకాలం వెళ్లమార్చారు. ఔనని, కాదని కడకు ఆయా అభిప్రాయాలను ఆయా పార్టీలు వెల్లడించాయి. దీనికంతకు రాజకీయ ప్రయోజనమే కీలకం. తీరా వెల్లడించిననంతరం మళ్లీ సమస్య మొదటికి వచ్చేలా పార్టీల నేతల నిర్ణయాలకు భిన్నంగా రాజీనామాల అస్త్రాలను ప్రకటిస్తున్నారు. ఇది పూర్తిగా అనైతికం. రాజకీయ ప్రయోజనాల కోసం, ప్రజలను పణంగా పెట్టడం మినహా వేరొకటి కాదు. రాజీనామాలతో రాజకీయ సంక్షోభం సృష్టిస్తే ఫలితం ఏంటి? సమస్య పరిష్కారం తప్పకుండా పక్కతోవ పట్టే వీలుంది. ఒక తప్పునుంచి మరో తప్పులోకి అన్నమాట. అందుకని రాజకీయ పక్షాలన్నీ సమస్య పరిష్కారం దిశగా చిత్తశుద్ధితో వ్యవహరించాలి. ఇందుకు రాజకీయ నేతలు ఆత్మవలోకనం చేసుకోవాలి. ఇది అత్యాశే కదా.

ఇది అత్యాశ అని ఎందుకంటున్నానంటే మూడేళ్లుగా ప్రత్యేక తెలంగాణ వాదంతో రాష్ట్రం అట్టుడికిపోయి, బలిదానాలతో రగిలిపోగా, అంతిమ నిర్ణయం తీసుకునే నాటికి మళ్లీ ఈ 'సమైక్య' ఆంధ్రప్రదేశ్ మాటేంటి? ఇప్పటికే ఇరు ప్రాంతాల ప్రజలు మానసికంగా సంసిద్ధులై పోయారు. ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు నాటినుంచి, తెలంగాణ ప్రాంతీయ కష్టాలు నష్టాల చరిత్రలన్నీ తిరగతోడి, ప్రత్యేక రాష్ట్ర ఆవశ్యకతను నొక్కి చెప్పిన వైనం మన ముందు ఉంది. మా వనరులను, మా అవకాశాలను ఆంధ్ర ప్రాంతీయులు దోచుకున్నారని వేనోళ్ల తెగనాడారు. గతంలో మాదిరిగా ప్రత్యేకాంధ్ర పేరున కాకుండా, ఇంత జరిగినా, మనం విడిపోవడానికి వీల్లేదని, సమైక్యంగా ఉండాలని డిమాండు చేయడం సహేతుకం కాదు. బలవంతపు మనుగడను బలపర్చడం అర్థరహితం కాదా! ఇలా డిమాండు చేయడం తెలంగాణ ప్రజానీకాన్ని ఆంధ్రవాసులు దోపిడీ చేశారన్న అభియోగాన్ని బలపర్చడం కాదా! ఈ పరిస్థితుల్లో ఆంధ్ర ప్రాంతీయులు, మిమ్మల్ని మేం దోచుకోవడం ఏమీలేదు. మీమానాన మీరు బతకండి, తెలుగు ప్రజలుగా ఐక్యంగా ఉందామనే సానుకూల వాదనను ముందుకు తీసుకు రావాల్సి ఉంది. తెలంగాణ పారిశ్రామికంగా అభివృద్ధికి పాటుపడిన ఆంధ్ర ప్రాంతీయులే కనుక మునుముందు తమ ప్రాంతీయ అభివృద్ధికి కృషి చేయడం, సుసాధ్యమే. 'అన్నదమ్ముల్లా విడిపోదాం – తెలుగువారిగా కలిసుందాం' అన్న నానుడికి ఆచరణ రూపం ఇవ్వడం ఎంతైనా అవసరం. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం ఉనికిలోకి వచ్చిన తరువాత పరిస్థితులను, అంతకు ముందునాటి పరిస్థితులతో బేరీజువేసి అభివృద్ధి పరంగా ఎంత వెనుక బడిపోయామన్నది సమైక్యవాదులు గుర్తించాలి. ఇవే పరిస్థితులను ఇంకా కొనసాగనిస్తే ప్రజాజీవనం ఎంతటి అధోగతి పాలవనుందో అంచనా వేయాలి. నేతల రాజకీయ ప్రయోజనాలను, ప్రజా ప్రయోజనాలతో విడదీసి చూడాలి. స్వార్థ రాజకీయ ప్రయోజనాలకు సమిధలు కాని రీతిలో సామాన్యులు, యువత ఆలోచించాలి.

ఈ పరిస్థితులను అంచనా వేయలేకనే, కేంద్ర ప్రభుత్వం సమస్యను ఇలా కొనసాగించిందా? అంటే కాదు. వారి అవలోకనం మేరకే నేడు మనం ఎదుర్కొంటున్న పరిస్థితులు. ఈ ప్రత్యేక రాష్ట్ర సమస్యను పరిష్కరిస్తే, అంతిమంగా ప్రజలు అధిక ధరల వంటి ప్రజా సమస్యల వైపు దృష్టిని కేంద్రీకరిస్తారు. సమస్య తీవ్రతను వారికి అవగతం చేసిన నాడు, ఎంతటి నిరసనలకైనా సామాన్యులు వెనుకాడరనే వాస్తవం ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం ద్వారానే కొంత మేరకు పాలకులకు అర్థం అయింది. ధరలు, పన్నులు పెంచక గత్యంతరంలేని పరిస్థితులు. వెంటాడుతున్నా ప్రపంచీకరణ ప్రయోగ ఫలితాలు. ఆర్థిక సంస్కరణలకు పాతికేళ్లు నిండుతున్నాయి. ఇక చెల్లింపులు ప్రారంభం కావాలి. వేల కోట్ల రూపాయలను కేవలం వడ్డీల రూపేణ చెల్లించాలి. అన్ని తరహా పన్నులతో పాటు విద్యుత్, నీటి సరఫరా చార్జీలను పెంచక తప్పని పరిస్థితి. మంచి నీటి సరఫరా విషయంలో అయితే సరఫరాను మూడు రోజులకోసారి చేస్తూ వినియోగ చార్జీలను పెంచేయడం ఎంత దౌర్భాగ్యమో బుద్ధిజీవులు ఆలోచించాలి. మార్కెట్ ధరల విషయానికొస్తే కిలో బియ్యం 50 రూపాయలు. ఉల్లిపాయలు కూడా కిలో 50 రూపాయలు. ఏ కాయగూరలు తీసుకున్నా కిలో 50కి తక్కువ లేవు. అయినా తలొంచుకుని సర్దుకు పోతూనే ఉన్నాడు సామాన్యుడు. ఈ ప్రత్యేకరాష్ట్ర లొల్లే లేకుంటే, ఆకాశాన్నంటుతున్న ధరల వైపు దృష్టి సారించడం తప్పనిసరి. అప్పుడు మింగుడు పడని పరిస్థితి కేంద్రానిది. మరోవైపు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను చిల్లర అమ్మకాల్లో (వ్యాపారంలో) ఆహ్వానించాలన్నది కేంద్ర ప్రభుత్వ లక్ష్యం. ఈ అంశంపై అనేక చర్చోప చర్చలు జరిగాయి. రానున్న పార్లమెంటు సమావేశాల్లో ఈ అంశానికి ఆమోదం లభ్యం కావచ్చు. ఆమోదం పొంది విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆహ్వానిస్తే విదేశీ అమ్మకం కేంద్రాల ధరలు, ప్రస్తుత మార్కెట్ ధరల కంటే కాస్తా తక్కువగా ఉండి సామాన్యుల ఆమోదాన్ని పొందితే, పాలక వర్గాల పని చాలా తేలికవుతుంది.

విదేశీ పెట్టుబడులతో ఆవిర్భవించిన విదేశీ కార్పొరేట్ శక్తులను ప్రజలు కీర్తించక తప్పనిసరి పరిస్థితి. ఇంక అప్పుడు వచ్చే సాధారణ ఎన్నికల్లో అధికార పక్ష గెలుపు నల్లేరు మీద నడకే అవుతుంది. అందుకుగాను ప్రత్యేక రాష్ట్ర అంశంలో ఆంటోని కమిటీతో పాటు మరిన్ని కమిటీలు చోటు చేసుకున్నా ఆశ్చర్య పోనవసరం లేదు.

ఇంతకీ కేంద్రం ఎందుకీ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు వైపు మొగ్గు చూపింది అని తర్కించుకుంటే, దాచేస్తే దాగని వాస్తవాల వెల్లువ రాష్ట్రంలో ఉన్న రాజకీయ పక్షాల్లో ఒక సిపిఎం మినహా అన్ని విపక్ష పార్టీలు ప్రత్యేక తెలంగాణకు అనుకూలంగానే తమ నిర్ణయాలను ప్రకటించాయి. వారికి రాజకీయంగా చెక్ చెప్పేందుకు తప్పనిసరై కాంగ్రెసు అధిష్టానానికి ప్రత్యేక రాష్ట్రాన్ని ప్రకటించక తప్పలేదు. ప్రకటించిన తరువాత కొనసాగింపులపై ముందు చూపు ఉన్నా, కొనసాగించాల్సిన అవసరం పాలక పక్షానికి అనివార్యం. పైన పేర్కొన్న కారణాల దృష్ట్యా ఇది పైగా ప్రజాస్వామ్య వ్యవస్థలో యువరాజును అధికార పీఠమెక్కించాలని పాలక పక్షం కంకణం కట్టుకుంది. రాజకీయ విధి విధానాలు పాలనాపరంగా ప్రజలకు చుక్కలను చూపిస్తున్నాయి. ఈ స్థానంలో కాంగ్రెసు లేదా

తెలంగాణ ఉద్యమం- ఒక విశ్లేషణ

తెలంగాణ ఉద్యమాల తీరును విశ్లేషిస్తూ, పార్లమెంటరీ పార్టీల స్వభావాలను తెలియజేస్తూ, ప్రజాస్వామ్య తెలంగాణ నిర్మాణ బాధ్యత ప్రజాస్వామిక వాదులదేనంటున్నారు డా. ఎం. గంగాధర్

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును అంగీకరిస్తూ యుపిఎ సమన్వయ కమిటీ, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఏకగ్రీవ తీర్మానాలను చేశాయి. ఇప్పుడున్న రాజకీయ పరిస్థితిలో యుపిఎ సమన్వయ కమిటీ, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీర్మానాలు, అవి కూడ ఏకగ్రీవ తీర్మానాలు, నిర్ణయాత్మకమైనవి. కాంగ్రెస్‌లో అంతర్గతంగా సుదీర్ఘకాలం చర్చలు జరిగిన తరువాత, ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేయడం కొరకు, రాష్ట్రాన్ని సమైక్యంగానే ఉంచడం కొరకు, ఇంటా, బయటా తీవ్రమైన ఒత్తిళ్లను చవి చూసిన తరువాత, ఎట్టకేలకు, తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయడానికి కాంగ్రెస్ నిర్ణయించింది.

భారతీయ జనతా పార్టీ(బిజెపి) చాలా సంవత్సరాల క్రితమే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును అంగీకరిస్తూ తీర్మానం చేసి, ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో పాల్గొంటున్నది. 2014లో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో తమ ఎన్‌డిఎ కూటమి అధికారంలోకి వస్తుందని, అప్పుడు తెలంగాణను ఇస్తుందని చెపుతూ వస్తోంది. సార్వత్రిక ఎన్నికలకు ముందే పార్లమెంట్‌లో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కొరకు బిల్లు పెడితే మద్దతు ఇస్తానని అంటున్నది.

గడిచిన ఒకటిన్నర దశాబ్దాల దేశ రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కాంగ్రెస్, బిజెపిలు అంగీకరించడం కీలకమైన విషయంగా మారింది. 2008, 2009 ల నుండి విద్యార్థి ఉద్యమాలు, టిఆర్ఎస్ ఉద్యమం, తెలంగాణ జెఎసి ఉద్యమం, సామాజిక తెలంగాణ, ప్రజాస్వామిక తెలంగాణల కొరకు జరిగిన ఉద్యమాలు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, న్యాయవాదులు సాగించిన ఉద్యమాలు, ఆర్‌టిసి, సింగరేణి, విద్యుత్, తదితర కార్మిక శ్రేణులు చేసిన ఉద్యమాలు, వీటన్నింటి కారణంగా కాంగ్రెస్, టిడిపి నాయకులు చేసిన ఉద్యమాలు, సిపిఐ, సిపిఐ (ఎంఎల్) (న్యూడెమోక్రసీ) పార్టీలు చేసిన ఉద్యమాలు, సిపిఐ (మావోయిస్టు) పార్టీ, దాని పూర్వ రూపాల్లో కూడ, 1969 కాలం నుండి అందిస్తున్న మద్దతు, గత ఐదేళ్లుగా తెలంగాణలోని అన్ని సామాజిక శ్రేణులు, దాదాపు మినహాయింపు లేకుండా, చేసిన ఉద్యమాలు, అంతిమంగా, ప్రస్తుత ఉద్యమ కాలంలో, వేయికి పైగా జరిగిన విద్యార్థి యువజనుల బలిదానాలు, ఇవన్నీ కలిసి కాంగ్రెస్, బిజెపిల ముందు ఒక అనివార్యతను ఉంచాయి. ఆ అనివార్యత కారణంగానే ఆ పార్టీలు తెలంగాణ ఏర్పాటుకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకున్నాయి. కేంద్రంలో ఒకసారి అధికారాన్ని చవిచూసి, రెండుసార్లు అధికారాన్ని అందుకో లేకుండా పోయి, ఈ సారి అధికారం కోసం అర్రులు చాచి ఉన్న బిజెపి, కాంగ్రెస్ కంటే ముందుగా తెలంగాణకు అనుకూలంగా నిర్ణయం తీసుకుని, ఉద్యమంలో కూడ దిగింది. ఇందువలన ఆంధ్రప్రదేశ్‌లో ఓట్ల, సీట్ల పరంగా బిజెపి కోల్పోయేదేమీ లేదు. ఈ కారణంగా కనీసం తెలంగాణలోనైనా తమ పరిస్థితి మెరుగు పడుతుందని ఆ పార్టీ నాయకత్వం అనుకుని ఉండవచ్చును. ప్రతిపక్షంలో ఉండడం, రాష్ట్రంలో తమకు పోవడానికి ఏమీ ఉండకపోవడం అనే సౌకర్యాలు తెలంగాణ విషయంలో బిజెపి, కాంగ్రెస్ కంటే ముందుండడానికి కారణమయ్యాయి. గత రెండు పర్యాయాలు బిజెపిని నిలువరించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు, గత కొద్ది సంవత్సరాలుగా వరుసగా వెలుగులోకి వస్తున్న భారీ అవినీతి కుంభకోణాల కారణంగా తన ప్రతిష్ట బాగా దిగజారి ఉండడం, వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి మరణం తరువాత ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్‌లో అంతర్గతంగా తలెత్తిన సంక్షోభం, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు, జగన్‌ను జైల్లో ఉంచినా సీమాంధ్ర ప్రాంతంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి ఇంకా చెప్పుకోదగినంత ప్రభావం ఉండడం, తెలంగాణ ప్రాంత కాంగ్రెస్ నాయకులు కొందరు టిఆర్ఎస్‌లో చేరడం వీటన్నింటి నేపథ్యంలో, అంతిమంగానైనా, కాంగ్రెస్‌కు తెలంగాణకు అనుకూలంగా నిర్ణయం తీసుకోక తప్పలేదు.

ప్రజలు, ప్రజాస్వామ్యం, మెజారిటీ ప్రజల ఆకాంక్ష ప్రజాస్వామ్యంలో వీటికి అర్థం లేకుండా పోయింది. పార్టీలు, వాటి ప్రయోజనాలు, అవి అధికారంలోకి రావడం, ఉన్న అధికారాన్ని నిలుపుకోవడం మీదనే ఆధారపడి కోట్లాది ప్రజలకు వర్తించే నిర్ణయాలను రాజకీయ పార్టీలు

యుపిఎ-2 తప్పు మరే ఇతర పార్టీ నేతృత్వంలోని కూటమి ఉన్నా ఇదే పరిస్థితి. అనివార్యంగా ప్రజల నెత్తిన పన్నుల భారం తప్పదు. ప్రభుత్వాలు దొరికినంత దోచుకోక తప్పదు. ఈ అధికృత దోపిడి సజావుగా సాగేందుకు అన్ని రాజకీయ పార్టీల ధోరణి ఒక్కటే. కాదు అని ఎన్ని ప్రత్యామ్నాయాలు వల్లించినా అభివృద్ధి మాత్రం నేటిచందంగానే ఉంటుంది. వ్యవసాయ సంక్షోభం మరింత ముదిరి వ్యవసాయం సైతం కార్పొరేటీకరణకు బలికాక తప్పదు. ఈ విషయంలో ఇదివరకే టిడిపి నేత కుప్పం ప్రయోగం పేరున చవి చూపించారు. ఈ విపత్కర పరిస్థితులను ఎదుర్కోవాలంటే ప్రపంచీకరణను నిలిపివేయాలి, నిలదీయాలి. అందుకు చేవ ఉన్న శక్తులన్నీ చేష్టలడిగి పీలికల్లా చీలిపోయారు. శక్తిని కూడదీసుకునేందుకు మరింత సమయం అవసరం. ఆ సమయం చాలు పాలక వర్గాలకు మరింతగా పాతుకు పోయేందుకు.

భవిష్యత్ అంచనాలను మరింతగా పదునెక్కించగలిగితే, వెనుకబాటు నేపథ్యాన్ని హక్కుల ఉద్యమంగా మలిస్తే సన్వత్రా అభివృద్ధి సాధ్యం కాదా? అనువైన సమయంలోనే ప్రజాశక్తిని పదునెక్కిస్తే ఇంతటి ప్రజా ఉద్యమాల జోరు సరైన లక్ష్యాన్ని, గమ్యాన్ని ఎంచుకునేది కాదా? ప్రజా సంక్షేమం సాధ్యమయ్యేది కాదా? ప్రగతిశీల శక్తులు ఆలోచించాలి మరి. వీ

(రచయిత పాత్రికేయులు)

తీసుకుంటున్నాయి. తెలంగాణ విషయంలో కాంగ్రెస్, బిజెపి, టిడిపిలు ఆయా కాలాల్లో తీసుకున్న వేర్వేరు వైఖరులే ఇందుకు ప్రబల నిదర్శనం. 2004 ఎన్నికల సందర్భంగా తెలంగాణను ఇస్తానని నమ్మబలికిన కాంగ్రెస్, ఆ తరువాత వెనకడుగు వేసింది. 2009లో తెలంగాణను ఇస్తున్నానని ప్రకటించి, రెండు వారాల్లోనే మాట మార్చింది. ఈ నాలుగేళ్ల కాలంలో ఇన్ని పరిణామాలు జరిగితే గాని, ఇన్ని ఒత్తిళ్లు వస్తే గాని, ఇంత ఉద్యమ స్రవంతి నిరంతరాయంగా ప్రవహిస్తే గాని తెలంగాణను ఇవ్వడానికి కాంగ్రెస్ ముందుకు రాలేదు.

తెలంగాణ పట్ల బిజెపికి ఉన్న నిబద్ధత అధికారంతో నిమిత్తం లేనిది కాదు. ఆ పార్టీ పదే పదే చెప్పుకొన్నట్లు చిన్న రాష్ట్రాల ఏర్పాటుకు తాను వ్యతిరేకం కాకపోతే, తాను గతంలో కేంద్రంలో అధికారంలో ఉన్నప్పుడే, తన కాకినాడ తీర్మానాన్ని అమలు చేస్తూ, తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయవలసింది. కాని బిజెపికి ఆనాడు తెలంగాణ రాష్ట్రం కొరకు టిడిపిని, టిడిపితో పాటు కేంద్రంలో అధికారాన్ని కోల్పోవడం ఇష్టం లేదు. 2002లో గుజరాత్‌లో నరేంద్రమోడీ బిజెపి ప్రభుత్వ కనుసన్నల్లో జరిగిన ఊచకోత పట్ల నిరసన తెలిపిన చంద్రబాబు నాయుడుకు, బిజెపి తెలంగాణ ఇవ్వకపోవడంతో, సంతృప్తి కలిగింది. గుజరాత్ ఊచకోతల పట్ల చంద్రబాబు నాయుడు నిరసన దగ్గరే ఆగిపోవడంతో బిజెపికి సంతృప్తి కలిగింది. కేంద్రంలో బిజెపికి, రాష్ట్రంలో చంద్రబాబు నాయుడుకు అప్పటికి ఎవరి అధికారం వారికి నిలబడిపోయింది.

పదేళ్ల కింద అసెంబ్లీలో తెలంగాణ అనే పదాన్ని పలకగూడదని శాసించిన చంద్రబాబు నాయుడు ఇప్పుడు నేను తెలంగాణకు వ్యతిరేకం కాదని, తెలంగాణ ప్రజల ముందు చేతులు జోడించి, పదేపదే విజ్ఞప్తి చేసుకోవలసి వచ్చింది. తెలంగాణ ప్రజల ఆకాంక్షకు సంబంధించిన అభివ్యక్తీకరణను కూడ తొక్కిపట్టి, ఆంధ్రప్రదేశ్ అంతటా తన అధికార దర్పాన్ని నిరంతరాయంగా కొనసాగించాలని పదేళ్ల కింద చంద్రబాబు నాయుడు అనుకున్నాడు. విజన్ 2020ని కలగన్నాడు. కాని తెలుగు ప్రజలు, తెలంగాణ ప్రజలు ఆయనను అధికార పీఠం నుండి లాగి అవతల పడవేశారు. ఇప్పుడాయన సుమారు దశాబ్ద కాలంగా అధికార పీఠంకు దూరంగా ఉన్నారు. మండుటెండల్లో, కాళ్లు బొబ్బలెక్కినా ప్రజలను ప్రసన్నం చేసుకోవడానికి సుమారు మూడు వేల కిలోమీటర్లు నడిచారు. మరి ఇన్ని పరిణామాలు, ఇన్ని పరిస్థితులు కళ్ల ముందు కనిపిస్తున్నపుడు, కోల్పోయిన సింహాసనం పదే పదే కళ్ల ముందు కదలాడుతున్నపుడు, చంద్రబాబు నాయుడైనా సరే, తెలంగాణకు ఒప్పుకోకుండా ఉండలేరు కదా. కాని, బహుశా, చంద్రబాబునాయుడు ఉభయ భ్రష్టత్వాన్ని పొందనుండడమే ఆయనకు విషాదకరమైన విషయం.

2. తెలంగాణ వస్తోంది. కాని ఎటువంటి తెలంగాణ వస్తోంది? తెలంగాణను ఇస్తున్న వారు ఎందుకు, ఎలా ఇస్తున్నారో, తెలంగాణను ఇస్తామన్నవారు అందుకు ఏ నజరానా కావాలని అన్నారో, తెలంగాణను అడ్డుకుని, అడ్డు తొలగినవారు ఎందుకలా చేశారో చూశాం. తెలంగాణను తీసుకుంటున్నవారు ఎవరు?

బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా కొనసాగిన జాతీయోద్యమంలో అనేక పోరాట స్రవంతులు ఉన్నప్పటికీ, ప్రధాన పోరాట స్రవంతి కాంగ్రెస్ నాయకత్వంలో ఉన్నట్లుగానే, సీమాంధ్ర వలస పాలనకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమంగా చెప్పిన తెలంగాణ ఉద్యమంలో కూడ అనేక పోరాట స్రవంతులు ఉన్నప్పటికీ, ప్రధాన పోరాట స్రవంతి టిఆర్ఎస్ నాయకత్వంలో ఉంది.

తెలంగాణ ఉద్యమానికి సుదీర్ఘ చరిత్ర ఉంది. ఆంధ్ర రాష్ట్రంగా ఉన్న సీమాంధ్ర ప్రాంతాలను, హైదరాబాదు రాష్ట్రంగా ఉన్న తెలంగాణ ప్రాంతాన్ని కలిపి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా చేసే సమయంలోనే తెలంగాణ ప్రాంతంలో భయాలు, సందేహాలు, నిరసనలు, వ్యతిరేకతలు వ్యక్తమయ్యాయి. ఇవేవీ నిరాధారమైనవి కావని, వీటికి జవాబుగా ఇవ్వబడిన హామీలను చెత్తబుట్టలో పడేసినప్పుడే, స్పష్టమైంది. పెద్దమనుషుల ఒప్పందం అమలు కాకపోవడం, 1969 తెలంగాణ ఉద్యమం, 370 మంది ప్రాణ త్యాగం, ముల్కీ నిబంధనల రద్దు, రాష్ట్రపతి ఉత్తర్వుల ఉల్లంఘన ఇవన్నీ ఆ ఉద్యమ చరిత్రలో భాగం.

1995లో భువనగిరి సభ, 1996లో తెలంగాణ మహాసభ ఏర్పాటు, 1997లో వరంగల్‌లో ప్రజాస్వామ్య తెలంగాణ సదస్సు, 1998లో తెలంగాణ జనసభ ఏర్పాటు, 2006లో తెలంగాణ ఐక్యకార్యాచరణ కమిటీ ఏర్పాటు, 2010లో తెలంగాణ ప్రజా ఫ్రంట్, తెలంగాణ యునైటెడ్ ఫ్రంట్‌ల ఏర్పాటు ఇదంతా ఇప్పటి ఉద్యమ చరిత్రలో ఒక క్రమం. తెలంగాణ ప్రాంతానికి ఉన్న ఉజ్వల పోరాట వారసత్వాన్ని ఇప్పటి తెలంగాణ ఉద్యమంలో నిలిపి ఉంచడానికి, అందు కనుగుణమైన తెలంగాణ రాష్ట్రాన్ని సాకారం చేయడానికి ప్రయత్నించిన క్రమం ఇది. మార్క్సిస్టు రాజకీయ తాత్విక దృక్పథాన్ని స్థూలంగా స్వీకరించి కొనసాగిన ఉద్యమ క్రమం ఇది.

2001లో తెలంగాణ రాష్ట్ర సమితి (టిఆర్ఎస్) ఏర్పడిన తరువాత తెలంగాణ ఉద్యమం తెలంగాణ ప్రాంత దళారీ బూర్జువా భూస్వామ్య శక్తుల ఆధిపత్యంలోకి వెళ్లిపోయింది. ఈ ఆధిపత్య శక్తుల గౌరవ ప్రదమైన రూపంగా తెలంగాణ జెఎసి పని చేసింది. తెలంగాణ ప్రాంత మధ్య తరగతి విద్యావంతుల చైతన్యానికి సంఘటిత రూపంగా నిలిచిన తెలంగాణ జెఎసి తెలంగాణ ఉద్యమంలో ఉన్న పార్లమెంటరీ రాజకీయ పార్టీల మధ్య సమన్వయ కర్త పాత్రను శక్తివంచన లేకుండా పోషించింది. తెలంగాణ ఉద్యమం నుండి ఏ విధమైన రాజకీయ ప్రతిఫలాన్ని పొందగలమని చూసే రాజకీయ పార్టీల యావకు దూరంగా, సాధారణంగా, తెలంగాణ జెఎసి ఉద్యమాన్ని నిర్మించింది. అయితే తెలంగాణ జెఎసి నాయకత్వంలో కనిపించిన వారు ఎవరైనా రేపు ఏదైనా రాజకీయ ప్రతిఫలాన్ని అందుకుంటే దాన్ని మినహాయింపుగా చూడాలి. బూర్జువా ఉద్యమ పరిమితుల్లో, తెలంగాణ ఉద్యమంలో పాల్గొంటున్న రాజకీయ పార్టీల్లో స్పష్టమైన పెడధోరణులు కనిపించినపుడు నిరసన వ్యక్తమై, ఆ పెడధోరణుల నుండి బయట పడడానికి తెలంగాణ జెఎసి వైపు చూసిన చూపు దాని మధ్యస్థ స్థితికి సూచిక.

తెలంగాణ ప్రాంతంలోని విప్లవ రాజకీయోద్యమం వలన, వివిధ అస్తిత్వ ఉద్యమాల వలన, వివిధ సామాజిక శ్రేణులలో కొనసాగుతున్న ప్రజా పోరాటాల వలన తెలంగాణ సమాజం ఒక స్థాయి రాజకీయ చైతన్యాన్ని కలిగి ఉంది. ఈ చైతన్యం తెలంగాణ ఉద్యమంలో, ఇటీవలి సంవత్సరాలలో, నిరంతరాయంగా పోర్లాడింది. దీని ఫలితంగా తెలంగాణ ఉద్యమంలో విస్తృతమైన చర్చ జరిగింది. దళితులు, గిరిజనులు, మైనారిటీలు, స్త్రీలు, తదితర సామాజిక శ్రేణులు తమ సమస్యలను తెలంగాణ ఉద్యమంలోకి తెచ్చారు. తమ ఆకాంక్షలను తెలంగాణ ఉద్యమంలో భాగం చేయడానికి ప్రయత్నించారు. ఇన్ని సమస్యలను గుర్తించగల స్థితిలో, ఇన్ని ఆకాంక్షలను ఇముడ్చుకొనగల స్థితిలో ఆధిపత్య రాజకీయ శక్తుల చేతుల్లో ఉద్యమం ఉన్నదా అనే దానితో నిమిత్తం లేకుండా ఈ సమస్యలు, ఆకాంక్షలు తెలుగు సమాజం ముందుకు వచ్చాయి. ఈ సమస్యలతో, ఆకాంక్షలతో అల్లుకొని పోయిన

ఒక సంఘటిత నిర్మాణయుత ఉద్యమ రూపం లేకపోయినప్పటికి, విస్తృతంగా కొనసాగిన ఈ చర్చ సామాజిక తెలంగాణ అనే భావనను బలంగా ముందుకు తెచ్చింది.

కాని అంతిమంగా ఉద్యమంలో తెలంగాణ ప్రాంత అస్తిత్వ చైతన్యమే బలీయంగా ముందుకు వచ్చింది. 2009 నుండి అది జాతి చైతన్య స్థాయికి ఎదిగింది. దళారీ బూర్జువా భూస్వామ్య శక్తులకు ఈ పరిస్థితి బాగా సౌకర్యంగా అందివచ్చింది. ఆ శక్తులు ఈ చైతన్యాన్ని మరింతగా సంఘటిత పరిచాయి. ఈ చైతన్యాన్ని తమకు అనువుగా వాడుకునే రాజకీయ శక్తులకు భౌగోళిక తెలంగాణ మాత్రమే లక్ష్యంగా ఉంటుంది. అయితే ఈ శక్తులు అరచేతిలో వైకుంఠాన్ని చూపించాయి. వివిధ సామాజిక శ్రేణులు, అంతిమంగా ప్రజలందరూ ఎదుర్కొనే సమస్య లన్నింటికి పరిష్కారాన్ని తెలంగాణ ఏర్పాటులోనే చూపించాయి. తెలిసో, తెలియకో, ఒక ప్రవాహంలాగా సాగుతున్న ఉద్యమానికి ఎడంగా ఉండలేకనో, తమకు అర్థమవుతున్న దానిని చెపితే వినిపించుకునే స్థితిలో ఎవరూ కనిపించనందువల్లనో తెలంగాణ ఏర్పాటులోనే, భౌగోళిక తెలంగాణ ఏర్పాటులోనే, తమ సమస్యలన్నింటికి పరిష్కారం ఉందన్నట్లుగా ఉద్యమంలో పాల్గొన్నారు. తెలంగాణ ప్రాంతంలో 2009 నుండి అదే జరిగింది. తెలంగాణ ప్రాంతంలో ప్రతి ఊరికి ఒక జెఎసి ఏర్పడింది. పట్టణాల్లో వాడవాడలా జెఎసిలు ఏర్పడ్డాయి. వృత్తుల వారీగా జెఎసిలు ఏర్పడ్డాయి. తెలంగాణ ఉద్యమంలో పాల్గొనకపోవడం పాపమన్నట్లుగా, లోపమన్నట్లుగా ప్రజలందరూ పాల్గొన్నారు. దువ్వూరి రామిరెడ్డి ఒక కవితలో సమసమాజాన్ని కలగంటూ రాజు, సేవకుడు భేదభావం తొలగిపోయి సమబంతిలో కూర్చున్నారని చెప్పినట్లుగా, తమ మధ్య ఉన్న వైరుధ్యాలను మరిచిపోయి విభిన్న సామాజిక శ్రేణులు కలిసికట్టుగా తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నాయి. ప్రైవేట్ కళాశాలలు పెట్టి విద్యావ్యాపారం చేస్తున్న యజమానులు, ఆ కళాశాలల్లో శ్రమ దోపిడీకి గురవుతున్న అధ్యాపకులు, డబ్బు పెట్టి ఆ కళాశాలల్లో విద్యను కొనుక్కుంటున్న విద్యార్థులు అందరూ కలిసి ఒకే ప్రదర్శనగా ఒకే తెలంగాణ కొరకు ఉద్యమంలో పాల్గొంటే బాగానే ఉంటుంది. కాని ఈ ఉద్యమ ఫలితంగా రేపు వచ్చే భౌగోళిక తెలంగాణ ఏకకాలంలో ఈ మూడు సామాజిక శ్రేణుల ఆకాంక్షలను నెరవేర్చలేదు కదా. ప్రధాన ఉద్యమ ప్రవంతి మీద ఆధిపత్యం కలిగి ఉన్న శక్తులను గమనంలో ఉంచుకొని చూస్తే రేపు వచ్చే తెలంగాణ విద్యా వ్యాపారులైన యజమానుల ప్రయోజనాలను నెరవేర్చేది గానే ఉంటుందని అర్థమవుతుంది.

సమాజంలోని విభిన్న వర్గాల ఆర్థిక ప్రయోజనాలకు బలమైన వ్యక్తీకరణే రాజకీయాలు. భిన్న వర్గాలకు ప్రయోజనకరమైన రాజకీయాలు భిన్నంగానే ఉంటాయి, ఒకటిగా ఉండవు. పాలకవర్గ రాజకీయాలు సమాజంలో వర్గాలు లేనట్లుగా, మొత్తం సమాజానికంతటికి మేలు చేసే రాజకీయాలు తమవేనన్నట్లుగా వ్యవహరిస్తాయి. ఉద్యమాల చరిత్రలో ఈ ధోరణి కొత్తదేమీ కాదు. పాలకవర్గాల రాజకీయాల అదుపులో ఉద్యమాలు ఉన్నపుడు ఆ ఉద్యమాలు సాధించే విజయాలు ప్రజలకు, పీడిత ప్రజలకు, తొలిమెట్టు విజయాలుగానే ఉంటాయి. భౌగోళిక తెలంగాణ ఏర్పడడంతో టిఆర్ఎస్, బిజెపి లాంటి పాలకవర్గ రాజకీయ పార్టీల లక్ష్యం నెరవేరుతుంది. కాని ప్రజలకు మెరుగైన జీవితాన్ని అందించే సమాజం రావాలంటే, గుణాత్మకమైన మార్పును అందించే సమాజం రావాలంటే, సామాజిక తెలంగాణ వైపు, ప్రజాస్వామ్య తెలంగాణ వైపు ఉద్యమాలు పురోగమించాలి. పాలక వర్గ రాజకీయాల పరిమితిని అధిగమిస్తూ, వ్యతిరేకిస్తూ తెలంగాణ ఉద్యమంలో ఉన్న ఇతర అస్తిత్వ ఉద్యమ శక్తుల ముందు, మార్క్సిస్టు రాజకీయ తాత్విక దృక్పథంతో పని చేసే శక్తుల ముందు ఈ ఉద్యమ కర్తవ్యాలు మిగిలి ఉన్నాయి.

3. తెలంగాణ తనను తాను మళ్లీ ఒక అస్తిత్వంగా చూసుకోవడానికి ఆరు దశాబ్దాల కాలం పట్టింది. అయినా రేపు వచ్చే తెలంగాణ 1948 నుండి 1956 వరకు అస్తిత్వంలో ఉన్న తెలంగాణ కాదు. ఆ ఎనిమిది సంవత్సరాల హైదరాబాదు రాష్ట్రంలో ఉన్న మరాఠీ, కన్నడ ప్రాంతాల గురించి మాట్లాడడం లేదు. అవి లేని, హైదరాబాదు ఉన్న తెలంగాణ కూడ రేపు రాబోవడం లేదు. హైదరాబాదు పదేళ్లు ఉమ్మడి రాజధానిగా ఉంటుందని అంటున్నారు. ఈ లోగా సీమాంధ్రకు కొత్త రాజధానిని నిర్మించాలని అంటున్నారు. పదేళ్ల తరువాత హైదరాబాదు ఉమ్మడి రాజధానిగా ఉండకపోవడం, అది తెలంగాణ రాజధానిగానే ఉండడం, ఈలోగా సీమాంధ్రకు కొత్త రాజధానిని నిర్మాణం చేయడం ఇప్పుడు చెపుతున్నట్లుగానే ఈ ప్రభుత్వాలు, వాటిని నడిపించే రాజకీయ పార్టీలు చేస్తాయని నమ్మగలమా? ఈ ప్రభుత్వాలు, పార్టీలు తాము ఇచ్చిన హామీలను తప్పనిసరిగా నెరవేర్చాలని ఎప్పుడైనా అనుకున్నాయా? ఈ విషయంలో తెలంగాణకే ఆరు దశాబ్దాల చేదు అనుభవం ఉంది కదా. పది సంవత్సరాల కాలం పూర్తయ్యే నాటికి గడువును పొడిగించకుండా ఉంటాయా? హైదరాబాదును ఉమ్మడి రాజధాని స్థితి నుండి కేంద్రపాలిత ప్రాంత స్థితికి మార్చుతామని అనకుండా ఉంటాయా?

ఈ ప్రభుత్వాలకు, ఈ పార్టీలకు అంతిమంగా కావలసింది ప్రజలు కాదు. తమకు ఓట్లు వేసి గెలిపించడానికే ప్రజలు కావాలి. అందుకు కూడ అవి ఎన్నో మాయోపాయాలను పన్నుతాయి. వాటికి కావలసింది పెట్టుబడికి సేవ చేయడం. పెట్టుబడి అదుపులో అవి పని చేస్తున్నాయి. ప్రపంచీకరణ దశలో ఈ వాస్తవం మరింత నగ్నంగా కనిపిస్తోంది. ఇది నిజం కాకపోతే యుపిఎ పాలనలో బయటపడుతున్న అవినీతి కుంభకోణాలను అర్థం చేసుకోవడం కష్టం. వై.ఎస్. రాజశేఖర రెడ్డి పాలనను, జగన్ వ్యవహారాన్ని అర్థం చేసుకోవడం కష్టం.

హైదరాబాదులో పెట్టుబడులు ఉన్నాయి. అవి కార్పొరేట్ పెట్టుబడులు. అవి ఆశ్రిత పెట్టుబడులు. అవి దళారీ పెట్టుబడులు. అవి ఆంధ్రుల పెట్టుబడులు. ఇన్ని రకాల పెట్టుబడులతో, మేం పెట్టుబడులు పెట్టి అభివృద్ధి చేశామని ఆంధ్రా పెట్టుబడిదారీ సంపన్న వర్గాలు చెప్పినట్లుగా, హైదరాబాదు అభివృద్ధి చెందింది. హైదరాబాదు అభివృద్ధి సారాంశంలో పెట్టుబడుల అభివృద్ధి. ఈ అభివృద్ధి కొరకు ఆ పెట్టుబడులు హైదరాబాదు ప్రజల, రంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల ప్రజల జీవనసారాన్ని పీల్చుకున్నాయి. వాళ్ల అస్తిత్వాన్ని దయనీయంగా మార్చివేశాయి. హైదరాబాదు మీద తమకు హక్కు ఉందని చెప్పుకుంటున్న ఈ ఆంధ్రా పెట్టుబడిదారీ సంపన్న వర్గాలు హైదరాబాదు అభివృద్ధిలో ఉన్న చీకటిని దాచి, వెలుతురునే చూపెడుతున్నాయి.

ఈ హైదరాబాదును, దాని అభివృద్ధిని, అక్కడి పెట్టుబడులకు ఆ అభివృద్ధి కల్పిస్తున్న సౌకర్యాన్ని వదులుకోవడం ఇష్టం లేకనే హైదరాబాదును ఇప్పుడు ఉమ్మడి రాజధాని అని అన్నారు. రేపు కేంద్ర పాలిత ప్రాంతమని అనవచ్చును. టిడిపి పాలనా కాలం నుండి స్థిరంగా, వేగంగా ఇప్పటి హైదరాబాదు అభివృద్ధి జరుగుతూ వచ్చింది. గత రెండు దశాబ్దాల ప్రపంచ బ్యాంకు నిర్దేశిత ఆర్థిక సంస్కరణల విధానం

ఆ అభివృద్ధికి చెప్పలేనంత ఊతం ఇచ్చింది. ఈ ఆర్థిక సంస్కరణలతో చెట్టాపట్టాలేసుకుని వచ్చిన ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం హైదరాబాదు అభివృద్ధిని ఇప్పటి స్థితికి తెచ్చింది. హైదరాబాదు మీద తెలంగాణకు ఉన్న ప్రేమలో చరిత్రకు సంబంధించిన భావోద్వేగం ఉంది. హైదరాబాదు అభివృద్ధిలో ఇవాళ పెట్టుబడి నిర్వహిస్తున్న దుర్మార్గమైన, అమానుషమైన పాత్రను ఆనాటి ఫ్యూడల్ రాచరికం నిర్వహించలేదన్న కొన్ని జ్ఞాపకాలు ఈనాటి అస్తిత్వ ఉద్యమ సందర్భంలో హైదరాబాదును ప్రీతిపాత్రం చేస్తున్నాయి. ఈ ధోరణిలో ఉండే అజాగరూకత వల్లనే అక్కడక్కడ కనిపించిన ఫ్యూడల్ ఔదార్యం, ఫ్యూడల్ దోపిడీ హింసలను మరుగు పరిచి, నిజాం కీర్తన వైపు దారి చూపించింది. నిజాం కీర్తన చేయవలసిందే అయితే, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం చేయగూడనిదా?

చరిత్ర నుండి తెలంగాణకు సంక్రమించిన హైదరాబాదును తెలంగాణ ప్రజలకు సన్నిహితం చేయవలసి ఉంది. నిన్నటి ఫ్యూడల్ దోపిడీ పీడనల నుండి, నేటి పెట్టుబడి అమానుషత్వం నుండి హైదరాబాదును విముక్తం చేసి, తెలంగాణ ప్రజలకు దాన్ని సన్నిహితం చేయవలసి ఉంది. ప్రజాస్వామ్య తెలంగాణ కొరకు నిర్వర్తించవలసిన కర్తవ్యాలల్లో ఇదొక భాగమవుతుంది.

4. ప్రస్తుత తెలంగాణ ఉద్యమంలో బలీయమైన శక్తిగా ఉన్న టిఆర్ఎస్ తెలంగాణ ప్రాంత పాలక సంపన్న వర్గాలను విజయవంతంగా సంఘటితం చేసిన రాజకీయ పార్టీ. ఇది ఆంధ్రప్రదేశ్‌లోనూ, దేశంలోనూ మొత్తంగా ఉన్న పాలక సంపన్న వర్గాల్లోనే ఒక భాగంగా ఉంటూ, విడిగా కనిపిస్తున్న ఒక ముక్క. 1980లలో కోస్తాంధ్ర సంపన్న వర్గాలను సమీకృతం చేస్తూ, తెలంగాణ ప్రాంతం నుండి ఈ పరిణామంలో ఇమడగల వారిని ఇముడ్చుకుంటూ ఏర్పడిన టిడిపి నుండే టిఆర్ఎస్‌ని ఏర్పాటు చేసిన కెసిఆర్ వచ్చారు. ఆయన కొత్త పార్టీని పెట్టారు, కాని కొత్త రాజకీయాలను తేలేదు. తనది ఉద్యమ పార్టీ అని చెప్పుకుంటూ ఆయన నడిపించిన ఉద్యమం ఆయన రాజకీయాల పరిధిని ఎప్పుడూ దాటలేదు. ఆయన రాజకీయాల లక్ష్యం చాల పరిమితమయింది. ఆంధ్రా పెట్టుబడిదారీ సంపన్న వర్గాల చేతుల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలంగాణ పెట్టుబడిదారీ సంపన్న వర్గాల ప్రయోజనాలను ఈడేర్చలేదు. ఈడేర్చే అవకాశం కనిపించలేదు. అభివృద్ధి మార్గంలో లభిస్తున్న దోపిడీ సంపదకు తెలంగాణ పెట్టుబడిదారీ సంపన్న వర్గాలు దూరంగానే ఉండిపోవలసి వస్తున్నది. ఈ సమస్యను పరిష్కరించడం కొరకు టిఆర్ఎస్ ఏర్పడింది. టిఆర్ఎస్‌కి ఆంధ్రా పెట్టుబడితోనే వైరుధ్యమున్నది కాని అసలు పెట్టుబడితో కాదు. ఆశ్రిత పెట్టుబడి, దళారీ పెట్టుబడి, వెన్నెముక లేని పెట్టుబడి ప్రబలమైన కాలంలో ఈ వైరుధ్యం కూడ ఎంత వరకు నిలబడుతుందో, ఎంత కాలం నిలబడుతుందో చూడాలి. ఈ వైరుధ్యాన్ని పరిష్కరించుకోవడానికి టిఆర్ఎస్‌కి తెలంగాణ ప్రభుత్వం కావాలి. ఆ తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ పెట్టుబడిదారీ సంపన్న వర్గాలకు చెందిన పనులను చేసిపెట్టడానికి తెలంగాణ రాష్ట్రం కావాలి.

టిడిపి నుండి వచ్చిన, టిఆర్ఎస్‌ని ఏర్పాటు చేసిన కెసిఆర్ కాంగ్రెస్‌తో కలిశారు, విడిపోయారు. మళ్లీ పూర్తిగా కలిసి పోతానని అంటున్నారు. ఒక విడి అస్తిత్వంగా ఉన్న తెలంగాణ ఆంధ్రప్రదేశ్‌లో కలిసిపోవడానికి నెహ్రూ కాలం నాటి కాంగ్రెస్ రాజకీయాలే కారణం కదా. తెలంగాణ పోరాటాన్ని అణచివేసింది, తెలంగాణ ప్రజలకు ద్రోహం చేసింది ఇందిర కాలం నాటి, సోనియా కాలం నాటి కాంగ్రెస్ రాజకీయాలే కదా. రాజకీయ వాద వివాదాల్లోకి జుగుప్సాకరమైన భాషను ప్రవేశపెట్టిన కెసిఆర్ తెలంగాణ ఏర్పాటుకు తాను నిర్ణయాత్మకమని భావించిన సోనియాను ఏనాడైనా పల్లెత్తుమాట అన్నారా?

టిఆర్ఎస్ ఆదానప్రదానాలను చూడండి. కాంగ్రెస్ నుండి, టిడిపి నుండి టిఆర్ఎస్‌లోకి వచ్చినవారు తమ పూర్వాశ్రమాల్లో ఏవో సమస్యలు వచ్చి, ప్రాధాన్యాన్ని కోల్పోయి, గౌరవాన్ని వెదుక్కుంటూ వచ్చిన వాళ్లే. గీత దాటక ముందు వాళ్లకు టిఆర్ఎస్‌లో, కెసిఆర్‌లో కనిపించిన లోపాలు గీత దాటాలనుకున్న తరువాత కనిపించకుండా పోయాయి. అంతకు ముందు ఒకరి మీద ఒకరు చేసుకున్న విమర్శలు వీళ్ల తమ కోసం ఏదో చేస్తున్నారని ప్రజలు అనుకోవడం కొరకు మాట్లాడుకున్న మాటలుగా మిగిలి పోయాయి. టిఆర్ఎస్ నుండి కాంగ్రెస్, టిడిపిలకు పోయిన వాళ్లకు ఆ పోకడలో ఎలాంటి అసౌకర్యం కలగలేదు.

2004 నుండి కొంతకాలంపాటు రాష్ట్ర మంత్రి వర్గంలో చేరిన టిఆర్ఎస్‌కి చెందిన మంత్రుల వ్యవహార శైలి, అందులో కొంతమంది అవినీతి ఆరోపణల్లో కూరుకుపోయిన తీరు చూస్తే టిఆర్ఎస్‌కి భిన్నమైన, మెరుగైన రాజకీయ సంస్కృతి ఏదైనా ఉందని అనగలమా?

ఆంధ్ర పెట్టుబడిదారీ సంపన్న వర్గాల రాజకీయాధిపత్యం గురించి, వనరుల దోపిడీ గురించి మాట్లాడిన కెసిఆర్ కార్పొరేట్ పెట్టుబడులు చేస్తున్న దోపిడీ గురించి ఎప్పుడైనా మాట్లాడారా? ఆంధ్రా పెట్టుబడి చేస్తున్న తెలంగాణ వనరుల దోపిడీని క్షేత్రస్థాయిలో అడ్డుకోవడానికి కెసిఆర్ ఎప్పుడైనా ప్రయత్నించారా? లేదు కదా. ఆయనవి దోపిడీ ఉండకూడదని చెప్పే రాజకీయాలు కావు. ఇవాళ ఆంధ్రా పెట్టుబడి చేస్తున్న పని రేపు తెలంగాణ పెట్టుబడి చేస్తే ఆయనకేమీ అభ్యంతరం ఉండదు. అప్పుడది, బహుశా, తెలంగాణ అభివృద్ధి అవుతుంది. మరి ఈ ఇంటి దీపాన్ని మనం ముద్దు పెట్టుకుందామా?

అందువలన టిఆర్ఎస్ రాజకీయాలు కాంగ్రెస్, టిడిపిల రాజకీయాల కంటే ఏ విధంగానూ భిన్నమైన రాజకీయాలు కావు. అయితే ఆ రాజకీయాల చలనానికి ఇప్పుడు ఒక భౌగోళిక పరిధి ఉంటుంది. ఆ భౌగోళిక పరిధిలోని తెలంగాణ పాలక వర్గాలకు ఎక్కువగా, తెలంగాణ ప్రజలకు తక్కువగా, గతంలో కంటే, కొన్ని అవకాశాలు పెరుగుతాయి.

5. విప్లవోద్యమంలో తెలంగాణ నాడు, నేడు నెత్తురోడిన నేల. ఆ విప్లవోద్యమ చైతన్యం తెలంగాణ ప్రజల్లో లోతుగానే కాదు, బహుళంగానూ, విస్తృతంగానూ కనిపిస్తున్నది. తెలంగాణలో అనేక అస్తిత్వ ఉద్యమ చైతన్యాలు ఇవాళ చలన శీలంతో ఉన్నాయి. ఈ చైతన్యాలే ఒక సామాజిక తెలంగాణ భావనను రూపు కట్టించాయి. ఈ అస్తిత్వ ఉద్యమ చైతన్యాలు తమ సామాజిక శ్రేణులకు చెందవలసిన ప్రయోజనాల గురించి మాత్రమే సాధారణంగా మాట్లాడుతుంటాయి. ఆ ప్రయోజనాలు సామాజిక న్యాయం పేరిట వ్యవహరింపబడతాయి. సామాజిక న్యాయంగా చెప్పుతున్నది ఆయా సామాజిక శ్రేణులకు సంబంధించిన ప్రయోజనాలే అయినందువలన అది మొత్తం సమాజానికి సంబంధించిన న్యాయం కాకుండా పోతున్నది. మొత్తం సమాజానికి సంబంధించిన న్యాయమనే భావనతో నిమిత్తం లేకుండా, అస్తిత్వ ఉద్యమాల కారణంగా ఉనికిలోకి వచ్చిన వేర్వేరు సామాజిక న్యాయాలు, ఉద్యమ కాలంలోనూ, ఆ ఉద్యమం జరుగుతున్న ప్రాంతంలోనూ, ఆ ఉద్యమం సమాజం ముందుకు తెచ్చిన విలువకు భిన్నంగా, ఎవరి ప్రయోజనాలు వాళ్లు చూసుకునే స్థితి తెలంగాణ ప్రాంతంలో కూడ ఏర్పడిందేమోననిపిస్తున్నది.

(ఇంకా ఉంది)

(రచయిత ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు) వీ

ఈ విపరిణామాల అర్థమేమిటి?

కాంగ్రెస్ తీర్మానంలోని అనుమానాస్పద అంశాలను వివరిస్తూ, కోస్తా, రాయలసీమ ప్రజల ఆందోళనలకు తగిన జవాబులు అన్వేషించాలంటున్నారు **ఎన్. వేణుగోపాల్**

జూలై 30న కేంద్ర ప్రభుత్వాన్ని నడుపుతున్న యునైటెడ్ ప్రోగ్రెసివ్ అలయన్స్ (యుపిఎ), కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సిడబ్ల్యుసి) సమావేశాలలో జరిగిన నిర్ణయాలు, సిడబ్ల్యుసి చేసిన తీర్మానం ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో, సమాజంలో పెను మార్పులకు, అనేక విపరిణామాలకు కారణమయ్యాయి. ఆ తీర్మానం వెలువడిన రోజు నుంచి ఇది రాస్తున్న ఆగస్ట్ 27 దాకా నాలుగు వారాలుగా రాష్ట్రం ఆందోళనలతో, ప్రతి ఆందోళనలతో, వాదవివాదాలతో, అబద్ధాలతో, అర్ధసత్యాలతో, బెదిరింపులతో, దుర్భాషలతో, జుగుప్సాకరమైన ప్రదర్శనలతో, 'అన్ని హక్కులూ మాకే, అవతలి వాళ్లకు ఏ హక్కులూ వద్దు' అనే అప్రజాస్వామిక ప్రకటనలతో అట్టుడికి పోతున్నది. గొప్ప ప్రజా ఉద్యమాల చరిత్ర, వారసత్వం ఉన్న తెలుగు జాతి తన చరిత్రకు తానే తూట్లు పొడుచుకునేలా ప్రవర్తిస్తున్నది. అయితే ఈ స్థితి ఎక్కువ కాలం ఉండకపోవచ్చు. ఇవాళ ప్రతీప ఉద్యమాలలో ఉన్న ప్రజలు తమను రెచ్చగొట్టి, ముందుకు తోస్తున్న నాయకుల స్వార్థ ప్రయోజనాలను, వారు ప్రచారం చేస్తున్న అబద్ధాల అసలు నిజాలను గుర్తించడం ఇవాళ కాకపోతే రేపు జరుగుతుంది. ఈలోగా ఈ నాలుగు వారాల విపరిణామాలను వస్తుగతంగా పరిశీలించి ఎక్కడ ఏమి జరిగిందో అర్థం చేసుకోవలసి ఉంది.

జులై 30 సమావేశాలలో కాంగ్రెస్ పార్టీ అనుసరించిన వైఖరి అభ్యంతరకరంగా, అక్రమంగా, రెండు ప్రాంతాలకూ అవమానకరంగా ఉంది. ఆ వైఖరిని తెలంగాణ ప్రాంతానికి అనుకూలమైనదిగా వ్యాఖ్యానించి, తమ ప్రాంత ప్రజలను రెచ్చగొట్టడానికి కోస్తా, రాయలసీమ నాయకులు ప్రయత్నిస్తున్నారు. కనుక ఆ రోజు జరిగిన పరిణామాల నుంచే ఈ వివరణ ప్రారంభించడం ఉచితం. అప్పటికి వారం, పది రోజులుగా వీలయినంత వేడి రాజేసి, అటూ ఇటూ భావోద్వేగాలు, ప్రకటనలు, ఖండనలు రెచ్చగొట్టి కాంగ్రెస్ అధిష్ఠాన వర్గం జూలై 30 మధ్యాహ్నం యుపిఎ సమన్వయ సమితిని సమావేశపరచింది. సిడబ్ల్యుసి సమావేశం ఆ సాయంత్రం జరుగుతుందని నిర్ణయించింది. మొట్టమొదట ఇది అనుచితమైన పద్ధతి. కాంగ్రెస్ పార్టీ యుపిఎలో పెద్ద పార్టీ అయినప్పటికీ అది యుపిఎలో అనేక భాగస్వామి పక్షాలలో ఒకటి మాత్రమే. అంటే మొదట కాంగ్రెస్ సమావేశం జరిగి అక్కడ తీసుకున్న నిర్ణయమేదైనా అంతకన్న పెద్ద కూటమి సమావేశం ముందుకు వెళ్లవలసి ఉంటుంది. కాని ముందు జరగవలసిన సమావేశం తర్వాతా, తర్వాత జరగవలసిన సమావేశం ముందూ జరిగిపోయాయి. ఇంతకూ సమన్వయ సమితి సమావేశంలో ఏమి చర్చించారో, ఏమి తీర్మానించారో ఇప్పటికీ బయటపడలేదు. అది తెలంగాణకు అనుకూలంగా ఏకగ్రీవ తీర్మానం చేసిందనే మాట మాత్రమే బయటికి వచ్చింది.

ఆ తర్వాత జరిగిన సిడబ్ల్యుసి సమావేశంలో ఒక తీర్మానం ఆమోదించారని, పత్రికాసమావేశంలో కాంగ్రెస్ కార్యదర్శి అజయ్ మాకెన్, ఆంధ్రప్రదేశ్ వ్యవహారాల బాధ్యుడు దిగ్విజయ్ సింగ్ ప్రకటించారు. ఆ తీర్మానం ప్రతిని పత్రికా ప్రతినిధులకు అందజేశారు. అందులో ఒక పేజీ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షల పట్ల కాంగ్రెస్ స్పందనల చరిత్ర, మరొక పేజీ తీర్మానం ఉన్నాయి. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షల చరిత్రను కాంగ్రెస్ తనకు తోచినట్టుగా, తనకు అనుకూలంగా రాసుకున్నదనేది పెద్ద విషయం కాదు గాని, ఆ చరిత్ర ఏకరవు దాని రాజకీయ ప్రయోజనాలకు అద్దం పడుతుంది. ఇక తీర్మానంలో సిడబ్ల్యుసి రాజ్యాంగబద్ధంగా తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసే చర్యలు తీసుకొమ్మని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నదనే వాక్యంతో పాటుగా కొన్ని అభ్యంతరకరమైన, అస్పష్టమైన, అపార్థానికి తావివ్వగల వాక్యాలు కూడ ఉన్నాయి. ఇంతకూ ఈ తీర్మానానికి కాంగ్రెస్ నాయకులు ప్రచారం చేస్తున్న, కొందరు తెలంగాణ వాదులు కూడ అమాయకంగా నమ్ముతున్న ప్రాధాన్యత ఏమీ లేదు. నిజం చెప్పాలంటే 2009 డిసెంబర్ 9న కేంద్ర హోం మంత్రి చేసిన ప్రకటన ఈ తీర్మానం కన్న పైస్థాయిది. అది ప్రభుత్వం తరఫున, రాష్ట్రాల ఏర్పాటుకు బాధ్యత వహించే హోం మంత్రి చేసిన ప్రకటన. మరి ఆ ప్రకటనకే దిక్కు లేనప్పుడు, ఆ ప్రకటననే వెనక్కి తీసుకున్నప్పుడు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ ఒక పార్టీ చేసిన తీర్మానానికి పెద్ద ప్రాధాన్యత లేదు.

ఈ తీర్మానం తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసే చర్యలు తీసుకొమ్మని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది గాని ఆ చర్యల ప్రక్రియకు ఎటువంటి కాల పరిమితిని సూచించలేదు. పాలక కూటమి సమావేశం కూడ అప్పటికే ముగిసింది గనుక, ప్రభుత్వం తమ నాయకత్వంలోనే ఉన్నది గనుక, ఇటువంటి ప్రక్రియకు సాధారణంగా ఎంత వ్యవధి అవసరమో కాంగ్రెస్ కు తెలుసు గనుక ఆ కాల పరిమితిని కూడ సూచించడం, గత చరిత్ర నేపథ్యంలో దాన్ని ఇంకా వేగవంతం చేయమని అడగడం కాంగ్రెస్ బాధ్యత. కాని కాంగ్రెస్ చాల తెలివిగా, బహుశా కుట్రపూరితంగా ఆ బాధ్యత నుంచి తప్పించుకున్నది. అది ఉద్దేశపూర్వకం గానే కాలపరిమితి సూచించలేదని అనడం ఎందుకంటే, ఆ తర్వాత వాక్యంలోనే మరొక పని సూచించి 'నిర్దిష్ట కాల పరిమితి' లోపల ఆ పని పూర్తి చేయాలని సూచించింది. మొదటి పెద్ద పనికి అవసరం లేని కాలపరిమితి, రెండోదీ, మొదటి పనిలో భాగమైనదీ అయిన చిన్న పనికి

ఎందుకు అవసరమైంది? ఆ పని ఏమంటే, 'నదీజలాల పంపిణీ, విద్యుత్ ఉత్పాదన, పంపిణీ, మూడు ప్రాంతాల లోని నివాసులందరి రక్షణ, భద్రతలు, ప్రజలందరి ప్రాథమిక హక్కుల హామీ ఇవ్వడానికి నిర్దిష్ట కాలపరిమితితో తగిన వ్యవస్థలను నిర్మించాలని' కూడ తీర్మానం చెప్పింది. రాష్ట్రం ఏర్పాటుతో సహజంగా, అనివార్యంగా జరిగిపోయే పనులకేమో నిర్దిష్ట కాలపరిమితి, రాష్ట్ర ఏర్పాటుకేమో కాలపరిమితి లేదు. ఇదీ కాంగ్రెస్ చాణక్యం.

ఆ తీర్మానమే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత పది సంవత్సరాల కొరకు హైదరాబాదును రెండు రాష్ట్రాల ఉమ్మడి రాజధానిగా ప్రకటించమని, ఆ పది సంవత్సరాలలో హైదరాబాదు నుంచి రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు సమర్థంగా పనిచేయడానికి అవసరమైన చట్టపరమైన, పాలనాపరమైన చర్యలు తీసుకొమ్మని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది.

ఇది మాటల గారడీ తప్ప మరేమీ కాదు. రెండు రాష్ట్రాలకు ఉమ్మడి రాజధాని అనేదే ఒక అబద్ధం. అది చరిత్రలో ఎప్పుడూ జరగలేదు. నైసర్గికంగా కుదరదు. పాలనాపరంగా చిక్కులకు కారణమవుతుంది. ఒక రాష్ట్రాన్ని విభజించి రెండు రాష్ట్రాలుగానో, మూడు రాష్ట్రాలుగానో ఏర్పరచినప్పుడు కొత్త రాష్ట్రాలకు కొత్త రాజధానులను కల్పించడం ఆనవాయితీ. పాత రాష్ట్రపు రాజధాని ఎంత ఉండేదో సరిగ్గా అంత రాజధానే కావాలని అడగడంలో అర్థం లేదు. దేశంలో 28 రాష్ట్రాలుంటే 28 రకాల రాజధానులున్నాయి. రాజధానిని వెంటనే మరొక చోటికి తరలించడానికి సౌకర్యాలు ఉన్నాయా లేవా, కొత్త నగరం రాజధానిగా ఉపయోగపడుతుందా లేదా అని చూడకుండా, కొత్త రాజధానిని పాత రాజధానితో పోల్చకుండా గతంలో రాష్ట్రాల విభజన, రాజధానుల ఏర్పాటు జరిగాయి.

ఇంతకూ ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్నది విభజన కాదు. విభజన అంటే ఉండే అర్థం వేరు. ఇది కేవలం విలీనం రద్దు. 1956లో అప్పటికి ఉండిన ఒక రాష్ట్రంలో కొంత భాగాన్ని, మరొక రాష్ట్రంతో విలీనం చేయడం జరిగింది. ఆ విలీనానికి ఆ ప్రాంత ప్రజలలో గణనీయమైన వ్యతిరేకత ఉండింది గనుక కొన్ని హామీలతో, వాగ్దానాలతో, షరతులతో కూడిన ఒప్పందం మీద ఆ విలీనం జరిగింది. ఆ ఒప్పందం కుదిరిన రోజునుంచే దాన్ని ఉల్లంఘించడం మొదలయింది. ఎప్పటికప్పుడు తెలంగాణ వాదులు ఆ రక్షణలను గుర్తుచేస్తూ, పాటించమని కోరుతూ వచ్చారు. అలా రక్షణల అమలు కోరుతూ పన్నెండు సంవత్సరాల చర్చలు, విజ్ఞప్తులు, ఆందోళనల తర్వాత, ఇక ఈ పాలకులు ఆ రక్షణలు అమలు చేయబోరని నమ్మకం కలిగాక తెలంగాణ వాదుల ఆలోచన మారింది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేయమని, అంటే విలీనాన్ని రద్దు చేయమని ఆందోళన మొదలైంది. ఆ తర్వాత గడిచిన నలభై సంవత్సరాలలో మరెన్నో సార్లు మరెన్నో కొత్త వాగ్దానాలు వెలువడ్డాయి గాని అవన్నీ మళ్లీ మళ్లీ ఉల్లంఘనలకు గురయ్యాయి. ఈ చరిత్ర నేపథ్యంలో, విభజన అనుకుంటే రెండు ప్రాంతాల హక్కుల గురించి మాట్లాడవచ్చు గాని విలీనం రద్దు అనుకుంటే రెండు ప్రాంతాలూ విలీనానికి ముందు ఉన్న స్థితికి వెళ్లిపోవడమని అర్థం. ఆ అర్థంలో చూసినప్పుడు హైదరాబాద్ ఉమ్మడి రాజధాని కావలసిన అవసరం లేదు.

మద్రాసు రాష్ట్రం నుంచి ఆంధ్ర రాష్ట్రం విడిపోయినప్పుడు ఆనాటి కర్నూలులో ఏ సౌకర్యాలూ లేకపోయినా రాజధానిని తక్షణమే తరలించారు. అంతకు ముందు ఆంధ్ర రాజకీయ నాయకులు 'మద్రాసు మాదే' ఆందోళన జరిపినందువల్ల, ఆ కోరిక మీదనే పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహార దీక్ష జరిపినందువల్ల విభేదాలు ముదిరి, రాష్ట్ర విభజన జరిగాక ఒక్క రోజు కూడ ఆంధ్రులు మద్రాసులో ఉండడానికి ఒప్పుకోబోమని తమిళ నాయకులు ప్రకటించారు. ఆ విభేదాలు ఎంత దూరం పోయి, ఎంత అమానుషమైన స్థితి ఏర్పడిందంటే, పొట్టి శ్రీరాములు చనిపోయాక సంతాపాన్ని ప్రకటిస్తూ మద్రాసు కార్పొరేషన్‌లో ప్రవేశపెట్టిన తీర్మానాన్ని తమిళులు ఓడించారు. చనిపోయిన వ్యక్తి పట్ల సంతాపం ప్రకటించడానికి కూడ నిరాకరించారు. బ్రిటిష్ అనంతర భారతదేశంలో కొత్త రాష్ట్రాల ఏర్పాటుకు అది నాంది. అప్పటి నుంచి 2000లో ఏర్పడిన మూడు రాష్ట్రాల వరకూ రాజధానుల నిర్ణయం వెంటనే జరిగిపోయింది. డెహ్రాడూన్, రాంచి, రాయపూర్ చిన్న నగరాలే అయినప్పటికీ వాటిని వెంటనే రాజధానులుగా ప్రకటించారు. ఈ మధ్యలో రాష్ట్ర రాజధాని విషయంలో జరిగిన మరొక మూడు సందర్భాలు కూడ ఇప్పుడు గుర్తు చేసుకోవాలి.

మహారాష్ట్ర విభజన సమయంలో బొంబాయిని తామే నిర్మించి, అభివృద్ధి చేశామని, అందువల్ల ఆ నగరాన్ని తమకే ఇవ్వాలని గుజరాతీలు ఎంతగానో వాదించారు. అయినప్పటికీ అది భౌగోళికంగా మహారాష్ట్రలో భాగం కనుక దాన్ని మహారాష్ట్రలోనే ఉంచి గుజరాత్ కు కొత్త రాజధానిగా అహ్మదాబాద్ పరిసరాల్లో గాంధీనగర్ నిర్మించారు. అస్సాంను విభజించి మేఘాలయను కొత్త రాష్ట్రంగా చేసినప్పుడు రాజధాని షిల్లాంగ్ భౌగోళికంగా మేఘాలయలో ఉండిపోయింది. దాన్ని మేఘాలయకు రాజధానిగానే ఉంచి, అస్సాం కొత్త రాజధానిగా గువాహటి పరిసరాల్లో దిస్ పూర్ నిర్మించారు. పంజాబ్ రాజధానిగా ఉండిన లాహోర్ దేశ విభజనతో పాకిస్తాన్ కు పోవడంతో, పంజాబ్ కు కొత్త రాజధానిగా చండీగఢ్ ను నిర్మించడానికి కేంద్రప్రభుత్వం పూచీపడింది. ఆ తర్వాత పంజాబ్ నుంచి హర్యానా, హిమాచల్ ప్రదేశ్ కొత్త రాష్ట్రాలు ఏర్పాటు చేసినప్పుడు చండీగఢ్ ను కేంద్ర పాలిత ప్రాంతంగా చేసి, అది పది సంవత్సరాల కోసం పంజాబ్, హర్యానా రెండు రాష్ట్రాలకూ రాజధానిగా ఉంటుందని ప్రకటించారు. తర్వాత యాభై సంవత్సరాలు కావస్తున్నా హర్యానాకు కొత్త రాజధాని నిర్మించలేదు. ఇలా రాష్ట్రాల, రాజధానుల ఏర్పాటు చరిత్రను చూస్తే హైదరాబాద్ ను ఉమ్మడి రాజధానిగా నిర్ణయించడం అసాధారణం, అనుచితం, అసాధ్యం అని తెలుతుంది.

హైదరాబాదు ఉమ్మడి రాజధానిగా ఉంటే, హైదరాబాదులోనే ఆంధ్ర రాష్ట్ర శాసనసభ, సచివాలయం, ఇతర రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు ఉంటే ఆంధ్ర ప్రాంత శాసనసభ్యులకు, హైదరాబాదులో అక్రమ ఆస్తులు పోగేసుకున్న ఆంధ్ర ప్రాంత సంపన్నవర్గాలకు, ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులలో కొందరికి ఉపయోగంగా ఉండవచ్చు. కాని అది ఉపయోగకరంగా ఉండేవారు ఎంత ఎక్కువగా లెక్కవేసినా కొన్ని వేల మందికి మించరు. ఈ కొన్ని వేల మంది కోసం ఆంధ్ర రాష్ట్రంలోని ఐదు కోట్ల మంది ప్రజలు రాజధాని గురించి ఇబ్బంది పడవలసి వస్తుంది. వారికి రాజధానిలో ఏ చిన్న పని పడినా మరొక రాష్ట్రంలో రెండు వందల కిలోమీటర్లు ప్రయాణిస్తే గాని తమ రాజధానికి చేరలేరు. పాలన అంతకంతకూ ఎక్కువగా ప్రజల దగ్గరికి చేరాలన్న ప్రజాస్వామిక

ఆలోచనకు ఇది పూర్తిగా వ్యతిరేకం. ఇంత ప్రజావ్యతిరేక నిర్ణయపు అసలు స్వభావాన్ని దాచి ఈ పిడికెడు మంది స్వార్థపరశక్తులు తమ ప్రజలను వంచిస్తున్నారు.

అంతేకాదు, పాలనాపరంగా కూడ రెండు రాష్ట్ర ప్రభుత్వాలు ఒకే నగరం నుంచి పనిచేయడం హాస్యాస్పదంగా, గందరగోళంగా ఉంటుంది. ఈ దేశంలో రాష్ట్ర ప్రభుత్వాలన్నిటికీ సమాన ప్రతిపత్తి ఉంది. రెండు రాష్ట్ర ప్రభుత్వాలూ సమాన ప్రతిపత్తి కలవి అయినప్పుడు హైదరాబాద్ మీద తెలంగాణ అధికారం ఉంటే ఆంధ్ర ప్రభుత్వపు ప్రతిపత్తి తగ్గిపోతుంది. కాబట్టి, హైదరాబాద్ మీద ఇద్దరిలో ఏఒక్కరికీ అధికారం లేకుండా, మూడో శక్తిగా కేంద్ర ప్రభుత్వానికి అధికారం ఉండాలనే వాదన అనివార్యంగా ముందుకు వస్తుంది. అంటే హైదరాబాద్ దొడ్డిదారిన కేంద్ర పాలిత ప్రాంతం అవుతుంది. కాంగ్రెస్ ఉద్దేశపూరితంగా, కుట్రబుద్ధితో కేంద్ర పాలిత ప్రాంత ఆలోచనను ఇలా పరోక్షంగా తీసుకువచ్చిందని అనుమానించవచ్చు.

నిజానికి దేశంలో ప్రస్తుతం ఉన్న ఏడు కేంద్ర పాలిత ప్రాంతాలను అలా గుర్తించడానికి ప్రత్యేక చారిత్రక, రాజకీయ, సామాజిక కారణాలున్నాయి. వాటిలో అండమాన్ నికోబార్ ద్వీపాలను, లక్షద్వీపాలను అక్కడి ఆదిమ జాతుల సంరక్షణ కొరకు కేంద్రపాలిత ప్రాంతంగా గుర్తించారు. దాద్రా నాగర్ హవేలీ, దమన్ దియూ పోర్చుగీసు పాలనలో ఉండి 1954లో, 1961లో భారతదేశంలో కలిసినందువల్ల కేంద్ర పాలిత ప్రాంతాలయ్యాయి. పుదుచ్చేరి ఫ్రెంచి పాలనలో ఉండి 1963లో భారతదేశంలో చేరినందువల్ల కేంద్ర పాలిత ప్రాంతమయింది. ఇక మిగిలిన చండీగడ్ ను 1966లో ప్రత్యేక పరిస్థితిలో కేంద్ర పాలిత ప్రాంతంగా ప్రకటించి ఉమ్మడి రాజధాని చేశారు. ఢిల్లీని 1956లో కేంద్ర పాలిత ప్రాంతంగా ప్రకటించి 1998లో దానికి ప్రత్యేక హోదా కల్పించారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ ను కేంద్ర పాలిత ప్రాంతంగా చేయడానికి ఎటువంటి హేతుబద్ధ తర్కమూ లేదు. అలా మార్చడం అర్థరహితం కూడ.

కేంద్ర పాలిత ప్రాంతంగా ప్రకటించడమంటే స్థానిక స్వపరిపాలన లేకుండా చేయడం. ప్రజా ప్రతినిధుల పాలన లేకుండా చేయడం. అప్రజాస్వామికంగా ఢిల్లీ నుంచి లెఫ్టినెంట్ గవర్నర్ల, అడ్మినిస్ట్రేటర్ల పాలనను రుద్దడం. నానాటికీ ప్రజాస్వామిక సంప్రదాయాలు మరింతగా పెరగాలని, స్థానిక స్వపరిపాలన కావాలని, ఎన్నికలు మరింత పారదర్శకం కావాలని, ప్రజాభిప్రాయాన్ని ఎన్నికలు నిజంగా ప్రతిబింబించాలని అడగవలసిన సమయంలో, అసలు ప్రజల ప్రాతినిధ్యమే లేని సుదూరపు అధికారుల పాలనను కోరాలని మన రాజకీయ నాయకులు, స్వార్థపరశక్తులు అడుగుతున్నారంటే అది కేవలం వారి అజ్ఞానం మాత్రమే కాదు. తమ ఆర్థిక ప్రయోజనాలు, ఆస్తులు కాపాడుకోవడానికి ప్రజాస్వామ్యం లేకపోయినా ఫరవాలేదని అనుకుంటున్నారన్నమాట.

కేంద్ర పాలిత ప్రాంతాలలో పౌర, ప్రజాస్వామిక పాలన ఉండకపోవడం ప్రజాస్వామిక భారతదేశంలో ఎలా చెల్లుతుందని వచ్చిన ప్రశ్నలకు జవాబుగా పుదుచ్చేరి, ఢిల్లీలలో స్థానిక శాసనసభలను, ముఖ్యమంత్రితో సహా ప్రభుత్వాలను ఏర్పాటు చేయడం జరిగింది గాని, ఆ శాసనసభలకు, ప్రభుత్వాలకు మిగిలిన శాసనసభలకు ఉన్నటువంటి అధికారాలు లేవు. ఆ రెండు కేంద్ర పాలిత ప్రాంతాలకు పాక్షిక రాష్ట్ర ప్రతిపత్తి మాత్రమే ఉంది. ఢిల్లీ కోసం ప్రత్యేకంగా 1991లో తెచ్చిన రాజ్యాంగ సవరణ ద్వారా ఆ రాష్ట్ర ప్రభుత్వానికి ఆ రాష్ట్రంలోని శాంతి భద్రతలు, పోలీసులు, భూమి మీద అధికారం ఉండబోదని నిర్ధారించారు. ఈ మూడు కీలకమైన అంశాలలో రాష్ట్ర ప్రభుత్వానికి ఎటువంటి అధికారం లేకపోయిన తర్వాత, కేంద్ర ప్రభుత్వానికే సంపూర్ణ అధికారం ఉన్న తర్వాత ఆ రాష్ట్ర ప్రభుత్వం కేవలం నామమాత్రపు ఉత్సవ విగ్రహమే అవుతుంది. కొంతమంది రాజకీయ నాయకులకు పదవులు కట్టబెట్టడానికి తప్ప ప్రజాజీవితంలో మెరుగైన, ప్రజాస్వామికమైన స్థానిక స్వపరిపాలన ఏమీ ఉండదు. నిర్భయ సామూహిక అత్యాచారం సమయంలో స్వయంగా ఢిల్లీ ముఖ్యమంత్రి అటువంటి ఘటనల నిరోధక చర్యలు తీసుకోవడానికి గాని, ఘటన జరిగిన తర్వాత తగిన చర్యలు తీసుకోవడానికి గాని తమకు ఏ అధికారాలూ లేవని అన్నారు. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి అని పేరున్నప్పటికీ ఆమెకు తన రాష్ట్రంలో జరిగిన ఒక దారుణ నేరపు బాధితురాలిని ఆస్పత్రిలో పరామర్శించి రావడం కన్న ఎక్కువ అధికారాలు లేవు. రేపు హైదరాబాదును ఇలా మార్చడం ఎవరి కుటిల ఆలోచన అయినా వారు ప్రజాస్వామ్యానికి దోహదం చేస్తున్నారా, ద్రోహం చేస్తున్నారా ఆలోచించుకోవాలి.

హైదరాబాదును ఉమ్మడి రాజధానిగా మార్చడాన్ని తెలంగాణ సమాజం ఎందుకు వ్యతిరేకిస్తున్నది? హైదరాబాద్ భౌగోళికంగా తెలంగాణ నడిబొడ్డున ఉన్నది. హైదరాబాద్ రాష్ట్రాన్ని మూడుగా విభజించి, తెలుగు మాట్లాడే ప్రజల రాష్ట్రాన్ని (తెలంగాణను) హైదరాబాద్ రాష్ట్రం అని పిలవాలని ఫజల్ అలీ కమిషన్ 1955లో సిఫారసు చేసింది. అంటే హైదరాబాదు తెలంగాణకు పర్యాయపదం అన్నమాట. ఆ రెండు మాటలకు తేడా లేదన్నమాట. మరి ఇప్పుడు తెలంగాణ నుంచి హైదరాబాదును వేరు చేయడమంటే తెలంగాణ అస్తిత్వాన్ని ధ్వంసం చేయడమే. చండీగడ్ విషయంలో పది సంవత్సరాల పాటు ఉమ్మడి రాజధాని అని 1966లో అన్న మాట ఇప్పటికీ కొనసాగుతున్నది. అరవై సంవత్సరాల కేంద్ర పాలకుల, ఆంధ్ర పాలకుల నమ్మక ద్రోహాలను చవిచూసిన తెలంగాణ అందుకే పది సంవత్సరాల ఉమ్మడి రాజధాని అనే మాటను నమ్మదలచుకోలేదు. అలాగే ఉమ్మడి రాజధాని అనే మాట కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చడానికి ఒక ఎత్తుగడ కావచ్చునని కూడ తెలంగాణ సమాజం భయపడుతున్నది. అరవై సంవత్సరాలలో హైదరాబాదులో వేల ఎకరాల భూమి, వనరులు అక్రమంగా కబ్జా పెట్టిన ఆంధ్ర పాలకులు ఈ పది సంవత్సరాలలో మరెన్ని అక్రమాలకు పాల్పడతారో అని భయపడుతున్నది. రెండు ప్రాంతాల ప్రజల మధ్య స్నేహ సుహృద్భావాలు ఇనుమడించాలంటే ఒకే నగరంలో రుసరుసల కాపురం సాగనివ్వడం అనుచితం.

ఇక సిడబ్ల్యుసి తీర్మానంలో మరొక కీలకమైన అంశం పోలవరం నీటి పారుదల ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా గుర్తించి దాని సత్వర పరిపూర్తి కొరకు తగిన నిధులు సమకూర్చాలని కేంద్రాన్ని కోరడం. ఈ వాక్యాన్ని దేశంలో ప్రభుత్వాన్ని నడుపుతున్న పార్టీకి చెందిన అత్యున్నత అధికార పీఠం ఎంత నిస్సిగ్గుగా రాసిందంటే, ఈ వాక్యం నిజానికి చట్టవిరుద్ధం. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం ఆపాలని కోరుతూ ఒడిశా, చత్తీస్ గడ్ రాష్ట్ర ప్రభుత్వాలు, తెలంగాణ రాష్ట్ర సమితి సుప్రీం కోర్టులో

వేసిన మూడు వ్యాజ్యాలు విచారణలో ఉన్నాయి. కనీసం సుప్రీం కోర్టు తీర్పు వెలువడే వరకూ ఆ ప్రాజెక్టు నిర్మాణం గురించి మాట్లాడగూడదు. దాన్ని నిర్మించాలని అనడం న్యాయస్థానాన్ని ధిక్కరించడం అవుతుంది. కాని ఈ దేశంలో చట్టాన్ని, చట్టబద్ధ పాలనను ఉల్లంఘించడమే, న్యాయస్థానాలను అవమానించడమే పాలకవర్గాల నిరంతర కార్యాచరణ గనుక సిడబ్ల్యుసి తీర్మానంలో ఆశ్చర్యం ఏమీ లేదు.

పోలవరం ప్రాజెక్టు మానవ విధ్వంసం, పర్యావరణ విధ్వంసం, నీటి వినియోగం, సాంకేతిక కారణాలు, ఆర్థిక దుబారా, ప్రాంతీయ న్యాయం వంటి ఏ కారణంతో చూసినా దుర్మార్గమైన, అనవసరమైన, అక్రమమైన పథకం. ప్రజలకు, రైతాంగానికి ఏదో మేలు జరగబోతుందనే పచ్చి అబద్ధాలతో ప్రజలను రెచ్చగొట్టి సమ్మతి తయారుచేస్తూ, అంతిమంగా ప్రజలకు ఎంత మాత్రం ఉపయోగపడని ప్రాజెక్టు ఇది. నిర్మాణ సమయంలో కంట్రాక్టర్లకు, నిర్మాణం తర్వాత బహుళ జాతి సంస్థలకు, కృష్ణా, గుంటూరు జిల్లాలలో మూడో పంటకు మాత్రమే ప్రయోజనం చేకూర్చే పథకం ఇది. పోలవరం ప్రాజెక్టు ఆదివాసుల జీవితాలను పెద్ద ఎత్తున విధ్వంసానికి గురి చేస్తుందనీ, ఇప్పటికే అభివృద్ధి చెందిన ప్రాంతాలను మరింత అభివృద్ధి చేయడానికీ, ఇప్పటికీ వెనుకబడి ఉన్న ప్రాంతాలను, ప్రజలను ముంచుతుందనీ, ఉత్తర తెలంగాణ జిల్లాలలోని మెట్ట భూములకు తగిన మోతాదులో గోదావరి జలాలను దక్కకుండా చేస్తుందనీ, అందువల్ల ఈ ప్రాజెక్టును వ్యతిరేకించాలనీ కె. బాలగోపాల్ 2005లో రాశారు.

ఆదివాసి ప్రాంతాలలో 300 గ్రామాలను ముంచివేసి, మూడులక్షల మంది ప్రజలను నిర్వాసితులను చేసి (ఇది 1996 నాటి లెక్క ప్రస్తుతం ఇది పదిలక్షల మందిని నిర్వాసితులను చేయవచ్చునంటున్నారు), శబరి వంటి నదులను, ఎన్నో చారిత్రక, సాంస్కృతిక స్థలాలను మటుమాయం చేసి కట్టనున్న ఈ ప్రాజెక్టు ప్రారంభం నుంచే విశాఖపట్నం %--% కాకినాడల మధ్య తలపెట్టిన పారిశ్రామిక పెట్టుబడుల కారిడార్‌లో రానున్న బహుళ జాతి సంస్థల కర్మాగారాలకు నీరు అందించడం ప్రధాన బాధ్యతగా మొదలయింది. అలాగే కృష్ణా, గుంటూరు జిల్లాలలో మూడో పంటకు అవసరమైన నీరు కృష్ణా నదిలో విజయవాడ బారేజి దగ్గర ఉండడం లేదని, పోలవరం నుంచి 80 టిఎంసి నీటిని విజయవాడ బారేజి దగ్గరికి తరలించాలని కూడ ఈ ప్రాజెక్టు లక్ష్యం. ప్రాజెక్టు కిందా, ఈ కాలువ పొడవునా కొంతమంది రైతులకు నీరు అందించడం ఈ రెండు లక్ష్యాల ఉపఫలితమే తప్ప ఆ రైతుల మీద కూడ ప్రభుత్వాని కేమీ ప్రేమ లేదు. ఈ ప్రాజెక్టు నిర్మాణం వారికోసం కూడ కాదు. నిజానికి ఆ రైతులకు నీరు అందించాలంటే ఇంత ఖర్చుతో, ఇంత విధ్వంసంతో పోలవరం నిర్మించే బదులు ఇతర అవకాశాలు ఉన్నాయి.

తెలంగాణ ఏర్పాటు చేస్తామనే ప్రకటనలోనే పోలవరం ప్రాజెక్టును చేర్చడం మరింత దుర్మార్గం, కాంగ్రెస్ కుటిల రాజకీయాలలో భాగం. ఎందుకంటే పోలవరం ప్రాజెక్టు గోదావరి జలాలలో తెలంగాణ వాటాకు ఎసరు పెడుతుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి గోదావరి జలాలలో 1480 టిఎంసిల వాటా ఉంది. దాన్ని సమన్యాయంతో, అంతర్జాతీయంగా పాటిస్తున్న జలవనరుల పంపిణీ సూత్రాల ప్రకారం ప్రాంతాల వారీగా విడదీస్తే తెలంగాణకు 1086 టిఎంసి, ఆంధ్రకు 444 టిఎంసి కేటాయించాలి. కాని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాగించిన కోస్తా అనుకూల వాదనల వల్ల తెలంగాణకు 789 టిఎంసి, ఆంధ్రకు 645 టిఎంసి కేటాయించడం జరిగింది. ఆంధ్ర ప్రాంతంలో ప్రాజెక్టుల వల్ల ఇప్పటికే 320 టిఎంసి వినియోగంలోకి వచ్చాయి. అంటే ఇంకా ఆంధ్ర ప్రాంతంలో న్యాయంగా 124 టిఎంసిలకు, కేటాయింపుల ప్రకారమైనా 325 టిఎంసిలకు మాత్రమే హక్కు ఉంది. అటువంటప్పుడు కాగితం మీద 302 టిఎంసి అనో, 325 టిఎంసి అనో అంటున్నారు గాని ఆనకట్ట ఎత్తు, కాలువల వైశాల్యం వంటి సాంకేతిక అంశాలను బట్టి అంచనా వేస్తే 500 టిఎంసి సామర్థ్యంతో నిర్మాణం జరుగుతున్నదని బాలగోపాల్ వంటివారు కూడ అనుమానించారు. అంటే తెలంగాణ వాటా లోంచి కనీసం 150 టిఎంసిని కొల్లగొట్టడానికి పోలవరం అవకాశం ఇస్తుంది. ఇప్పుడు గోదావరి మీద తెలంగాణలో మూడు నాలుగు పథకాల ఆలోచనలు ఉన్నప్పటికీ, వాటన్నిటినీ చేపట్టడానికి అవసరమైన నిధులు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దగ్గర ఉండకపోవచ్చు గనుక అవన్నీ నత్తనడకలు నడుస్తాయి. అసలు భారీ ప్రాజెక్టులు అవసరమా, తెలంగాణ చిన్న, మధ్యతరహా నీటిపారుదల పథకాల వైపు మళ్లాలా అనే చర్చలు కూడ ఉన్నాయి. మరొకవైపు పోలవరం జాతీయ ప్రాజెక్టుగా జాతీయ నిధులతో త్వరలో పూర్తయిపోతుంది. పోలవరం నిలువచేసే జలాల మీద ఆంధ్రకు హక్కు లేకపోయినా ప్రాజెక్టు నిర్మాణం అయింది గనుక అంత భారీ ప్రాజెక్టుకు నీటి కేటాయింపులు జరగవలసిందే అని ఆందోళనలు ప్రారంభమవుతాయి. అంతిమంగా తెలంగాణ కట్టుకోవలసిన ప్రాజెక్టులు కట్టుకోలేని పరిస్థితి వస్తుంది. రెండు రాష్ట్రాల మధ్య ఈ అనవసరపు వివాదం ఎప్పటికీ ఆరని చిచ్చులా రగులుతూనే ఉంటుంది.

అంటే సిడబ్ల్యుసి తీర్మానం ఒకవైపు తెలంగాణ ఇస్తున్నట్టే భ్రమ కల్పిస్తూ హైదరాబాద్ ను విడగొట్టి, గోదావరి నీటివాటా కొల్లగొట్టి తెలంగాణ ఇవ్వాలని ప్రతిపాదించిందన్నమాట. సిడబ్ల్యుసి తీర్మానం ఇంత అవకతవకలుగా, వాస్తవంగా తెలంగాణకు అన్యాయం చేస్తూ తెలంగాణ ఇచ్చినట్టు నటించినా, అల్పసంతోషులుగా తెలంగాణ వాదులు సంబరపడ్డారు. కాని ఈ రాయితీలు కూడ సరిపోవని, ఇంకా ఎక్కువ రాయితీలు కావాలని కోస్తా రాయలసీమ సంపన్నులు ఆందోళన ప్రారంభించారు. గత నాలుగు వారాలుగా సాగుతున్న ఈ ఆందోళన పైకి సమైక్యత కొరకు, రాష్ట్రాన్ని యథాతథంగా ఉంచడం కొరకు జరుగుతున్నట్టు కనబడుతున్నది గాని, హైదరాబాద్ ను వేరుచేస్తే, తెలంగాణ ఏర్పాటు చేసినా ఫరవాలేదని స్పష్టంగానే అంటున్నారంటే ఇది కేవలం హైదరాబాద్ మీద, హైదరాబాద్ ఆస్తుల మీద కన్నుతో కొందరు రెచ్చగొడుతున్నదే తప్ప నిజంగా సమైక్యతా వాదం కాదని అర్థం అవుతుంది.

ఈ ఆందోళనను ప్రేరేపిత ఆందోళన అని, మీడియా ప్రచారం చేస్తున్న ఆందోళన అని కొట్టివేయడం సులభమే గాని, అంతకన్న లోతుకు వెళ్లి నిశితంగా పరిశీలించవలసి ఉంది. తప్పనిసరిగా రాజకీయ నాయకులు, హైదరాబాద్‌లో ఆస్తి పోగేసుకున్న సంపన్నులు, కొద్దిమంది ఉద్యోగులు, కోస్తా సంపన్నుల యాజమాన్యంలోని ప్రచార సాధనాలు ఈ ఆందోళనను రెచ్చగొడుతున్న మాట, ప్రోత్సహిస్తున్న మాట, గోరంతలు కొండంతలు చేస్తున్న మాట నిజమే. అదే సమయంలో ఏదో ఒక మేరకు ప్రజా భాగస్వామ్యం ఉన్న మాట కూడ నిజమే.

ప్రజావ్యతిరేక, అప్రజాస్వామిక, ప్రతీప ఆందోళనలలో కూడ ప్రజలు పాల్గొనే అవకాశం ఉంటుంది. రామజన్మభూమి, శిలాన్యాస్, రథయాత్ర, మండల్ వ్యతిరేక అల్లర్లు, గుజరాత్ మారణకాండ వంటి అనేక సందర్భాలలో ఆ విషయం రుజువైంది. కనుక ప్రస్తుతం కోస్తా, రాయలసీమల్లో జరుగుతున్న ఆందోళనల్లో ఎవరు, ఎందుకు పాల్గొంటున్నారు, ప్రజలు పాల్గొంటున్నట్టయితే ఏ కారణాలతో పాల్గొంటున్నారు అని ఆలోచించడం ప్రగతిశీల ఆలోచనాపరుల కర్తవ్యం.

ఈ ఆందోళనల్లో ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని ఐదు రకాల వాళ్లున్నారు. ఒకటి, తెలంగాణ రాష్ట్రం ఏర్పడక తప్పదని పూర్తిగా గుర్తెరిగి, ఆ తర్వాత రూపొందే ఆంధ్ర రాష్ట్రంలో తమ రాజకీయ ప్రయోజనాలను, ముఖ్యంగా శాసనసభ, లోకసభ స్థానాలను పదిల పరచుకోవాలంటే ఇప్పుడు ప్రజలకు దగ్గర కావాలని, వారికోసం ఏదో చేసినట్టు నటించాలని అనుకునేవారు. ఒకరకంగా ఇది రానున్న ఎం ఎల్ ఎ, ఎంపి, తదితర స్థానాలను రిజర్వ్ చేసుకోవడం. రెండు, రానున్న ఆంధ్ర రాష్ట్రంలో పెద్దఎత్తున నిర్మాణ కార్యక్రమాలు జరగబోతాయి గనుక ఆ రాష్ట్రంలోని ఆర్థిక ప్రయోజనాల మీద దృష్టి ఉన్నవాళ్లు. అక్కడి శాసనసభ, సచివాలయం, భవన నిర్మాణాలు, ఇతర మౌలిక సౌకర్యాల కల్పనల కాంట్రాక్టులు తామే దక్కించుకోవాలంటే ఇప్పుడు ప్రజలకోసం పోరాడినట్టుగా నటించాలి. ఒకరకంగా ఇది రానున్న లాభాలకు ముందస్తు పెట్టుబడి పెట్టడం. మూడు, గత ఆరు దశాబ్దాలుగా హైదరాబాద్ లో, తెలంగాణలో అక్రమ ఆస్తులు పెంపొందించుకుని, వాటిని కాపాడుకోవడానికి తెలంగాణను అడ్డుకోవాలని ప్రయత్నించేవారు. దేశ రాజ్యాంగం ప్రకారం ఎక్కడివారైనా ఎక్కడైనా సక్రమంగా, చట్టబద్ధంగా ఆస్తులు సంపాదించుకోవచ్చు. కాని వీరు హైదరాబాద్‌లో సంపాదించినవి అక్రమ, చట్టవ్యతిరేక ఆస్తులు. వాటికి ప్రమాదం వస్తుందేమోనని వీరి భయం. వీరు కోట్లకు పడగెత్తినవారు గనుక, ఢిల్లీ స్థాయిలో కూడ చక్రం తిప్పగలిగినవారు గనుక, డిసెంబర్ 9 నిర్ణయాన్ని ఉపసంహరింప జేసినవారు గనుక ఈసారి కూడ నిర్ణయాన్ని వెనక్కి తిప్పడానికి ఒక అవకాశంగా ఆందోళనలను రెచ్చగొడుతున్నవారు. ఒకవేళ తెలంగాణ ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కి తిప్పలేకపోయినా, ఆందోళనను చూపి హైదరాబాదును కేంద్రపాలిత ప్రాంతంగా మార్చగలిగినా తమ ఆర్థిక ప్రయోజనాలకు రక్షణ దొరుకుతుందని భావిస్తున్నవారు. ఈ మూడు రకాల వాళ్లు రాజకీయ నాయకులు, స్వార్థపరులు, స్వప్రయోజనపరులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, పాలకవర్గాలలో భాగమైన వాళ్లు. వీరు కోస్తా, రాయలసీమ ప్రజలకు అబద్ధాలు చెప్పి రెచ్చగొడుతున్నారు. ఆ ప్రజలలో నిజంగానే ఉన్న భయసందేహాలను తీర్చే వాస్తవాలు చెప్పే బదులు, వాటిని పెంచి పోషిస్తున్నారు.

ఇక, తమలో ముందునుంచే ఉన్న భయ సందేహాల వల్ల, వాటిని రాజకీయ నాయకులు రెచ్చగొడుతున్నందువల్ల కోస్తా, రాయలసీమల్లో రెండు రకాల అమాయక ప్రజలు ఈ ఆందోళనల్లో పాల్గొంటున్నారు. వారిలో కొందరు, తమ జీవనం మీద, భవిష్యత్తు మీద, భద్రత మీద ఈ పరిణామం ఏ ప్రభావం వేస్తుందో తెలియని అమాయక ప్రజలు, నిజానిజాలు స్వయంగా తేల్చుకోలేక, చెప్పేవారు లేక భావోద్వేగాలతో ఆందోళనల్లో పాల్గొంటున్నవాళ్లు, ఇక రెండో రకం రాష్ట్ర ఏర్పాటు గురించి లోతైన విషయాలు అర్థం కాకుండా, అర్థం చేసుకోదలచుకోకుండా, కేవలం ఐక్యత, తెలుగుజాతి, భాష వంటి ఉద్వేగ భావనలతో ప్రభావితులైన ప్రజలు. వీరి భయాలకు, సందేహాలకు, అనుమానాలకు తప్పనిసరిగా జవాబులు చెప్పవలసి ఉంటుంది.

ఇలా ఈ ఆందోళనల్లో పాల్గొంటున్నవారిలో పాలకవర్గాలను, ప్రజలను వేరు చేసి చూడకపోతే ప్రజలమధ్య అనవసరమైన విద్వేషాలు పెరిగిపోయి భవిష్యత్తు ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది. రెండు రాష్ట్రాలుగా ఏర్పడిన తర్వాతనైనా కొనసాగవలసిన తెలుగు సమాజ ఐక్యత విచ్ఛిన్నమై పోయే ప్రమాదం ఉంది. పాలకుల స్వార్థ స్వప్రయోజనాలను, తప్పుడు వాదనలను, అబద్ధాలను తీవ్రంగా ఖండిస్తూనే, కోస్తా, రాయలసీమ ప్రజల్లో ఉన్న భయాలు, సందేహాలు, అనుమానాలు ఏమిటో వివరంగా తెలుసుకోవలసి ఉంది. వాటికి పరిష్కారాలు, సమాధానాలు అన్వేషించవలసి ఉంది. ఆ ప్రాంతాల సాధారణ ప్రజానీకానికి సమైక్య ఆంధ్రప్రదేశ్ ఉండడం వల్ల ఒరిగిందీ లేదు, రెండు రాష్ట్రాలు ఏర్పడినందువల్ల రాబోయే నష్టమూ లేదు. కాని వారికి ఏదో నష్టం జరగబోతుందనే మహా అబద్ధాన్ని అన్ని పార్టీల రాజకీయ నాయకులూ, కొందరు మేధావులూ ప్రచారం చేస్తున్నారు. 'తెలంగాణ ఏర్పడితే అది ఎగువ రాష్ట్రం గనుక కిందికి నీరు రాకుండా ఆపేస్తుంది. తెలంగాణ ఏర్పడితే హైదరాబాద్ కు రానివ్వరు గనుక అక్కడి విద్యావకాశాలు, ఉద్యోగావకాశాలు మీకు దక్కవు. హైదరాబాద్ అభివృద్ధి మనందరి నిధులతో జరిగింది గనుక హైదరాబాద్ ఆదాయంలో మనకు శాశ్వత వాటా ఉండాలి. బొగ్గు గనులు తెలంగాణలోనే ఉన్నాయి గనుక, తెలంగాణ ఏర్పడిన తర్వాత కోస్తా, రాయలసీమలలోని విద్యుత్ కేంద్రాలకు ఇబ్బంది వస్తుంది' లాంటి నాలుగైదు వాదనలు ఇవాళ కోస్తా, రాయలసీమ ప్రజానీకాన్ని ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఆ ఆందోళనతోనే వారు వీధుల్లోకి వస్తున్నారు. కాని ఈ అన్ని వాదనలకూ జవాబులున్నాయి. పరిష్కారాలున్నాయి. ఆ జవాబులూ పరిష్కారాలూ ఇవాళ ఆందోళనల్లో ఉన్న ప్రజలకు అందడం లేదు. చిలవలు పలవలతో కూడిన అబద్ధాలే అందుతున్నాయి.

ఏ ఎగువ రాష్ట్రమైనా ఎంత కోరుకున్నా తన ఆనకట్టల పూర్తి సామర్థ్యం కన్న ఎక్కువ నీటిని ఆపుకోజాలదు. నీరు పల్లమెరుగు అనేది భౌతిక సత్యం. తెలంగాణ కూడ కృష్ణ, గోదావరి జలాలలో తన ఆనకట్టల వెనుక పట్టగలిగినంత నీటిని మాత్రమే ఆపుకోగలదు. వర్షాభావ సంవత్సరాలలో ఇది సమస్య కావచ్చుగాని, సాధారణ వర్షపాతం ఉన్న సంవత్సరాలలో కూడ ఈ రెండు నదులలో వరదలు వస్తున్నాయి. కృష్ణా నదిలో అయితే బచావత్, బ్రజేష్ ట్రిబ్యునళ్ల తీర్పుల మేరకు నికర జలాలకు మాత్రమే కాదు, మిగులు జలాలకు కూడ ఉమ్మడి రాష్ట్రంలోనే ప్రాజెక్టుల రూపకల్పన, నిర్మాణం జరిగిపోయాయి. నిజానికి ఆ కాలంలో తెలంగాణకు న్యాయమైన వాటా కూడ అందని తీరులోనే ప్రాజెక్టుల నిర్మాణం జరిగింది. ఇప్పుడు బహుశా దాన్ని తిరగదోడడం సాధ్యం కాదు. కనుక కృష్ణా నది కింది రైతులు ఆందోళన పడవలసిన అవసరమే లేదు. గోదావరిలో తెలంగాణ వాటా వాడుకోవడానికి ఇంతవరకూ ప్రాజెక్టులు నిర్మించలేదు గనుక భవిష్యత్తులో అవి నిర్మించుకోవచ్చు. అప్పటికి కూడ గోదావరిలో కోస్తా వాటాలో మొత్తానికీ మొత్తం వినియోగానికి ప్రాజెక్టులు ఉన్నాయి గనుక, ఇప్పుడు పోలవరం

గురించి కూడ ఆలోచిస్తున్నారు గనుక కోస్తాకు జరగబోయే నష్టం ఏమీ లేదు. 'మా నీరు ఒక్క చుక్క కూడ మరొకరు వాడుకోవడానికి వీలు లేదు. మాకు మరొకరి నీరు ఒక్క చుక్క కూడ అవసరం లేదు' అని తెలంగాణ అంటున్న న్యాయమైన మాటకు ఎవరికైనా ఎందుకు అభ్యంతరం ఉండాలి?

దేశంలో ఎవరైనా ఎక్కడికైనా వెళ్లవచ్చునని, స్థిరపడవచ్చునని రాజ్యాంగం చెపుతుంది. తెలంగాణ ప్రభుత్వమైనా ఆ రాజ్యాంగానికి లోబడి పని చేసేదే కనుక హైదరాబాదులో ఎవరైనా చట్టబద్ధంగా, సక్రమంగా స్థిరపడతామంటే అభ్యంతరపెట్టడానికి వీలు ఉండదు. దేశంలోని అన్ని నగరాలలోను, విదేశాలలో కూడ కోస్తా, రాయలసీమ వాసులు లక్షలాది మంది స్థిరపడి ఉన్నారు. అలాగే హైదరాబాదులో కూడ భవిష్యత్తులో ఉంటారు. మద్రాసు మీద అంత రభస జరిగినా మద్రాసులో తెలుగు ప్రజలు ఇంకా జీవిస్తూనే ఉన్నారు. బొంబాయి విషయంలో మహారాష్ట్రులకూ, గుజరాతీలకూ మధ్య హింసాత్మక ఘర్షణలు జరిగినా, విడిపోయిన 1960 నాటికీ ఇప్పటికీ బొంబాయిలో గుజరాతీల జనాభా ఐదు శాతం పెరిగింది. కనుక హైదరాబాదులో నివాసం విషయంలో లేనిపోని అబద్ధాలు సృష్టించి కోస్తా, రాయలసీమ వాసులను రెచ్చగొట్టడం అక్రమం, అనైతికం.

హైదరాబాద్ విద్యావకాశాలలో, ఉద్యోగావకాశాలలో కొంత భాగాన్ని కోస్తా, రాయలసీమ వాసులు కోల్పోవలసి రావచ్చు. అందులోనూ జరుగుతున్న అబద్ధ ప్రచారాలకూ వాస్తవానికీ హస్తిమశకాంతరం ఉంది. హైదరాబాదులోని ఉద్యోగాలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వోద్యోగాలు, ప్రైవేట్ రంగ ఉద్యోగాలు ఉంటాయి. వీటిలో కేంద్ర ప్రభుత్వోద్యోగాలలో, ప్రైవేట్ రంగ ఉద్యోగాలలో తెలంగాణేతరులు చేరగూడదనే నిబంధనలు ఇప్పుడూ లేవు, తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడ ఉండడానికి వీలులేదు. అప్పుడు కేవలం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు మాత్రమే తెలంగాణ వారికి పరిమితమవుతాయి. అదే స్థాయిలో ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు వారి రాజధానిలో వస్తాయి గనుక అది కూడ సమస్య కాదు. ఇక జాతీయస్థాయి విద్యా సంస్థలలోను, ప్రైవేట్ విద్యా సంస్థలలోను విద్యావకాశాలు తెలంగాణ వారికి మాత్రమే పరిమితం కావు. ఈ పరిణామాలన్నీ వాస్తవ రూపం ధరించేటప్పటికి కోస్తా, రాయలసీమ విద్యార్థులకు, నిరుద్యోగులకు పెద్ద హాని జరగదని కచ్చితంగా చెప్పవచ్చు. ఈలోగా ఆంధ్ర రాష్ట్రంలో మరిన్ని కేంద్ర, జాతీయ స్థాయి విద్యా సంస్థలు, కేంద్ర ప్రభుత్వ పారిశ్రామిక సంస్థలు తెరవాలని, ఇతోధికంగా విద్యావకాశాలు, ఉద్యోగకల్పన జరపాలని వారు కోరుకోవచ్చు. హైదరాబాద్ కేంద్రీకరణ అనుభవం వల్ల వచ్చిన దుష్ఫలితాలను దృష్టిలో ఉంచుకుని, ఆంధ్ర రాష్ట్ర పునర్నిర్మాణంలో విద్యా, ఉద్యోగ అవకాశాలను వికేంద్రీకరించవచ్చు.

'హైదరాబాద్ ను మేం అభివృద్ధి చేశాం గనుక మాకు వాటా ఉండాలి' అనే వాదన అచారిత్రకమైనది, అర్థరహితమైనది, అనవసరమైనది. ఆంధ్ర రాజకీయ నాయకులు సరిగ్గా ఈ వాదననే 1947-53 మధ్య 'మద్రాసు మనదే' ఆందోళన రూపంలో చేశారు. గుజరాతీ రాజకీయ నాయకులు మహారాష్ట్ర విభజన సమయంలో చేశారు. ఈ రెండు సందర్భాలలోను ఆ వాదనలు ఓడిపోయాయి. ఎవరైనా విద్యావకాశాలుంటే చదువుకోవడానికి, ఉద్యోగం వస్తే చేయడానికి, లాభాలు వస్తాయంటే పరిశ్రమలు, వ్యాపారాలు పెట్టడానికి ఒక నగరానికి వెళతారు. వారెవరూ ఆ నగరాన్ని అభివృద్ధి చేయాలనే ధార్మిక ఆలోచనతో ఆ నగరానికి వెళ్లరు. కనుక మా పెట్టుబడులతోనే నగరం అభివృద్ధి అయింది అనే వాదనకు అర్థం లేదు. ఈ మాటలు అంటున్న నాయకులు అన్నిరాష్ట్రాలలోను, చివరికి అఫ్ఘనిస్తాన్‌లో కూడ వ్యాపారాలు, కంట్రాక్టులు చేస్తున్నారు. ఎక్కడ లాభం వస్తే అక్కడికి పోతున్నారు. ఒక నగర అభివృద్ధికి ప్రభుత్వం ఖజానా నుంచి ఖర్చు పెడుతుంది గనుక, ఆ ఖజానాకు పన్నులు చెల్లించేవారందరూ మా డబ్బుతోనే నగరం అభివృద్ధి అయింది అని వాదించవచ్చు. కాని ఆ లెక్క తేల్చడం కష్టం. వారు ఆ పన్నులు చెల్లించినందుకు ప్రభుత్వం నుంచి ఏవో సేవలు కూడ అందుకునే ఉంటారు గనుక, అది అప్పటికప్పుడే చెల్లు అయిపోయినట్టే.

ఇక విద్యుత్తు, బొగ్గు వంటి అంశాలలో కూడ ఇప్పటికే స్థిరపడిన సంప్రదాయాలు, నియమ నిబంధనలు ఉన్నాయి. రాష్ట్రాల మధ్య వివాదాలు వస్తే తేల్చడానికి కేంద్ర ప్రభుత్వం, న్యాయస్థానాలు, ట్రిబ్యునళ్లు వంటి అనేక మార్గాలున్నాయి. ఆ మాటకొస్తే తెలంగాణకు కూడ సమస్యలు ఉంటాయి. సముద్రతీరం ఉండదు గనుక ఆమేరకు అది కూడ నష్టపోతుంది. సుదీర్ఘమైన సముద్రతీరంలో గత ఆరు దశాబ్దాలలో రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన ఓడరేవులన్నీ కూడ ఉమ్మడి రాష్ట్ర ఖజానా నుంచే నిర్మాణమయ్యాయి గనుక ఆ ఓడరేవులలో తెలంగాణకు వాటా ఇవ్వాలి అనడం అసందర్భమైన వాదనే అవుతుంది.

ఇటువంటి నిజాలు చెప్పి కోస్తా, రాయలసీమ ప్రజల భయాలను, అనుమానాలను తొలగించి, ఇరు ప్రాంతాల ప్రజలు మైత్రీ భావంతో రెండు రాష్ట్రాల పునర్నిర్మాణ ప్రక్రియలో భాగం పంచుకునేలా చూడవలసిన బాధ్యత రాజకీయ నాయకులది, పౌరసమాజ నాయకులది, ప్రచారసాధనాలది. కాని కోస్తా, రాయలసీమ రాజకీయ నాయకులు తమ స్వార్థం కోసం నిజాలు చెప్పకపోగా, తామే అబద్ధాలు సృష్టించి ప్రచారం చేస్తున్నారు. ప్రచార సాధనాలు ఆ అబద్ధాలను పెంచి పోషిస్తున్నాయి. కోస్తా, రాయలసీమలలో పౌరసమాజం ఉండవలసినంత బలంగా లేదు.

ఈ వాస్తవాలన్నిటి మధ్య ఆశారేఖ ఏమంటే కోస్తా, రాయలసీమ దళిత, బహుజన వర్గాలకు చెందిన వేలాది మంది ఆలోచనాపరులు సమైక్యతా నినాదపు బూటకత్వాన్ని బద్దలు కొడుతున్నారు. మెల్లమెల్లగా, తమకు వీలయినంత మేరకు వాస్తవాలు విప్పి చెపుతున్నారు. ఈ వాస్తవ ప్రచార ప్రభావం క్రమక్రమంగా విస్తరిస్తుంది. ఇవాళ కాకపోతే రేపయినా అక్కడి ప్రజలు మేలుకొంటారు. వాస్తవాలు తెలుసుకుంటారు. తమ నాయకులుగా, రక్షకులుగా నటిస్తున్న అక్రమ వ్యాపారులను, కబ్జాకోరులను, దళారులను నిలదీస్తారు. తమ ప్రాంతం మీద అంత ప్రేమ ఉంటే ఇన్ని దశాబ్దాలలో ఏ నిజమైన అభివృద్ధి సాధించారని ప్రశ్నిస్తారు. ఇప్పటికైనా కొత్త రాష్ట్రంలో ప్రజానుకూల అభివృద్ధి కోసం ప్రశ్నలు సంధిస్తారు. వర్తమాన విపరిణామాలను అధిగమించి తెలుగుజాతి రెండు ప్రాంతాలలోను సర్వతోముఖ వికాసం దిశగా, ప్రజాస్వామ్య ఆదానప్రదానాల దిశగా, ఉజ్వల భవిష్యత్తులోకి పయనిస్తుంది.

(రచయిత వీక్షణం సంపాదకులు)

రాష్ట్ర విభజనను ఆహ్వానిద్దాం

రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలపై పది ప్రజాసంఘాలు హైదరాబాద్‌లో నిర్వహించిన సదస్సులో వ్యక్తమైన అభిప్రాయాల నివేదిక

ఆగస్టు 8, 2013న హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'రాష్ట్ర విభజనను ఆహ్వానిద్దాం' ఉభయ రాష్ట్రాల ప్రజల మధ్య శాంతి, సహృద్భావాన్ని కాపాడుకుందాం, మూడు ప్రాంతాల సామాన్య ప్రజల అభివృద్ధికి కృషి చేద్దాం. వినాశకర, విధ్వంసకర స్వార్థ రాజకీయ ఎత్తుగడలను తిప్పికొడదాం అనే రాజకీయ ప్రకటనతో సీమాంధ్ర డెవలప్‌మెంట్ ఫోరం, ఆంధ్ర జర్నలిస్టు ఫోరం, బహుజన కెరటాలు, కావడి కుండలు కవుల వేదిక, మట్టిపూలు, ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ రచయిత్రుల వేదిక, హర్యాలి ముస్లిం రచయితల వేదిక, సావిత్రీ బాయి పూలే అధ్యయన వేదిక, సామాజిక న్యాయ పోరాట సమితి, హైదరాబాద్ ఫోరం ఫర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ ఈ సభలో దాదాపు 100 మందికి పైగా పాల్గొన్నారు. మూడు ప్రాంతాల నుంచి విభిన్న సామాజిక నేపథ్యాలతో వచ్చిన అనేక మంది సామాజిక కార్యకర్తలు, మేధావులు, కవులు, రచయితలు, ఉద్యోగులు, జర్నలిస్టులు, విద్యార్థులు పాల్గొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజనను ఎందుకు ఆహ్వానిస్తూ, తమ తమ ప్రాంతాలలో పరిష్కరించవలసిన, అభివృద్ధికి నోచుకోని అనేక అంశాలను లేవనెత్తారు.

ఎనిమిది సంఘాల నిర్వాహకుల తరఫున సమావేశానికి ఆహ్వానం పలుకుతూ ఆంధ్ర జర్నలిస్టుల ఫోరం కన్వీనర్ ఎ.ఎం.యజ్దానీ(డానీ) రాష్ట్ర విభజన అవసరమా కాదా అనే దానికి ఇది చర్చా వేదిక కాదని, రాష్ట్ర విభజనలో చర్చించవలసిన అనేక అంశాలను పౌర సమాజం ముందుకి తీసుకొని రావడం కోసం, ఇరు ప్రాంతాల ప్రజల మధ్య ఉండాల్సిన శాంతి సహృద్భావనల దిశగా ఈ చర్చ ఉండాలని, ముఖ్య విషయాలైన నీళ్లు, వ్యవసాయం, ఉద్యోగాలు, రాజధానులు, హక్కులు తదితర అంశాల మీద ఫోకస్‌గా చర్చను కొనసాగించాలని కోరారు.

అధ్యక్షత వహించిన సామాజిక కార్యకర్త సజయ మాట్లాడుతూ రెండు ప్రాంతాల ప్రజల మధ్య పరస్పర శాంతి, సుహృద్భావం, గౌరవం ఉన్నప్పుడే రాజకీయ నాయకులకి వారి ఎత్తుగడలకు అడ్డుకట్ట వేస్తామని అన్నారు. ఈ చారిత్రక సందర్భంలో మనం ఎలాంటి అంశాల గురించి ఆలోచించాలి, సమాజం ముందుకి తీసుకెళ్లాల్సిన అంశాలేమిటి? ఏ ఏ అంశాలు ఇరు రాష్ట్రాల ప్రజలను సామాజిక అభివృద్ధి క్రమంలోకి తీసుకెలుతాయి? విద్యావకాశాలు, సహజ వనరులు, వ్యవసాయం, సవాలుగా మారిన నదీ జలాలు, రాజధాని హైదరాబాద్ చుట్టూ సామాన్యులను అంచుల్లోకి నెట్టిన పెరిగిన వికృత అభివృద్ధి ఇలా ఈ అంశాలన్నింటినీ చర్చించాల్సిన అవసరం ఉంది. ఏ అంశమైనా రాజ్యాంగబద్ధంగా జరగాలే తప్పించి ఆవేశకావేశాలతో జరిగేవి కావు. ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాలలో ఈ రోజు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై నడుస్తున్న ఒక ద్వేష పూరితమైన ఆందోళన హైదరాబాదులోనూ, ఇతర తెలంగాణా జిల్లాలలోనూ ఎన్నో సంవత్సరాలుగా స్థిరపడిన ఆ ప్రాంతవాసులకు భయాందోళనలను కలిగిస్తున్నాయి. ఇప్పటి వరకు పరస్పరం ఉన్న స్నేహపూరిత బాంధవ్యాలు అకారణమైన ద్వేషాగ్నుల బారిన పడే అవకాశం ఉంది. నిజానికి ప్రజల మధ్య విద్వేషం లేదు. అందుకే ఈ సందర్భంలో ఇరు రాష్ట్రాల ప్రజల జీవితాలతో ముడిపడి ఉన్న అనేక అంశాల మీద మాత్రమే ఈ చర్చను కొనసాగించాలని మేము అనుకుంటున్నామని అన్నారు.

ముఖ్య అతిథి విశ్రాంత సంపాదకులు పొత్తూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, ప్రస్తుత వాతావరణంలో జరగవలసింది ఏమిటి, ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో ఆవేశాలను తగ్గించడం ఎలా అనేది ప్రతి ఒక్కరూ ఆలోచించాలి. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు విషయంలో నిర్ణయం జరిగిపోయింది. దానికి సుదీర్ఘ చరిత్ర ఉంది. దాని గురించి చర్చించాల్సిన అవసరం లేదు. ఆ నిర్ణయం ఎలా అమలు జరగాలనేదే ఇప్పుడు ఉంది. దురదృష్టవశాత్తూ మేము ఆశించిన పరిణామాలకు బదులు చాలా అన్యాయమైన పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. తెలుగువారందరి మధ్య ఒక సహృద్భావాన్ని కోరుకున్నాం. కానీ రాజకీయ వ్యవస్థను పాలకులు ధనార్జనకు, అక్రమార్జనకు ఉపయోగించుకున్నారు. జనం చీలిపోయారు. ఏ ఒక్క వర్గంలోనూ ఐక్యత లేదు. చీలిపోయిన వ్యక్తుల మధ్య ఒక ఏకీకృతానికి కృషి చేసే వ్యక్తులెవరూ లేరు. ఆచరణ సాధ్యంకాని అంశాల గురించి చర్చించాల్సిన అవసరం లేదు. ప్రాంతాల మధ్య పరస్పర విశ్వాసం లేకుండా పోయింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మూడు ప్రాంతాలుగా విడిపోయి తమ తమ అస్తిత్వాలతో ఉండాలని నా ఆలోచన. ఈ ప్రస్తుత వాతావరణంలో ఏ ఒక్క నాయకుడు ప్రజల మధ్యకు వెళ్లి అభివృద్ధికి కావలసింది ఇది అని చెప్పడం ఎందుకు సాధ్యం కావడం లేదు? ప్రజలను ఆ దిశగా ముందుకు నడిపించే నాయకులు కనిపించడం లేదు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత కొన్ని సమస్యలు వస్తాయి. అయితే అవి పరిష్కారం కానంత పెద్దవేం కాదు. నీళ్ల సమస్య గురించి ఆలోచిస్తే అన్ని ప్రాంతాల అవసరాల గురించి ఆలోచించాల్సిన అవసరం ఉంది. రాష్ట్రాల పునర్ వ్యవస్థీకరణ సమయంలో ఆవేశాలను తగ్గించే మానవీయ చర్యలకు శ్రీకారం చుట్టాలి అని చెప్పారు.

తూర్పు గోదావరి ఏలేశ్వరం నుంచి పవన్ మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో అన్ని రకాల వనరులకి, అవకాశాలకి దూరమై వేదన అనుభవిస్తున్న ప్రజలూ, 1947లో స్వాతంత్రం వస్తే ఈ రోజుకీ

ఎటువంటి అవకాశాలని పొందకుండా విద్య, ఆరోగ్యం, ఉద్యోగ విషయాలు, వ్యవసాయ రంగం ఇలా అనేక రంగాలలో వారి ఆకాంక్షలను పక్కన పెట్టారు. ఎవరైతే ప్రజల ఆకాంక్షలను తమ రాజకీయ ప్రయోజనాల కోసం, స్వార్థం కోసం ఉపయోగించుకున్నారో వారే ఇవాళ సమైక్యాంధ్ర ఉద్యమాన్ని ప్రోత్సహిస్తున్నారు. 2009 డిసెంబరు 9 ప్రకటన తర్వాత వచ్చిన పరిస్థితుల్ని మనం గనుక చూసినట్లయితే ఎక్కడ కూడా అక్కడి ప్రాంత ప్రజలను ఒక రాజకీయ అంశంలో చైతన్యవంతం చేయకుండా, ఎందుకు ఇలాంటి విభజన ప్రస్తావన వచ్చిందో అందుకు దారితీసిన పరిస్థితులను చెప్పకుండా దాచారు. నిజాయితీగా ఇప్పటి వరకు ఒక ప్రాంతానికి జరిగిన అన్యాయాన్ని సరిదిద్దే ప్రయత్నం ఏదీ జరగలేదు. ఇప్పుడు విభజన అనివార్యమైన పరిస్థితిలో ఇంకా ఇంకా విద్వేషాలను పెంచకుండా ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల ప్రజల ముందు ఉన్న సమస్యల గుర్తించి వాటి పరిష్కారం కోసం కృషి జరగాలి. అలాంటి దూరదృష్టి లేకుండా ఈ ప్రాంత రాజకీయ నాయకత్వం పెడదోవనపట్టే విధంగా ప్రజలను ముందుకు నెట్టడం చాలా దురదృష్టకరం.

తిరుపతి నుంచి రాయలసీమ అధ్యయన వేదిక అధ్యక్షులు భూమన్ మాట్లాడుతూ, ఒకప్పుడు ప్రాంతాల ఉనికితో మనుషులను గుర్తించడం జరిగేది. ఇప్పుడు రాయలసీమకు ఆ గుర్తింపు పోయింది. ఇప్పుడు సీమాంధ్ర అని అనడం పట్ల కూడా నాకు చాలా అభ్యంతరం ఉంది. కృష్ణా జలాల్లో రాయలసీమకు నికర జలాలు ఇవ్వాలని చాలా రోజుల నుంచి కొట్లాట చేస్తున్నాం. ఈ విషయంలో మాకు చాలా అన్యాయం జరిగింది. నీళ్లకు సంబంధించి స్పష్టంగా మాట్లాడుకోకుండా కుదరదు. తెలంగాణ వాదులకు ఈ విషయమై ఎలాంటి అభిప్రాయం ఉంది? ఏమి సమాధానం చెప్తారు. మాకు హక్కే లేదనడం సరైన విషయం కాదు. ఎలా పరిష్కరించుకుందాం? రెండు రాష్ట్రాలు ఏర్పడితే మేము ఆంధ్ర సర్కార్‌తో కలిసి ఉండలేం. తెలంగాణ వాళ్లు కూడా ఈ విషయమై తీవ్రంగా ఉండాలి. మేము సంఖ్య రీత్యా చాలా మైనారిటీలమై పోతాం. మాకు ప్రత్యేక రాయలసీమ అవసరం ఎంతైనా ఉంది. ఏ ఒప్పందం కూడా సరిగ్గా అమలైన దాఖలాలు లేవు. హైదరాబాద్ బాగా అభివృద్ధి అయిందన్న విషయం కూడా వాస్తవం కాదు. దేనిని చూసి మనం అభివృద్ధి అంటున్నాం? హైదరాబాదులోని ఏ సామాన్య చిరుద్యోగి నడిగినా వాళ్ల జీవన పరిస్థితి గురించి చెప్తారు. మా రాయలసీమ ప్రాంతానికి సరైన యూనివర్సిటీ లేదు. పిల్లల చదువు గురించి ఏ రకమైన చట్టాన్ని ముందుకు తీసుకువస్తాం. మనకి కొత్త ఉద్యోగాలు లేవు. ప్రపంచీకరణలో చాలా ఉద్యోగాలు ఎగిరిపోయాయి. దీనిపట్ల చాలా భ్రమలు ఉన్నాయి. హైదరాబాద్ తెలంగాణలో అంతర్భాగం. ఇది తెలంగాణ రాజధానిగానే ఉండాలి. మా రాజధాని ఏర్పాటు చేయడంలో చాలా నిధులు అవసరమవుతాయి. ఇప్పటికిప్పుడు రాయలసీమ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు అయ్యే అవకాశం లేదు. రాజధాని తిరుపతిలో ఏర్పాటు చేయాలని మా డిమాండ్. దాని చుట్టూ ఐటిపార్కులు ఏర్పాటు చేయడానికి అనువైన ప్రాంతాలున్నాయి. రాష్ట్ర రాజధానికి ఇరవై ముప్పై వేల ఎకరాలుండాలని ఎవరన్నారు? అంత అవసరం లేదు. ఉద్వేగాలను, కారణాలను అర్థం చేసుకుందాం. అదే సమయంలో ప్రజల్లో భ్రమలు, భయాలు కల్పించకుండా వివేచనతో సంయమనంతో అడుగు ముందుకు వేయాల్సిన తరుణమని తన అభిప్రాయాన్ని పంచుకున్నారు.

అనకాపల్లి నుంచి వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ కార్యదర్శి పి.అజయ్‌కుమార్ మాట్లాడుతూ సీమాంధ్రలో పెరుగుతున్న సందేహాలకు, భయ భావోద్వేగాలకు తెలంగాణ పౌర సమాజం నుంచి తాము కొన్ని స్పష్టమైన హామీలను కోరుతున్నామన్నారు. ప్రైవేటు సెక్టారు ఉద్యోగాలలో ఎలాంటి రిజర్వేషన్‌ల లేవు. భవిష్యత్‌లో కూడా ఉండకపోవచ్చు. కనుక తెలంగాణ రాష్ట్రంలో కూడా ఇదే పరిస్థితి ఉంటుంది. ఇందుకు సంబంధించిన విస్పష్టమైన ప్రకటన రావాలి. 'నిమ్స్' వ్యవసాయ పరిశోధన వంటి కేంద్రాలు కేంద్ర ప్రభుత్వం నుండి ఇంతకు ముందు ఉమ్మడి రాష్ట్రానికి వచ్చాయి. వాటి ఏర్పాటు కొత్త రాష్ట్రంలో ఏర్పడే వరకు వాటి సేవలను రెండు రాష్ట్రాల తెలుగు ప్రజలు పొందే విధంగా ఉండాలి. చట్టబద్ధమైన పద్ధతులలో స్థిరాస్తులు సంపాదించుకున్న వారికి పూర్తి రక్షణ లభిస్తుందని, చట్టబద్ధమైన హక్కులు కొనసాగుతాయని హామీ ఉండాలి. ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ సంక్షేమ బోర్డులో సభ్యత్వం తీసుకుని, గుర్తింపు కార్డులు పొందిన ఆంధ్రప్రాంత నిర్మాణ కార్మికులను 'తెలంగాణ సంక్షేమ బోర్డు' తన సభ్యులుగా కూడా గుర్తించి, తెలంగాణ ప్రాంతంలో వారు ఉన్నన్ని రోజులు సౌకర్యాలు, రక్షణ లభించేలా చూడాలి. రేపు రెండు రాష్ట్రాలుగా మారి, రెండు సంక్షేమ బోర్డులు ఏర్పడితే, రెండు రాష్ట్రాల మధ్య ఉపాధి కోసం ప్రయాణించే నిర్మాణ రంగ కార్మికులకు ఆ ప్రాంతాలలో ఉండి పని చేసే సమయంలో ఒక కార్డుపై రెండు చోట్ల వారికి బోర్డు నుండి సహాయం అందించేందుకు తెలంగాణ సంక్షేమ బోర్డు కృషి చేయాలి. అసంఘటిత రంగ కార్మికులకు కూడా అసంఘటిత రంగ సంక్షేమ బోర్డు కృషి చేయాలి. నదీజలాలకు సంబంధించి రెండు రాష్ట్రాల హక్కులపై ఒక ట్రిబ్యునల్ ఏర్పాటు, నదీ జలాలను న్యాయంగా పంపకం చేయడానికి కృషి చేయడం. ఈ సందర్భంలో రాయలసీమలో ఉన్న ప్రత్యేక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ఆ ప్రాంతం వారికి కూడా న్యాయం జరిగేలా చూడాలి. ప్రభుత్వ ఉద్యోగాలను ఎగువస్థాయి, దిగువ స్థాయిగా విభజించి, దిగువ స్థాయిలో ఉండే ఉద్యోగాలలో ఎక్కడైనా జిఓ 610కి భిన్నంగా జరిగినా, అందుకు సంబంధించిన కోర్టు కేసులు ఉంటే వాటిని ఉపసంహరించుకుని, వారికి భద్రత కల్పిస్తామని హామీ ఇవ్వాలి. తెలంగాణ ప్రాంతంలోని విశ్వ విద్యాలయాల్లోను, కేంద్ర విశ్వవిద్యాలయాల్లోను ఆంధ్ర ప్రాంత విద్యార్థులకు ఎలాంటి వివక్షత ఉండదని హామీ ఇవ్వాలి. మద్రాసు నుండి హైదరాబాదుకు వచ్చిన సినిమా పరిశ్రమ లేదా అటువంటి పరిశ్రమలు, వ్యాపార, వాణిజ్య కంపెనీలకు ఉమ్మడి రాష్ట్రంలో ఇచ్చిన రాయితీలు ఆయా షరతులకు లోబడి తెలంగాణ రాష్ట్రంలో కొనసాగాలి. ఆంధ్ర రైతాంగానికి సాగునీరు ఇవ్వడానికి ఇప్పటికే ఉన్న ట్రిబ్యునల్ అవార్డుల ప్రకారం ఉంటుంది కాబట్టి ఎలాంటి అభ్యంతరం ఉండదనుకుంటున్నాం. పోలవరంలో ఆదివాసిలు ముంపుకి గురవకుండా లేదా కనిష్టంగా తగ్గించే ప్రత్యామ్నాయాలను పరిశీలించాలని ఇందుకోసం చర్చకు ఆంధ్ర పౌర సమాజం, మేధావులు కూడా ముందుకి రావాలి. భూమి సమస్యపై రెండు రాష్ట్రాలు దృష్టి సారించి ఆలోచించవలసిన విషయాలు: ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాలలో భూముల సమగ్ర సర్వే సెటిల్‌మెంట్ జరిగి దశాబ్దాల కాలం గడిచినా

అమలులోకి రాలేదు. ఒక నిర్దిష్టమైన తేదీని నిర్ధారించుకొని అంతకు ముందు ఉమ్మడి రాష్ట్రంలో పేదలకు ఇచ్చిన డి ఫారం, లావణి, సీలింగు, భూదాన భూములకు ఇచ్చిన 'అసైన్‌మెంట్' భూములను పూర్తిస్థాయి పట్టా భూములుగా గుర్తించాలి. ప్రగతిశీలమైన ఉమ్మడి రాష్ట్ర భూమి చట్టాలైన 9/77, 1/70, ఆంధ్రప్రదేశ్ కౌలుదారీ చట్టాలు రెండు రాష్ట్రాలలోనూ కొనసాగే విధంగా చూడాలి. వ్యవసాయం చేయనివారు, సుస్థిరమైన వ్యవసాయేతర ఆదాయాలను కలిగిన వారి నుండి, తగు నష్టపరిహారం చెల్లించి ఆ భూములను స్వాధీనం చేసుకోవాలి. వాటిని ప్రభుత్వ భూములుగా గుర్తించి పేదలకు పంపిణి చేయాలి. తెలంగాణ కౌలుదారీ చట్టం 38ఇ కింద ఇచ్చిన పట్టాలను పూర్తిస్థాయి సెటిల్‌మెంట్ పట్టాలుగా గుర్తింపు ఇవ్వాలి. తెలంగాణ కౌలుదారీ చట్టంలోని ప్రగతిశీల అంశాలను ఆంధ్ర కౌలుదారీ చట్టంలోకి తేవాలి. రెండు ప్రాంతాలలోనూ కౌలు స్వభావంలో వచ్చే మార్పులను గుర్తించాలి. నివాసేతర, సుస్థిర ఆదాయం ఉండిన వర్గాల భూములను సాగుచేసే కౌలుదార్లను, వాణిజ్య పంటల కోసం సన్న, చిన్నకారు రైతుల భూములను కౌలుకు తీసుకున్న ధనిక రైతు కౌలుదార్లను విడి విడిగా చూడాలి. ఆ విధంగా కౌలు చట్టాలలో మార్పులు చేయాలి. ఒక రెవెన్యూ గ్రామంలోని మొత్తం భూమిలో 10 శాతానికి తక్కువ లేకుండా భూమిని ఊరు ఉమ్మడి అవసరాలకు రిజర్వు చేసే 'హైదరాబాద్ స్టేట్' సెటిల్‌మెంట్ సూత్రాన్ని పునరుద్ధరించి, ఆంధ్రలో కూడా వర్తింప చేయాలి. వ్యవసాయంలో లేనివారు, వ్యవసాయం చేయనివారు వ్యవసాయ భూములను కొనడం నిషేధించాలి. 'సర్వే సెటిల్‌మెంట్' కోర్టులు(1వ అంశం) భూసంస్కరణల కోర్టులుగా 'సెటిల్‌మెంట్' ఎల్ ఆర్ ట్రిబ్యునల్స్' గా కూడా పని చేయాలి. ఇవి హక్కుల నిర్ధారణ, భూ సంస్కరణలు, కౌలు సంస్కరణలు పరిష్కార ట్రిబ్యునల్స్‌గా పని చేయాలి. 'సెటిల్‌మెంట్' ఎల్ ఆర్ ట్రిబ్యునల్స్ రూపొందించిన భూమి రికార్డులకు చట్టబద్ధత కల్పించి ప్రభుత్వం బాధ్యత వహించాలి. స్వాధీన అనుభవం, పట్టా హక్కుల వివాదాలు, పేద కౌలుదార్ల హక్కులు, అక్రమణల తొలగింపు వంటి వివాదాలను సివిల్ కోర్టుల పరిధి నుండి తొలగించి ఈ ట్రిబ్యునల్స్‌కు అప్పగించాలి. పేదలకు భూముల పంపిణిని, ప్రజా ప్రయోజనంగా గుర్తించాలి. దానికోసం భూసేకరణ చట్టం ప్రయోగించాలి. భూసంస్కరణల చట్టంలోని సీలింగు పరిమితిని తగ్గించాలి. 'సెటిల్‌మెంట్ ఎల్ ఆర్' ట్రిబ్యునల్స్ ఇచ్చే ధ్రువపత్రం లేదా సమాచార పత్రం ఆధారంగానే రిజిస్ట్రేషన్‌లు నిర్వహించాలి. దస్తావేజులలో సమాచారం, ట్రిబ్యునల్ పత్రంలోని సమాచారానికి భిన్నంగా ఉంటే దానికి ఆయా పార్టీలే బాధ్యత వహించాలి. తెలంగాణలో పేదల సాగులో లక్షలాది ఎకరాల ఇనాం భూములు హక్కులు నిర్ధారణ కాకుండా ఉండిపోయాయి, వాటిని పరిష్కరించాలి. తెలంగాణ ప్రాంతంలోని కౌలుదారీ, ఇనాం చట్టాలకు సంబంధించి కెఆర్‌సిసి సిఫార్సులను పరిగణనలోకి తీసుకోవాలి. షెడ్యూలు ప్రాంతాలకు బయట ఉన్న ఆదివాసిలకు, భూములకు రక్షణ కల్పించాలి. అవసరమైతే ఒక ప్రత్యేక చట్టాన్ని రూపొందించాలి. షెడ్యూలు ప్రాంతాలను ఆనుకుని ఉన్న ఆదివాసి గ్రామాలను, నల్లమల అటవీ ప్రాంతం ఆదివాసి గ్రామాలను షెడ్యూలు ప్రాంతాలుగా గుర్తించాలి. సన్న, చిన్నకారు రైతుల వ్యవసాయం నిలబడె సుస్థిర వ్యవసాయ విధానాలను రెండు రాష్ట్రాలు అమలు పర్చాలి.

సీమాంధ్ర డెవలప్‌మెంట్ యూత్ ఫోరమ్ వ్యవస్థాపకుడు, ఇంజనీర్ రామ్ సుధాకర్ మాట్లాడుతూ 60 సంవత్సరాల నుంచి ఉన్న సమస్యను పరిష్కరించకుండా రాజకీయ నాయకులు తాత్సారం చేశారు. అందువల్లే ఈ తరానికి చెందిన మేము మా భవిష్యత్ గురించి ఆందోళన చెందాల్సి వస్తోంది. హైదరాబాద్ కేంద్రంగా ముఖ్యమైన అన్ని ఉన్నత విద్యా సంస్థలు కేంద్రీకరించడం వల్ల ఎంతో మంది ఆ వైపుగా ఆలోచించలేక పోతున్నారు. అదే మా ప్రాంతాలలో కూడా ఈ విధమైన విద్య అవకాశాలను వివిధ జిల్లాలో ఏర్పాటు చేసుంటే ఈ విధమైన పరిస్థితి ఈనాడు వచ్చేది కాదు. హైదరాబాదును మాత్రమే కేంద్రంగా తీసుకుని ఇతర తెలంగాణ ప్రాంతాల సామాన్య ప్రజలకు ఎలా అన్యాయం జరిగిందో అలానే సీమాంధ్ర ప్రాంతంలో కూడా అనేక ప్రాంతాలు అభివృద్ధి కాలేదు పైగా వనరుల విధ్వంసం జరుగుతోంది. ఇది ఇప్పటితో ఆగకపోతే మా భవిష్యత్ తరాలు మమ్మల్ని క్షమించవు. విడిపోవడం ద్వారా రెండు రాష్ట్రాలుగా అభివృద్ధి సాధించుకుంటామని మా యువతరం బలంగా నమ్ముతోంది. అవకాశాలు అందించాలే గానీ ఒక బలమైన రాష్ట్ర పునర్ నిర్మాణాన్ని చేస్తామని మా నమ్మకం. అన్ని వర్గాలకు ఇందులో అవకాశం వస్తుంది. శ్రీకాకుళం నుంచి తిరుపతి వరకూ కూడా ఆయా ప్రాంతాల వనరులను బట్టి రాష్ట్ర పునర్ నిర్మాణం జరగాలి. హైదరాబాద్ అనుభవంతో వికేంద్రీకరణ కూడా జరగాల్సిన అవసరం ఉందని మేము భావిస్తున్నాం. ఇప్పుడు అడుగుతున్న ప్రశ్నలివే గానీ, వాటికి ఏ మీడియా కూడా సరైన ప్రాధాన్యత ఇవ్వకుండా కేవలం రాజకీయ నాయకుల సమైక్యవాద నినాదాన్నే ముందుకు తీసుకురావడం చాలా దురదృష్టకరం అన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ విధానాలపై పని చేస్తున్న 'రైతు స్వరాజ్య వేదిక' నుంచి డాక్టర్ రామాంజనేయులు మాట్లాడుతూ ఇప్పుడు రాష్ట్రంలోని మూడు ప్రాంతాలలోనూ ఆయా భౌగోళిక ప్రాంతీయ పరిస్థితులకు అనుకూలంగా వ్యవసాయం జరగడం లేదు. పెట్టుబడి విపరీతంగా పెంచే వ్యాపార పంటలతో పాటు నీటి వాడకం అధికంగా ఉండే పంటలనే ప్రోత్సహించడం జరుగుతోందని దీని వలన అన్ని ప్రాంతాలలోనూ రైతులు సంక్షోభంలో ఉన్నారు. ముఖ్యంగా వర్షాధార ప్రాంతాలలోనూ, కౌలు అధికంగా ఉన్న ప్రాంతాలలోనూ ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, దేశంలో రైతుల ఆత్మహత్యల స్థానంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రెండో స్థానంలో ఉందని అన్నారు. నదీ జలాలు, వాటి లభ్యత, అన్ని ప్రాంతాలకు న్యాయం జరిగేలా నీటివాడకాన్ని తగ్గించే వ్యవసాయ విధానాలను రెండు రాష్ట్రాలలో అమలు చేసుకుంటేనే రైతుల స్థితిగతులు మారుతాయని, ప్రాంతీయ వనరులు, స్థానిక పంటలను రక్షించుకునే విధంగా వ్యవసాయం విధానం రూపొందించడంలో ప్రజలు కీలక పాత్ర వహించాలని చెప్పారు.

ఒంగోలు నుంచి బహుజన కెరటాలు వ్యవస్థాపకులు, బహుజన ఆంధ్ర జెఏసి కన్వీనర్ పల్నాటి శ్రీరాములు మాట్లాడుతూ కేవలం ఆర్థిక ప్రయోజనాల కోసమే సమైక్యాంధ్ర ఉద్యమం జరుగుతోందని తామెవరం అనుకోవడం లేదు. అగ్రకుల పెత్తందారీ మనస్తత్వం బహుజన కులాల రాజకీయ, సామాజిక అభివృద్ధిని సహించలేక పోవడమే ఈ సమైక్యాంధ్ర ఉద్యమానికి నాంది అనంటున్నారు. ఆంధ్ర ప్రాంత ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనారిటీ నాయకులు, సంఘాలు, ప్రజలు అందరూ చిన్న రాష్ట్రాలకి మనస్ఫూర్తిగా ఆహ్వానం పలుకుతున్నారు. స్వతంత్రం లేనివాళ్లు మరో

స్వతంత్ర పోరాటం అనాలి గానీ పరుచూరి అశోక్‌బాబు, లగడపాటి రాజగోపాల్, రాయపాటి వారి తొత్తులకు ఆ మాట అనే హక్కు, అర్హత లేదు. దీక్షలు ఎవరు చేస్తున్నారు, ఎవరు రెచ్చగొడుతున్నారు? వీరి వలన అణగారిన ప్రజల మధ్య ఒక విద్వేషాగ్ని రెచ్చగొట్టే ప్రమాదం ఉంది. బాధ్యత కలిగిన పౌరులుగా తాము సమైక్యాంధ్ర ఉద్యమానికి స్పందించి గవర్నర్‌ను కలిశామని చెప్తున్న సీమాంధ్ర మంత్రుల భార్యలు ఏనాడూ దళిత బహుజన, ఆదివాసి మహిళలపై జరుగుతున్న అత్యాచారాలపై ఏనాడైనా స్పందించారా? తెలంగాణ కోసం వందల మంది బిడ్డలు ఆత్మ బలిదానాలు చేసుకుంటుంటే వారి తల్లుల గర్భశోకాన్ని ఏ రోజైనా గుర్తించారా? వారి కళ్ల నుంచి ఒక్క కన్నీటి చుక్క బయటకు రాలేదే మరి. ఈ రోజు వారు తాము బాధ్యత కలిగిన పౌరులమని ఎలా చెప్పుకుంటున్నారు. 2009 నుంచి కూడా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోరడం అనేది ఒక ప్రజాస్వామ్య హక్కుగా భావిస్తూ సంఘీభావంగా అనేక సమావేశాలు ఆంధ్ర ప్రాంతంలో నిర్వహించామని, చిన్న రాష్ట్రాల ఏర్పాటుతో దళిత బహుజన సమూహాలకు సాధికారతే కాకుండా రాజ్యాధికార దిశగా అడుగులు పడతాయనే అంబేద్కర్ అభిప్రాయంతో తాము పూర్తిగా ఆమోదించి ఆ దిశగా ప్రయాణిస్తున్నామని అన్నారు. తెలంగాణకు అనుకూలంగా దాదాపు ఐదు బహుజన కెరటాలు పత్రిక సంచికలను ముద్రించి విస్తృతంగా పంపిణీ చేశామని అన్నారు. ఆంటోని కమిటీని స్వాగతిస్తున్నామని అన్నారు.

ఒంగోలు నుంచి దళిత బహుజన ఉద్యోగుల జెఎసి కన్వీనర్ తేళ్ళ అంజయ్య మాట్లాడుతూ ఇప్పుడు ఈ రాష్ట్రంలో జరుగుతున్నది రెండు కులాల రాజకీయ అధికార కుమ్ములాట. దీనిలో దళిత బహుజనుల ఉద్యోగ మిత్రులు పాల్గొని తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని కోరుతున్నాం. ఈ దేశంలో రాజ్యాంగం లేనప్పుడు దళిత, బహుజనులకు విద్యా ఉద్యోగావకాశాలు లేవు. రాజ్యాంగం వచ్చిన తర్వాతే రాజ్యాంగబద్ధంగా దళిత బహుజనులకు ఉద్యోగాలు వచ్చాయి. అవి ఎక్కడికీ పోవు. దళిత బహుజన ఉద్యోగులు ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదు. సమైక్యవాదుల విష వలయంలో చిక్కుకోవలసిన అవసరం లేదు. పల్లెల్లో ప్రజలు తెలంగాణ వచ్చినా, హైదరాబాద్ పోయినా తమ జీవితాల్లో ఏ మార్పు తీసుకవస్తుందని ప్రశ్నిస్తున్నారు. మా ఊరి అభివృద్ధి గురించి మాట్లాడమని నిలదీస్తున్నారు. దీన్ని ఏ మీడియా కవర్ చేయడం లేదు. ఏపిఎన్‌జిలు చేస్తున్న సమ్మెలో మేమెవరం కూడా పాల్గొనడం లేదు.

విజయవాడ నుంచి ముస్లిం రిప్రజెంటేషన్ ఫోరం కన్వీనర్ సయ్యద్ రఫీ మాట్లాడుతూ ఈ రోజు విభజనను అంగీకరించే అనేక మంది ఆంధ్ర, రాయలసీమ ప్రాంత గొంతుకలకు అక్కడ ప్రభుత్వ అనుమతి లేదు. విభజన వల్ల మాకు ఏరకమైన అభ్యంతరం లేదు, దీని ద్వారా ఇరు ప్రాంతాల అభివృద్ధికి ఆస్కారం ఉంటుందని చెప్పడానికే మేము ఈ రోజు ఇక్కడకు వచ్చాం. మా గొంతు అక్కడ వినిపించనివ్వరు. మీడియా తీసుకోదు. పార్లమెంటులో వెంటనే బిల్లు పెట్టి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను త్వరితంగా పూర్తి చేయాలని కోరుకుంటున్నాం. హైదరాబాద్‌లోని వక్ఫ్ భూములను ఆక్రమించుకున్నది ఎవరో ఈ రాష్ట్ర ప్రజలందరికీ తెలుసు. అయినా గానీ సమైక్యాంధ్ర అంటున్నారు. ఎవరి ప్రయోజనం కోసం ఈ సమైక్యాంధ్ర? చరిత్ర గురించి తెలిసీ తెలియకుండా యువకులు మాట్లాడేస్తున్నారు. హైదరాబాద్ కేంద్రపాలిత ప్రాంతం కావాలని అంటున్నారు. దానికసలు తాత్వికత ఉందా? అటు తెలంగాణ ప్రాంత ప్రజల్ని, ఇటు ఆంధ్ర, రాయలసీమ ప్రాంత ప్రజలను మరింత దోపిడీకి గురిచేయడం కోసమే సమైక్యాంధ్ర ముసుగులో అన్ని పార్టీల రాజకీయ నాయకులు పని చేస్తున్నారని అన్నారు.

జల రంగ నిపుణులు విద్యాసాగర్ మాట్లాడుతూ గోదావరి బేసిన్‌కు రాయలసీమకు భౌగోళికంగా కూడా సంబంధం లేదు. ఉన్న సంబంధం కృష్ణా బేసిన్ తోనే. మనకు నికర జలాలు, మిగులు జలాలు అని రెండు రకాలు ఉంటాయి. కర్నాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌ల మధ్య నికర జలాల పంపిణీ ఎప్పుడో జరిగింది. రాష్ట్రంలో ప్రాజెక్టుల వారీగా నాగార్జున సాగర్, కెసి కెనాల్, కృష్ణా డెల్టాలకి నికర జలాల పంపిణీ ఎప్పుడో జరిగి పోయింది. ఆంధ్రప్రదేశ్ ఒకటిగా ఉన్నా లేదా రెండుగా విడిపోయినా గానీ ఆ కేటాయించిన ఆ 811 టిఎంసి నీళ్లనే వాడుకోవాలి తప్పించి ఏ రాష్ట్రమూ అదనంగా జాలి తలిచి ఇవ్వదు. ఇది స్పష్టం. మిగులు జలాలు వాడుకునే అవకాశం ఉంది కానీ హక్కు ఉండదు. వాటి మీద ప్రాజెక్టులు కట్టకూడదు. అయినా గానీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రాజెక్టులు కట్టేసింది. ఇప్పుడు నికర జలాల్లో తెలంగాణకు 300 టిఎంసిల వాటా ఉంది. మిగిలింది ఇతర ప్రాంతాలకు, రాయలసీమకు హక్కు లేదని భాధపడుతున్నారు. అయితే ఉమ్మడి రాష్ట్రంగా కలిసి ఉన్నప్పుడే అయ్యో ఆ ప్రాంతం అన్యాయమైపోతుందని అనుకుని ఇవ్వొచ్చు కదా, కానీ ఇవ్వలేదు. ఇప్పుడు కోస్తా వాళ్లు ఇవ్వరనేది జగమెరిగిన సత్యం. సొంత అన్నదమ్ముల మధ్య పంపకాల్లోనే పూచికపుల్ల వదలరు ఎవరూ. అట్లాంటిది ఇరు ప్రాంతాల మధ్య తమకు హక్కుగా వచ్చిన దాన్ని వదులుకుంటారా ఎవరైనా. ఏ ప్రాంత భూభాగంలో ఉన్న ప్రాజెక్టులపై ఆ రాష్ట్రానికే అధికారం ఉంటుంది. నాగార్జున సాగర్, శ్రీశైలం, రాజోలిబండ వీటికి ఒక కంట్రోలు బోర్డు పెట్టే అవకాశం ఉంది.

కావడి కుండలు కవితా సంకలనం సంపాదకులు కోయి కోటేశ్వరరావు మాట్లాడుతూ సమైక్యాంధ్ర ఉద్యమం ఒక అలారం మోతలాంటిదని, తెలంగాణా ఉద్యమం ఒక తొలి కోడి కూతలాంటిదని మేము నాలుగేళ్ల కిందటే మీడియా సాక్షిగా ప్రకటించాం, కావడి కుండలుగా విడిపోదాం కావడిబద్ధగా కలిసి ఉందాం, పరస్పరం గౌరవించుకుందాం అనే స్ఫూర్తితో 2010లోనే తెలంగాణ ప్రజల ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షకు సంఘీ భావం తెలుపుతూ దాదాపు 45 మంది ఆంధ్రా ప్రాంత కవులతో సంకలనం తెచ్చామని తెలిపారు. తెలంగాణ ఉద్యమానికి సాంస్కృతికంగా కవులు, రచయితలే ఊపిరి అందించారు. సమైక్యాంధ్ర ఉద్యమానికి కవులు కలాలు, గళం విప్పడం లేదంటే అది ఎంత కృత్రిమమైనదో అర్థం అవుతోంది.

సామాజిక ఆంధ్ర, రాయలసీమ, తెలంగాణ సమన్వయ కమిటి కో ఆర్డినేటర్ సాంబశివరావు (ఉ.సా.) మాట్లాడుతూ రాజకీయ నాయకులకు వేయాల్సిన ఒకే ఒక్క సూటి ప్రశ్న ఏమిటంటే, ఏమనుకుని తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు అనుకులంగా లేఖలు ఇచ్చారని. ఇప్పుడు పదవులకు రాజీనామా చేయడం కాదు, పార్టీలకు రాజీనామా చేయాలని డిమాండ్ చేయాలి. ప్రజలు ఇలాంటి రాజకీయ నాయకుల మోస పూరిత విధానాలను ప్రశ్నించి తమ ప్రాంతాల అభివృద్ధికి ఎందుకు పాటుపడలేదో నిలదీయాల్సిన తరుణమిది అన్నారు.

సెటిలర్స్ ఫోరం వ్యవస్థాపకురాలు, మాజీ శాసన సభ్యురాలు కాట్రగడ్డ ప్రసూన మాట్లాడుతూ ఆ ప్రాంతం నుంచి తెలంగాణ ప్రాంతానికి వచ్చి ఇక్కడ ప్రజలతో, భూమితో అనేక మంది జీవిస్తున్నారు. తెలంగాణ సమాజం ఎంతో అభిమానంతో మమ్మల్ని అక్కున చేర్చుకుంది. అయితే మారుతున్న రాజకీయ పరిస్థితుల్లో అటువైపు అభద్రత ఎలా వస్తోందో అలానే ఇక్కడ స్థిరపడిన వారిలో కూడా అభద్రత కనిపిస్తోంది. ముఖ్యంగా హైదరాబాద్‌లో స్థిరపడిన సామాన్యులకు. వీటిని పారదోలేలా మనందరం కలిసి పని చేయాలి. తగినటువంటి రక్షణ చర్యలు ఉండాలని కోరుకుంటున్నామని వివరించారు.

ఉత్తరాంధ్ర రచయిత బమ్మిడి జగదీశ్వరరావు మాట్లాడుతూ ముందుగా తాను తెలంగాణ ప్రజలకు ఉత్తరాంధ్ర ప్రజల తరఫు నుంచి క్షమాపణలు చెపుతున్నానని, శ్రీకాకుళం నుంచి విశాఖ పట్టణం వరకూ ఉన్న ఏజెన్సీ ప్రాంతంలో వైద్య సౌకర్యాలు అందక మలేరియా వంటి విష జ్వరాలతో వేల మంది చనిపోయినా పట్టించుకోనివారు, పెట్టుబడిదారీ అభివృద్ధి మూసలో పచ్చటి పంట పొలాలను, తీర ప్రాంతాన్ని కబళిస్తుంటే ప్రశ్నించని వారు ఇప్పుడు రాష్ట్రం విడిపోతుందంటే మాత్రం మూర్ఖంగా రోడ్ల మీదకు రావడం చాలా దు:ఖంగా ఉంది. కలిసి ఉంటే ఏ ప్రయోజనం జరిగిందని ఈ రోజు విడిపోతుందంటే బాధపడుతున్నారు. ఇప్పటికైనా ఆ ప్రాంత ప్రజల అభివృద్ధి కోసం ఆలోచించాలి.

జై ఆంధ్ర జెఎసి రాష్ట్ర ఛైర్మన్ జయబాబు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రక్రియను త్వరితం చేసి పార్లమెంటులో బిల్లును ప్రవేశ పెట్టాలని మేము డిమాండ్ చేస్తున్నామని, నీళ్ల విషయంలో స్పష్టత తెచ్చుకుని ఇరు ప్రాంతాలకు అన్యాయం జరగకుండా ఒప్పందాలు జరగాలని అన్నారు.

హక్కుల ఉద్యమ నేత ప్రొ. హరగోపాల్ మాట్లాడుతూ, తమకు ఇరు ప్రాంతాల ప్రజల మీద అపారమైన గౌరవం ఉందని, ఆ ప్రాంతాల ప్రజలను ప్రేమిస్తున్నామని ఎలాంటి అభద్రతలకు లోను కాకూడదన్నారు. ముఖ్యంగా హైదరాబాదు నగరంలో జరిగిన దోపిడీకి వ్యతిరేకంగా అధికార దుర్వినియోగానికి పాల్పడిన వారి మీద ఈ పోరాటం. ఇరు రాష్ట్రాలుగా విడిపోవడం వల్ల ప్రత్యేక అస్తిత్వంతో పరస్పర గౌరవంతో అభివృద్ధి చెందటానికి ఏర్పడుతుంది, ప్రజల మధ్య ఆ సహృదయత ఎప్పటికీ నిలిచి ఉండాలి. అందుకు ప్రజా రంగంలో పని చేస్తున్న మన లాంటి కార్యకర్తలు నిరంతరం కృషి చేయాలని చెప్పారు.

దళిత రచయిత్రి జూపాక సుభద్ర మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడితే ఆంధ్ర ఉద్యోగులు తాము వెళ్లి పోవాల్సిందేనా అనే భయాందోళనలను వ్యక్తం చేస్తున్నారు. అయితే ఆ భయం ఉండాల్సిన అవసరం లేదు. ఉద్యోగుల భద్రతకు రాజ్యాంగపరమైన అన్ని రక్షణలు ఉంటాయి. వీరి భద్రతను గురించి అనవసర భయాలకు, అపోహలకు తావివ్వకుండా ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలి.

దళిత రచయిత్రి గోగు శ్యామల మాట్లాడుతూ ఇప్పుడు అక్కడ ఆధిపత్య వర్గాలు ఉద్యమాలు చేస్తున్న తీరు ఆశ్చర్యం కలిగిస్తోంది. అక్కడి రెండు ఆధిపత్య వర్గాలు పని గట్టుకుని తెలంగాణా విడిపోతే నీరు నియామకాల పట్ల ప్రజలను గందరగోళంలోకి నెట్టడం ఏ మాత్రం తగదు. వారి దృష్టి అంతా హైదరాబాద్ చుట్టూనే తిరగడం వారి స్వార్థ ప్రయోజనాలకే గానీ మరి దేని గురించి కాదని చెప్పవచ్చు.

భద్రాచలం నుంచి ఆదివాసి మహిళా గ్రామ సర్పంచ్ పి.జ్యోతి మాట్లాడుతూ పోలవరం కడితే తమ ఆదివాసి గ్రామాలన్నీ మునిగి పోతాయని కొన్ని లక్షల మందిమి నిరాశ్రయులమవుతామని పోలవరం నిర్మాణం ఆపి వేయాలని చెప్పారు.

ఈ సమావేశంలో ఇంకా ప్రముఖ కవులు, రచయితలు, సామాజిక రాజకీయ కార్యకర్తలు పైడి తేరేష్‌బాబు, క్రాంతి, సుమిత్ర, మురళి, బి.పరంజ్యోతి, రత్నమాల, చలసాని ప్రసాద్, పెద్ది కృష్ణ, పిల్లా వెంకటేశ్వర రావు, కృపాకర్ మాదిగ, స్కైబాబ, నందిని సిధారెడ్డి, ఒమ్మి రమేష్‌బాబు, ప్రొ. రమణమూర్తి, జితేందర్, డా. లలిత, డా. సత్యలక్ష్మి, డా.సునీత, పిల్లి కవిత, మంజుల, మిరపా మాధవి, జ్యోతి, కిషన్‌రావు, కన్నెగంటి రవి, పద్మ, కిరణ్ కుమార్, డా. ఉషా సీతాలక్ష్మి, ఆషా, అజిత, కొండల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చర్చానంతరం సమావేశం ఈ కింది తీర్మానాలను ఆమోదించింది.

రెండు రాష్ట్రాలు ఏర్పడాలి. రెండు రాష్ట్రాల్లో అభివృద్ధి సామాన్య ప్రజల అవసరాలు, ఆకాంక్షల కేంద్రంగా జరగాలి. పార్లమెంట్‌లో వెంటనే బిల్లు ప్రవేశపెట్టాలి.

రాష్ట్ర విభజనను ఆహ్వానిస్తూ ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల ప్రజల అభివృద్ధి, హక్కులపైన పని చేస్తున్న దళిత, బహుజన, ఆదివాసి, మైనారిటీ ప్రజా సంఘాల గొంతుకలను, బయటకు రాకుండా ఆపుతున్న ప్రయత్నాలను దానికి పోలీసుల, ప్రభుత్వం, మీడియా సహకారాన్ని ఖండిస్తున్నాం.

రాయలసీమ, ఆంధ్రా ప్రాంతాలలో మీడియా 10 శాతం ప్రజల ఆందోళనలని మాత్రమే పెద్దగా చూపిస్తూ 90 శాతం ప్రజల ఆకాంక్షలని ప్రతిబింబించట్లేదు. ప్రజల అభిప్రాయాలని ప్రజాస్వామికంగా ప్రతిబింబించాలి.

రాజకీయ పార్టీలన్నీ రాష్ట్ర విభజనపై తాము ప్రకటించిన వైఖరికి కట్టుబడి విభజన ప్రక్రియను త్వరితంగా పూర్తి చేయడానికి కేంద్ర ప్రభుత్వానికి పూర్తి సహకరించాలి.

ప్రజలలో అనేక అపోహలకు దారి తీస్తున్న అంశాలు: విద్యావకాశాలు, ఉద్యోగాలు, జల వనరులు, రాజధానులపై అపోహలు తొలగించాలి. సహజ న్యాయం జరిపించడానికి రాయలసీమ, తెలంగాణ, కోస్తా ప్రాంతాల నుండి నిపుణులతో కమీటీలు ఏర్పాటు చేయాలి.

తెలంగాణలోనూ, హైదరాబాద్‌లోనూ ఎన్నో దశాబ్దాల నుండి నివశిస్తున్న రాయలసీమ, ఆంధ్ర ప్రజలలో అనవసర భయాలను రేకెత్తించే కోస్తాంధ్ర, రాయలసీమ రాజకీయ నాయకుల ప్రకటనలు వెంటనే మానుకోవాలి.

హైదరాబాద్ అనుభవం దృష్ట్యా కొత్తగా ఏర్పడే రాజధానిలో విద్యా, ఉద్యోగ, పరిశ్రమలను వికేంద్రీకరణ జరిగేలా నిర్ణయాలు తీసుకోవాలి. రాజధానిని అత్యంత త్వరగా ప్రకటించి, నిధులు ఏర్పాటు చేయాలి.

ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి కొనసాగింపుగా ఆంధ్ర రాయలసీమల్లో సమావేశాలు స్థానిక సంఘాల సమన్వయంతో జరపాలని నిర్ణయించారు.

రాయలసీమ, ఆంధ్ర, తెలంగాణ ప్రజాసంఘాల సమన్వయ కమిటీగా వివిధ ప్రాంతాలలో ఈ చర్చను ముందుకు తీసుకువెళ్లడానికి నిర్ణయించడమైంది.

(రచయితలు రాయలసీమ, ఆంధ్ర, తెలంగాణ–
ప్రజాసంఘాల సమన్వయ కమిటీ)

వీ

అభివృద్ధి చీకటిలో బక్క చిక్కిన రూపాయి

వ్యవసాయ, పారిశ్రామిక రంగాలతో కూడిన దేశీయ మార్కెట్‌ను పెంపొందించుకొని, దిగుమతులు తగ్గించి, ఎగుమతులు పెంచి రూపాయి పతనాన్ని అరికట్టవచ్చంటున్నారు **ఎ. నర్సింహారెడ్డి**

భారత్ కాబోయే సూపర్ పవర్! ఇది మన పాలకులు దేశీయ మధ్యతరగతిలో రేకెత్తించిన పంచరంగులకల. కాదు... భారత్ ఇప్పటికే సూపర్ పవర్ !! ఇది, భారతదేశ పర్యటన సందర్భంగా, పార్లమెంటులో అమెరికా అధినేత బరాక్ ఒబామా ఓటి మద్దెల. కానీ, నేడు ఈ సూపర్ పవర్ కలలన్నీ సూపర్ ఫ్లాప్‌గా తేలుతున్నాయి. దీనికి సజీవ సాక్ష్యం అదుగులేని అగాథంలోకి జారిపోతున్న రూపాయి విలువ. ఆగస్టు 16 నాటికి డాలర్‌కు రూపాయి విలువ 62 రూపాయలకు, ఆగస్టు 20 నాటికి కనిష్ఠస్థాయి రు. 65. 30కి పతనమైంది. రూపాయి పతనం అప్రతిహతంగా కొనసాగుతోంది. అగ్రరాజ్యం కరెన్సీ చేస్తున్న రచ్చకు రూపాయి బెంబేలెత్తుతుంది. మరోవైపు బిఎస్ఇ సెన్సెక్స్ నాలుగేళ్ల గరిష్టస్థాయిలో 699 పాయింట్ల మేరకు పతనమైంది. ఒకేరోజున మదుపరులు రు. 2 లక్షల కోట్లు నష్టపోయారు. ఒక వారంలో మొత్తం ఆరున్నర లక్షల కోట్లు మదుపరులు నష్టపోయారు. ఈ పరిణామాలు భారత స్టాక్ మార్కెట్, విదేశీ మారకద్రవ్య (ఫారెక్స్) మార్కెట్లలో ఉత్పాతాన్ని సృష్టించాయి. ఫలితంగా దలాల్ స్ట్రీట్‌లో లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ (మదుపర్ల సంపద) రు 60 లక్షల కోట్లకు పడిపోయింది. ఇన్వెస్టర్లలో విశ్వాసం సన్నగిల్లుతోంది. రానున్నది మరింత గడ్డుకాలమన్న హెచ్చరికలు వినవస్తున్నాయి. ప్రభుత్వం మాత్రం తనదైన బాణిలో... మరేం ఫర్వాలేదంటూ భరోసా ఇచ్చే ప్రయత్నం చేస్తోంది.

అమెరికా అభివృద్ధి అంచనాలకు మించి పుంజుకుంటోందని, వడ్డీరేట్లు పెరిగే అవకాశాలున్నాయని ఆగస్టు మొదటి వారంలో అంచనాలు వెలువడ్డాయి. నిజానికి అమెరికా వృద్ధి తాజా గణాంకాలేవీ వెలువడక ముందే జూన్ 19న అమెరికా ఫెడరల్ రిజర్వ్ (ఫెడ్) ఛైర్మన్ బెన్ బెర్నాంకె ఒక్క ప్రకటనతో మన మార్కెట్లను మండించేశారు. అమెరికా వృద్ధి ఆశావహంగా ఉన్నందున ఆర్థికవ్యవస్థలో ద్రవ్యత్వాన్ని పెంచడానికి ఫెడ్, బాండ్ల కొనుగోళ్ల రూపంలో ఇస్తున్న సహాయక ప్యాకేజీలను భవిష్యత్తులో దఫదఫాలుగా తగ్గించే అవకాశం ఉందని మాత్రమే ఆయన అన్నారు. అప్పుడు అదోగతికి దిగజారడం ప్రారంభించిన మన రూపాయి మళ్లీ తల పైకెత్తి చూసింది లేదు. ఆగస్టు 15న రిజర్వ్ బ్యాంక్ దేశం నుంచి స్వల్పకాలిక పెట్టుబడులను ఇష్టానుసారంగా ఉపసంహరించు కోవడంపై కొన్ని ఆంక్షలను విధించింది. ఆగస్టు 16న స్టాక్ మార్కెట్లలో కల్లోలం ప్రారంభమైంది. ద్రవ్యోల్బణం పెరుగుదలకు దారితీసే బ్యాంకు వడ్డీ రేట్ల పెంపుదలకు తిరస్కరిస్తున్న ఆర్‌బిఐ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు విధించిన ఆంక్షలే విదేశీ మదుపర్లలో బీభత్సాన్ని సృష్టించాయంటూ పలువురు అధికార ఆర్థిక నిపుణులు ఆయనపై విరుచుకుపడ్డారు. 1947 తొలినాళ్లలో డాలర్ విలువకు రూపాయి సమాన స్థాయిలో ఉండేది. గత అరవై ఆరేళ్ల స్వేచ్ఛా భారత ప్రస్థానంలో డాలర్ మారకంలో రూపాయి విలువ 65 రెట్లు పతనమైంది. రూపాయి విలువ పతనంలో అధిక భాగం గత రెండేళ్లకాలంలోనే జరిగింది. గత మూడు నెలలుగా రూపాయి దానికదే తగు స్థాయిలో స్థిరత్వాన్ని సాధిస్తుందని చిదంబరంతోపాటూ పలువురు అధికార ఆర్థిక నిపుణులు చెబుతూ వస్తున్నారు.

గత నెల రోజులుగా రూపాయి పతనాన్ని నిలువరించడానికి ఆర్‌బిఐ, ప్రభుత్వం వరుసగా అనేక చర్యలు వెంట వేంటనే ప్రకటించినా డాలర్ల డిమాండ్ మందగించలేదు. రూపాయి పతనం ఆగలేదు. విశ్లేషకుల అంచనా ప్రకారం మరికొద్ది నెలల్లో డాలర్ మారకం విలువ 75 రూపాయలకు చేరే అవకాశం ఉంది. ప్రభుత్వ నియంత్రణలో స్థిరంగా ఉంటూ వచ్చిన రూపాయి విలువ ఇలా భారీ స్థాయిలో పతనం వెనక కాదనలేని చారిత్రక కారణాలున్నాయి. విధాన నిర్ణేతలు ఉద్దేశపూర్వకంగా తీసుకున్న నిర్ణయాలూ ఉన్నాయి. విదేశీ పాలకుల చెర నుంచి బయట పడిన దేశం ఆర్థిక ప్రగతి కోసం ఎంచుకున్న పరాధీన మార్గం, విస్తరణ కాంక్షలో భాగంగా ఇరుగుపొరుగు దేశాలతో అనివార్యంగా చేసిన యుద్ధాలు... వీటన్నింటి ప్రభావం విడివిడిగానూ, జమిలిగానూ రూపాయిపై ఉంది. రూపాయిని ప్రభుత్వ నియంత్రణ నుంచి తప్పించి మార్కెట్ శక్తులకు విడిచిపెట్టడంలో ప్రస్తుత దేశ ప్రధాని, నాటి ఆర్థిక మంత్రి అయిన మన్మోహన్‌సింగ్ కీలక పాత్ర వహించారు. పతనమైన రూపాయి నుంచే ప్రగతిని కాంక్షించిన నేతలు, ఇప్పుడా పతనాన్ని చూసి గుండె పగిలిపోతున్నారు.

రూపాయి విలువ పతనం లేదా తగ్గుదల గురించిన అంశంతో – అమెరికా కరెన్సీ అయిన డాలర్ గురించిన ఇంత ప్రస్తావన ఎందుకనే సందేహం కొందరికి రావచ్చు. విశ్వంలోని ప్రతీ అంశంలాగా, దేశాల కరెన్సీల విలువలు కూడా సాపేక్షమైనవి. అంటే, పరస్పరం పోల్చి చూడబడేవి. కాగా, డాలర్ కరెన్సీ అనేది, ఇక్కడ అంతర్జాతీయంగా వివిధ కరెన్సీలు తమ తమ విలువలను లెక్కకట్టుకునేందుకు ఉద్దేశించినది. అందుకే, అమెరికా డాలర్‌ను అంతర్జాతీయ రిజర్వ్ కరెన్సీ అంటారు. అంటే, ప్రపంచంలోని వివిధ దేశాల మధ్య నడిచే వాణిజ్య, వ్యాపార లావాదేవీల తాలూకు అధిక చెల్లింపులు – అమెరికా డాలర్ల రూపంలోనే జరుగుతాయి. మరి, ఈ అమెరికా డాలర్‌కు ఇంత ప్రాధాన్యత ఎందుకు వచ్చింది? ప్రపంచంలో 200పైగా దేశాలూ, వాటి తాలూకు భిన్న కరెన్సీలు ఉండగా అమెరికా డాలర్ మాత్రమే ఎందుకు అంతర్జాతీయ వాణిజ్య, వ్యాపార చెల్లింపులకు పునాది కావాలి?

నిజానికి నేటి ప్రపంచంలోని వివిధ దేశాల కాగితం కరెన్సీలు అన్నింటికీ 1971 వరకు బంగారమే పునాదిగా ఉండేది. 1944లో జరిగిన బ్రెట్టన్ ఉడ్స్ ఒప్పందం ప్రకారం, అమెరికా కరెన్సీ డాలర్‌ను బంగారం పునాదిపై నిలిపారు. అంటే ఒక ఔన్స్ బంగారం 35 అమెరికా డాలర్లకు సమానమని నాడు నిర్ణయించారు. రెండవ ప్రపంచ యుద్ధానంతరం, ప్రపంచంలోనే అత్యంత పటిష్టవంతమైన ఆర్థికవ్యవస్థగా నాడు అమెరికా ఆవిర్భవించడమే దీనికి కారణం. అందుకే ఈ విధంగా అమెరికా డాలర్ అనే కాగితం

కరెన్సీకి – డిమాండ్ భారీగా ఉండి, సరఫరా పరిమితంగా ఉండే విలువైన లోహం అయిన బంగారంతో ముడిపెట్టారు. అనంతరం ప్రపంచంలోని వివిధ దేశాల కరెన్సీలను వాటి వాటి ఆర్థిక పటిష్టత మేర, అమెరికా డాలర్‌కు సాపేక్షంగా నిర్దేశించారు. ఈ రకంగానే 1948లో భారతదేశం కరెన్సీ అయిన రూపాయి విలువను ఒక అమెరికా డాలర్‌తో పోలిస్తే, రు 3.31గా నిర్ణయించారు. ఇటువంటి నిర్దిష్ట, సాపేక్ష కరెన్సీల విలువలే 'పెగ్డ్' కరెన్సీ విలువ విధానం అంటారు. అయితే 1971 నాటికి పరిస్థితి మారిపోయింది.

1944–71 మధ్య కాలంలో అంతర్జాతీయంగా పెరిగిన వాణిజ్య లావాదేవీల స్థాయికీ, కరెన్సీ మార్కెట్ల వృద్ధి స్థాయికీ తగిన విధమైన మార్పులు అనివార్యం అయ్యాయి. ఈ కాలంలో పెరిగిపోయిన కాగితం కరెన్సీ అయిన డాలర్ల మేరకు అమెరికా బంగారం నిల్వలను కూడా ఉంచలేని స్థితి ఏర్పడింది. 1971 నాటికి అమెరికా కరెన్సీ అయిన డాలర్ల చలామణీ స్థాయితో పోలిస్తే, దాని వద్ద బంగారం నిల్వలు (బ్రెటన్ ఉడ్స్ కొలబద్ద ప్రకారం) కేవలం మూడవ వంతు మాత్రమే. ఈ నేపథ్యంలో, డాలర్ – బంగారం సాపేక్ష ప్రాతిపదికను కొనసాగించలేని పరిస్థితి ఏర్పడింది. దీనితో, డాలర్‌ను బంగారం ప్రాతిపదికన కొలవడాన్ని, 1971లో అమెరికా అధ్యక్షుడు నిక్సన్ రద్దు చేశారు. ఇక ఇప్పుడు అమెరికా తన డాలర్ల సరఫరాను – తన వద్ద ఉన్న బంగారం నిల్వలకు పరిమితం చేయవల్సిన అవసరం లేదు. ఫలితంగా 'పెగ్డ్' కరెన్సీల వ్యవస్థ స్థానంలో 'ఫ్లోటింగ్' కరెన్సీ వ్యవస్థ వచ్చి చేరింది. అంటే ఒక దేశ కరెన్సీ విలువ గతంలో లాగా నిలకడగా ఉండే పరిస్థితి పోయింది. వివిధ దేశాల కరెన్సీల విలువలు కూడా మార్కెట్లోని ఇతరేతర సరుకులలాగానే డిమాండ్ – సరఫరా సూత్రంపై ఆధారపడి మారసాగాయి. ఒకానొక దేశం తాలూకు కరెన్సీకి డిమాండ్ ఎక్కువగా ఉంటే ఆ దేశ కరెన్సీ విలువ అధికంగా ఉంటుంది. దీనికి భిన్నంగా ఒకానొక దేశ కరెన్సీని మార్కెట్లలో పలువురు అమ్మేయాలని కోరుకుంటుంటే – ఆ కరెన్సీ విలువ క్షీణిస్తుంది. ఈ విధంగా ఒకానొక దేశం కరెన్సీని కావాలనీ లేదా వద్దనీ అంతర్జాతీయంగా ఇతరేతర దేశాలు కోరుకోవడానికి కారణాలు అనేకం. ఈ కారణాలే ఆ దేశం తాలూకు స్థూల ఆర్థిక పటిష్టతకు కొలబద్దలైన – ద్రవ్యోల్బణ స్థాయి, ఎగుమతి – దిగుమతుల నడుమ సమతుల్యత, విదేశీ రుణాలు, స్థూల జాతీయోత్పత్తి, పారిశ్రామిక కార్యకలాపాల స్థాయి వంటివి. ఒక దేశం తాలూకు ద్రవ్యోల్బణం తక్కువగా ఉండటం, దాని ఎగుమతులు దిగుమతుల కంటే అధికంగా ఉండడం, విదేశీ రుణ భారం స్థాయి తక్కువగా ఉండటం లేదా అసలు లేకుండడం, స్థూల జాతీయోత్పత్తి అధికంగా ఉండటం, పారిశ్రామిక కార్యకలాపాలు దృఢంగా ఉండటం వంటివి ఆ దేశానికి సంబంధించిన కరెన్సీ విలువను పెంచుతాయి. దీనికి భిన్నమైన స్థితి దాని కరెన్సీ విలువను దిగజారుస్తుంది.

రూపాయి విలువ ఎందుకు పడిపోతుంది?

ఒక వస్తువు విలువను ద్రవ్యం రూపంలో వ్యక్తపరిస్తే దానిని ధర అంటాం. వస్తువుల ధరలు ఎందుకు పెరుగుతాయి? అంటే వస్తువు నాణ్యత, అవసరం బట్టి ధరలు పెరుగుతుంటాయి. వస్తువును ఎక్కువ మంది కోరుకోవడం, ఎక్కువ పరిమాణంలో కోరుకోవడం వలన కూడా ధరలు పెరుగుతాయి. ఇదే సూత్రం డాలర్ కయినా, యూరోకయినా, రూపాయికయినా వర్తిస్తుంది. మన వస్తువును అంతర్జాతీయ మార్కెట్‌లో ఎక్కువ మంది. ఎక్కువ పరిమాణంలో కోరుకుంటే మన రూపాయి విలువ ఎక్కువవుతుంది. తక్కువ మంది కోరుకుంటే తక్కువవుతుంది. అమెరికా ఉత్పత్తులను ఎక్కువమంది, ఎక్కువ పరిమాణంలో కోరుకుంటే డాలరు విలువ ఎక్కువవుతుంది. భారతీయ రూపాయి విలువ పడిపోవటం అనేది కొత్త విషయమేమి కాదు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 1947వ సంవత్సరంలో భారతీయ రూపాయి విలువ అమెరికన్ డాలరుకు సమానంగా నిర్ణయించారు. అంటే 1 రూపాయి – 1 డాలరుగా నిర్ణయించారు. అయితే క్రమంగా రూపాయి విలువ తగ్గుతూ వచ్చింది. కొన్నిసార్లు భారత ప్రభుత్వం కావాలనే రూపాయి విలువను తగ్గించింది.

ఎందుకు భారత ప్రభుత్వం రూపాయి విలువను తగ్గించింది? అంతర్జాతీయ మార్కెట్లో మన రూపాయిని కోరే వారి కంటే లేదా కోరే మొత్తం కంటే అమెరికన్ డాలరును లేదా ఇంగ్లాండ్ పౌండ్‌స్టెర్లింగ్‌ను కోరే వారు లేదా కోరే మొత్తం ఎక్కువగా ఉండటం. డాలరును ఎక్కువ కోరుకుంటున్నారంటే దానర్థం అమెరికన్ వస్తువులనో, అమెరికన్ సేవలనో ఎక్కువ మంది కోరుకుంటున్నారని అర్థం. ఈ కోణంలో చూసినప్పుడు భారతదేశ ఆర్థికాభివృద్ధి ఆరంభంనాటికే అమెరికా, ఇంగ్లాండ్, జర్మనీ, జపాన్, ఫ్రాన్స్, ఇటలీ, రష్యా, కెనడా, స్విట్జర్లాండ్‌లు పారిశ్రామికంగా బాగా అభివృద్ధి చెంది ఉన్నాయి. అందువలన భారతదేశం పారిశ్రామికాభివృద్ధి కోసం, స్వావలంబన కోసం ప్రయత్నించకుండా అభివృద్ధి చెందిన దేశాల నుండి సాంకేతిక పరిజ్ఞానాలను ఆశించింది. అంతేగాకుండా అభివృద్ధి పరిణామ క్రమంలో భారతదేశానికి ఇంధన వనరుల అవసరం కూడా పెరిగింది. అందుకోసం ప్రధానంగా ముడిచమురు కోసం ఇతర దేశాలపై ఆధారపడవలసి వచ్చింది. అలా భారతదేశం ఇతర దేశాల వస్తువులపై ఎక్కువగా ఆధారపడవలసిన పరాధీనత రావటమే ప్రాథమికంగా రూపాయి విలువ తగ్గడానికి కారణమయ్యింది. ఇతర దేశాల వస్తువులను కొనాలంటే వారి కరెన్సీ కావాలి. వారి కరెన్సీ మనకు అవసరం అయినా మన కరెన్సీ వారికవసరం కాకపోవడంతో అనివార్యంగా రూపాయి విలువ తగ్గిపోయింది.

నేడు డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ దేని వలన ఇలా వేగంగా క్షీణిస్తున్నది? రూపాయి క్షీణతకు రెండు కారణాలు ఉన్నాయి. మొదటిది, దేశీయంగా అంతర్గత ఆర్థిక పటిష్టత దెబ్బతినడం. రెండవది, విదేశాల్లో అంతర్గత ఆర్థిక సమస్యలు ఏర్పడడం. కాగా నేడు మన పాలకులు ఈ రెండు కారణాలలో ప్రధానమైనదైన దేశీయ అంతర్గత బలహీనతను మరుగుపరిచి, కేవలం విదేశాలలోని కారణాలనే 'రూపాయి' పతనానికి మూలంగా చూపిస్తున్నారు. ఏదేమైనా, యూరప్ దేశాలు, అమెరికాలో ఏర్పడిన తీవ్ర ఆర్థిక మాంద్య పరిస్థితులు కూడా రూపాయి విలువ పతనానికి కారణమే. నేడు యూరోపియన్ దేశాలు, అమెరికాను మించిన స్థాయిలో ఆర్థిక ఊబిలోకి జారిపోతున్నాయి. దీనితో, అమెరికా డాలర్‌తో పోలిస్తే యూరోపియన్ యూనియన్‌కు చెందిన ఉమ్మడి కరెన్సీ అయిన 'యూరో' విలువ మరింతగా పతనమవుతున్నది. అంటే యూరోతో సాపేక్షంగా డాలర్ బలపడుతున్నది. ఈ కారణం దృష్ట్యా అంతర్జాతీయ మదుపుదారులు తమ వద్ద ఉన్న బలహీన దేశాల కరెన్సీలను అమ్మివేసి, డాలర్లను కొనుగోలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే, వారు రూపాయలను కూడా అమ్మివేస్తున్నారు. అంటే, అంతర్జాతీయ కరెన్సీ విపణిలో రూపాయికి డిమాండ్ పడిపోతున్నది.

2008లో ప్రపంచ ఆర్థిక వ్యవస్థను మాంద్యం కమ్మివేసింది. ఇది 2012 వరకు కొనసాగింది. ఈ కాలంలో డాలరుతో రూపాయి మారక విలువ రు 45 వద్ద స్థిరంగా ఉంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మాంద్యం నుండి బయటపడటం ప్రారంభమైన 2012 నుంచి రూపాయి విలువ పడిపోవడం ప్రారంభమైంది. సంక్షోభకాలంలో కాక అది మెరుగుపడుతున్న దశలో మన రూపాయి విలువ పడిపోతోంది. అంటే రూపాయి పతనానికి కారణాలు మాంద్యంలో కాక వేరేచోట ఉన్నాయన్నమాట. పెట్టుబడి వసూళ్లను వర్తమాన వ్యయానికే ఉపయోగించడం వల్ల ఈ సమస్య తలెత్తింది. విదేశాల నుంచి

వచ్చిన డాలర్లను ఉత్పాదక రంగంలో పెట్టకుండా వినియోగ వస్తువుల కొనుగోళ్లకు ఉపయోగించడం వలన సమస్య తలెత్తింది. సంపదను పెట్టుబడిగా మారిస్తే ఉత్పత్తి పెరిగి దేశం సంపద్వంతమవుతుంది. విదేశీ మారకద్రవ్యాన్ని విలాసాలకు వినియోగించడం వల్లనే రుణభారం పెరిగి, డాలర్ల కొరత ఏర్పడి రూపాయి మారక విలువ బక్కచిక్కడానికి ప్రధాన కారణం. అందువల్ల ప్రస్తుతం మన ఆర్థిక వ్యవస్థను చికాకు పరుస్తున్న సంక్షోభానికి మూల కారణం పూర్తిగా దేశీయ విధానాల లోపమే కానీ ప్రపంచ ఆర్థిక సంక్షోభం కారణం కానేకాదు.

చరిత్రలో మూడో భారీ పతనం

మన దేశంలో ఆరున్నర దశాబ్దాల కాలంలో రూపాయి విలువలో ఏర్పడిన మూడో భారీ పతనం ఇది. 1966, 1991 సంవత్సరాల్లో కూడా రూపాయి భారీ పతనాలు చవి చూసింది. రెండు సందర్భాల్లోను సాక్షాత్తు అప్పట్లో అధికారంలో ఉన్న ప్రభుత్వాలే పలు అంతర్గత, విదేశీ పరిణామాల వల్ల కరెన్సీ విలువను స్వచ్ఛందంగా తగ్గించాల్సి వచ్చింది. 1966లో కరెన్సీ విలువ తగ్గించడానికి విదేశాల ఒత్తిడి కారణం అయితే 1991లో ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో పడకుండా నివారించడానికంటూ ఆ చర్యకు ఉపక్రమించింది. సాధారణంగా ఏ ప్రభుత్వం అయినా సంక్షోభాలను నివారించుకునేందుకు స్థిరమైన మారకం రేటు విధానాన్ని అనుసరిస్తూ ఉంటుంది. ఏ దేశం అయినా వస్తుసేవలను, విదేశీ పెట్టుబడులను గట్టిగా నియంత్రించగల స్థితిలో ఉంటే ఆ దేశంలో ప్రభుత్వం, రిజర్వ్‌బ్యాంకు పటిష్టంగా ఉన్నట్టు భావించాలి. ఇందుకు భిన్నమైన పరిస్థితి నెలకొన్నట్టయితే ఆ దేశం కరెన్సీ విలువను స్వచ్ఛందంగానే తగ్గించుకోవలసి వస్తుంది. 1966లో ఇదే జరిగింది.

ఇక 1991 సంవత్సరానికి వస్తే అంతకు ముందు దేశంలో నెలకొన్న రాజకీయ సంక్షోభంతో పాటు సరళీకృత ఆర్థిక విధానాల అమలు ప్రయత్నంలో భాగంగా కరెన్సీ విలువను స్వచ్ఛందంగా తగ్గించింది. 1991 దేశంలో ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టిన సంవత్సరంగా ప్రాచుర్యంలోకి వచ్చింది. ప్రభుత్వ ఆర్థిక విధానాల్లో సంపూర్ణమైన మార్పులు చోటు చేసుకున్నాయి. 1991 నాటికి దేశంలో స్థిరమైన మారక రేటు విధానం అమలులో ఉంది, దేశీయ కరెన్సీ విలువ ప్రధాన వాణిజ్య భాగస్వాముల కరెన్సీల విలువతో అనుసంధానమై ఉంది. 1990 సంవత్సరం చివరిలో ప్రభుత్వం తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో పడింది. ఖజానా దివాలా స్థితికి చేరింది. విదేశీ మారకం నిల్వలు పూర్తిగా అంతరించిపోయాయి. ప్రభుత్వం వద్ద కేవలం మూడు వారాల దిగుమతులకు సరిపోయే విదేశీ మారకం నిల్వలు మాత్రమే ఉన్నాయి. విదేశాలకు చెల్లించాల్సిన రుణాలు చెల్లించలేని స్థితిలో పడిపోయింది. 1985 సంవత్సరంలోనే ఈ విదేశీ రుణ చెల్లింపుల సంక్షోభానికి బీజం పడింది. 1980 దశాబ్ది ద్వితీయార్థంలో వడ్డీ చెల్లింపులు, దిగుమతుల భారం కూడా త్వరితంగా పెరగడంతో కరెంట్ అకౌంట్‌లోటు భారీగా పెరిగింది. ద్రవ్యలోటు కూడా జిడిపిలో 8.2 శాతానికి చేరింది. గల్ఫ్ యుద్ధం దీనికి ఆజ్యం పోసింది.

1990లో మన వాణిజ్యలోటు 944 కోట్ల డాలర్లుంటే కరెంట్ అకౌంట్ లోటు 970 కోట్ల డాలర్లుంది. విదేశీ కరెన్సీ నిల్వలు 120 కోట్ల డాలర్లకు పడిపోయాయి. ఈ నేపథ్యంలో కరెన్సీ విలువను 18 నుంచి 19 శాతం మేరకు తగ్గించింది. దీనికి తోడు వాణిజ్య విధానంలో కూడా సమూలమైన మార్పులు చేపట్టి అత్యంత పరిమితులతో కూడిన విధానం స్థానంలో స్వేచ్ఛాయుత ఎగ్జిమ్ విధానాన్ని ప్రకటించింది. ఎగుమతిదారులు తమ ఎగుమతుల విలువలో 30 శాతం మేరకు దిగుమతులు చేసుకునే స్వేచ్ఛ కూడా కల్పించింది. అమెరికన్ డాలరుతో రూపాయి మారకం విలువను 31.37 రూపాయలుగా ఆర్‌బిఐ నిర్ణయించింది. అప్పటి నుంచి విదేశీ ద్రవ్య మార్కెట్‌లో ఆటుపోట్లకు అనుకూలంగా రూపాయి విలువ మారడానికి అనుకూలమైన వాతావరణాన్ని ఆర్‌బిఐ కల్పించింది. ద్రవ్యోల్బణానికి ఆజ్యం పోసే ఆర్థిక విధానాలు అనుసరిస్తూ సమాంతరంగా నిర్దిష్ట మారక రేటు విధానం అనుసరించడం వల్లనే ఇంత సమస్య తలెత్తిందని అప్పట్లో విశ్లేషకులు అభిప్రాయపడ్డారు.

రూపాయి పతనంతో మనకేమౌతుంది?

అసలు రూపాయి విలువ ఎందుకు పతనం అవుతుంది? వంటి ప్రశ్న చాలా మందికి ఈ సందర్భంలో రావచ్చు. ఈ ప్రశ్నకు జవాబులు, రానున్న రోజులలో మరింత ప్రాధాన్యతను పొందగలవు. ఎందుకంటే, మన దేశీయ ప్రజల మనుగడ అనేది ముందు ముందు ఈ ప్రశ్నతో ముడిపడి ఉంది. వారి నిత్య జీవితం అనివార్యంగా ఈ ప్రశ్నకు జవాబులతో కలగలిసి ఉంది. నిజానికి, రూపాయికి అధిక విలువ ఉండడం లేదా దానికి అధిక బలం ఉండడం అనేది దేశ ప్రజలకొనుగోలు శక్తిని అధికం చేయలేదు. పరిమిత, బోటాబోటీ ఆదాయాలతో మెజారిటీ జనసామాన్యం జీవించే, మన దేశంలో ఇది మరింత ప్రాధాన్యత గల అంశం. అందుకే ఈ అంశం గురించిన వివరణ ఇక్కడ ప్రస్తుతం అవసరం. ఉదాహరణకు, 1991 జులై 1వ తేదీ నాటికి ఒక డాలర్ విలువ 18 రూపాయలకు సమంగా ఉంది. కాగా, ఈ మారకం విలువ 1993 మార్చి నాటికి ఒక డాలర్‌కు 32 రూపాయలు అయ్యింది. 2012 మే 24న ఒక డాలర్‌కు 56 రూపాయలకు, 2013 ఆగస్టు 19 నాటికి 63.30 రూపాయలకు, 2013 ఆగస్టు 21 నాటికి 65 రూపాయలకు చేరింది. అంటే, 1991 జూలైలో మనం 18 రూపాయలను ఇచ్చి అంతర్జాతీయ మార్కెట్‌లో ఒక డాలర్ విలువైన సరకులు లేదా సేవలను పొందాం. కాగా, నేడు (ఆగస్టు 21, 2013 నాటికి) అవే సేవలను, సరుకులను మూడున్నర డాలర్ల పైబడి చెల్లించిగానీ మనం పొందలేం. ఇతర దేశాలనుంచి ఎటువంటి దిగుమతులు చేసుకోకుండానే, తన మనుగడను శాసించగల దేశం అనేది ఏది నేటి ప్రపంచంలో లేదు. పెట్రోలియం, బొగ్గు, బంగారం, యంత్రాలు, రక్షణ అవసరాలు, వంట నూనెలు మొదలుకుని ఎలక్ట్రానిక్స్ సరుకుల వరకూ, అంతర్జాతీయ మార్కెట్ల నుంచి, డాలర్లను చెల్లించి దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి మన దేశానికి ఉంది. నేటికీ మనదేశం ప్రధాన వస్తువుల ఉత్పత్తిలో స్వావలంబన సాధించక పోవడం ప్రధాన లోపం.

డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ తగ్గిపోవడంతో మన దేశీయ దిగుమతులను ఖరీదైనవిగా మార్చి వేయగలదు. ఈ దిగుమతులకై మనం అంతకు ముందర చెల్లించవలసిన డబ్బు కంటే, నేడు అధికంగా చెల్లించవలసి రావడమే దీనికి కారణం. ఇలా, ఈ సరకుల ధరల పెరుగుదల లేదా విలువ పెరుగుదల అనేది – కేవలం విదేశాల నుంచి దిగుమతి చేసుకునే తయారైన వస్తువులకు సంబంధించిన వ్యవహారం మాత్రమే కాదు. అది, మనం దిగుమతి చేసుకునే ముడి సరుకులకు సంబంధించినది కూడా! మన దేశంలో పలు కంపెనీలు, సంస్థలు తమ సరుకు ఉత్పత్తి అవసరాల కోసం, కావాల్సిన ముడి సరుకులను విదేశాలనుంచే దిగుమతి చేసుకుంటున్నాయి. కాబట్టి, నేడు రూపాయి విలువ దిగజారడంతో ఈ సంస్థలు దిగుమతి చేసుకునే ముడిసరుకు ఖరీదు కూడా పెరిగి తీరుతుంది. దీంతో, వాటికి సరుకు తయారీ వ్యయం పెరిగి పోతుంది. ఫలితంగా, ఆయా కంపెనీలు మార్కెట్లో అమ్మే తయారీ వస్తువుల, సరుకులఖరీదు కూడా పెరుగుతుంది. అంటే, అంతిమంగా, వివిధ సరుకుల ధరలు మార్కెట్లో పెరిగిపోతాయి. దీని ప్రభావం ఉపాధిపై పడుతుంది. వారి ఆదాయాలు

పెరగకుండానే మార్కెట్లో ధరల పెరుగుదల అనేది – ప్రజల కొనుగోలు శక్తి పతనానికి దారి తీయగలదు. దీని ఫలితంగా, వారు తమ నిత్య జీవితంలోని, అన్ని కనీస అవసరాలను కూడా తీర్చుకోలేరు.

రూపాయి విలువ పతనం వలన మన దేశం విదేశాల నుంచి చేసుకునే దిగుమతుల వ్యయం పెరిగిపోయింది. పెట్రోలియం వంటి పలు ఉత్పత్తులను మనం విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. రూపాయి విలువ పతనం వలన, పెట్రోలియం దిగుమతికి మనం చెల్లించవలసి వచ్చే ఖరీదు పెరిగి పోతోంది. దానితో దిగుమతి చేసుకున్న సరుకులు అన్నింటి ఖరీదు (పెట్రోలియంతోపాటుగా) మన దేశంలో పెరిగిపోతుంది. విదేశీ ప్రయాణం చేసే ప్రయాణీకులపై, విదేశాల్లో విద్యాభ్యాసం చేసే విద్యార్థులపై దీని ప్రభావం పడుతుంది. అంతిమంగా ఇదంతా, దేశీయంగా ఇప్పటికే అధికంగా ఉన్న ద్రవ్యోల్బణానికి అగ్నికి ఆజ్యంలా తోడవుతుంది. ఇక దేశీయ వడ్డీ రేట్లు అధికంగా ఉండటంతో, విదేశాల నుంచి తక్కువ వడ్డీలకు అప్పులు తెచ్చుకున్న పారిశ్రామికులకు రూపాయి పతనం పుండుమీద కారమే. ఏదేమైనా దేశీయ కరెన్సీ విలువ ఈ విధంగా పతనం కావటం అన్ని విధాల అనర్థదాయకం.

రూపాయి విలువను పెంచలేమా?

ఆర్థిక సరళీకరణ (1991కి ముందు)కు పూర్వం రూపాయి విలువను నిర్ణయించే అధికారం పూర్తిగా భారత ప్రభుత్వం చేతిలోనే ఉండింది. అయినప్పటికీ ఎప్పుడు కూడా భారత ప్రభుత్వం రూపాయి విలువను పెంచలేదు. ఇందుకు కారణం ఒక్కటే మనకు ఇతరదేశాల సాంకేతిక పరిజ్ఞానం, ముడిచమురు కావాలంటే మనకు ఆయా దేశాల ద్రవ్యం కావాలి. ఆయా దేశాల ద్రవ్యం కావాలంటే మన వస్తువులు ఆయా దేశాలలో అమ్ముడు పోవాలి లేదా ఆయా దేశాలు మనకు అప్పు ఇవ్వడానికి సిద్ధపడాలి, లేదా ఆయా దేశాల నుండి మన దేశంలోకి పెట్టుబడులు రావాలి. అంతంత మాత్రంగా ఉన్న సాంకేతిక పరిజ్ఞానంతో ఉత్పత్తి చేసిన మన వస్తువు ధర అంతర్జాతీయ మార్కెట్‌లో తక్కువగా ఉంటుంది. రూపాయి విలువను పెంచడమంటే మన వస్తువు ధరను అంతర్జాతీయ మార్కెట్‌లో పెంచడమని అర్థం. అలా ధర పెరిగితే మన వస్తువుల డిమాండ్ దెబ్బతింటుంది. ఈ ఏకైక కారణం చేత రూపాయి విలువను తగ్గించారు. కాని ఎప్పుడూ పెంచే సాహసం చేయలేదు. మన ఆర్థిక స్థితి, సాంకేతిక స్థితి మన కరెన్సీ విలువను నిర్ణయిస్తాయన్న ప్రాథమిక సత్యాన్ని మనం అర్థం చేసుకోవాలి. తక్కువ వ్యయానికి ఎక్కువ నాణ్యతతో వస్తువులను, సేవలను అందించిన రోజున మన వస్తువులను, సేవలను ప్రపంచ దేశాలు పదే పదే కావాలనుకున్నప్పుడు మనం అందించినంత తక్కువ ధరకు ఇతర ఏ దేశం అందించలేనప్పుడు, ప్రపంచంలో కొరతగా ఉన్న అరుదైన వస్తువులను అందించినప్పుడు మన కరెన్సీ విలువ పెంచినా లేదా పెరిగినా మన రూపాయి విలువ తగ్గదు.

చమురు, ఆహారం కోసం దిగుమతులపై ఆధారపడిన దుస్థితిని కప్పిపుచ్చుతూ, బంగారం దిగుమతులు అధికంగా ఉండటమే రూపాయి పతనానికి ప్రధాన కారణమని ప్రధాని మన్మోహన్ సింగ్ చెప్పడం విడ్డూరం. రూపాయి విలువ పతనానికి మన పాలకులు చెబుతున్న కారణం అమెరికా ఆర్థిక వ్యవస్థ, యూరోప్ ఆర్థిక వ్యవస్థలో సంభవించిన ఆర్థిక మాంద్యం. ఆయా దేశాలలో ఆర్థిక మాంద్యం ఏర్పడటంతో మన దేశానికి ఆయా దేశాల నుండి వచ్చే వ్యాపార సేవల (బిజినెస్ ప్రాసెస్ అవుట్ సోర్సింగ్ – బిపిఒ) డిమాండ్ తగ్గిపోవటంతో పాటు మన దేశ వస్తువుల ఎగుమతి కూడా పడిపోయింది. మన సేవల, మన వస్తువుల డిమాండ్ అంతర్జాతీయ మార్కెట్‌లో తగ్గడంతో మన రూపాయి విలువ తగ్గటం కొనసాగింది. ఈ కాలంలో విదేశీ పెట్టుబడుల రాక కూడా మందకొడిగా సాగింది. వీటికి తోడు ఇతర కారణాలు. రూపాయి పతనానికి అసలు కారణం దేశీయమైనది. అంతర్గతమైనది. వీటిలోని మొదటిది దేశీయ ఎగుమతులలో క్షీణత. అంటే మన దేశం నుంచి విదేశాలకు ఎగుమతి అయ్యే సరుకులూ, సేవల విలువకంటే, మనం దిగుమతి చేసుకునే సరుకులూ, సేవల విలువ అధికం అయింది. దీనితో మనం వాణిజ్యం నెరపే దేశాలతో, మన వాణిజ్య సమతుల్యత దెబ్బతింటోంది. అమెరికా వంటి ధనిక దేశాలలో తీవ్ర ఆర్థిక మాంద్య పరిస్థితుల కారణంగానూ, ఇతరేతర దేశాలతో పోలిస్తే ఎగుమతుల విషయంలో మన పోటీ సామర్థ్యం బలహీనపడటం వల్ల ఇదంతా జరుగుతోంది.

మళ్లీ మొదటికొచ్చిన కథ !

రూపాయి విలువ ఒక్కటే కాదు, దేశార్థిక రంగ స్వస్థతపై యు.పి.ఎ నేతల ప్రగల్భాలూ ఇప్పుడు మంచుకొండలా కరిగిపోతున్నాయి. డాలరుతో రూపాయి మారకం ధర పతనాన్ని అడ్డుకునేందుకంటూ రిజర్వుబ్యాంకు చేపట్టిన చికిత్స వికటించి ఆగస్టు 14 ఒక్కరోజులోనే రెండు లక్షల కోట్ల రూపాయల మేర స్టాక్‌మార్కెట్లో మదుపరుల సంపద ఆవిరైపోయింది. దానికదే అంతా సర్దుకుంటుందంటున్న ప్రధాని మన్మోహన్, 1991 నాటి చెల్లింపుల సంక్షోభం పునరావృతమయ్యే ప్రసక్తే లేదని నమ్మబలుకుతున్నారు. కేవలం పదిహేను రోజులకే సరిపోయే విదేశ మారకద్రవ్యం ఉన్న ఆనాటికి, ఆరేడు నెలల దిగుమతులకు సరిపడా నిల్వలు పోగుపడ్డ ఈనాటికి పోలికే లేదనీ ఆయన సెలవిస్తున్నారు. మరో వైపు ఆర్థిక మంత్రి చిదంబరం బంగారం దిగుమతులు అధికంగా ఉండటమే ఈ దుస్థితిని తెచ్చిందని అడ్డగోలుగా దబాయిస్తున్నారు. చమురుతోపాటు ఆహార దిగుమతులు లేనిదే రోజు గడవని పరాధీనత పాలకుల పాపమే! రిజర్వుబ్యాంకు ద్రవ్యపరపతి విధాన సమీక్షలో మార్పులతోనే అంతా కుదుటపడుతుందిలెమ్మన్న వ్యాఖ్యలతో జాతి జనుల కళ్లకు మన్మోహన్, చిదంబరం టోకున గంతలు కట్ట జూస్తున్నారు. ఇరవై రెండేళ్లక్రితం చెల్లింపుల సంక్షోభం ఒక్కటే ప్రధాన సమస్య. నేడు – మందగించిన వృద్ధిరేటు, ద్రవ్యోల్బణం, రూపాయి విలువలో క్షీణత, భారీ కరెంటు ఖాతా లోటు... దేనికదే దేశార్థికాన్ని కాటేయడానికి కసిగా బుసకొడుతున్నాయి.

ఒకటిన్నర దశాబ్దాల క్రితం ఐరోపా, అమెరికాలకు చెందిన అనేక సంస్థలు ఒకేసారి భారీయెత్తున పెట్టుబడులు ఉపసంహరించుకునేసరికి స్టాక్ మార్కెట్లు కుప్పకూలి ఆగ్నేయాసియా దేశాలు కిందమీదులయ్యాయి. సంస్కరణల వేగం మందగించి, కాలూచేయీ కూడదీసుకోలేని స్థితిలో అవి అమాంతం పెనుసంక్షోభం కోరల్లో చిక్కి, ఉక్కిరిబిక్కిరయ్యాయి. తూర్పు, ఆగ్నేయాసియా దేశాలను హడలెత్తించిన కరెన్సీ సంక్షోభం దేశీయంగానూ ప్రకంపనలు పుట్టించి రూపాయి మారకం విలువ క్షీణించిన దశలో గుజ్రాల్ సర్కారు 1998 మార్చి 19న రాజీనామా చేయాల్సి వచ్చింది. ప్రస్తుతం అంతకుమించిన వేగంతో రూపాయి కుంగుదల, షేర్ల ధరల పతనం చూసి నివ్వెరపోతున్న మదుపుదారులు – గత్యంతరం లేక బంగారంవైపు మొగ్గుచూపుతున్నారు. అడ్డూ అదుపూలేని రూపాయి క్షీణత ద్రవ్యోల్బణాన్ని రెచ్చగొట్టే ముప్పుందన్నా లక్ష్యపెట్టని 'ఆమ్ ఆద్మీ' సర్కారు నిమ్మకు నీరెత్తినట్లు పొద్దుపుచ్చుతోంది. సమస్యకు పరిష్కారం చూపని మన్మోహన్ బృందం వృద్ధిరేటు డాంబికాల మాటున దేశంలో స్థిరీకరించింది – ఆకలి, అభద్రత, అనారోగ్యం, అప్పులే!

1991న 8300కోట్ల డాలర్లున్న విదేశీ రుణభారం 2013 మార్చి నాటికి 39వేల కోట్ల డాలర్లకుపైగా ఎగబాకింది! నాటి కరెంటు ఖాతాలోటు

స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో 1.1 శాతం ఉంది. 'మన్మోహనామిక్స్' పుణ్యమా అని ఇప్పుడది 4.8శాతానికి చేరి ఉరుముతోంది. ఎగుమతులకు, దిగుమతులకు మధ్య అంతరాన్ని సూచించే ఆ లోటు జి.డి.పిలో రెండున్నర శాతానికి మించకుండా ఉండాలన్న రిజర్వుబ్యాంకు సూచనలు అరణ్య రోదనమయ్యాయి. గడచిన రెండున్నర నెలల్లోనే స్టాక్, రుణ మార్కెట్ల నుంచి 11వందల కోట్ల డాలర్లకుపైగా విదేశీ పెట్టుబడులకు రెక్కలొచ్చి ఎగిరిపోయాయి. వ్యవసాయ, పారిశ్రామిక, ఉత్పాదక, సేవా రంగాలు పోటాపోటీగా వెలవెల పోతున్నాయి. గనులు, క్వారీయింగ్ తదితర రంగాల్లోనూ నైరాశ్యం తాండవిస్తోంది. వచ్చే ఏడాదికి స్థిమితపడి ఏడుశాతం వృద్ధిరేటును రక్షిస్తామన్న ఆర్థిక మంత్రిత్వశాఖ మూస ప్రకటనలో ఏ కోశానా ఆత్మవిశ్వాసం ధ్వనించడం లేదు.

మన కరెంటు అకౌంటు లోటు గత ఏడాది స్థూల జాతీయోత్పత్తిలో 4.8 శాతంగా ఉంది. మన విదేశీ మారకద్రవ్య నిల్వలు 28,000 కోట్ల డాలర్లకు పడిపోయాయి. ఈ ఏడాది 17,235 కోట్ల డాలర్ల రుణ చెల్లింపులు చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో 1991లో మన బంగారాన్ని తాకట్టు పెట్టుకొని, రూపాయి విలువను తగ్గించుకొని దిగుమతుల కోసం దినదిన గండంగా బతకాల్సిన రోజులు పునరావృతం కానున్నాయనే భయాలు సర్వత్రా వ్యాపిస్తున్నాయి. ఆరునెలల దిగుమతులకు సరిపడా విదేశీ మారక నిల్వలు ఉన్నాయంటూ ప్రధాని భరోసా ఇస్తున్నారు. కానీ, 1991లో మొదలైన మన ఆర్థిక సంస్కరణల చరిత్ర రెండు దశాబ్దాల తర్వాత తిరిగి అక్కడికే చేరబోతున్న సూచనలు కనిపిస్తున్నాయి. వాల్‌మార్ట్, మెకీస్ వంటి బడా రిటైల్ వర్తక సంస్థల అమ్మకాలు క్షీణిస్తుండటం అమెరికా వృద్ధి కథనాన్ని సందేహాస్పదం చేస్తోంది. వాల్‌మార్ట్ తన అమ్మకాలు 0.3 శాతం పడిపోవడానికి అల్పాదాయ వర్గాలపై పన్నుల భారం, అల్పవేతనాల వల్ల కొనుగోలుశక్తి పెరగకపోవడమేనని, వారు తమ అవసరాలకు మించి వినియోగం చేయలేకపోవడమే కారణమని వాపోతోంది. వాల్‌మార్ట్ మన విధానకర్తలు చెప్పని నిజాన్ని చెబుతోంది.

రూపాయి చరిత్రలో 1993 సంవత్సరం అత్యంత కీలకం. అప్పటి వరకు మారకం విలువను నియంత్రిస్తూ వచ్చిన ప్రభుత్వం మార్కెట్ శక్తులకే రూపాయి మారకం విలువను వదిలిపెట్టాలని నిర్ణయించింది. ఈ ఒక్క నిర్ణయంతో రూపాయి విలువ భారీగా పతనమైంది. కొత్త సహస్రాబ్ది తొలి పదేళ్లు (2000 - 2010) రూపాయి సగటు విలువ 45 శ్రేణిలోనే ఉంది. 2007 సంవత్సరంలో మాత్రం భారీగా బలం పుంజుకుని 37 రూపాయలకు చేరింది. ఆ మరుసటి ఏడాదే అమెరికాను కుదిపేసిన ఆర్థిక సంక్షోభం సెగలు రూపాయిని కూడా తాకాయి. 2008 సంవత్సరం తర్వాత నుంచి మళ్లీ రూపాయి విలువ తగ్గుతూ వచ్చింది. 2010 తర్వాత పతనం వడివడిగా సాగింది. తాజాగా 2013లో ఆల్‌టైమ్ కనిష్ఠ స్థాయి 65 రూపాయలను తాకింది. అంతర్జాతీయ మార్కెట్ ఎనలిస్టులు, దేశీయ మార్కెట్ పండితులు... ఎవరూ కూడా ప్రభుత్వం తీసుకున్న, తీసుకుంటున్న చర్యలు రూపాయి విలువను నిలబెడతాయని ఆశించడం లేదు. కరెంటు ఖాతాలో లోటును తగ్గించే దిశగా ప్రభుత్వం ఇప్పటి వరకు గట్టి చర్య ఒక్కటీ తీసుకోలేకపోయిందని వారి అభిప్రాయం. అంటే రూపాయి విలువ పుంజుకుంటుందన్న విశ్వాసం మార్కెట్‌లో ఏ మాత్రం లేదన్న మాట.

కరెన్సీ పతనం కారణంగా బ్యాంకులు వడ్డీరేట్లు పెంచనున్నాయన్న ఉద్దేశంతో చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా ఆగస్టు 19న రిజర్వ్ బ్యాంకు ద్రవ్య సడలింపు చర్యలను చేపట్టింది. ఆర్థిక వ్యవస్థలో నిధుల లభ్యత పెంచేందుకోసం 23న ఓపెన్ మార్కెట్ ద్వారా రు 8 వేల కోట్ల విలువైన బాండ్లను తిరిగి కొనుగోలు చేయనున్నట్లు ఆర్‌బిఐ తెలిపింది. అవసరమైతే మరిన్ని ఓపెన్ మార్కెట్ కార్యకలాపాల (ఒఎంఒ)ను చేపట్టనున్నట్లు బ్యాంకింగ్ నియంత్రణ మండలి పేర్కొంది. అలాగే బ్యాంకుల చట్టబద్ధ నగదు నిష్పత్తి (బ్యాంకులు సేకరించే డిపాజిట్లలో తప్పనిసరిగా ప్రభుత్వ సెక్యూరిటీల్లో పెట్టాల్సిన మొత్తం)ని 24.5 శాతంగా నిర్ణయించింది. దీంతో మార్క్-టు- మార్కెట్ (ఎంటీఎం) నష్టాలను తగ్గించుకునేందుకు వీలవుతుందని ఆర్‌బిఐ భావిస్తున్నది. ప్రభుత్వ బాండ్లపై రాబడి రేటు ఐదేళ్ల గరిష్ట స్థాయికి చేరుకోవడంతో దేశంలోని బ్యాంకుల పోర్ట్‌ఫోలియోలపై రు 40 వేల కోట్ల మేర ప్రభావం పడనుందని అంచనా.

మన దేశంలో గత మూడు సంవత్సరాలుగా ద్రవ్యోల్బణం తీవ్రస్థాయిలో ఉంది. దీని వలన కూడా రూపాయి విలువకు గండం ఏర్పడింది. రూపాయి కొనుగోలు శక్తి ద్రవ్యోల్బణ నేపథ్యంలో పడిపోతుండటంతో - విదేశీ మదుపుదారులు రూపాయలను అమ్మేస్తున్నారు. ఇతరేతర దేశాల కరెన్సీలలోకి వెళ్లిపోతున్నారు. ఇక చివరగా దేశ స్థూల జాతీయోత్పత్తి గణాంకాల స్థితిని అనివార్యంగా ప్రస్తావించాలి. నిన్న మొన్నటి వరకు మన పాలకులు సాలీనా 9 శాతం స్థూల జాతీయవృద్ధి తమ లక్ష్యం అంటూ చెబుతూ వచ్చారు. కాగా, 2012-13 ఆర్థిక సంవత్సర కాలానికి మన దేశ స్థూల జాతీయ వృద్ధి 5 శాతం మేరకు ఉంటే చాలనుకునే దుస్థితిలో నేడు మనమున్నాం. ఈ మొత్తం నేపథ్యంలోనే ముందు ముందు ఏర్పడగల విపత్కర పరిస్థితులకు ఇది ముందస్తు సూచిక. దేశీయ ఆర్థిక రంగంలో 60 శాతం మందికి జీవనోపాధిని కల్పించే వ్యవసాయ రంగాన్ని మన పాలకులు దశాబ్దన్నరపాటు నిర్లక్ష్యం చేసిన ప్రతికూల ఫలితాలను నేడు మనం చవిచూస్తున్నాం. ఈ స్థితిలో రిజర్వు బ్యాంకు జోక్యం చేసుకుని తన వద్ద ఉన్న డాలర్లను అమ్మి రూపాయిని కొనుగోలు చేయటం ద్వారా దాని డిమాండ్‌ను పెంచేందుకు ప్రయత్నించినా అదీ పరిమితమే. ఎందుచేత నంటే మన దేశం వద్ద ఉన్న విదేశీ మారక ద్రవ్య నిల్వల మొత్తం డాలర్లు మనకు 6 నెలల కాలపు దిగుమతులకు చెల్లించేందుకు సరిపోతుంది. కాగా ఈ మొత్తాన్ని నేడు తాత్కాలికంగా రూపాయిని కాపాడేందుకు వినియోగించగల స్థితి లేదు. రూపాయి పతనంతో పాటు, దానికి ఈ దుస్థితిని తెచ్చిపెట్టిన మన్మోహనామిక్స్ తాలూకు చరమ దశ ఇది!

మన విధానకర్తల నిర్వాకం ఫలితంగా గత ఏడాది మన పారిశ్రామిక వృద్ధి రెండు దశాబ్దాలలో అతి తక్కువగా ఒక్క శాతంగా నమోదైంది. పైగా మరింతగా ప్రజల కొనుగోలుశక్తిని తగ్గించేలా సబ్సిడీల, సంక్షేమ వ్యయాల కోతలను అమలుచేస్తోంది. గత 22 ఏళ్ల ఆర్థిక సంస్కరణల అనంతరం విదేశీ ద్రవ్య సంస్థలు స్వల్పకాలిక చంచల పెట్టుబడులతో మన రూపాయితోనూ, స్టాక్ మార్కెట్లతోనూ జూదం ఆడగలుగుతున్నాయి. మన ఆర్థిక వ్యవస్థను ఒక జూదగృహంగా మారుస్తున్నారు. దేశంలోని చమురు, సహజవాయువు, బొగ్గు తదితర సహజ సంపదలను వెలికితీసి దేశ అవసరాలను తీర్చుకోవడంలో ప్రభుత్వంలో నెలకొన్న అలసత్వం, హ్రస్వదృష్టి, కార్పొరేట్ సంస్థలకు దాసోహం కావడమే ఈ దుస్థితికి ప్రధాన కారణం. ముందుకొస్తున్న ఈ సంక్షోభాన్ని విదేశీ ప్రత్యక్ష, పరోక్ష మదుపులను ఆకర్షించడంపై ఆధారపడి పరిష్కరించాలని పాలకులు మలి విడత సంస్కరణలను అమలు చేస్తున్నారు. నిజానికి ప్రపంచ ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొవడానికి ఏదేశానికైనా కొనుగోలు శక్తి గల ప్రజలున్న బలమైన జాతీయ మార్కెట్ అవసరం వ్యవసాయ పారిశ్రామిక రంగాల అనుసంధానంతో దేశీయ మార్కెట్‌ను బలోపేతం చేసుకుని, దిగుమతులు తగ్గించుకొని ఎగుమతులు పెంచుకోవడం ద్వారా మాత్రమే రూపాయి పతనాన్ని అరికట్టగలం.

(రచయిత ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు, రాజనీతిశాస్త్ర విద్యార్థి) వీ

మత విద్వేషాల 'మోడీ'కరణ

***మత విద్వేషాలను రెచ్చగొడుతూ మారణహోమాలు సృష్టించి మానవ విలువలను ధ్వంసం చేస్తూ ఆర్ఎస్ఎస్ కలలను నిజం చేయడమే మోడీ నైజం అంటున్నారు* ఎల్. అరణ్య**

మనిషి మానవత్వాన్ని మరిచిపోతే, కనీస మానవీయ విలువలను మతానికి తాకట్టు పెడితే ఆ వ్యక్తి ఎలా తయారవుతాడనే దానికి నరేంద్రమోడీ ఒక స్పష్టమైన ఉదాహరణ. భారతీయ జనతా పార్టీ (బిజెపి) లాంటి ఒక మత ఛాందస పార్టీకి నాయకునిగా, ఆర్ఎస్ఎస్ లాంటి మత ఆలోచనలతో పుచ్చిపోయిన సంస్థ నుంచి వచ్చిన కార్యకర్తగా నరేంద్రమోడీ హిందూ మతాన్ని ఇతర మతాలపై ఎక్కుపెట్టిన ఆయుధంగా వాడుతూ వచ్చాడు. వివేకానందుడు తన ఉపన్యాసాలతో ఈ పని చేస్తే మోడీ తనకున్న అధికారంతో హింసాత్మక చర్యలు చేపడుతూ ఈ పని చేశాడు. అందుకే ఆగస్టు 11వ తేదీన హైదరాబాద్‌లో జరిగిన మోడీ సభలో ఒక వైపు వివేకానందుడు, మరో వైపు మోడీతో కూడిన బ్యానర్లు ఎక్కువ సంఖ్యలో కన్పించాయి.

నరేంద్రమోడీని దేశ ప్రధాన మంత్రి అభ్యర్థిగా భారతీయ జనతా పార్టీ ప్రచారం చేస్తున్న ప్రతిసారీ విచిత్రంగా ఆ పార్టీలోని సాధారణ కార్యకర్తలను అసలు మోడీని ఎలా అర్థం చేసుకోవాలనే ఒక ప్రశ్న తొలుస్తోంది. ఆర్ఎస్ఎస్ తరహా హిందూవాదిగానా లేక అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్న ఒక ఉదారవాద ముఖ్యమంత్రిగానా, రేపు ప్రధాని అయితే ఈ రెండింటిలో ఏ మార్గంలో వెళ్లబోతాడనే మీమాంసలో ఉంటూ వస్తున్నారు. నిజానికి ఒక నాయకుని గురించి ఆ పార్టీలో వాళ్లకు స్పష్టత ఉంటుంది. బయటి వాళ్లకు అర్థం చేసుకోవడంలో ఇబ్బంది ఉంటే ఉండవచ్చు. కానీ నరేంద్రమోడి విషయంలో మాత్రం బయటి వాళ్లకు స్పష్టత ఉంది గానీ సొంత పార్టీలో వాళ్లకే అర్థం కానంత అస్పష్టత ఉంది. బయటి వాళ్లకు వచ్చిన స్పష్టత ఏమిటంటే నరేంద్రమోడీ వేలాది మంది అమాయకులను చంపించిన ఒక ఉన్మాది. మత మారణహోమాలు బాహాటంగా జరిపించడానికి అభివృద్ధి గొప్పలతో ప్రజలను పక్కదోవ పట్టిస్తున్న మోసకారి.

భారతదేశంలో మత పిచ్చి, మత ఛాందసవాదాల గురించి మాట్లాడుకునే ప్రతిసారి 2002 హత్యల గురించి మొదటగా మాట్లాడుకునే స్థాయినే ఒక మారణకాండను సృష్టించి పెట్టాడు మోడీ. గోద్రాలో హిందువులను చంపితే ఏం చేయమంటారు? అని బాహాటంగానే ఆ మారణకాండను సమర్థించుకునే కారణాలను కార్యకర్తలకు సిద్ధం చేసి పెట్టాడు. అలాంటి వ్యక్తి ఇవాళ ప్రధాన మంత్రి అభ్యర్థిగా పోటీలో ఉన్నాడు. అతన్ని ఆ పదవికి ప్రమోట్ చేసి బిజెపి మరోసారి అధికారంలోకి రావాలని కలలు కంటున్నది. గుజరాత్ నరమేధానికిగాను మోడికి వీసా ఇవ్వడానికి నిరాకరించిన అమెరికా 2011లో తన ఆలోచనలు సడలించుకుని ప్రధానిగా రాహుల్‌గాంధీ కంటే మోడీకే ఎక్కువ అవకాశాలున్నాయని చెప్పడంతో మోడీ ఆలోచనలు ప్రధానమంత్రి పీఠంపైకి వెళ్లాయి. ఎందుకంటే అమెరికా గ్రీన్ సిగ్నల్ ఉంటే కొండంత బలాన్ని వెంట ఉంచుకున్నట్లే అని మోడీకి తెలుసు కనుక ఇక ప్రధాని పదవిపై ఉబలాటపడడం ప్రారంభించాడు. సద్భావన దీక్ష ఆ ఉబలాటం నుంచి పుట్టిందే. ఆ దీక్షతో ఏకబిగిన దేశ వ్యాప్త ఇమేజ్‌ను సంపాదించుకుని 2014 ఎన్నికలలో విజయం సాధించాలని ఉవ్విళ్లూరాడు. అసలు ఇప్పటికీ గుజరాత్‌ను చాలా అభివృద్ధి చేశానని దేశానికే ఒక రోల్ మోడల్ చేశానని ప్రతి సభలోనూ చెప్పడం ప్రారంభించాడు. పదేపదే చేప్తే అబద్ధమైనా నిజమై పోతుందనట్లు మోడి గోబెల్స్ ప్రచారంతో నిజంగానే చాలా మంది గుజరాత్‌లో చాలా అభివృద్ధి జరిగిందని నమ్మే స్థితికి వచ్చారు. కేంద్ర ప్రభుత్వం, స్వతంత్ర సంస్థలు ఇచ్చిన గణాంకాలను అంకెల గారడీతో తనకనుకూలంగా మార్చుకుని వాటిని విపరీతంగా ప్రచారం చేసి గుజరాత్ అభివృద్ధి శరవేగంతో సాగిపోతోందని ప్రజలను భ్రమింప చేస్తూ వచ్చాడు.

అసలు గుజరాత్‌లో నిజంగానే అభివృద్ధి జరిగిందా? గుజరాత్‌లో మోడి అధికారంలోకి వచ్చిన 2001 నుంచి చాలా దారుణంగా అభివృద్ధి కుంటుబడింది. అభివృద్ధి అని ఏదైతే చెప్పుకుంటున్నారో అందులో ఒక శాతమైనా ప్రజలకు అందలేదు. కొద్దిగానైనా అంది ఉంటే అది కేవలం హిందూ మతస్తులకు, అందులోనూ పలుకుబడి ఉన్న వాళ్లకే. ముస్లింలకయితే అభివృద్ధి అనే మాటే తెలియనంత దుర్భర స్థితి ఉంది. ముస్లింలు ఎక్కువగా నివసించే ప్రాంతాలలో గుజరాత్‌లో పాఠశాలలు ఉండవు. కొన్ని చోట్ల ఉన్నా అక్కడ సిబ్బందిని నియమించలేదు. పేద ముస్లింలు బ్యాంకుల ద్వారా రుణాలు వంటి సదుపాయాలు పొందాలనుకున్నా బ్యాంకులు వారిని నిరాకరించేలా ఆదేశాలున్నాయి. ఏదో ఒక కారణంతో బ్యాంకు వాళ్లు ముస్లింల అభ్యర్థనలను తిరస్కరిస్తారు. విసుగు వచ్చి ఇక బ్యాంకుకు పోకూడదని తమంతట తామే విరమించుకునేలాగా అధికార్లు ప్రవర్తిస్తారు. మైనారిటీలకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే స్కాలర్‌షిప్‌లను కూడా ప్రభుత్వ అధికారులు అందించరు. వారికి అలాంటి ఆదేశాలు ఎప్పటికప్పుడు ఇస్తుంటాయి. కేంద్ర ప్రభుత్వ పథకాలపై రాష్ట్ర ప్రభుత్వమే అజమాయిషీ చేసే వాతావరణం గుజరాత్‌లో కనిపిస్తుంది. కనీసం ఒక ఫోన్ కొనాలన్నా, నిత్యావసర సరుకులు కొనాలన్నా, వాహనాలలో ప్రయాణం చేయాలన్నా ముస్లింలు హిందువుల కంటే ఎక్కువ డబ్బులు చెల్లించాల్సిందే. అలా ఎక్కువ డబ్బులు వసూలు చేసే ఒక దోపిడి వ్యాపార వర్గాన్ని ఆ రాష్ట్ర ప్రభుత్వం అక్కడ సృష్టించింది. పెట్టుబడికున్న వ్యాపార లక్షణం వికృత రూపం

గుజరాత్‌లో మనకు కనిపిస్తోంది. అక్కడ పెట్టుబడి ఉత్పత్తిని ప్రోత్సహించేదిగా కాకుండా కేవలం వ్యాపారాన్ని పెంచుకునేలా పని చేస్తోంది. ఎక్కువ భాగం పెట్టుబడి ఆ పని చేయడానికే చలామణిలో ఉంటుంది. ఉత్పత్తికి ఉన్న అసలు విలువ అక్కడి ప్రజలకు చేరే సరికి అనేక రెట్లుగా పెరిగిపోతుంది. అసలు విలువకు పెరిగిన విలువకు ఉన్న ఆ విపరీతమైన తేడా వివిధ స్థాయిలలో మరల పెట్టుబడిగా మారి పోతుంది. దళారీలు, వ్యాపారులు ఈ స్థాయిలలో విపరీతంగా దోపిడి చేస్తూ అసలు పెట్టుబడిని పెద్ద స్థాయిలో పెంచి దాన్ని కూడా ఉత్పత్తిని పెంచేదిగా కాకుండా కేవలం వ్యాపారం పెంచుకునే విధంగా ఉపయోగపడేలా మార్చేశారు. ఈ ప్రక్రియలో అధిక లాభాలు గడించి ఆ లాభాల పునాదులాధారంగా ఆర్థిక అంతరాలను పెంచుతూ వస్తున్నారు. గుజరాత్‌లో మార్వాడీలు, సింధీలు ఈ తరహా దళారీ సమూహాలే. ప్రభుత్వం కార్పొరేట్ వ్యాపారాలకు అధిక ప్రోత్సాహమిచ్చి చిన్న వ్యాపారుల, పేద వ్యాపారుల నడ్డి విరిచేలా కార్పొరేట్ అనుకూల సంస్కరణ విధానాలను అమలు చేస్తూ వచ్చింది. తద్వారా గ్రామాలలో పట్టణాలలో పేదవారికి ఉపాధి లేకుండా పోయింది. పేదవాడు మరింత పేదవాడిగా మారాడు. కాని ఇదంతా మోడీకి పట్టదు. కార్పొరేట్ వ్యాపారమే ఆర్థిక ప్రగతికి కారణమవుతుందని నమ్ముతూ పెట్టుబడులను ఆహ్వానించి కార్పొరేట్ రంగాన్నే వృద్ధి చేస్తూ వచ్చాడు. ఇక్కడ ఒక విషయం చెప్పుకోవాలి. ప్రతి సభలోనూ బోలెడన్ని పెట్టుబడులు గుజరాత్‌కు తెచ్చానని చెప్పుకునే మోడీ 2011లో కూడా 20 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని చెప్పాడు. కానీ వాస్తవంగా వచ్చినవి 29183 కోట్లు మాత్రమే. మొత్తం 8300 ఎంఒయులు సంతకాలు అయితే అందులో సరైనవి కేవలం 250 మాత్రమే. నిజానికి పెట్టుబడులు తేవడం, వాటి ద్వారా కార్పొరేట్ రంగాన్ని వృద్ధి చేయడం, కృత్రిమ ఉద్యోగాలు సృష్టించడం, ఆ పెట్టుబడుల లాభాలను కంపెనీలకు పంచడం అనే రూపం అసలు అభివృద్ధి కిందనే రాదు. కానీ అలాంటి అభివృద్ధికి బిజెపి వ్యతిరేకం కాదు కనుక, అందులోనూ మోడీ ప్రతిచోటా పెట్టుబడుల గురించి మాట్లాడుతాడు. కనుక 2001 నుంచి 2013 దాకా చూస్తే తెచ్చిన పెట్టుబడులు తక్కువ, చెప్పుకొనేది ఎక్కువగా మోడీ ప్రచార పటాటోపం కొనసాగింది. పెట్టుబడులు రాకపోయినా, ఎంఒయులు కాక పోయినా అయినట్లుగా నమ్మింపజేసే దుస్సాహసం మోడీకి అలవాటైన విద్యే. వచ్చిన కొద్ది పాటి పెట్టుబడులు కూడా బిజెపి కార్యకర్తల, నాయకుల జేబులు నింపడానికే ఉపయోగపడ్డాయి. కాని జరగాల్సిన కొద్దిపాటి పనులు కూడా ఎక్కడ జరిగిన దాఖలాలు లేవు.

ఇక సామాజిక అభివృద్ధి గురించి చూద్దాం. గుజరాత్‌లో పిల్లల పౌష్టికత చాలా తక్కువ పాళ్లలో ఉంది. నలుగురిలో ముగ్గురు రక్తహీనతతో బాధపడుతున్నారని, తల్లుల పరిస్థితి కూడా అలాగే ఉందని యునిసెఫ్ రిపోర్టు చెపుతోంది. మౌలిక వసతుల కల్పనలో కూడా గుజరాత్ చాలా వెనుకబడి ఉంది. గ్రామీణ జనాభాలో అధిక శాతం నీటి వసతికి నోచుకోలేదు. 67 శాతం ప్రజలకు అసలు మరుగుదొడ్ల వసతే లేదు. రక్షిత మంచి నీటి సౌకర్యం ఉన్నవారు కేవలం 16.7 శాతమే. దళితులు, గిరిజనులు, స్త్రీలు, ముస్లింలు చాలా దయనీయంగా బతుకుతున్నారు. ప్రణాళికా సంఘం విద్య, వైద్యంపై చేసిన సమీక్షలో ఈ అంశాన్ని స్పష్టంగా పేర్కొంది. యుఎన్‌డిపి కూడా పిల్లలను పాఠశాలలలో చేర్పించే విషయంలో గుజరాత్ 18వ స్థానంలో ఉందని పేర్కొన్నది. ఉన్నత పాఠశాలల్లో ఇది కేవలం 36.3 శాతం మాత్రమే. ఎస్.సి, ఎస్.టిల డ్రాపవుట్ శాతం 57.9 అంటే సగానికంటే ఎక్కువ మంది పిల్లలు డ్రాపవుట్‌లవుతున్నారన్న మాట. తలసరి ఆదాయం పెరిగిందని గొప్పలు చెప్పుకునే మోడి ప్రభుత్వంలో అసమానతలు ఇంకా ఎక్కువ పెరిగాయి. గుజరాత్‌లో ప్రజలకు ఉపాధి చాలా కల్పించబడిందనే ప్రచారం జరుగుతోంది. ఇది అవాస్తవం. నిజానికి మోడి వచ్చాక చిన్న ఉద్యోగాలను తగ్గించి కార్పొరేట్ ఉద్యోగాల సంఖ్య పెంచాడు. వృత్తులను ఘోరంగా దెబ్బతీశాడు. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు, వైఎస్ తరహాలోనే గుజరాత్‌లో ప్రపంచీకరణ మోడీ హయాంలో పేద, చిన్న తరగతి ప్రజల పొట్ట కొట్టింది. రైతులు, రైతు కూలీలు, వృత్తులపై ఆధారపడ్డవారు, కార్మికులు, శ్రామికులు అందరూ చితికిపోయి పొట్ట చేత పట్టుకొని నగరాలకు పోయి అక్కడి కార్పొరేట్ పనులతో పోటీ పడలేక బిక్షాటన చేసుకునే స్థితికి చేరుకున్నారు. ఒక గ్రామీణ పేద వ్యక్తి సగటు రోజువారి సంపాదన 69 రూపాయలు. కానీ లక్షలాది పేదలు ఖాళీ కడుపుతో పస్తులుంటున్నారు. బిజెపి గుజరాత్‌లో రైతు ఆత్మహత్యలు లేవని గొప్పలు చెప్పుకుంటుంది. కానీ రైతు ఆత్మహత్యలను సాధారణ మరణాలుగా చెప్తూ అసలు నిజాలను కప్పిపుచ్చుతున్నారు. అనేక మంది రైతులు ఆత్మహత్య చేసుకుంటూనే ఉన్నారు. కార్పొరేట్ కంపెనీలకు పేదల భూములను ఎకరాలకు ఎకరాలు తక్కువ ధరలకు కట్టబెట్టి, ఆ పేదలకు కనీస నష్ట పరిహారం కూడా ఇవ్వడం లేదు. అటవీ హక్కుల చట్టాన్ని పూర్తిగా ఉల్లంఘించి గిరిజనుల భూములను కార్పొరేట్ సంస్థలకు దారదత్తం చేశారు. బహుచరాజి ప్రాంతంలో 55 వేల ఎకరాల భూ ఆక్రమణపై జరిగిన నిరసనలను మనం చూసే ఉన్నాం. మారుతి సుజికికీ 750 హెక్టార్ల భూమి ఇచ్చారు. రైతుల అనుమతి లేకుండా వారికి ఎలాంటి ప్యాకేజీ ఇవ్వకుండా వారి నుంచి భూమిని ప్రభుత్వమే ఆక్రమించుకున్నది. ఒక్క 2011-12 సంవత్సరానికే 1275 కోట్ల రూపాయల విలువ గల లాభాలను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టిందని కాగ్ ప్రభుత్వాన్ని తప్పుబట్టింది. ఎస్సార్, రిలయన్స్ వంటి వాటికి ప్రభుత్వం స్వాగతం పలికింది. హజీరాలో ఎస్సార్‌కు 724687 చదరపు మీటర్ల భూమిని కట్టబెట్టారు. హింటర్ ల్యాండ్, గుజరాత్ కోస్తా ప్రాంతాలలో పెద్ద ఇండస్ట్రియల్ జోన్ల స్థాపన కోసం ప్రత్యేకంగా ఒక ప్రణాళిక తెచ్చి జిల్లా కలెక్టర్‌కు భూ ఆక్రమణ జరిపే రాజ్యాంగాతీత ప్రత్యేకాధికారాలు కల్పించాడు. మహిళలు, దళితులు, గిరిజనులు దీని వల్ల ఎక్కువగా నష్ట పోతున్నారు.

అవినీతిపై సమరం అని ఊదర గొట్టే నరేంద్రమోడీకి అవినీతి రహిత ప్రభుత్వ అధిపతి అని కితాబిస్తుంది. నిజానికి గుజరాత్‌లో తీవ్రమైన అవినీతి రాజ్యమేలుతోంది. మంత్రులు, అధికారుల అవినీతి చాలా ఎక్కువ స్థాయిలో గుజరాత్‌లో ఉంది. దాన్ని కప్పిపుచ్చుకోవడానికే అవినీతి వ్యతిరేక ఉద్యమాలు చేస్తున్నట్లు బిజెపి నటిస్తోంది.

మోడీ మార్క్ అభివృద్ధి కేవలం మధ్య తరగతి వర్గాన్ని ఆకర్షించేదే. సాధారణంగా మధ్య తరగతి వర్గాలు వాస్తవ విషయాల కంటే ఆకర్షణలచే

ఎక్కువగా లొంగిపోతారు. ఈ బాణాన్ని సరిగ్గా గురిచూసి వదిలిన మోడి ఆ ప్రజలకు పెద్ద దిక్కుగా మారిపోయాడు. అభివృద్ధి అంటే గణాంకాలు, లెక్కలు కావని, ఏ ప్రజలైతే పేదరికంతో కొట్టు మిట్టాడుతున్నారో ఆ ప్రజలు జీవన ప్రమాణాలు, స్థితి గతులు మారి వారి జీవితాలు బాగుపడడమే అభివృద్ధి అనే ఉన్నతార్థాన్ని ప్రజలకు అందనివ్వకుండా చేసి ప్రజలంటే హిందూవులు మాత్రమేనని, ముస్లింలంతా ఈ ప్రాంతానికి అదనపు భారమని, అందుకే ఏదైనా సరే హిందువులకు అందడమే అభివృద్ధి అనే నిర్వచనాన్ని మధ్య తరగతి వర్గాల మెదళ్లలోకి చొప్పించడంలో మోడీ సఫలమయ్యాడు. ఇదొక ప్రణాళికా బద్ధమైనా ప్రయోగం. ముున్ముందు ఈ హిందూవులలో కూడా దళితులు, గిరిజనులు, స్త్రీలను ఇదే విధంగా కార్నర్ చేసి మొత్తంగా గుజరాత్ సమాజాన్ని బ్రహ్మణీకరించబోతున్నాడు. కనుక ఇదెంత ప్రమాద పూరితమైన ప్రయోగమో అర్థం చేసుకోవాలి. బిజెపి, ఆర్ఎస్ఎస్‌ల అంతిమ అజెండా ఇదే. దానికి గుజరాత్ కార్యస్థానంగా మారబోతోంది. మోడీ ప్రధాని అయితే దాన్ని దేశం మొత్తానికిస్తరింపచేసే ప్రమాదమున్నది.

గుజరాత్‌లో మావన హక్కులు తీవ్రంగా ఉల్లఘించబడుతున్నాయి. రాజ్యానికి వ్యతిరేకంగా నోరు మెదపలేని నియంతృత్వ వ్యవస్థ గుజరాత్‌ను పాలిస్తోంది. చత్తీస్‌గడ్, ఆంధ్రప్రదేశ్‌లలో రాజ్యానికి వ్యతిరేకంగా మాట్లాడితే ఎలాగైతే మావోయిస్టు ముద్ర వేస్తారో గుజరాత్‌లో ముస్లిం సానుభూతి పరుడనే ముద్రవేస్తారు. అలా మాట్లాడిన వారిపై ప్రభుత్వ ప్రేరేపిత, మోడీ ఆజ్ఞాపిత హిందూ మూకలు దాడులు చేస్తాయి. పోలీసులు కూడా కనీసం కేసైనా నమోదు చేసుకోనంతగా ఆ మూకలకు రక్షణగా నిలుస్తారు. హిందూత్వ పేరుతో గుజరాత్‌లో ఒక భయాకన పరిస్థితి రాజ్యమేలుతోంది. సెప్టెంబర్ 11 దాడుల తర్వాత అమెరికా ముస్లిం మతాన్ని ప్రపంచ వ్యాప్తంగా లక్ష్యంగా గురిచేసుకోవడాన్ని మోడీ చాలా తెలివిగా వాడుకున్నాడు. విశ్వ హిందూ పరిషత్, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్, భజరంగ్‌దళ్, దుర్గా వాహిని వంటి హిందూ అతివాద గ్రూపులను పెంచి పోషించాడు. మక్కా మసీద్, మాలెగావ్, అజ్మీర్ షరీఫ్, సమ్‌జౌతా ఎక్స్‌ప్రెస్‌లపై దాడులను నిర్వహించింది ఈ హిందూ టెర్రరిస్టు గ్రూపులే. వాటిని ఖండిస్తూ ఏనాడూ మోడీ కనీసం ఒక్క మాటైనా మాట్లాడ లేదు. పైగా ముస్లింలపైనే ప్రతిదాడి చేస్తూ కేంద్రం ముస్లింల పట్ల మెతకగా వ్యవహరిస్తోందని ఆరోపిస్తాడు. ఇవాళ్టికీ మక్కా మసీద్, మలెగావ్ ఘటనలలో ప్రత్యక్ష్యంగా పాల్గొన్న హిందూ ఉగ్రవాదులు గుజరాత్ వీథులలో నిర్భయంగా తిరుగుతూనే ఉన్నారు. కేవలం ముస్లింలు అయినందుకే అనేక మందిపైన ఉగ్రవాద ముద్ర వేసి వేలాది మందిని జైలు పాలు చేశాడు. ముస్లింలపై దాడులు చేసినపుడు పెట్టబడ్డ నాలుగు వేల కేసులను ప్రభుత్వమే స్వయంగా మూసి వేసింది. ఒకటో అరో న్యాయ స్థానాల దాకా వెళ్లితే ఆ లోపున సాక్ష్యాలన్నీ మాయం చేసి అందకుండా చేశాడు. అంత పెద్దగా సంచలనం సృష్టించిన బెస్ట్ బేకరీ కేసులోనూ సాక్ష్యాలను తారుమారు చేయించిన ఘనుడు మోడీ. ఇక 2002 హత్యల గురించి అందరికీ తెలిసిందే. 'హిందూవుల కోపాన్ని వ్యక్తం కానివ్వండి' అంటూ పోలీసులనూ ప్రేక్షకులుగా మార్చి ముస్లింలపై దాడులను ప్రోత్సహించాడు. నిండు గర్భిణి కడుపును కత్తితో నిలువుగా చీల్చినా, గుంటలో దాక్కున్న మనుషులపై కిరోసిన్ పోసి మండుతున్న టైర్లను వేసి సజీవ దహనం చేసినా, ముస్లింలను చంపి తానొక రాణాప్రతాప్‌నని హంతకులు విర్రవీగినా, కనీస చలనమైనా లేకుండా 'మూడు రోజుల పాటు మీ ఇష్టం' అని హిందూత్వ హంతకులకు దాక్కోవడానికీ అవకాశం కల్పించి హత్యాకాండ ముగిసాక వారిని అభినందించి పూల మాలలతో సత్కరించి మోడీ, ప్రవీణ్ తొగాడియాతో కలిసి రచించిన ఆ నరమేధానికి పదేళ్ల తర్వాతైనా పశ్చాత్తాప పడకుండా 'ఆ సమయంలో నేను సరైనా పనే చేశాను' అని ఇటీవల ప్రకటించుకున్నాడు. గుజరాత్ మారణకాండను వ్యతిరేకించిన వారందరినీ ఇంతకు ముందు చెప్పుకున్నట్లుగా ముస్లిం సానుభూతి పరులుగా చిత్రించి, అలా చేయడమంటే గుజరాతీలను, వారి మనోభావాలను అవమానించడమే అని చెప్పి ఒక రకమైన సున్నితత్వాన్ని రెచ్చగొడుతూ వచ్చి దాన్ని గుజరాత్ అస్మిత ప్రచారం 2002 మచ్చ నుంచి తప్పించుకోవడానికి ఈ గుజరాత్ అస్మిత అస్త్రాన్ని ఒక రక్షణ కవచంగా ఏర్పాటు చేసుకున్నాడు. దాంతోనే ఎన్నికలలో వరుసగా గెలుస్తూ వచ్చాడు. వరుస విజయాల దర్పంతో సోహ్రాబుద్దీన్, తుల్సిరా ప్రజాపతి, ఇష్రత్ జహాన్ వంటి అమాయకులను ఎన్‌కౌంటర్‌లలో చంపిస్తూ వచ్చాడు. ఇవాళ గుజరాత్ ప్రజలకు ఈ ఎన్‌కౌంటర్లు సాధారణమే అనిపిస్తున్నాయి. కనుక లోక్‌సభ ఎన్నికలలో కూడా మోడీ గెలిస్తే దేశ భవిష్యత్తు ఏ విధంగా ఉండబోతుందో ఊహించుకోవచ్చు. విలువలను విధ్వంసం చేసినపుడే పెట్టుబడులు, వ్యాపారాలు వృద్ధి చెందుతాయి.

గుజరాత్ తరహాలో అభివృద్ధి చేయడమంటే దేశం మొత్తంలో విలువలను, ఆశయాలను ధ్వంసం చేయడమే. గుజరాత్‌లో మోడీ ఎదగడానికి, ఇవాళ మోడీని జాతీయ స్థాయిలో నిలబెట్టడానికి కారణమైన సంస్థలు, కంపెనీలు రేపు పెట్టుబడులపై ఆధిపత్యం నెరపి మానవత్వాన్ని, మానవీయ విలువలను పూర్తిగా నాశనం చేసే ప్రమాదముంది. ఇప్పుడు అమెరికాకు కూడా మోడీ విధానాల పట్ల అభ్యంతరం లేదు. కనుక ఇప్పటి యుపిఎ హయాంలో కూడా మరింత ప్రత్యక్షంగా భారతదేశ అంతర్గత వ్యవహారాలను అమెరికా శాసించబోతుంది. ఇక ఏనాటి నుంచో భారతదేశాన్ని హిందూదేశంగా మార్చి వేయాలని కలలు కంటున్న ఆర్ఎస్ఎస్ కలలను నిజం చేసే విధేయమైన నాయకునిగా మోడీ ముస్లింలను, మైనారిటీలను భౌతికంగా నిర్మూలించే వందలాది 2002లను సృష్టించే పనికి పూనుకునే ప్రమాదముంది. అది ప్రజాస్వామ్య విలువలకే పరిణమించబోయే అతి పెద్ద విఘాతం. అందుకే మోడీని నిలువరించడం ఇవాళ దేశ ప్రజలందరి ముందూ ఉన్న అతి పెద్ద బాధ్యత.

(రచయిత ఉపాధ్యాయులు) వీ

రచయితలకు సూచన : తక్షణ, సమకాలీన అంశాలపై రచనలు చేసి ఆ సంచికలోనే రావాలనుకొనే రచయితలు 20వ తేదీ లోగా పంపగలిగితేనే మరుసటి నెల సంచిక కోసం పరిశీలించడం సాధ్యమవుతుంది. ఆ తరువాత వచ్చిన రచన, అంశం ఎంత ముఖ్యమైనదైనా పరిశీలించడం, ముద్రణకు సిద్ధం చేయడం అసాధ్యమవుతుంది. రచయితలు గుర్తించగలరు. – సం.

ఢిల్లీ ఎన్‌కౌంటర్ - దెబ్బతిన్న న్యాయం

***దేశంలోని ముస్లిం సమాజంపై ప్రత్యేకంగా జరిగిన ఎన్‌కౌంటర్లను వివరిస్తూ అధికార నేరానికి అమాయక ముస్లింలు బలవుతున్నారని, చెరసాలలే వారి జీవితాలవుతున్నాయని అంటున్నారు* పి.వి. రమణ**

దేశవ్యాప్తంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న తీవ్రవాద వ్యతిరేక చర్యలు, వాటిలో భాగంగా పోలీసులు చేస్తున్న అరెస్టులు, మీడియా ప్రచారం అంతా మొత్తం ముస్లిం సమాజం చుట్టూనే తిరుగుతున్నాయి. జాతీయ రక్షణ పేరుతో ముస్లింలను జాతి వ్యతిరేకులుగా ముద్ర వేస్తున్నారు. దేశంలో ఏ మూల ఏ ఒక్క బాంబు పేలినా దాని ప్రభావం నేడు మొత్తం ముస్లిం సమాజంపై పడే పరిస్థితి కొనసాగుతోంది. ఎక్కడ ఏం జరిగినా, వారికి సంబంధం లేకపోయినా సమాజంలో తోటి వారి అనుమానపు చూపులు, సంభాషణలు మొత్తం ముస్లిం సమాజాన్ని భయభ్రాంతుల్ని చేస్తున్నాయి. అన్యాయమైన పరిస్థితి కొనసాగుతున్న సమయంలో 'బాట్లా' ఎన్‌కౌంటర్‌పై తీర్పు వెలువడింది.

ఢిల్లీ అదనపు సెషన్స్ జడ్జి రాజేందర్ కుమార్ శాస్త్రి జూలై 30న బాట్లా ఎన్‌కౌంటర్‌లో నిందితుడిగా అభియోగం మోపబడిన షహజాద్ అహ్మద్‌కు జీవిత ఖైదు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. 2008 సెప్టెంబర్ 19న ఢిల్లీ బాట్లా హౌస్ ఏరియాలో తీవ్రవాదులకు, పోలీసులకు మధ్య జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇండియన్ ముజాహిద్దీన్ సంస్థ ముఖ్య నేత మహ్మద్ బషీర్ అతీఫ్, అతని సహచరుడు మహ్మద్ ఫక్రుద్దీన్ సాజిద్‌లతో పాటు స్పెషల్ సెల్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ మోహనచంద్ శర్మలు మరణించారనీ, సంఘటన స్థలంలో మహమ్మద్ సైఫ్, జీషన్‌లను అరెస్టు చేశామనీ, మరో ఇద్దరు తీవ్రవాదులు పారిపోయారనీ పోలీసుల అభియోగం. ఢిల్లీలో జరిగిన వరుస బాంబు పేలుళ్లకు షహజాద్ ప్రణాళిక రచించాడనీ, పారిపోయిన షహజాద్‌ను ఫిబ్రవరి 2010న ఆజంఘర్‌లో అరెస్టు చేశామని పోలీసులు చెప్పారు. షహజాద్ ఇన్‌స్పెక్టర్ శర్మ మరణానికి, గాయపడిన హెడ్ కానిస్టేబుళ్లు బల్వంత్‌సింగ్, రాజ్‌బీర్ సింగ్‌లపై హత్యా ప్రయత్న నేరానికి, ఉద్యోగ నిర్వహణలో ఉన్న పోలీసు అధికార్లపై దాడి చేసినట్లు రుజువయినందుకు షహజాద్‌కు జీవిత ఖైదు విధించడమే కాకుండా, జడ్జి 95 వేల రూపాయల పెనాల్టీ విధించి, దాంట్లో 40 వేల రూపాయలు ఇన్‌స్పెక్టర్ కుటుంబానికి చెల్లించాలని ఆదేశించారు. తీర్పులో జడ్జి ఆశ్చర్యకరంగా షహజాద్‌కు ఇండియన్ ముజాహిదీన్‌తో సంబంధమున్నట్లు రుజువు కాలేదని, పైగా అతను తీవ్రవాదా, కాదా అనేది అప్రస్తుతం అని వ్యాఖ్యానించారు.

2008లో జరిగిన బాట్లా ఎన్‌కౌంటర్ దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించడమే కాకుండా పోలీసుల కథనంపై తీవ్రమైన ఆరోపణలు వెలువడ్డాయి. ప్రధానంగా పియుడిఆర్, జనహస్తాక్షేప్ సంస్థల ఆధ్వర్యంలో 2008, సెప్టెంబర్ 21న జరిపిన నిజనిర్ధారణ కమిటీ అనేక ముఖ్యమైన విషయాలను ప్రజల దృష్టికి తీసుకు వచ్చింది. ఈ కమిటీలో ఢిల్లీ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రిన్సిపాల్ డా. ఎన్.కె. భట్టాచార్య, ఢిల్లీ యూనివర్సిటీ ప్రొ. షహనా భట్టాచార్య, డా. ఇష్ మిశ్రా, సుప్రీంకోర్టు లాయర్ ప్రశాంత్ భూషణ్, ఢిల్లీ హైకోర్టు లాయర్ ఎన్.డి. పాంచోళీ, జమియా మిలియా ఇస్లామియా టీచర్ శ్రీరేఖలున్నారు. ఈ కమిటీకి జమియా మిలియా ఇస్లామియా ప్రొ. ఇమితియజ్ నాయకత్వం వహించారు.

కమిటీ నివేదికలో అంశాలు -

1) ఎల్-18 బాట్లా హౌస్ నాలుగు అంతస్థుల భవనం. దానికి ఒకే ఒక్క మార్గముంది.

2) నాలుగవ అంతస్థులో ఫ్లాట్ నెం. 108లో హతులైన అతీఫ్, సాజిద్‌లు తీవ్రవాదులని పోలీసుల అభియోగం. కాని ఆగస్ట్ 21న ఆ ప్రాంతంలో అద్దెకుంటున్నవారు పోలీసులకు వివరాలు సమర్పించాల్సిన విధానం ప్రకారం వారు అన్నీ సరైన వివరాలనే ఇచ్చారు. అందులో అతీఫ్ మొబైల్ నంబర్ కూడా అసలైనదే ఇచ్చాడు. వాళ్లు తీవ్రవాదులైతే వెరిఫికేషన్‌లో దొరికిపోయే వివరాలను ఎందుకిస్తారు?

3) ఎన్‌కౌంటర్ జరిగిన తరువాత చనిపోయిన వారి ముఖాలను, శరీరాలను ఎవ్వరికీ మీడియాకు కూడా చూపించలేదు. వారిని నేరం జరిగినట్లు చెపుతున్న స్థలం దగ్గరకు అనుమతించలేదు.

4) అరెస్టు చేసినట్లుగా చెపుతున్న జీషన్ ఆ సమయంలో ఐఐపిఎం ప్రవేశ పరీక్ష రాస్తున్నాడు. 'హెడ్‌లైన్స్ టుడే' టివి స్టూడియోలో ఇంటర్వ్యూ ఇస్తున్న జీషన్‌ను అరెస్టు చేశారు. ఇది టివిలో రికార్డు కూడా అయింది. ఇతను తీవ్రవాది అని పోలీసుల అభియోగం.

5) ఫ్లాట్‌లో భయంకరమైన తీవ్రవాదులున్నారని తెలుసుకొని వెళ్లినట్లు చెపుతున్న పోలీసులు, ఇన్‌స్పెక్టర్ శర్మ, ఇతర పోలీసులు భద్రతకు అవసరమైన బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లు ఎందుకు ధరించలేదు?

6) ఒకవేళ వాళ్లు తీవ్రవాదులని తెలియకపోతే సంఘటన జరిగిన వెంటనే అరెస్టయిన వారిని ప్రశ్నించకుండానే, లోతైన పరిశోధన జరపకుండానే ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన వారు ఢిల్లీ బాంబుల కేసుల్లో ముఖ్యమైన నాయకులని ఎలా ప్రకటించగలిగారు?

7) మేడ మీద నుండి కింది వరకు పోలీసుల పహారా పెట్టి, ఒకే మార్గమున్న దారి నుండి ఇద్దరు తీవ్రవాదులు ఎలా పారిపోగలిగారు?

8) ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన ఇద్దరు యువకులు, పోలీసు ఎన్‌స్పెక్టర్‌ల పోస్టుమార్టమ్ రిపోర్టు వారి కుటుంబ సభ్యులకు గానీ, ప్రజలకు గానీ అందనివ్వకుండా రహస్యంగా ఎందుకు ఉంచారు?

ఎన్‌కౌంటర్ సంఘటనలో పోలీసుల కథనంపై అనుమానాస్పద అంశాలపై జవాబులను కోరుతూ ఈ సంఘటనపై సిట్టింగ్ సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలనీ, జామియా నగర్ వాసులు, జామియా యూనివర్సిటీ విద్యార్థుల అక్రమ అరెస్టులు వెంటనే ఆపాలనీ, పోలీసు సంస్థల్లో కరడుగట్టిన తీవ్రవాదులను పట్టుకొన్నామనే పేరు కోసం

జరుగుతున్న పోటీ కారణంగా అమాయక ముస్లింలను అరెస్టు చేయడాన్ని ఆపాలనీ, ఇంతవరకు 'స్టూడెంట్స్ ఇస్లామిక్ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా' (సిమి)ను బలిమేకను చేసిన పోలీసులు నేడు మొత్తం అజాంఘర్‌ను తీవ్రవాద ప్రాంతంగా పేర్కొనడాన్ని వెంటనే ఆపాలి అనే నిజనిర్ధారణ కమిటీ డిమాండ్ చేసింది.

2008లోనే సమాజ్‌వాది పార్టీ, బహుజన సమాజ్ పార్టీ ఈ ఎన్‌కౌంటర్‌ను ఖండిస్తూ, జుడిషియల్ ఎంక్వైరీ జరపాలని డిమాండ్ చేశాయి. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దిగ్విజయ్ సింగ్ ఈ ఎన్‌కౌంటర్ బూటకమని, పోలీసు అధికార్ల మధ్య ఉన్న పోటీయే ఇన్‌స్పెక్టర్ శర్మ మరణానికి కారణమని, దానికి రుజువుగా శర్మ బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ వేసుకోకపోవడమేనని, కరడుగట్టిన తీవ్రవాదులని తెలిసే వెళ్లామని చెపుతున్నప్పుడు, మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సింది పోయి, సాధారణ వ్యవహారంగా ప్రవర్తించడం దీనిని రుజువు చేస్తుందని విమర్శించారు.

పియుడిఆర్ వేసిన పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు మే 21, 2009న జాతీయ మానవ హక్కుల సంఘాన్ని (ఎన్‌ఎచ్‌ఆర్‌సి) ఎన్‌కౌంటర్‌పై విచారణ జరపాలని ఆదేశించింది. దానిపై ఆ సంఘం జూలై 22న పోలీసుల అభియోగాలన్నీ నిజమేనని నిర్ధారించింది. నిజానికి ఎన్‌ఎచ్‌ఆర్‌సి ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశాన్ని పరిశీలించకుండానే, చుట్టు పక్కల ఉన్న ప్రజలతో మాట్లాడకుండానే, అరెస్టయిన వారితో కూడా మాట్లాడకుండానే కేవలం పోలీసులు ఇచ్చిన సమాచారం మీద ఆధారపడి నిర్ణయించిందని ప్రజాసంఘాలన్నీ విమర్శించాయి.

సెషన్స్ కోర్టు జడ్జి తీర్పుపై స్పందిస్తూ జామియా టీచర్స్ అసోసియేషన్ అనేక ప్రశ్నలు లేవనెత్తింది. షహజాద్‌కు ఇండియన్ ముజాహిదీన్‌తో సంబంధం లేదని, ఎన్‌కౌంటర్ జరిగిన రోజు అతను అక్కడ లేడని తేలింది. ఇంతవరకు హత్యకు ఉపయోగించిన ఆయుధం దొరకలేదు. షహజాద్ ఇన్‌స్పెక్టర్ శర్మపై కాల్పులు జరిపి పారిపోయాడన్నారు. కాని అక్కడ సేకరించిన వస్తువులలో బుల్లెట్ షెల్స్ దొరకలేదు. అతీఫ్, సాజిద్‌ల శరీరాలపై తీవ్రమైన గాయాలున్నాయి. దీన్ని బట్టి చిత్రహింసల తర్వాత కాల్చి చంపారనే అనుమానం ఉంది. పారిపోయిన తీవ్రవాది షహజాద్ అని అంటున్నారు. కాని, రైడింగ్ పార్టీలో ఉన్న సీనియర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ రాహుల్ కుమార్, పరిశోధనాధికారికి ఇచ్చిన ఫిర్యాదులో పారిపోయిన తీవ్రవాది పేర్లు జునైద్, పప్పులుగా, అరెస్టయిన సైఫ్ చెప్పినట్లుగా ఉంది. మరి షహజాద్ ఎక్కడ నుంచి వచ్చినట్లు? షహజాద్ పాస్‌పోర్టు ఎన్‌కౌంటర్ ప్రదేశంలో దొరికిందని చెపుతున్నారు. అలాంటప్పుడు షహజాద్ పేరు ఫిర్యాదులో ఎందుకు లేదు? అన్న ప్రశ్నలకు సరైన జవాబులు లేవు.

విధ్వంసం అయిన అమాయకుల జీవితాలు

1984 సిక్కుల ఊచకోత కోసిన వారు 1992-93లలో బొంబాయి మారణకాండలో, 2002 గుజరాత్ మారణకాండలో ఇతర మతకల్లోలాలలో పాల్గొన్నవారు హాయిగా తిరుగుతుంటే, దేశవ్యాప్తంగా అమాయక ముస్లింలు జైలులో ఏళ్ల తరబడి మగ్గుతున్నారు. 2007లో జరిగిన స్టేట్ పోలీస్ కాన్ఫరెన్స్‌లో ఇంటిలిజెన్స్ బ్యూరోకి చెందిన స్పెషల్ డైరెక్టర్ మాట్లాడుతూ '16 బాంబు పేలుళ్ల కేసులలో హిందూ తీవ్రవాదుల హస్తం ఉన్నట్లు ఆధారాలున్నాయి' అని చెప్పినా మీడియాలో దానికంత ప్రచారం రాలేదు. వీటిలో సంజోత ఎక్స్‌ప్రెస్, మాలేగాం, అజ్మీర్, హైదరాబాద్ బాంబు పేలుళ్ల కేసులు ఉన్నాయి. తీవ్రవాద ముద్రపడి ఏళ్ల తరబడి జైళ్లలో ఉన్న ముస్లింలలో కొంతమంది నిరపరాధులుగా రుజువయి బయటకు వచ్చినా, చాలా మంది తమ ఉద్యోగాలు, బతుకు తెరువు కోల్పోయారు. సమాజంలో ఎవరూ నమ్మని పరిస్థితిలో మానసికంగా కుంగిపోయిన వారు, బతకాలనే ఆశ కూడా లేకుండా ఉన్నవారు అనేక మంది ఉన్నారు. ఉదాహరణకు కొన్ని వివరాలు చూద్దాం.

ఢిల్లీ లజపతినగర్ బాంబు పేలుళ్ల కేసులో జూన్ 17, 1996న సయ్యద్ మఖ్‌బూల్ షాను అరెస్టు చేశారు. ఈ కేసును 26 మంది జడ్జీలు విచారించారు. చివరకు ఏప్రిల్ 8, 2010న నిరపరాధిగా విడుదల చేశారు. అరెస్టయినపుడు అతని వయసు 17 సంవత్సరాలు. విడుదల అయ్యే నాటికి 32 సంవత్సరాలు. అంటే 14 సంవత్సరాలు జైలులోనే ఉన్నాడు.

మురళీ మనోహర్ జోషి, మాజీ జమ్మూ కశ్మీర్ గవర్నర్ జగ్‌మోహన్‌ల హత్యకు కుట్ర పన్నాడని షకీల్ అహ్మద్ ఖాన్‌ను ఢిల్లీలో ఏప్రిల్ 24, 1992న అరెస్టు చేశారు. పది సంవత్సరాలు జైల్లో ఉన్న అతన్ని ఆగస్ట్ 2002లో నిరపరాధిగా విడుదల చేస్తూ ఢిల్లీ అడిషనల్ సెషన్స్ కోర్టు జడ్జి ఎస్.ఎన్. ధీంగ్రా 'అమాయకుల్ని అరెస్టు చేశారు. సంఘటనకు ముందే వీళ్లను అరెస్టు చేశారు. ఆయుధాల స్వాధీనం గురించి కూడా నమ్మకమైన ఆధారాలు లేవు' అని తీర్పు చెప్పారు.

పేలుడు పదార్థాలు, ఆయుధాలు కలిగి ఉన్నాడని, కశ్మీర్ నివాసి మీర్జా ఇఫ్తికర్ హుస్సేన్ (40)ను ఢిల్లీలో జూన్ 14, 1996న అరెస్టు చేశారు. పాటియాలా హైకోర్టు జడ్జి ఎస్.పి. గార్గ్ అతన్ని ఏప్రిల్ 8, 2010న నిరపరాధిగా విడుదల చేస్తూ 'అతను ఏ విధమైన నేరమూ చేయలేదని, పోలీసుల అభియోగాలన్నీ తప్పుల తడక' నని వ్యాఖ్యానించారు. 14 సంవత్సరాలు జైల్లో నరకయాతన అనుభవించిన హుస్సేన్ 'జీవితం మీదే ఆశ పోయింది. ఎందుకు బతకాలనిపిస్తుంది' అన్నాడు.

లష్కర్ తోయిబా తీవ్రవాదిగా శ్రీనగర్ నివాసి ఏరోనాటికల్ ఇంజనీర్ అయిన ఇమ్రాన్ అహ్మద్ కర్మానీ (29)ని నవంబర్ 15, 2006న ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. అతనిపై రాజ్యంపై యుద్ధం, చట్ట విరుద్ధ కార్యకలాపాల చట్టం సెక్షన్ 121, 122, 123లతో పాటు, నేరపూరిత కుట్ర సెక్షన్ 120బి కూడా పెట్టారు. కోర్టుల చుట్టూ తిరగడానికి కుటుంబ జీవనాధారాలన్నీ ఇల్లు, పొలం అన్నీ అమ్ముకోవలసి వచ్చింది. ఏడుగురు జడ్జీలు విచారించిన తర్వాత చివరకు తీస్ హజారీ కోర్టు జడ్జి ఎస్.ఎస్. రథి అతన్ని నిపరాధిగా మే 12, 2011న విడుదల చేశారు. పోలీసుల అభియోగాలన్నీ అబద్ధాలేనని ప్రకటించారు.

2007లో జరిగిన మక్కామసీదు, గోకుల్‌ఛాట్ పేలుళ్ల కేసులో కిరోసిన్ డీలర్ అయిన షోయబ్ జాగిర్దార్ (42) అతని బంధువు సయ్యద్ ఇమ్రాన్ ఖాన్ (22) తీవ్రవాద కార్యకలాపాల పేరుతో మే 21, 2007న అరెస్ట్ చేశారు. పోలీసులు కరెంట్ షాక్‌లిచ్చి బలవంతంగా నేరం చేసినట్లు ఒప్పంద పత్రాలపై సంతకాలు తీసుకున్నారు. చివరకు నిరపరాధులుగా విడుదలైన వీరు మీడియాతో మాట్లాడుతూ 'అమాయకుల్ని తప్పుడు కేసులు పెట్టి ఈ విధంగా ఇరికిస్తే వారు తప్పక తీవ్రవాదులుగా మారిపోతారని, పోలీసుల చర్యలన్నీ సామాన్య ప్రజలు తీవ్రవాదులుగా మారిపోయే విధంగానే ఉన్నాయని' తమ బాధను వెలిబుచ్చారు.

ఇదే కేసులో నిందితుడిగా యునాని వైద్యుడు ఇబ్రహీమ్ ఆలీజునైద్ (26) ను సెప్టెంబర్ 3, 2007న అరెస్ట్ చేశారు. చెవులు, పెదాలు, గుండె, శరీరంలో అన్ని భాగాలలో చివరకు మర్మాంగంపై కూడా కరెంట్ షాకులు రోజుల తరబడి ఇచ్చారని ఇప్పుడు మూత్ర విసర్జన చేసేటప్పుడు రక్తం కారుతుందని అతను చెప్పాడు. హక్కుల సంఘాలు, సీనియర్

పాత్రికేయుల జోక్యం వలన నేను నిరపరాధిగా బయటపడ్డానని చెప్పాడు.

మహారాష్ట్ర మాలెగాం బాంబుపేలుళ్ల కేసులో డాక్టర్ సల్మాన్ షా...., ఇమామ్ మహ్మద్ జహీద్, కార్మికుడు నూరున్ హుదా, వ్యాపారస్తుడైన రియాజ్ అహ్మద్, షబ్బీర్ అహ్మద్‌లను 2006లో అరెస్ట్ చేసి, 2011లో విడుదల చేశారు. నిజానికి ఆ పేలుళ్లకు హిందూత్వ తీవ్రవాదులే కారణమని జైల్లో ఉన్న అసిమానంద ఒప్పుకోలు తర్వాతనే వీరిని నిరపరాధులుగా విడుదల చేశారు. వారిని నగ్నంగా చేసి, కాళ్లు కట్టేసి, కాళ్లపై మర్మాంగాలపై కర్రలతో కొట్టి ఒప్పుకోలు పత్రాలపై సంతకాలు చేయమని ఒత్తిడి చేయడం, ఒప్పుకోక పోతే వారి కుటుంబ సభ్యులపై క్రిమినల్ కేసులు పెడతామని, స్త్రీలను చెరుస్తామని కూడా బెదిరించారని వారు చెప్పారు. ఈ విధంగా మాలెగాం పేళుళ్ల కేసులో 115 మందిని అరెస్ట్ చేసి ఐదు సంవత్సరాలు చిత్రహింసలకు గురిచేసి, తర్వాత విడుదల చేశారు.

2002 గుజరాత్ మారణకాండకు కారణమైన గోద్రా రైలు దహనం కేసులో 67 మంది ముస్లింలను అరెస్ట్ చేసి 9 సంవత్సరాలు జైల్లో ఉంచి సరైన ఆధారాలు లేవని విడుదల చేశారు. హరేన్ పాండ్య హత్య కేసులో 12 మందిని అరెస్ట్‌చేసి 5 సం॥లు జైలులో ఉంచి సరైన ఆధారాలు లేవని విడుదల చేశారు. 2007లో హైదరాబాద్‌లోని మక్కా మసీదు బాంబు పేళుళ్ల కేసులో 21 మందిని అరెస్ట్ చేసి 3 సం॥లు జైలులో ఉంచి వారిని నిరపరాధులుగా విడుదల చేశారు.

పోలీసుల విచక్షణా రహిత దాడులను, అరెస్ట్‌లను పరిశోధించాలని స్టేట్ మైనారిటీస్ కమిషన్ నియమించిన అడ్వకేట్ కమిషనర్ 'అరెస్ట్‌లు చేసిన వారిపై పోలీసులు జరిపిన చిత్రహింసలు రుజువయ్యాయని, వారు ప్రత్యేకంగా ఒక మతానికి చెందిన వారు కాబట్టే అరెస్ట్‌లు చేసినట్లు కూడా రుజువైందని' తన నివేదికలో తెలిపారు.

స్టూడెంట్ ఇస్లామిక్ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా (సిమి)

ఆగ్రాలో జరిగిన బాంబుదాడి కేసులోనూ, మరో నాలుగు కేసుల్లోనూ, ఉత్తరప్రదేశ్, భగ్వా గ్రామానికి చెందిన అబ్దుల్ యుబీన్‌ను సెప్టెంబర్ 4, 2000న అరెస్ట్ చేశారు. ఆగ్రా బాంబుపేళుళ్ల కేసులో యుబీన్‌తో బలవంతంగా తీసుకున్న ఒప్పుకోలు సాక్ష్యంగా చెల్లదని జడ్జి కేసుకొట్టేశారు. మిగిలిన కేసుల్లో కూడా నిరపరాధిగా తేలడంతో ఆగస్టు 6, 2008లో విడుదల అయ్యాడు. కాని హిందూస్థాన్ టైమ్స్ దినపత్రిక ఆగస్టు 10 సంచికలో యుబీన్ పెద్ద టెర్రరిస్ట్ అని, సిమి సంస్థలో మొట్టమొదటి బాంబర్ అని పూర్తి పేజీ కథనం వచ్చింది. దీన్నిబట్టి జాతీయ మీడియా ఎంత బాధ్యతా రహితంగా, ప్రమాదకరంగా ఉంటుందో తెలుస్తోంది. ఏప్రిల్ 3, 2001 ఇండియా టుడే పక్షపత్రికలో 'సిమి' సంస్థలో 500 మంది అన్సార్‌లు (పూర్తి కాలం విద్యార్థి సభ్యులు) ఇక్వాన్‌లు (అసోసియేట్ సభ్యులు) ఒక లక్ష మంది, అవాన్‌లు (అప్రెంటిస్ సభ్యులు) పది లక్షల మంది ఉన్నారని రాశారు. ఈ సంఖ్యలు అతిశయోక్తులన్న విషయం ఎవరికైనా అర్థమవుతుంది.

మెల్‌బోర్న్, మోనాష్ యూనివర్సిటీలో స్కూల్ ఆఫ్ పొలిటికల్ అండ్ సోషల్ ఎంక్వైరీలో రాజకీయాలు బోధిస్తున్న ప్రొఫెసర్ ఇర్ఫాన్ అహ్మద్ 'సిమి' సంస్థపై పరిశోధన జరిపి తెలిపిన వివరాల ప్రకారం 1975లో ఎమర్జెన్సీ తర్వాత దేశవ్యాప్తంగా ప్రజల హక్కులపై జరిగిన దాడి ప్రభావంతో ఉత్తరప్రదేశ్, ఆలీఘడ్ ముస్లిం యూనివర్సిటీలో కొంత మంది విద్యార్థులు కలిసి 1976లో 'సిమి' సంస్థకు అంకురార్పణ చేశారు. ఆ రోజుల్లో యూనివర్సిటీల్లో తీవ్రమైన ప్రభావం చూపుతున్న వామపక్ష విద్యార్థి సంస్థలను ఎదుర్కొనేందుకు 'జమాయిత్ ఎ ఇస్లామి' సంస్థ 'సిమి'ని ప్రోత్సహించింది. కాని కొన్ని సంవత్సరాల తర్వాత జమాయిత్ తన ఆదేశాలను ఏమాత్రం పాటించని సిమితో తెగతెంపులు చేసుకుంది.

1980ల మధ్యకాలం వరకు 'సిమి' కార్యకలాపాలు ప్రధానంగా విద్యార్థి సమస్యలు, విద్యాపరమైన, మతపరమైన నీతి విషయాల పైనే ఉండేవి. 1990ల నుండి మీడియాలో 'సిమి'ని తీవ్రవాద సంస్థగా చిత్రించడం ప్రారంభమయింది. 1990లో అద్వానీ రథ యాత్ర, 1992లో బాబ్రీ మసీదు విధ్వంసం తర్వాత 'సిమి'లో తీవ్రమయిన మార్పులు వచ్చాయి. ముంబయిలో 'సిమి' 'ఇక్దామ్-ఎ-ఉమ్మత్' (ముస్లింల కొరకు కార్యాచరణ) అనే సెమినార్ జరిపింది. ఇక్కడ నుండే జిహాద్‌కు పిలుపిచ్చారు. దేశంలో సెక్యులర్ విధానాలకు వ్యతిరేకంగా జరుగుతున్న పాలన, ముస్లింలపై జరుగుతున్న హింసను అరికట్టలేని ప్రభుత్వాలు, భేధభావం లేకుండా ప్రజలను పాలించడం జరగడం లేదనే కారణంతో జిహాద్ పిలుపివ్వడానికి కారణాలుగా సెమినార్‌లో వక్తలు మాట్లాడారు. బాబ్రీ మసీదు విధ్వంసం, ముంబైలోనూ, సూరత్‌లోనూ ముస్లింలపై జరిగిన దాడులు వీరిపై తీవ్ర ప్రభావం చూపాయి. తమ ప్రజల్ని రక్షించుకోవడానికి అవసరమైతే ప్రాణాల్ని బలి ఇవ్వడానికైనా సిద్ధపడాలనే పిలుపిచ్చారు. ఇక్కడ నుండే 'సిమి' విద్యార్థి విభాగం రంగం నుండి మొత్తం ముస్లిం సమాజాన్ని తమ కార్యరంగంగా మార్చుకున్నారు.

2001లో ఇండియా టుడే పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో 'సిమి' ప్రధాన కార్యదర్శి 'సఫ్దర్‌నగోరి' తన అభిప్రాయాలను ఇలా ప్రకటించాడు. 'ఎవరో ఒక వ్యక్తికి ముప్పు ముంచుకొచ్చినపుడు కాకుండా, యావత్ వర్గమే వేధింపులకు గురవుతున్నప్పుడు, జిహాద్‌కు పిలుపివ్వడం జరుగుతుంది. ఇందులో వివిధ దశలుంటాయి. మొదట అన్యాయానికి వ్యతిరేకంగా గొంతు విప్పాలి. ప్రజాస్వామ్య పద్ధతుల్లో నిరసన తెలపాలి. హెచ్చరించాలి. అవేవి పనిచేయనప్పుడే తిరుగుబాటు చేయవలసి వస్తుంది. ఆయుధాలు చేపట్టవలసివస్తుంది'.

'ఇతర మతస్థుల విశ్వాసాలను, ఆచారాలను మేము గౌరవిస్తాం. నిజమైన ముస్లింలుగా మేం ఎప్పుడూ ఈ గౌరవాన్ని ప్రదర్శిస్తూనే ఉంటాం. అదే సమయంలో ఖురాన్ సూక్తులు ప్రచారం చేయడం మా ముఖ్య లక్ష్యం. ఈ కార్యక్రమాన్ని ముస్లిమేతరులలోనూ నిర్వహిస్తాం. అయితే ఈ సందర్భంగా ఎలాంటి నిర్బంధం ఉండదు. అందరూ వందే మాతరం ఆలపించాలనే లాంటి నిర్బంధం ఉండదు'

'భారతీయుడిగా ఉన్నందుకు విచారిస్తున్నాను. ప్రపంచంలో ఎక్కడా లేనంతగా ముస్లింలపై అత్యాచారాలు జరిగే జెరుసలేంలో కూడా ప్రధాన మసీదు 'మజీద్-ఎ-అక్సా' పదిలంగా ఉంది. అయోధ్యలో మట్టుకు అలా జరగకపోవడం విచారం. ఇజ్రాయిల్‌లో నిరసన ప్రదర్శకులను అదుపులో ఉంచడానికి రబ్బర్ బుల్లెట్‌లను ఉపయోగిస్తారు. ఇక్కడేమో కాన్పూర్‌లో లాగ హతమారుస్తున్నారు'

'మేం కేవలం ఆకుల మీద, కొమ్మల మీద కాకుండా వేర్ల మీదనే దృష్టి కేంద్రీకరించి, సమూలంగా మార్పులు తేవాలని ఆశిస్తున్నాం. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో బహిరంగ సైద్ధాంతిక చర్చలు జరగాలి, తప్ప బోగస్ ప్రచారం కాదు. మా మదర్సాలు టెర్రరిజానికి శిక్షణాలయాలు కావు' అని ఇంటర్వ్యూలో చెప్పాడు.

'సిమి' కార్యకర్తలందరూ తీవ్రవాదులేనని అరెస్ట్‌లు చేసి కేసులు పెట్టారు. కాని అధిక శాతం కేసులలో వారు నిరపరాధులేనని తేలింది. 'సిమి' కేసులు విచారించడానికి ఏర్పాటు చేసిన 'ప్రత్యేక సిమి ట్రిబ్యునల్‌లో మహారాష్ట్ర ప్రభుత్వానికి చెందిన ఉన్నత ఇంటలిజెన్స్

అధికారి పి.కె. జైన్ జూలై 12, 2008న హాజరయి 'సిమి'పై 2001 నుండి రిజిస్టరయిన 107 కేసుల్లో దాదాపు 45 కేసుల్లో విచారణకు ముందే అభియోగం మోపబడిన వారిని విడుదల చేశాం. 107 కేసుల్లో కేవలం 2 కేసుల్లో మాత్రమే శిక్షలు పడ్డాయి. మిగిలిన కేసులు విచారణలో ఉన్నాయి' అని చెప్పాడు.

ఇండియన్ ముజాహిద్దీన్ (ఐ.ఎం)

బాబ్రీమసీదు విధ్వంసం, గుజరాత్ మారణకాండల తర్వాత ఇండియన్ ముజాహిద్దీన్ సంస్థ ఉనికిలోకి వచ్చిందనీ, 'సిమి' నుండి రూపాంతరం చెందిందనీ కొంత మంది విశ్లేషకుల అభిప్రాయం. వీరిలో అధికశాతానికి మతపరమైన మూఢ విశ్వాసాలు లేవు. ఎక్కువ మంది కాన్వెంట్ స్కూళ్లలో, ప్రైవేట్ స్కూళ్లలో చదువుతున్న వారే. వీరిలో కాలేజీ విద్యార్థులు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, మెకానిక్స్, డాక్టర్లు, విద్యావేత్తలు ఉన్నారు.

2008లో దేశవ్యాప్తంగా జరిగిన బాంబుపేళుళ్ల కేసులో అరెస్టు చేయబడిన యువకుల లక్షణాలను, సామర్థ్యాలను పరిశీలించిన ముంబాయి 'ఆంటీ' టెర్రరిస్టుస్క్వాడ్ (ఎ.టి.ఎస్) చీఫ్ అయిన హేమంత కర్కరే "ఇటువంటి విధ్యాధికుల గురించి ఏమనుకోవాలి. వారి నేపథ్యం చూడండి. వారి ఉన్నత విధ్యార్హతలు ఇతరులను సిగ్గు పడేల చేస్తున్నాయి" అని వాఖ్యానించాను.

బాట్లాహౌస్ ఎన్‌కౌంటర్ తర్వాత ఇండియన్ ముజాహిద్దీన్ నాయకులు చాలా మంది పాకిస్తాన్, బంగ్లాదేశ్, నేపాల్‌కు పారి పోయారని పోలీసు వర్గాల అభియోగం. భారత దేశంలో తీవ్రవాద నిరోధానికై పని చేస్తున్న ఇంటలిజెన్స్ సంస్థలన్నీ ప్రధానంగా పాకిస్తాన్, బంగ్లాదేశ్, నేపాల్‌ల నుండి నడుస్తున్న తీవ్రవాద సంస్థల నాయకత్వంలో మనదేశంలో బాంబు దాడులు జరుగుతున్నాయని అభిప్రాయ పడుతున్నారు. కాని 2008 బాట్లా ఎన్‌కౌంటర్ తర్వాత విదేశీ శక్తుల ఆధిపత్యం లేకుండానే, భారత దేశంలో స్వయంగా కార్యక్రమాలు నిర్వహించడానికి ఏర్పడిన సంస్థ ఇండియన్ ముజాహిద్దీన్ అని కొన్ని ఇంటలిజెన్స్ సంస్థల అభిప్రాయం. ఎందుకంటే ఎక్కడ బాంబు పేళుళ్ల కార్యక్రమం జరిగినా, వెంటనే నెట్‌లో ఇమేయిల్స్ ద్వారా ఈ దాడులకు ఇండియా ముజాహిద్దీన్ బాధ్యత వహిస్తుంది. ఈ దేశంలో ముస్లింలపై జరుగుతున్న దాడులకు, పోలీసుల చిత్రహింసలకు ఇదే మాసమాధానం అంటూ ప్రకటనలిచ్చారు కాబట్టి.

ఇప్పటికి అరెస్టయిన ఐ.ఎం నింధితుల్లో అత్యధిక శాతం అండర్ ట్రయిల్స్ గానే ఉన్నారు. వారిపై మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల ఆంటీ టెర్రరిస్టుస్క్వాడులు, కోర్టులో నిలబడగల కేసులు పెట్టలేని స్థితిలో ఉన్నారని విశ్లేషకుల అభిప్రాయం.

'సిమి' అయినా 'ఐ.ఎం' అయినా దేశంలో ముస్లిం సమాజంపై జరుగుతున్న దాడులకు సామాన్యంగా ఉనికిలోకి వచ్చాయన్నది రుజువవుతుంది. అయినా అమాయకుల్ని హతమార్చడాన్ని ఎవరు అంగీకరించరు. కాని అదే సమయంలో దేశంలో ఎక్కడ మత ఘర్షణలు జరిగినా, అల్లర్లు జరిగినా ఒకే వర్గానికి చెందిరవారే అధికంగా బలవడం కారణంగానే పెరుగుతున్న తీవ్రవాదాన్ని ఎలా కట్టడి చేయగలం అనే ప్రశ్నకు సభ్య సమాజం జవాబు చెప్పవలసి ఉంది. ఉదాహరణకు భగత్‌పూర్, ముంబాయి అల్లర్ల పర్యవసానం చూద్దాం.

భగత్‌పూర్ అల్లర్లు

1986లో బాబ్రీ మసీదులో రామ మందిరాన్ని భక్తుల కోసం తెరిచిన నాటి నుండి దేశంలో మతకల్లోలాలు పెద్ద స్థాయిలో జరగడం ప్రారంభించాయి. రామ్‌లీల ఊరేగింపుల కారణంగా దేశం వివిధ ప్రాంతాలలో 1989లో 1174 మంది చనిపోయారు. దానిలో 100 మంది బీహార్ రాష్ట్రంలో ఉన్న భాగత్‌పూర్‌లోనే చనిపోయారు. 1990లో మళ్లీ భాగత్‌పూర్‌లో 693 మంది చనిపోయారు. 1992లో బాబ్రీమసీదు విధ్వంసం కారణం దేశవ్యాప్తంగా 226 చోట్ల జరిగిన అల్లర్లలో 1801 మంది చనిపోయారు. భాగత్‌పూర్ సంఘటనలపై ప్రభుత్వం నియమించిన ఎంక్వైరీ కమిషన్ రిపోర్టులో ముస్లింలపై జరిగిన దాడుల్లో పోలీసు అధికార పాత్ర చాలా వివాదంశంగా ఉందని పేర్కొంది. ఈ అధికార్లలో సూపరెండెంట్ ఆఫ్ పోలీస్ కె.ఎస్. ద్వివేది, డిప్యూటి సూపర్నెంట్ ఆఫ్ పోలీస్ కె.సి. దూచే, ఇన్‌స్పెక్టర్ జనరల్ జి.పి దోత్రి, డిస్ట్రిక్ట్ మెజిస్ట్రేట్‌లో అరుణ్ ఝూలాంటి వారు ఉన్నారు. అల్లర్లు జరగడానికి అవకాశం ఉందని తెలిసి కూడా తగిన చర్యలు తీసుకోవడంలో, అల్లర్లు జరుగుతున్నప్పుడు తగిన సహాయ చర్యలు తీసుకోవడంలో, నిర్లక్ష్యం వహించినట్లు రుజువయిందని తెలిపారు. జగదీష్‌పూర్ పోలీస్ స్టేషన్ అసిస్టెంటు సబ్ ఇన్‌స్పెక్టర్ రాంచందర్‌సింగ్ యూనిఫారంలో తన స్టేషన్ పోలీసులతో, 4 వేల మంది గుంపుతో 'లోగన్' గ్రామంపై అక్టోబర్ 27న దాడి చేసిన సందర్భంలో అక్కడ 115 మంది ముస్లింలు చనిపోయారు. మొదట ఈ శవాలను ఒక గోతిలో పడేసి, తర్వాత వాటిని బయటికి తీసి పెద్ద నూతిలో పడేశారు. వీటిలో 108 శవాలను డిసెంబర్ 8 తర్వాతనే పైకి తీశారు.

ముంబాయి అల్లర్లు

1992 డిసెంబర్ 6న అయోధ్యలో హిందుత్వ వాదులు బాబ్రీ మసీదును కూల్చివేసిన తర్వాత, ఆ రాత్రి నుండే ముంబాయి నగరంలో మొదటి ధపా అల్లర్లు ప్రారంభమయ్యాయి. 12వ తేదీ దాకా సాగాయి. రెండవ ధపా అల్లర్లు 1993 జనవరి 6న ప్రారంభమై 20వ తేదీ వరకు సాగాయి. అధికారిక లెక్కల ప్రకారం అల్లర్లలో 900 మంది చనిపోగా వారిలో ముస్లింలు 575, హిందువులు 275 మంది ఉన్నారు. ఈ అల్లర్లపై ప్రభుత్వం నియమించిన జస్టిస్ శ్రీ కృష్ణ కమీషన్ 502 మంది సాక్షులను విచారించి, జనవరి 16, 1998లో విడుదల చేసిన నివేదిక ప్రకారం ముస్లింలవైపు జరిగిన హింసకాండ ఎక్కువగా అసంఘటితంగా జరిగింది. బాబ్రీ మసీదు విధ్వంసానికి వ్యతిరేకంగా ముస్లింలలో అసంకల్పితంగా పెల్లుబికిన ఆగ్రహ ఫలితంగా జరిగింది. హిందులవుల వైపు నుండి జరిగిన హింసకాండ అత్యధిక భాగం సంఘటితంగా జరిగింది. శివసేన దీనికి ప్రధానంగా నాయకత్వం వహించింది. ఈ అల్లర్లలో పోలీసుల వైఖరి నిష్పక్షపాతంగా లేదు. వారిలో ముస్లిం వ్యతిరేకత కొట్టొచ్చినట్లు కనిపించింది. శివసేన హింసకాండ వైపు పూర్తిగా ఉదార వైఖరితో ఉండడమే కాకుండా, రెచ్చగొట్టే ఉపన్యాసాలు, ఊరేగింపులు, మహా ఆరతి కార్యక్రమాలను, కర్ఫ్యూ సమయంలో సహితం అనుమతించారు శివసేనకు చెందిన దుండగుల పేర్లు బాధితులు చెప్పినా అరెస్టులు చేయలేదు. శివసేనకు చెందిన మరాఠి పత్రిక ద్వారా అభూత కల్పనలు ప్రచారంచేసి ద్వేష భావాన్ని రెచ్చగొట్టారు. కొన్ని సందర్భాలలో దొమ్మీలకు పాల్పడుతున్న వారి కార్యకలాపాలు యథేచ్ఛగా కొనసాగనిచ్చారు. కొన్ని సందర్భాలలో ప్రోత్సహించారు. వారితో చేతులు కలిపారు. పోలీసులకు ముస్లిం వ్యతిరేకత ఉందని సాక్ష్యాలు రుజువు చేస్తున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే, పోలీసుల నడవడిక శాంతి భద్రతల యంత్రంగం పట్ల విశ్వాసాన్ని నాశనం చేసేటట్లు చేసింది.

'ఇబ్రహీం పట్నంలోని సులేమాన్ బేకరీ పైన పోలీసులు దాడి చేసి

9 మంది ముస్లింలను కాల్చి చంపారు. 78 మందిని అరెస్టు చేశారు. ఈ చర్యను సమర్థించుకోవడానికి పోలీసులు సులేమాన్ బేకరీని పెద్ద టెర్రరిస్టు స్థావరంగా చిత్రీకరించే ప్రయత్నం చేసారు. కానీ కమిషన్, పోలీసులు విచ్చలవిడిగా కాల్పులు జరిపి 9 మంది అమాయకుల్ని చంపారనీ, ఈ ఘోరకృత్యానికి జాయింట్ పోలీస్ కమీషనర్ త్యాగి స్వయంగా బాధ్యత వహించాలనే పేర్కొన్నారు. కాని అతనికి శిక్ష పడలేదు సరికదా పోలీస్ కమిషనర్‌గా ప్రమోషన్ రావడంతో పాటు, ఎప్రిల్ 2003లో అతనిపై కేసును రద్దు చేశారు. వడాలా మసీదు కేసులో అన్యాయంగా కాల్పులు జరిపి 7 గురిని చంపిన కేసులో సబ్ ఇన్‌స్పెక్టర్ నిఖిల్ కాస్పెను కమిషన్ నింధితుడిగా గుర్తించింది. కాని డిపార్టుమెంటు ఎంక్వైరిలో అతన్ని నిరపరాధిగా తేల్చేసారు. మొత్తం 32 మంది పోలీసు అధికార్లను దోషులుగా కమిషన్ గుర్తించింది. కాని వారెవ్వరికి శిక్షలు పడలేదు. 'ఒక సైనిక జనరల్ లాగా బాల్‌థాకరే తన సైనికులకు ముస్లింలపై దాడులు చేయండని ఆదేశించాడ'ని కమిషన్ చెప్పింది. అతని మీద కొంత మంది పౌరులు రిజిస్టర్ చేసిన కేసుల్ని బి.జె.పి. శివసేన ప్రభుత్వం రాగానే రద్దు చేశారు.

తర్వాత కాలంలో థానేలోని గడ్కారి అడిటోరియంలో హిందూమత వాద కార్యకర్తలు పేల్చిన బాంబుల వలన 7గురు గాయపడ్డారు. దీనిపై శివసేన అధిపతి బాల్‌థాకరే స్పందిస్తూ, "థియేటర్‌లో బాంబులు పేల్చింది, హిందుత్వ మద్దతుదారులని తెలియగానే చాలా సంతోషం వేసింది. అయితే బాంబు పెట్టింది హిందువులను గాయపర్చడానికేనని తెలియగానే విచారం కలిగింది' అన్నాడు. శివసేన అధికార పత్రిక 'సామ్నా' సంపాదకీయంలో 'భారతదేశంలో ఇస్లామిక్ ఉగ్రవాదం పెరుగుతోంది. దానిని హిందూ ఉగ్రవాదంతో ఎదుర్కొనడానికి ఇదే తగిన సమయం. హిందూ సమాజ ఉనికికి, దేశాన్ని రక్షించుకోవడానికి హిందూ ఆత్మహుతి దళాలు సిద్ధం కావాలి' అని రాశాడు.

జనతా పార్టీ అధ్యక్షుడు సుబ్రహ్మన్య స్వామి 'ముస్లింలు గర్వంగా తమ తాత ముత్తాతలు హిందువులని ఒప్పుకోకపోతే వారిని పౌరులుగా గుర్తించ కూడద'ని అన్నాడు. గుజరాత్ మారణకాండ తర్వాత అటల్ భిహరీ వాజ్‌పాయ్ 'గోద్రా సంఘటనపై ముస్లింలు తగినంత బిగ్గరగా ఖండించలేదని' ఆరోపించారు. నరేంద్రమోడీ గుజరాత్ మారణకాండ అంతా గోద్రా సంఘటనకు ప్రతిచర్యలేనన్నాడు. కారులో ప్రయాణిస్తుంటే కారుకింద కుక్కపిల్ల పడితే నేను బాధపడతానన్నాడు. ప్రవీణ్‌తొగాడియ నవంబర్ 2011లో 'మాకు కొత్త రాజ్యంగం కావాలి. అందులో మన హిందువులను, సిక్కులను, జైనులు, బౌద్ధులతో సహ మతమార్పిడి చేసిన వారిని తల నరికివేసే అధికారం ఇవ్వాలి' అన్నాడు. ప్రజాస్వామ్య సమాజంలో నాయకులు ఇలా నిరంతరం భయం కలిగించే హెచ్చరికలు చేస్తున్నంతకాలం రక్షణ లేని మైనారిటీ సమూహాలు భద్రతతో ఎలా జీవించగలవు?

ప్రజాన్యాయ స్థానం

దేశవాప్తంగా జరుగుతున్న మైనారిటీల హక్కుల అణచివేతను వివరించడానికి దేశంలో మొట్ట మొదటి సారిగా "పీపుల్స్ ట్రిబ్యునల్' ఏర్పడింది. ఉగ్రవాద వ్యతిరేక చర్యల పేరుతో ప్రభుత్వాలు, పోలీసులు అమాయక ముస్లింల జీవితాలను ఎలా విధ్వంసం చేస్తున్నాయో పరిశీలించడానికి 2008 సెప్టెంబర్ 22,23,24, తేదీలలో హైదరాబాద్‌లో సమావేశం జరిపింది. ఈ ట్రిబ్యునల్‌లో జస్టిస్ ఎస్.ఎన్. భార్గవ, సర్దార్ ఆలీఖాన్, ప్రొ. రూప్‌రేఖావర్మ , కె.జి కన్నబిరాన్, రామ్ పున్యాని, లలిత సూర్జన్, కింగ్ షుక్‌నాగ్, అప్సర్ ఆలీ ఇంజనీర్ లాంటి న్యాయ కోవిదులు, మేధావులు, ప్రజాతంత్ర వాదులున్నారు. 40 మంది బాధితులతోపాటు, వారి కుటుంబ సభ్యులు, న్యాయ వాదులు, హక్కుల సంఘాల కార్యకర్తలు, జర్నలిస్టులు ఈ విచారణలో పాల్గొని తమ బాధలను, అనుభవాలను, అభిప్రాయాలను వివరించారు.

వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన బాధితుల కథనంలో అబద్ధపు ఆరోపణలపై అమాయకులను అరెస్టులు చేయడం, కస్టడిలో హింసకు గురిచేసి వారితో బలవంతపు ఒప్పుకోలు సంతకాలు తీసుకోవడం, వారి కుటుంబాలను భయ భ్రాంతులను చేయడం, వారికి న్యాయ సహాయం అందకుండా చేయడం జిహదీ సాహిత్యం కలిగిఉన్నారని అబద్ధపు ఆరోపణలు చేయడం అన్నీ వివరించారు.

ఈ సమావేశంలో కన్నభీరన్ మాట్లాడుతూ 'ఒక మైనారిటీ సమూహాన్ని టార్గెట్ చేసే పాలనా రీతి వైవిధ్య పూరిత భారత ప్రజాస్వామ్య సంస్కృతిని దెబ్బతీసింది. టెర్రరిజాన్ని ఆపడం పక్కనపెట్టి, ఇటువంటి పాలన టెర్రరిజానికి దారితీస్తుంది. బాధితులు, ఇతరుల కథనాలు వింటున్నప్పుడు, ముస్లింలపై అప్రకటిత అత్యవసర పరిస్థితి నడుస్తుందనే అభిప్రాయం కలుగుతుంది' అన్నారు.

'టెర్రరిజం దానిమూలం' అన్న వ్యాసంలో బాలగోపాల్ ఇస్లాం పేరుమీద జరుగుతున్న విచ్చలవిడి హింసకాండ గురించి రాస్తూ 'ఈ హింసకాండ అమానుషమైనా, దీని వెనక ఒక న్యాయమైన ఆగ్రహం ఉంది. ముస్లింలకు ఇక్కడ అన్యాయయం జరగనివ్వం అన్న విశ్వాసం కలిగించడం ద్వారా ఈ ఆలోచన వైపు యువకులు పోకుండా నిరోధించే అవకాశం ఉంది. కానీ టెర్రరిజం గురించి ఊరికే ఆవేశ పడుతున్న వారిలో ఎంత మంది ఈ కర్తవ్యంపైనా దృష్టిపెడుతున్నారని' ప్రశ్నించారు.

అసంబద్ధ మీడియా ప్రచారం

బాట్లా ఎన్‌కౌంటర్ కేసులో శిక్షపడ్డ షహజద్‌తో పాటు, ఇతర కేసుల్లో అరెస్టు కాబడ్డ కొంత మంది యువకులు ఉత్తరప్రదేశ్‌లోని అజాంఘర్ నివాసులు కావడంతో మొత్తం అజాంఘర్‌ను తీవ్రవాద ప్రాంతంగా మీడియా ప్రచారం చేసింది. అజాంఘర్ నుండి వేలాది మంది జనవరి 2009లో ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద భారీ నిరసన ప్రదర్శన నిర్వహించి 'మేం విద్యార్థులం, తీవ్రవాదులం కాదు అజాంఘర్ తీవ్రవాద ప్రాంతం కాదు' అని నినాదాలు ఇచ్చారు. బాట్లా ఎన్‌కౌంటర్‌పై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, అమాయకులైన ముస్లిం యువకులను వేధించడం నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ ప్రదర్శనలో ఢిల్లీ యూరివర్సిటీకి చెందిన విద్యార్థులు, టీచర్లు కూడా పాల్గొన్నారు.

మదర్సాలు తీవ్రవాద శిక్షణాలయాలుగా మారాయని మీడియాలో విపరీతమైన ప్రచారం జరిగింది. దీనిపై కొందరు విలేకరులు అజాంఘర్, జావున్‌పూర్ జిల్లాలను పరిశీలించారు. అక్కడ మదర్సాలలో విద్యార్థులు సంస్కృతం నేర్చుకొని, శ్లోకాలు చదువుతున్నారు. సల్ఫియా మదర్సాలో 475 మంది విద్యార్థులుంటే 45 శాతం అంటే 225 మంది హిందువులే. అజిజియా మదర్సాలో 143 మందిలో 35 మంది, మక్వాచ మదర్సాలో 100 మందికి 20 మంది, అర్బియా మదర్సాలో 374 మందికి 22 మంది హిందూ విద్యార్థులే.

మసీదులు, మత పెద్దలు తీవ్రవాద కార్యకలాపాలను ప్రోత్సహిస్తున్నారనే ప్రచారం కూడా మీడియాలో ఎక్కువగానే వచ్చింది. ఉత్తరప్రదేశ్, దియోబండ్ పట్టణంలో దారుత – ఉలామ్ సెమినరీ

ఈజిప్ట్‌లో వాడిపోయిన వసంతం

నిరంకుశ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా వచ్చిన ప్రజా ఉద్యమాలు రాజకీయ దృక్పథంతో ముందుకెళ్లకపోవడంతో వాటిని పాలకులు తమకు అనుకూలంగా ఎలా మలుచుకుంటారో వివరిస్తున్నారు ఎం.కె. కుమార్

ఈజిప్టులో మొదటిసారి ఏర్పడిన ప్రజా ప్రభుత్వానికి విఘాతం కలిగింది. దశాబ్దాల నిరంకుశ పాలనకు స్వస్తి పలికిన అరబ్ వసంతం తన ప్రాభవాన్ని కోల్పోతోంది. మోర్సీ, బ్రదర్‌హుడ్ మద్దతుదారులు సైనిక పరిపాలనకు వ్యతిరేకంగా, ఆయుధాలతో పోరాటం చేస్తున్నారు. వారు జరిపిన కాల్పుల్లో 2200 మంది పౌరులు చనిపోయారని, దాదాపు 5000 మంది దాకా గాయపడ్డారని పత్రికలు పేర్కొన్నాయి. ఈ ఘటనల్లో బ్రిటన్, దుబాయికి చెందిన ముగ్గురు జర్నలిస్టులు కూడా మరణించారు. అయితే ఆర్మీ 640 మంది మాత్రమే గాయపడ్డారని పేర్కొంటోంది. సైనిక ప్రభుత్వం తమను ఎంతగా అణచివేయాలని చూసినా, దానికి రెట్టింపు శక్తితో ఉద్యమాన్ని నడిపిస్తామని ముస్లిం బ్రదర్ హుడ్ ప్రతినిధి గెహద ఎల్ హడ్డాడ్ ట్విట్టర్‌లో హెచ్చరించాడు. దీనికి తోడు ఉగ్రవాద సంస్థ హమాస్‌తో మోర్సీకి సంబంధాలున్నాయని, మోర్సీ నిర్బంధాన్ని మరో 30 రోజుల పాటు కైరో కోర్టు పొడిగించడం అగ్నికి ఆజ్యం పోసినట్టైంది. కైరోలోని రాబా అల్‌అదవేయా, అల్‌సహ్దా ప్రాంతాల్లో వేలాది బ్రదర్‌హుడ్ మద్దతుదారులు ఆందోళనలు చేస్తున్నారు. దేశం అంతర్యుద్ధంతో అట్టుడికిపోవడంతో అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. అయినప్పటికీ బ్రదర్‌హుడ్ శుక్రవారం ప్రార్థనల తర్వాత నగరంలోని వివిధ మసీదులనుండి సెంట్రల్ రామ్‌సెస్ స్క్వేర్ వరకూ నిరసన ప్రదర్శన నిర్వహించింది. మోర్సీ వ్యతిరేకులు బ్రదర్‌హుడ్ నిర్వహించిన ప్రదర్శనకు వ్యతిరేకంగా నేషనల్ సాల్వేషన్ ఫ్రంట్, టామరోడ్ వంటి పార్టీలు నిరసనలకు పిలుపునిచ్చి ఉద్రిక్తతలను మరింత పెంచాయి. అత్యవసరపరిస్థితి నేపథ్యంలో సైనిక ప్రభుత్వం పోలీసులకు ఆయుధాలనిచ్చి ఆత్మరాక్షణార్థం వాటిని ఉపయోగించుకోవచ్చని తెలిపింది. దీనివల్లే కాల్పుల్లో మృతుల సంఖ్య పెరిగిందని బ్రదర్‌హుడ్ ఆరోపిస్తోంది. పశ్చిమాసియా, తూర్పు ఆఫ్రికా దేశాల పట్ల అమెరికా అనుసరిస్తున్న మధ్య ప్రాచ్య విధానం వల్ల ఆయా దేశాలలో ప్రజాస్వామ్యం క్షీణించి తీవ్ర మానవహక్కుల ఉల్లంఘన ఏర్పడుతోంది. సైనిక ప్రభుత్వానికి అమెరికా తన మద్దతును తెలియజేసింది. సైన్యం దుందుడుకు చర్యలకు నిరసనగా ఉపాధ్యక్షుడు ఎల్‌బరాదీ రాజీనామా చేసినా, తాత్కాలిక ప్రభుత్వ ప్రధానమంత్రి హాజెమ్ ఎల్‌బబ్లావీ సైనికచర్యలను సమర్థించాడు. నిజానికి మోర్సీ నేతృత్వంలోని ముస్లిం బ్రదర్‌హుడ్‌కి, సైన్యానికి జరుగుతున్న అంతుర్యుద్ధానికి అమెరికా రాజీచేసే దిశగా ప్రయత్నం చేస్తున్నప్పటికీ, అంతర్గతంగా సైన్యానికే అమెరికా తన మద్దతును తెలియజేస్తోంది. ఈ క్రమంలో సైన్యం దుందుడుకు చర్యలు, సాగిస్తున్న ఊచకోత అమెరికా చర్యలు ఇరుకున పెడుతున్నాయి. అయినప్పటికీ జూలై 3న సైన్యం మోర్సీని పదవీచ్యుతుడ్ని చేసిన వైనాన్ని, ఈజిప్టు సైనిక కుట్రగా గుర్తించేందుకు అమెరికా ఇప్పటికీ నిరాకరిస్తోంది. కుట్రతో ఏర్పర్చే ప్రభుత్వాలకు సహాయాన్ని అందించకూడదన్న అంతర్జాతీయ సహజ న్యాయసూత్రాలను కూడా అమెరికా తుంగలో తొక్కి, ఈజిప్టు సైన్యానికి ఇప్పటికీ ఆర్థిక సహాయాన్ని అందిస్తోంది. అయితే వచ్చే నెలలో జరగాల్సిన సంయుక్త సైనిక విన్యాసాలను మాత్రం వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది.

ముబారక్‌ను గద్దె దించడానికి తెహ్రీర్ స్క్వేర్‌లో ఉద్యమాన్ని ప్రారంభించి, ముబారక్‌ను గద్దె దించినప్పటికీ, దేశంలో ప్రజాస్వామిక వాతావరణాన్ని కల్పించడంలో మోర్సీ పాలకవర్గం విఫలమవడంతో ఈజిప్టు తిరిగి సైనిక పాలనలోకి వెళ్లింది. నిజానికి సైన్యం అదనుకోసం వేచిచూస్తోంది. అందుకే కుట్రతో మోర్సీని కూడా గద్దెదించి తన ఆధిపత్యాన్ని చాటింది. గత సంవత్సరం జూన్‌లో దేశాధ్యక్ష పదవికి

---

150 సంవత్సరాల కిందట ఏర్పడింది. ఆ సంస్థ మత పెద్దలు అత్యంత సనాతన వాదులుగా పేరుపడ్డారు. వారు ఫిబ్రవరి 25, 2008న సమావేశం ఏర్పాటు చేసి ఇస్లాం పేరుమీద జరుగుతున్న మారణ కాండలన్నీ ఆ మత సూత్రాలకే విరుద్ధమని, తీవ్రవాదానికి వ్యతిరేకంగా ఏకగ్రీవ తీర్మానం చేశారు. దేశవ్యాప్తంగా ఉన్న అరు వేల మదర్సాల టీచర్లతోపాటు వేలాది మంది విద్యార్థులు ఈ మహా సభలో పాల్గొన్నారు.

బాట్లా ఎన్‌కౌంటర్‌పై ప్రజా సంఘాలు, మేధావులు వేసిన ప్రశ్నలకు ఢిల్లీ సెషన్స్ కోర్టు తీర్పు సరైన జవాబులు ఇవ్వలేదు సరి కదా, అఫ్జల్‌గురు కేసులో సుప్రీంకోర్టు 'ఉరిశిక్ష విధిస్తేనే జాతి మొత్తం సామూహిక మనోభావ తృప్తి చెందుతాయని' చెప్పిన పద్ధతిలోనే ఉంది. షహజాద్ ఇండియన్ ముజాహిద్దీన్ సభ్యుడని కేసు పెట్టి, అతను ఆ సంస్థ సభ్యుడని రుజువు కాలేదని, అయినా అతను తీవ్రవాద, కాదా అనేది అప్రస్తుతం అంటూ, జీవిత ఖైదు విధించడంతో, న్యాయస్థానాల తీర్పులు ప్రజాస్వామ్య వ్యవస్థను ఎలా అపహాస్యం చేస్తున్నాయో అర్థమవుతుంది. 'వెయ్యి మంది అపరాదులు తప్పించుకున్న ఫరవాలేదు కాని ఒక్క నిరపరాధికి శిక్ష పడకూడదు' అన్న అంతర్జాతీయ న్యాయ సూత్రాన్ని ఏమాత్రం గౌరవించడం లేదని న్యాయస్థానాలు తీర్పులు రుజువు చేస్తునాయి. సామ్రాజ్యవాద అమెరికా ప్రకటించే తీవ్రవాదంపై యుద్ధానికి, మనదేశంలో హిందూత్వ వాదం తోడయిన కారణంగా మైనాటీలపై దాడులు పెరుగుతున్న సందర్భంలో, కోర్టు తీర్పులపైన కూడా హిందూత్వ భావాజాలం పడిందనే అభిప్రాయం కలుగుతుంది. ఇప్పటికే అభద్రతతో వలయంలో చిక్కుకు పోయిన మైనాటీలకు మరింత భయాన్ని పెంచుతున్నాయి. మనదేశ సంస్కృతిలో భాగస్వాములైన మైనారిటీల ఆత్మస్థైరాన్ని నిలబెట్టడంలో ప్రజాస్వామిక వాదులందరూ మరింతగా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

(రచయిత కార్మికోద్యమ నాయకులు) వీ

జరిగిన తొలి ప్రజాస్వామిక ఎన్నికల్లో ముస్లిం బ్రదర్ హుడ్ పార్టీ అభ్యర్థి మహమ్మద్ మోర్సీ విజయం సాధించినప్పటికీ తెహ్రీర్‌స్క్వేర్ ఉద్యమ నేపథ్యాన్ని విస్మరించడంతో దేశంలో రాజకీయ అస్థిరతకు కారణమయ్యాడు. ముబారక్ పాలనలో నిర్బంధాన్ని చవిచూసిన బ్రదర్‌హుడ్ సంస్థ ప్రజల సానుభూతిని పొంది ఎన్నికల్లో విజయాన్ని సాధించింది. మోర్సీ పాలనకు, ముబారక్ పాలనకు పెద్దగా వ్యత్యాసం లేకపోవడం రాజ్యాంగాన్ని తనకిష్టమైన రీతిలో రూపొందించుకోవడం, ఇస్లామీకరణను దేశంలో ప్రోత్సహించడం, మహిళల, మైనారిటీల ప్రయోజనాలను దెబ్బతీయడం వంటి నిరంకుశ చర్యల వల్ల గద్దె ఎక్కిన 6 నెలల్లోనే ప్రజల వ్యతిరేకతను మోర్సీ చవిచూడాల్సి వచ్చింది. ముబారక్ మాదిరే మోర్సీ సైన్యానికి అధిక ప్రాధాన్యతను ఇచ్చే ప్రయత్నం చేశాడు. దశాబ్దాలుగా ఈజిప్టును పరిపాలించి ఆధిపత్యాన్ని అనుభవించిన సైన్యం, మోర్సీ తీసిన గోతిలో తానే పడేటట్లు పావులు కదిపింది. మోర్సీకి వ్యతిరేకంగా జరిగిన నిరసనలను ఉత్సాహపరిచింది. దేశంలో శాంతి స్థాపన పేరుతో మోర్సీని గృహ నిర్బంధం చేసి అతన్ని పదవి నుంచి వైదొలిగించింది. దీనికి మోర్సీ వ్యతిరేక వర్గం సహాయ సహకారాలు కూడా తోడవడం, అమెరికా అండదండలుండడం వల్ల సైన్యం పని సులభమైంది. ముస్లిం బ్రదర్‌హుడ్‌ను ఒంటరి చేయడంలో సైన్యం వ్యూహం పనిచేసింది. బ్రదర్‌హుడ్ కైరోను ఆక్రమించుకుని పోరాటం చేస్తున్నప్పటికీ, ప్రజల సహకారం మునుపటి స్థాయిలో లేకపోవడంతో సైన్యం తన బలప్రయోగంతో వందల మందిని చంపుతూ, తన క్రూరత్వాన్ని చాటుకుంటోంది.

గత రెండేళ్లుగా ఉత్తరాఫ్రికా, మధ్య ప్రాచ్య దేశాలలో అమెరికా సామ్రాజ్యవాద మద్దతుతో సాగుతున్న అక్కడి ప్రభుత్వాలపై ప్రజలు తిరుగుబాట్లు చేశారు. ఈ ఉద్యమాలు సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా జరగనప్పటికీ, రేఖామాత్రమైనా సామ్రాజ్యవాద వ్యతిరేక వైఖరిని ప్రజలు అవలంబించారు. ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడిదారీ వ్యవస్థ ఆర్థిక సంక్షోభంలోకి కూరుకుపోవడంతో, పేద దేశాలపై నయా ఉదారవాద విధానాలను ఎక్కువగా రుద్దుతూ, సంక్షోభం నుండి బయటపడే ప్రయత్నాలను చేస్తోంది. ఈజిప్టులో 75 శాతం ప్రజలు 30 సంవత్సరాల లోపువారే కావడం గమనార్హం. ఇందులో అత్యధికులు నిరుద్యోగులు కావడం వల్ల, వీరిపైన కుటుంబం ఆధారపడి ఉండడం వల్ల వీరు తమ భవిష్యత్తుకై ఉద్యమాలు చేయక తప్పడం లేదు. ముబారక్ పాలనలో క్షీణించబడిన ఆర్థిక వ్యవస్థ, నిర్బంధ చట్టాల అమలు, తీవ్ర పేదరికం, నిరుద్యోగిత అతనికి వ్యతిరేకంగా ఆందోళనలు నడపడంలో కీలకాంశాలుగా ఉన్నాయి. ముబారక్‌ను కాపాడేందుకు చివరి క్షణం వరకు అమెరికా ప్రయత్నించి, చివరకు విఫలమై తన విశ్వసనీయ వర్గాలకు అధికారాన్ని బదలాయింపజేసింది. అప్పట్లో ఈజిప్టులోని ప్రజా ఉద్యమాన్ని ముస్లిం తీవ్రవాదమని కూడా అమెరికా ప్రచారం చేసింది. అయినప్పటికీ ముస్లిం బ్రదర్‌హుడ్ రాజకీయ పార్టీ ఫ్రీడమ్ అండ్ జస్టిస్ పార్టీని 2012లో గెలిచే విధంగా పావులు కదిపింది. మోర్సీ ప్రపంచ ద్రవ్య సంస్థలు విధించిన పొదుపు చర్యలను దేశంలో అమలు చేయడంతో దేశంలో ఆర్థిక అస్థిరత ఏర్పడింది. దేశంలో ప్రధాన పరిశ్రమైన వస్త్ర పరిశ్రమకు కావాల్సిన చమురును దిగుమతి చేసుకోవడంలో విఫలం కావడంతో, మిల్లులు మూతపడ్డాయి. దీనివల్ల వేలాది కార్మికులు వీధినపడ్డారు. ఉపాధి, మౌలిక సామాజిక సేవలు, ప్రజాస్వామిక హక్కుల రక్షణ వంటి నినాదాలతో మోర్సీకి వ్యతిరేకంగా కదిలిన ప్రజా ఉద్యమం సైనిక పాలనను తెచ్చింది. సైనిక ముఠా అధిపతి జనరల్ అబ్దుల్ ఫత్యా ఖలీల్ అల్‌సిసి ఒక రాజకీయ రోడ్ మ్యాప్‌ను ప్రకటిస్తూ, రాజ్యాంగ చట్టాన్ని రద్దుపరిచాడు. జాతీయ సాంకేతిక నిపుణుల ప్రభుత్వాన్ని నియమించాడు. ముబారక్ అనుయాయులుగా పేరొందిన, సైన్యంలోని ఉన్నతాధికారులను సైన్యం ప్రభుత్వ నేతలుగా నియమించింది. అయితే అబ్దుల్ అల్‌సిసి నియమించిన 50 మంది సాంకేతిక నిపుణుల కమిటీకి, సైనిక ప్రభుత్వానికి మద్దతుగా నిలిచిన రాజకీయ, ఇస్లామిక్ శక్తులకు మధ్య సానుకూలత లేదు. ఇందువల్ల దేశంలో కమిటీ పనిచేయలేని పరిస్థితిలో ఉంది. ఎప్పటిలాగే అమెరికా మోర్సీకి చివరి క్షణంలో చేయిచ్చి, సైన్యాన్ని దగ్గరికి తీసింది. అమెరికా సైన్యాధికారి మార్టిన్ డెంప్సీ, ఈజిప్టు సైనికాధికారులతో చర్చలు జరిపిన తర్వాతే మోర్సీ ప్రభుత్వాన్ని తొలగించడం జరిగింది. సైన్యం ముస్లిం బ్రదర్ హుడ్ కార్యకర్తలపై దాడులు చేస్తున్నప్పటికీ, ఈజిప్టులో రాబోయే కాలంలో ఎటువంటి ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమాలు రాకుండా నిరకుంశ వైఖరిని అవలంభించడమే దాని లక్ష్యంగా ఉంది. ప్రజల నిరసనోద్యమాలు జాతీయ ప్రయోజనాలకు హానికరమని, చట్ట వ్యతిరేకమని ఇప్పటికే సైన్యం ప్రచారం మొదలెట్టింది. మోర్సీ దిగిపోవడం ప్రజలకు ఆనందాన్ని కల్గించినప్పటికీ, ప్రజలకు అధికారం రాలేదు. తిరిగి సైన్యం అధికారంలోకి రావడం ప్రజలకు రానున్న కాలంలో తీవ్ర నష్టదాయకం. ప్రజలు చారిత్రకంగా బలమైన ఉద్యమాలను ఈజిప్టులో చేయగలిగి, వ్యవస్థలను నిర్మూలించడంలోను, అణచివేతను ఎదుర్కోవడంలోను అసాధారణ శక్తిని ప్రదర్శించారు.

1970 నుండి ఈజిప్టులో వ్యవసాయం అభివృద్ధి బాటలో నడిచింది. అయినా 50 శాతం ఆహారాన్ని ఈజిప్టు దిగుమతి చేసుకుంటోంది. తాగునీరు, సాగునీరు ఈజిప్టుకు నైలునది నుండే వస్తుంది. దీనిపై 2.1 మెగావాట్ల అశ్వాన్ జల విద్యుదుత్పత్తి కేంద్రాన్ని నిర్మించి, సగం ఈజిప్టుకు విద్యుత్ సరఫరాను చేసుకుంటున్నారు. ఈజిప్టు నాగరికతకు వెన్నెముక లాంటి నైలునది వివాదాల మధ్య చిక్కుకుంది. 22 శాతం ఈజిప్టులో ప్రవహిస్తూ, దక్షిణాన ఇథియోపియా, ఉగాండాల నుంచి మొదలై ఉత్తర కొసనున్న ఈజిప్టులోని అలెగ్జాండ్రియా వద్ద నైలునది మధ్యధరా సముద్రంలో కలుస్తుంది. నదిపై ఇథియోపియా, ఉగాండాలు భారీ రిజర్వాయర్లతో కూడిన డ్యాములను నిర్మించడం వల్ల ఈజిప్టు వ్యవసాయం సంక్షోభంలో పడే ప్రమాదముంది. ఈజిప్టుకు దిగువనున్న సూడాన్ 90 శాతం నైలునది నీటిని వాడుకుంటోంది. 1959 ఈజిప్టు సూడాన్ ద్వైపాక్షిక ఒప్పందం ఆధారంగానే నీరును వాడుకుంటున్నామని సూడాన్ చెప్తున్నప్పటికీ ఈజిప్టు ఒప్పుకోవడం లేదు. దేశంలో అంతర్యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో ఇథియోపియా, ఉగాండాలు రిజర్వాయర్ నిర్మాణాలను త్వరితపరుస్తున్నాయని ఈజిప్టులోని రాజకీయ పార్టీలు ఆరోపిస్తున్నాయి. 2025 నాటికి ఆఫ్రికా ఖండంలో సగం జనాభాకు తాగు నీరు లభ్యం కాదని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్న తరుణంలో నైలునది వివాదం ఈజిప్టు ప్రజలను భయాందోళనలకు గురి చేస్తోంది. ఈజిప్టులోని అంతర్యుద్ధం ఆ దేశ ప్రజలకు క్షేమకరం కాదు. అయినప్పటికీ అక్కడి ప్రజల దుస్థితి పెనం మీద నుండి పొయ్యిలో పడ్డ చందంగా తయారయ్యింది. ముబారక్, మోర్సీల నిరంకుశ ప్రభుత్వాలు ప్రజల నిరసన ఉద్యమాలతో పోయి, అత్యంత నిరకుంశమైన సైన్యం చేతిలోకి రావడం, అమెరికా హస్తం లేకుండా అక్కడి ప్రభుత్వాలు ఏర్పడకపోవడం అత్యంత విషాదం. సరైన నాయకత్వం లేకపోవడం వల్ల తెహ్రీర్ స్క్వేర్ వేదికగా సాగిన ఉద్యమాలు, ప్రజాస్వామిక ప్రభుత్వాలను ఏర్పర్చాలనే లక్ష్యాలను సాధించలేక పోయాయి.

(రచయిత పౌరహక్కుల సంఘం కార్యకర్త) వీ

గ్రామ స్వరాజ్యానికి భిన్నంగా పంచాయతీ ఎన్నికలు

అధికార వికేంద్రీకరణ లక్ష్యంతో ఏర్పాటయిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో మాత్రం అధికార, అర్థ, అంగబల ప్రదర్శనే ప్రధానంగా కనిపించిందంటున్నారు ముప్పాళ్ల భార్గవశ్రీ

రెండు సంవత్సరాల అధికారుల పాలన తరువాత రాష్ట్రంలోని 21,441 పంచాయితీలకు ఎన్నికలను అధికార పార్టీ ప్రకటించింది. స్థానిక సంస్థల పట్ల పాలక పార్టీలకు ఎంత నిర్లక్ష్యమో దీనిని బట్టి తేలికగా అర్థంచేసుకోవచ్చు. ఇప్పుడు కూడా పంచాయితీ ఎన్నికలను పాలక కాంగ్రెస్ పార్టీ విజయావకాశాలు ఎక్కువగా ఉంటాయన్న అంచనాతో అలానే రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు రిహర్సల్‌గా ఎంచి ఒక పథకం ప్రకారం ఎన్నికలను ప్రకటించింది. జూలై 9న నామినేషన్ల ఘట్టంతో మొదలై మూడు విడతలుగా సాగిన ఈ తంతు జూలై 31 వరకు సాగింది. పంచాయితీల ఎన్నికల ప్రకటన వెలువడడానికి చాలాకాలం ముందునుండే గ్రామాలలో పాలకపార్టీల ముఠాల, గ్రూపుల నాయకుల హడావుడి మొదలుకాగా, ఆ తరువాత అది మరింత జోరందుకుంది. కులపరంగా సమీకరణలు, ప్రత్యర్థులకు బెదిరింపులు, బుజ్జగింపులు, డబ్బు ప్రలోభాలకు తోడు ఈసారి వేలంపాటల ద్వారా అభ్యర్థుల 'ఏకగ్రీవ ఎంపిక ప్రక్రియ' పెద్దఎత్తున సాగింది. స్థానిక సంస్థల ఎన్నికలు ఈ స్థాయికి దిగజారాయి. పార్టీల రహితంగా జరపాలన్న లక్ష్యానికి భిన్నంగా జరపడమే మన పాలకుల ప్రత్యేకత. గ్రామ స్వరాజ్యాల గురించి కన్న కలలను నేడు నినాద ప్రాయంగా మార్చిన ఘనత మన పాలకులకే దక్కుతుంది.

దేశ, రాష్ట్ర ప్రజల ప్రయోజనాలతో ఏమాత్రం సంబంధం లేని, తమ స్వార్థ, స్వీయ ప్రయోజనాలే పరమావధిగాఉన్న పాలకపార్టీలు ఎన్నికలలో ఏవిధంగానైనా తామే పైచేయి సాధించేందుకు పడరాని పాట్లన్నీ పడుతున్నాయి. పనిలో పనిగా మండల, జిల్లా పరిషత్ ఎన్నికలను, పట్టణ, నగరాల ఎన్నికలను కూడా పూర్తి చేసుకొని రానున్న అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలకు కావలసిన సన్నాహాలు చేసుకుంటున్నాయి. అధికార పార్టీ నగదు బదిలీ పథకం, అమ్మహస్తం (నిత్యావసరాలు), బంగారు తల్లి (ఆడపిల్లలకు), రూపాయికి కిలో బియ్యం, రాజీవ్ యువ కిరణాలు (యువతకు ఉపాధి), వడ్డీలేని రుణం (మహిళలకు, రైతులకు), ప్రభుత్వ ఉద్యోగాల జాతర, ఇందిరమ్మ జలప్రభ (భూపంపిణీ), రాజీవ్ విద్యాదీవెన (విద్యార్థులకు), ఇందిరమ్మ అమృతహస్తం (గర్భిణులకు, బాలింతలకు), స్త్రీనిధి (మహిళా బ్యాంకు), ఇందిరమ్మ గృహాలు, వృద్ధుల, వికలాంగుల, వితంతువుల పింఛన్లతోపాటు ఎస్.సి., ఎస్‌టి సబ్‌ప్లాన్‌ల వంటి లెక్కకు మించిన పథకాలతో హోరెత్తిస్తుండగా ప్రధాన ప్రతిపక్ష పార్టీ ఇవన్నీ తమ పథకాల నకళ్లుగా పేర్కొంటూ, అధికారంలోకి వచ్చేందుకు మరెన్నో చిట్కాలను ప్రయోగిస్తున్నది. రాజన్న రాజ్యం లక్ష్యంగా మరొక పార్టీ పాదయాత్రలు సాగిస్తుండగా, మరోసారి మతం కార్డుతో పాటు 'సమర్థుడైన' ప్రధాని పేరుతో ఇంకో పార్టీ పావులు కదుపుతోంది.

గ్రామ పంచాయితీలకు, మండల, జిల్లా ప్రజా పరిషత్తులకు, స్థానిక సంస్థలకు ఎన్నికలను నిర్వహించడం ద్వారా ప్రజలే పరిపాలకులంటూ, గ్రామ స్వరాజ్యం సాధిస్తామంటూ పాలకులు ఆర్భాటంగా ప్రకటిస్తున్నారు. వాస్తవానికి రాజ్యాంగం ఉనికిలోకి వచ్చిన గత ఆరు దశాబ్దాలకు పైగా గ్రామ పంచాయితీలకు కనీసపాటి అధికారాలను ఈ పాలకులు విదిలించలేదన్నది వాస్తవం. ఈ పంచాయితీల పాలనలో గ్రామీణ పేదల జీవితాలు ఏమాత్రం అభివృద్ధికి నోచుకోలేదన్నదీ అంతే వాస్తవం.

1995 తర్వాత చంద్రబాబు నాయుడు పరిపాలన కాలంలో ఇతర జిల్లా సంఘాలతో పాటు ప్రధానంగా కృష్ణా జిల్లా సర్పంచ్‌ల సంఘం నాయకత్వాన 10 వేల మందితో ఛలో అసెంబ్లీ కార్యక్రమాన్ని చేపట్టారు. పోలీసు లాఠీలను ఎదుర్కొని సాగించిన ఆందోళన ఫలితంగా సర్పంచ్‌లకు చెక్ పవర్ సాధించుకోగలిగారు. దాని స్ఫూర్తితో స్థానిక సంస్థలకు ముఖ్యమైన అధికారాలు సాధించుకోవడానికి రాష్ట్ర సర్పంచ్‌ల సంఘాన్ని వై.వి.బి రాజేంద్రప్రసాద్ అధ్యక్షులుగా, బి.గురవారెడ్డి కార్యదర్శిగా విజయవాడ మహాసభలో ఎన్నుకోబడ్డారు. వీరి నాయకత్వంలో మంత్రులను, అధికారులను నిద్రపోనియకుండా సర్పంచ్‌లలో ఎనలేని కదలిక తీసుకొచ్చి నిరంతర ఆందోళనలు సాగించారు. ఈ సంఘటిత ఆందోళనల ఫలితంగా 73వ రాజ్యాంగ సవరణ ద్వారా 29 అధికారాలను పంచాయితీలకు బదిలీ చేస్తు పంచాయితీరాజ్ చట్టంలో పేర్కొనాల్సి వచ్చింది. అయితే ఆనాటి రాష్ట్ర ప్రభుత్వం 21 అధికారాలు బదలాయించడానికి ఒప్పుకొని ఆచరణలో 9 అధికారాలను మాత్రమే బదలాయించింది. అయితే రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం 'అధికార వికేంద్రీకరణ, స్వయం పరిపాలన, స్వయం పోషకత్వం' ప్రధాన నినాదంగా నిరంతర ఉద్యమాలు కొనసాగించి 105 జిఒల ద్వారా పంచాయితీలకు ముఖ్యమైన అధికారాలను సాధించారు. వాటిల్లో ముఖ్యమైనది ఇసుకపై వచ్చే ఆదాయాన్ని గనుల శాఖకు కాకుండా పంచాయితీకి 25 శాతం, మండల పరిషత్‌కు 50 శాతం, జిల్లా పరిషత్‌కు 25 శాతం వచ్చేలా సాధించారు. అయితే ప్రభుత్వాలు తీసుకొన్న 'నూతన ఇసుక విధానం' వలన ఇసుక మాఫియా పైచేయి సాధించి స్థానిక సంస్థల ఆదాయానికి గండి కొట్టారు. అలానే సర్పంచ్‌లకు గౌరవ వేతనం, వృత్తి పన్నులో 95 శాతం పంచాయితీలకు చెల్లించడం, పంచాయితీలకు జీతం గ్రాంట్‌ను 90 శాతం సాధించుకో

గలిగారు. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రైవేటీకరణ, సరళీకరణ విధానాల ఫలితంగా గతంలో పోరాడి సాధించుకొన్న అనేక అధికారాలకు పరోక్షంగా కత్తెర వేసి స్థానిక సంస్థలను ఆర్థికంగా పూర్తి పరాధీన స్థితిలోకి పాలకులు నెట్టారు. గతంలో సమితులు ఉన్న కాలంలో స్థానిక సంస్థలకు తగినన్ని అధికారాలుండేవి. ఆ తరువాత మండల వ్యవస్థను తీసుకొచ్చి ఆ అధికారాలకు సమాధి కట్టడం ప్రారంభించారు. ఎం.పి, ఎం.ఎల్.ఎ, ఎం.ఎల్.సిలకు ఇచ్చే కోట్లాది రూపాయల నిధుల వలన పంచాయితీల వైపు కన్నెత్తి చూసే వారు కరువై పోయారు. గతంలో కేంద్ర ప్రభుత్వం నుంచి నేరుగా పంచాయితీలకు విడుదలయ్యే గ్రాంటులకు కూడా గండం ఏర్పడింది.

80 శాతం పైగా ప్రజానీకం ప్రధానంగా ఆధారపడి జీవిస్తున్న గ్రామీణ ప్రాంతాల ప్రజల ముక్కుపిండి అధిక ఆదాయాన్ని రాబట్టు కుంటున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు (ఏ పార్టీలు అధికారంలో ఉన్నప్పటికీ) పంచాయితీలకు కేటాయించాల్సిన నిధులను, అధికారాలను ఇవ్వకుండా మొండిచేయి చూపుతూ వస్తున్నాయి. పైగా, పంచాయితీ పరిధిలోని వనరులపై తమ గుత్తాధిపత్యాన్నే చెలాయిస్తూ పంచాయితీలను నామమాత్రం చేశాయి. అనేక గ్రామ పంచాయితీలు తమ కార్యాలయాల విద్యుత్తు బిల్లులు కూడా చెల్లించుకోలేని దుస్థితికి నెట్టబడ్డాయి. మురుగు కాల్వల నిర్మాణానికి సైతం ప్రపంచ బ్యాంకు వద్దకు జోలెపట్టే పాలకులు, గ్రామ పంచాయితీల స్వయం పోషకత్వానికి, అధికారాల చలామణికి తోడ్పాటు అందిస్తారనుకోవడం భ్రమే అవుతుంది. కనుక స్థానిక సంస్థల అధికారాల కోసం గతంలో సర్పంచ్‌ల సంఘం సాగించిన ఉద్యమాల స్ఫూర్తితో ముందుకు సాగాల్సిన అవసరం ఉంది.

'పారిశ్రామిక అభివృద్ధి' ముసుగులో, నిక్షేపంగా పంటలు పండే భూములతో సహా వేలాది ఎకరాల భూములను రైతుల నుండి ప్రభుత్వాలు గుంజుకొని బడా పెట్టుబడిదారులకు అప్పనంగా కట్టబెడుతున్నాయి. అంతేకాక చివరికి రైతులను భూముల నుండి గెంటి వేయడానికి కార్పొరేట్ లేక కాంట్రాక్ట్ వ్యవసాయ విధానానికి పాలకులు చట్టం చేసే వరకు వెళ్లారు. రుణ భారంతో వ్యవసాయం నుండి బలవంతంగా వైదొలుగుతున్న రైతుల సంఖ్య పెరుగుతోంది. మరో వైపున బడా సంపన్న వర్గాలు గ్రామీణ ప్రాంత వ్యవసాయ భూములను పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తున్నారు. దీనితో గైర్హాజరీ భూస్వాముల (ఆబ్సెంట్ ల్యాండ్‌లార్డ్స్) సంఖ్య పెరుగుతోంది.

ముఖ్యంగా సెజ్‌లు, కారిడార్లు, థర్మల్, అణువిద్యుత్తు కేంద్రాలపేరిట పాలకులు సాగించే తీర ప్రాంత విధ్వంసంతో, భూముల పరాయీకరణతో వేలాది రైతుల, మత్స్యకారుల కుటుంబాలు జీవనోపాధికి దూరమై నీటి నుండి బయట పడిన చేపల్లా శాతరశాతంగా తల్లడిల్లుతున్నారు.

అటవీ ప్రాంత ఆదివాసి గ్రామాల పరిస్థితులు కూడా దీనికి భిన్నంగా లేవు. షెడ్యూల్డు ప్రాంతంలో ఆదివాసులకు కనీస పాటి గ్యారంటీలను కల్పించే 1/70, అటవీ హక్కుల చట్టం, పీసా వంటి వాటిని తుంగలో దొక్కి ఆదివాసులను అడవుల నుండి గెంటివేసి, లక్షలాది ఎకరాల అటవీ భూములను విదేశీ బహుళజాతి కంపెనీలకు ప్రభుత్వాలు కట్టబెడుతున్నాయి. గ్రామ సభలన్న వాటికి అర్థమే లేకుండా జేశాయి. ఇప్పటికీ కొండ కోనల్లో నివసించే వందలాది ఆదివాసి గ్రామాలను షెడ్యూల్డ్ ప్రాంతంగా ప్రకటించకుండా దశాబ్దాలుగా కాలం వెళ్లదీస్తున్నాయి.

గ్రామీణ ప్రాంతాల్లో అగ్రకులాధిపత్య, భూస్వామ్య, పెత్తందార్లు, పాలక వర్గ దళారీలు మొరటు పద్ధతుల్లోనూ, నగిషీలు చెక్కిన నాజూకు రూపాలలోనూ దోపిడీని సాగిస్తూ గ్రామీణ పేదల శ్రమ శక్తిని దోచు కుంటున్నారు. హంతక దాడులు, దౌర్జన్యాలు సాగిస్తూ అణచి వేస్తున్నారు. అధికార, ప్రతిపక్ష పాలక పార్టీల ముఠాలుగా ఉన్న వీరు గ్రామీణ ప్రాంతంలోని అత్యధిక భూములపై ఆధిపత్యం కలిగి ఉండి, రాజకీయంగా తమ పెత్తనాన్ని సుస్థిరం చేసుకోవడానికి పంచాయితీ ఎన్నికలను సాధనంగా చేసుకుంటున్నారు. అధికారం కోసం వారిలో వారు సాగించే కుమ్ములాటల్లో గ్రామీణ పేదలను బలిచేస్తున్నారు.

సామ్రాజ్యవాదుల లూటీ, దోపిడీలను కొనసాగించడంలో పాలకవర్గ పార్టీల వారెవరికీ భిన్నాభిప్రాయం లేకపోగా, సామ్రాజ్యవాదులకు నమ్మకమైన బంట్లుగా రుజువు చేసుకునేందుకు వీరిలో వీరు పోటీలు పడుతున్నారు. భూస్వామ్య, దళారీ పెట్టుబడిదారీ వర్గ ప్రయోజనాల కొమ్ము కాయడంలో ఎవరికివారే సాటిగా ఉన్నారు. ప్రజల మౌలిక సమస్యల పరిష్కారానికి వీరే మాత్రం సిద్ధంగా లేరనేది గత ఆరున్నర దశాబ్దాల వీరి ఆచరణే రుజువుగా నిలుస్తోంది.

పైగా, భూమి, ఉపాధి, విద్య, వైద్యం వంటి తమ మౌలిక సమస్యల పరిష్కారానికై కదిలిన ప్రజానీకంపై పాశవిక నిర్బంధాన్ని ప్రయోగించడంలో వీరంతా సిద్ధహస్తులే. ఉద్యమాలు మరింత సంఘటిత రూపం తీసుకోకుండా, ప్రజల మధ్య కుల, మత, ప్రాంతీయ విద్వేషాల్ని పెంచడంలోనూ, శక్తివంతులైన యువతను పెడదోవపట్టించే విష సంస్కృతిని వారి మెదళ్లలో దట్టించడంలోనూ, ఓట్ల కోసం డబ్బు సంచులను వెదజల్లడంలోనూ వీరంతా ఘనాపాటీలే. పోటీలో నిలబడిన పార్టీలు ఓటర్లకు పెద్ద మొత్తాలలో డబ్బులు పంచుతూ, చివరికి ఎవరు ఎక్కువ మొత్తం ఇస్తే వారికి ఓటు వేసే విధంగా సాధారణ ఓటర్లలో ఉండే నిజాయితీని సొమ్ము చేసుకొనే నీతి బాహ్య విధానాలను కొమ్ము కాస్తున్నారు. అలానే అభ్యర్థులు ఎవరిచ్చిన డబ్బులు తీసుకోవడం, ఒకవేళ నీతిగా తీసుకోకపోతే ఆ తరువాత జరిగే పరిణామాలకు భయపడి తీసుకోక తప్పని స్థితిలోకి ఓటర్లను నెట్టే దౌర్భాగ్య సంస్కృతిని పాలక పార్టీలు పెంచి పోషిస్తున్నాయి. మద్యం తాగడం ఆరోగ్యానికి హానికరమనే ప్రకటనలు ఒక వైపు చేస్తూనే మరో వైపు ప్రతి సంవత్సరం మద్యంపై ఆదాయాన్ని వేల కోట్ల రూపాయలు పెంచుకుంటూ పోతున్నారు. పంచాయితీ ఎన్నికల్లో మద్యాన్ని ఏరుల్లా పారించడానికి, ప్రజలను మత్తులో ముంచెత్తి వారి ఓట్లను కొల్లగొట్టేందుకు పథకాలు రూపొందిస్తున్నారు. వీరికి స్థానిక నాయకులు మొదలుకొని ఎం.ఎల్.ఎలు, మంత్రుల స్థాయిలో కావలసిన సహకారాలు అందుతాయన్నది బహిరంగ రహస్యం. కాబట్టి పంచాయితీ ఎన్నికల్లో నిలబడిన అత్యధిక అభ్యర్థులు తాము గెలవడానికి లక్షలు, కోట్లు గుమ్మరిస్తున్నారంటే పంచాయితీల అభివృద్ధి లక్ష్యం కోసం కాదని, తాము ఖర్చు పెట్టిన దానికి పదింతలు సంపాదించుకోవడానికేనని వేరే చెప్పనవసరం లేదు కదా! అలానే పట్టణాలు నగరాలకు, జాతీయ రహదారుల పక్కన ఉన్న గ్రామాల్లోని పంచాయితీ ఎన్నికల్లో రియల్ ఎస్టేట్, బడా కాంట్రాక్టర్లు,

విద్యార్థులను బలిగొన్న మధ్యాహ్న భోజనం

బీహార్‌లో విద్యార్థులను బలిగొన్న మధ్యాహ్న భోజన పథకంలోని లోపాలను వివరిస్తూ, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యత వహించాలంటున్నారు **సిరిసనగండ్ల సాహితి**

పేద విద్యార్థుల ఆకలి తీర్చాల్సిన మధ్యాహ్న భోజనం వారి ప్రాణాలనే తీసింది. బీహార్ రాష్ట్రంలోని శరణ్ జిల్లా మష్రాక్ బ్లాక్ గందావన్ గ్రామంలో జూలై 16న చోటు చేసుకున్న సంఘటన దేశ ప్రజానికాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో భోజనం చేసిన 23 మంది విద్యార్థులు మృతి చెందగా, మరో 30 మంది తీవ్ర అస్వస్థతకు గురై మృత్యువు అంచుల వరకు వెళ్లొచ్చారు. రోజూలాగే అన్నం, పప్పు, సోయాబిన్ వంటకంతో భోజనం చేసిన విద్యార్థులు ఒక్కసారిగా అస్వస్థతకు గురయ్యారు. చిన్నారులంతా పదేళ్ల వయస్సులోపు వారే. చిన్నారుల మృతికి కారణమైన భోజనంలో విషపూరిత పురుగు మందు ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. ఈ భోజనంలో మోనోక్రోటోఫాస్ ఉన్నట్లు ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ తన నివేదికలో వెల్లడించింది. నివేదికల సంగతి ఎలా ఉన్నా మొత్తం మధ్యాహ్న భోజనం పథకం నిర్వహణే లోపభూయిష్టంగా ఉంది. ఫలితంగా మన రాష్ట్రంలో కూడా మధ్యాహ్న భోజనం తిని నిత్యం ఒకటి, రెండు చోట్ల విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్న సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి.

పథకం అమలు.. తీరుతెన్నులు..

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పౌష్టికాహారం అందించడం.. డ్రాప్ అవుట్స్‌ను తగ్గించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించింది. రాష్ట్ర వ్యాప్తంగా 61,415 ప్రాథమిక పాఠశాలల్లో, 9216 ప్రాథమికోన్నత పాఠశాలల్లో, 10,292 హైస్కూళ్లలో మధ్యాహ్న భోజన పథకం అమలవుతోంది. అన్నం, సాంబారు, పులిహోరతో పాటు వారానికి రెండు సార్లు గుడ్డు, అరటిపండు విద్యార్థులకు పంపిణీ చేయాలి. అయితే ఆచరణలో అందుకు విరుద్ధంగా ఉంది. వారానికి రెండు సార్లు గుడ్డు ఇవ్వాల్సి ఉండగా 15 రోజులకోసారి ఇస్తున్నారు. కోడిగుడ్డు తినని వారికి అరటి పండు ఇవ్వాల్సి ఉండగా.. ఎక్కడా ఇచ్చినా దాఖలాలు కనిపించడం లేదు. ఇప్పటికీ రాష్ట్రంలోని మెజారిటీ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం ఆరుబయటే వండుతున్నారు. వంట గదులు లేకపోవడంతో ఆరుబయటే కట్టెలపొయ్యిలపై వంట చేస్తుండడంతో వాటి నుంచి వచ్చే పొగవల్ల విద్యార్థుల చదువులకు ఆటంకంగా మారుతోంది. ఒక కిచెన్‌కు రు. 75 వేల చొప్పున ఖర్చు చేసి షెడ్ నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం జీవో. నం. 821 విడుదల చేసింది. వంట గదులు పూర్తికాని పాఠశాలలు ఇంకా వేల సంఖ్యలో ఉన్నాయి. చాలా పాఠశాలల్లో భోజనం వండేందుకు మంచి నీళ్ల సౌకర్యం లేదు. దీంతో పాఠశాల బయట వంటలు చేసుకుని రావడం వల్ల చల్లబడిపోతున్నాయి. అలాగే వంట చేసేందుకు మహిళా సంఘాలు పోటీపడుతుండడంతో వారికి సర్దిచెప్పడం ప్రధానోపాధ్యాయులకు తలనొప్పిగా మారింది. అనేక పాఠశాలల్లో ఎస్‌సి, ఎస్‌టి మహిళలు వండిన భోజనాన్ని తినేందుకు అగ్రవర్ణ విద్యార్థుల తల్లిదండ్రులు అంగీకరించడం లేదు. ఈ తరహా ఘటనలు నిత్యకృత్యమయ్యాయి. మధ్యాహ్న భోజనానికి పిడిఎస్ బియ్యాన్ని రేషన్ డీలర్ల ద్వారా ప్రభుత్వం పాఠశాలలకు సరఫరా చేస్తోంది. ఇవి దొడ్డు బియ్యం కావడంతో అన్నం ముద్దలా అవుతోంది. ఉడికీ ఉడకని అన్నం తినడంతో విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారు. భోజనం రుచికరంగా ఉండకపోవడంతో విద్యార్థులు అర్థాకలితో చదువులు వెల్లదీస్తున్నారు. పెరిగిన ధరలకు

కార్పొరేట్ శక్తులు రంగంలోకి దిగి, గెలవడానికి అన్ని ఎత్తుగడలు ప్రయోగించి తమ వ్యాపారాలను పెద్ద ఎత్తున సాగించుకొనే పథకాలతో దిగారని వెల్లడయ్యింది. పంచాయితీ ఎన్నికల్లో రిజర్వేషన్ ప్రక్రియను గొప్పగా అమలు పరిచామని డాంబీకా పలుకుతున్న పాలక పార్టీ ఆచరణలో రిజర్వేషన్ ప్రక్రియను కూడా రాజకీయ లబ్ది కోసం ఉపయోగించుకొనే విధానాలకి పాల్పడింది. ఎస్.సి, ఎస్.టిల కింద రిజర్వేషన్ ప్రకటించిన కొన్ని పంచాయితీల్లో అసలు ఆ వర్గాలు తక్కువ సంఖ్యలో ఉన్నాయంటే ఇంత కంటే వేరే ఉదాహరణ అవసరం లేదు. రిజర్వేషన్ కేటాయింపుల్లోని అవకతవకలపై న్యాయ విచారణ జరిపించాలని ప్రతి పక్ష పార్టీలు డిమాండ్ కూడా చేయాల్సి వచ్చింది. అలానే రిజర్వేషన్ ప్రక్రియలో ఎన్నికైన ఎస్.టి, ఎస్.సి, బి.సి వర్గాల సర్పంచ్‌లు డబ్బులు పెట్టి ఎన్నికైన ఉపసర్పంచ్‌ల కనుసన్నలలోనే పనిచేయాల్సి రావడం రిజర్వేషన్‌ల బండారాన్ని బయటపెడుతుంది.

ఈ నేపథ్యంలో జరిగిన పంచాయితీ ఎన్నికలలో ప్రజలను వివిధ రకాలుగా దిగజార్చే, చీల్చే పాలకవర్గ పార్టీల కుట్రలకు బలికాకుండా ప్రజలంతా ఐక్యంగా నిలబడడం అవసరం. గ్రామీణ ప్రాంతంలో కీలకంగానున్న భూమి సమస్య పరిష్కారం కోసం, స్థానిక సంస్థలకు సంపూర్ణ అధికారాల సాధన కోసం, గ్రామీణ వనరులపై ఆధిపత్యం కోసం, అగ్రకుల పెత్తందార్ల దోపిడీ, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా భూమి హీనులైన వ్యవసాయ కూలీలు, గ్రామీణపేదలు, కష్టజీవులంతా సంఘటిత ఐక్యపోరాటాలు సాగించాలి. అగ్రకుల, భూస్వామ్యవర్గ దోపిడీ ప్రయోజనాల కొమ్ముగాసే, పేదలలో చీలికలు సృష్టించే శక్తుల కుట్రలను సమైక్యంగా ఎదుర్కొని, తిప్పికొట్టే కర్తవ్యం పీడితవర్గాలు చేపట్టాలి.

(రచయిత సిపిఐ (ఎం.ఎల్) రాష్ట్ర కమిటీ సభ్యులు) వీ

అనుగుణంగా మధ్యాహ్న భోజనం సరుకులకయ్యే చార్జీలను ప్రభుత్వం పెంచడం లేదు. 2011-12 విద్యా సంవత్సరంలో ప్రైమరీ స్కూళ్లలో ఒక్కో విద్యార్థికి రు. 3.84 పైసలు, ప్రాథమికోన్నత పాఠశాలలతో పాటు, హైస్కూల్ విద్యార్థులకు రు. 4.40 పైసల చొప్పున నిధులు కేటాయించింది. 2012-13 విద్యా సంవత్సరంలో ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు రు. 4.00, ప్రాథమికోన్నత, హైస్కూల్ విద్యార్థులకు రు. 4.65 పైసలు పెంచారు. కేంద్ర ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం ఏటా 7. 5 శాతం నిధులు పెంచాలని ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం తన వాటా కింద పైసా పెంచడం లేదు. అంతేగాక ప్రజలకు కిలో బియ్యం రూపాయికి ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు మాత్రం కిలో రు. 5కు సరఫరా చేయడం విడ్డూరం. రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థికి ఒక్క పూట భోజనానికి రు. 10 ఇస్తుండగా, సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు రు. 5. 50 పైసలు, పాఠశాలలో విద్యార్థులకు రు. 4.65 పైసలు వెచ్చించడాన్ని బట్టి మధ్యాహ్న భోజనం అమలుపై ప్రభుత్వానికి ఏపాటి చిత్తశుద్ధి ఉందో అర్థం చేసుకోవచ్చు. అంతేగాక చాలీచాలని భోజనంతో పాఠశాలల్లో 65 శాతం మంది విద్యార్థులు రకరకాల జబ్బులతో బాధపడుతున్నారని సర్వశిక్ష అభియాన్ నివేదికలే వెల్లడిస్తున్నాయి. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నాణ్యమైన భోజనంతోపాటు రోజూ గుడ్డు, పాలు ఇవ్వాలి. ఫలితంగా ఆరోగ్యకరమైన సమాజం రూపొందుతుంది.

మధ్యాహ్న భోజనం పథకంలో జరుగుతున్న లోపాలను సవరించకుండానే ఆ తప్పులను ఉపాధ్యాయులపై వేసి ప్రభుత్వం తన బాధ్యత నుంచి తప్పుకోవాలని చూస్తోంది. బీహార్ ఘటనకు బాధ్యురాలిగా చేస్తూ ప్రధానోపాధ్యాయురాలు మీనాదేవి ఆస్తులను ఆటాచ్ చేసినట్లు అక్కడి ప్రభుత్వం ప్రకటించింది. క్షేత్రస్థాయిలో మీనాదేవి నిర్లక్ష్యం ఉన్నట్లయితే ఆమె పై ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిందే. అయితే ప్రభుత్వం సరఫరా చేస్తున్న నాసిరకం సరుకులు, నూనెలతోపాటు బియ్యంతో నాణ్యమైన భోజనం ఎలా వండి పెట్టాలని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు. మధ్యాహ్న భోజనంతో విద్యార్థులు అస్వస్థతకు గురైతే ఉపాధ్యాయులను బాధ్యులను చేయడం సరికాదు.

మధ్యాహ్న భోజనం విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం.. స్థానికంగా వండిన వేడి ఆహారం విద్యార్థులకు ఇవ్వాలి. స్థానిక ఆహారాన్నే అందించాలి. అలాగే 25 మంది విద్యార్థులకు ఒక కుక్‌తోపాటు సహాయకుడు ఉండాలి. 26 నుంచి 100 మంది ఉంటే ఇద్దరు వంట మనుషులు, ఒక సహాయకురాలు ఉండాలి. కానీ ఈ నిబంధనలు కొన్నిచోట్లనే అమలవుతున్నాయి. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన బీహార్ సంఘటన మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ తీరుపై అనేక ప్రశ్నలను చర్చకు పెట్టింది. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని, అధికారుల అలసత్వాన్ని ఎత్తి చూపింది. అప్పటి వరకు మధ్యాహ్న భోజన నిర్వహణను అంతంతగా మాత్రమే పట్టించుకున్న కేంద్ర ప్రభుత్వం ఈ ఘటనతో మేల్కొని మార్గదర్శకాలను జారీ చేసింది.

కేంద్రప్రభుత్వ నూతన మార్గదర్శకాలు..

కేంద్ర ప్రభుత్వ నిధులతో వంట గదుల నిర్మాణం చేపట్టాలి. ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ఆహార పదార్థాలను, నూనెలను నిల్వ చేయాలి.

వంట చేసే మహిళలతోపాటు, సహాయకులకు సురక్షితమైన ఆహారం వండేలా శిక్షణను ఇప్పించాలి. జిల్లాస్థాయి అధికారులు తనిఖీలు నిర్వహించాలి.

కొన్ని రాష్ట్రాల్లో మధ్యాహ్న భోజనానికి అవసరమయ్యే సామగ్రిని ఆయా ప్రభుత్వ సంస్థల నుంచి సరఫరా చేస్తున్నారు. అదే విధానాన్ని ఇతర రాష్ట్రాలు కూడా అనుసరించి పప్పు దినుసులు, నూనె కూరగాయలు సరఫరా చేయాలి.

మధ్యాహ్న భోజనం పథకంపై విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలి. పాఠశాలల్లో ప్రహరీ గోడపై మెనూ వివరాలు రాయాలి.

మధ్యాహ్న భోజనంపై మూడు నెలలకోసారి ఎంపి ఆధ్వర్యంలో, కలెక్టర్ లేదా జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించాలి.

భోజనం శాంపిళ్లను ఎప్పటికప్పుడు పరిశీలించి నాణ్యతను తెలుసుకోవాలి. దీని కోసం ప్రభుత్వం గుర్తించిన ప్రయోగశాలలకు ఆహారాన్ని పంపించి నాణ్యత పెంచడానికి చర్యలు తీసుకోవాలి.

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని ఆ పాఠశాల ఉపాధ్యాయుల్లో ఒకరు తప్పనిసరిగా భుజించాక, నాణ్యతగా ఉందని రిజిష్టర్‌లో నమోదు చేసిన అనంతరమే విద్యార్థులకు వడ్డించాలి.

పథకాన్ని కేంద్ర ప్రభుత్వమే అమలు చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యతతో వ్యవహరించాలి. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు కూడా మధ్యాహ్న భోజనం అమలులో జరిగే అవకతవకలకు బాధ్యత వహించాల్సి ఉంటుంది.

పాఠశాలల్లో భోజనం వికటిస్తే ప్రధానోపాధ్యాయుడు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే జిల్లా అధికారులకు సమాచారం చేరవేయాలి.

ఇప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగం బీహార్‌లో జరిగిన ఘటనలను పునరావృతం కాకుండా చూసుకోవాలి. నిర్దేశించుకున్న నిబంధనలను అమలయ్యేలా చూడాలి. ఇది నిరంతర కార్యక్రమంగా కొనసాగాలి. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు పాలు అందించడమేగా కుండా, మధ్యాహ్న భోజనంలో రోజూ గుడ్డు ఉండేలా మెనూలో మార్పులు చేయాలి. పాఠశాలల్లో కనీస వసతులు మెరుగుపర్చాలి. ప్రధానంగా సన్న బియ్యం (ఫైన్ రైస్) సరఫరా చేస్తూ తాజా కూరగాయలు వండేలా చర్యలు తీసుకోవాలి. ఇవన్నీ అమలైనప్పుడే విద్యార్థులు ఆరోగ్యంగా ఉండి.. తన చదువును ప్రశాంత వాతావరణంలో కొనసాగిస్తారు. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగడానికి అవకాశముంది.

(రచయిత్రి కాకతీయ విశ్వవిద్యాలయం సోషల్ వర్క్ విద్యార్థిని) వీ

ఇటీవల పోస్టల్ శాఖ అన్ని మనీ ఆర్డర్‌లను టెలిగ్రాఫిక్ మనీ ఆర్డర్‌లుగా పంపుతున్నది. మీరు ఎం.ఒ. చేసినప్పుడు కింద కూపన్‌లో రాసిన ఉత్తరం ఈ టెలిగ్రాఫిక్ ఎం.ఒ.లో మాకు చేరదు. కనుక ఎం.ఒ.లు చేసేవారందరూ విడిగా ఒక పోస్ట్‌కార్డు మీద మీరు ఎం.ఒ. ఎందుకు పంపుతున్నారో రాయండి. – సం.

మేం మళ్లీ వస్తాం!

సోవియట్ యూనియన్, చైనా పతనాలతో మార్క్సిజం అంతం కాలేదని విశ్వసిస్తూ, ఆ రెండు అనుభవాలను తన శైలిలో విశ్లేషించిన తోలేటి జగన్మోహనరావు 'మేం మళ్లీ వస్తాం' పై* రంగనాయకమ్మ *సమీక్షావ్యాసం

రష్యా, చైనాల్లో క్రమ క్రమంగా అపజయాలు పొందుతూ నిశ్శబ్దం అయిపోయిన సోషలిస్టు విప్లవకారులు ఇప్పుడు, 'మేం మళ్లీ వస్తాం!' అని కేకపెడితే, 'ఎక్కణ్నించీ?' అనే ప్రశ్న రాదూ? రష్యావాళ్లు రష్యాలోనే, చైనా వాళ్లు చైనాలోనే, ఉంటారు కదా? అక్కణ్నించి ఎక్కడికి వస్తారు? ఉన్న చోటే వున్న వాళ్లు, 'మళ్లీ వస్తాం' ఏమిటి? పోనీ, 'మళ్లీ లేస్తాం' అని కేక పెడితే? 'ఇప్పుడా లేచేది? అప్పుడేం చేశారు?' అనే ప్రశ్నలూ వస్తాయి.

ప్రశ్నలు వస్తే వచ్చాయి గానీ, 'మళ్లీ వస్తాం' అనే కేకకి, 'మళ్లీ పోరాడతాం' అని అర్థం చెప్పుకుంటే, అది ఎంత బాగుందో!

ఈ పుస్తకం మీద ఆ పేరు చూడగానే, నాకు చాలా నచ్చింది. సంతోషంగా పుస్తకం తెరిచి లోపలికి వెళ్తే, ముందు మాట కూడా చాలా ధైర్యాన్నిచ్చింది. రష్యా చైనాల్లో సోషలిజాలు ఎందుకు పోయాయో, ఆ కారణాల్ని, ఈ దేశంలో ఏ కమ్యూనిస్టు పార్టీలూ చెప్పడం లేదనీ, ఆ కారణాలు తను చెపుతాననీ, పోయిన సోషలిజం మళ్లీ ఎలా వస్తుందో కూడా తను చెపుతాననీ, రచయితే రాసిన 'ముందు మాట' చాలా గట్టి వాగ్దానం చేసింది.

రష్యా చైనాల పతనాల మీద ఎందరెందరో రాసిన అనేక వ్యాసాలూ, పుస్తకాలూ, చిన్నవీ పెద్దవీ మధ్యవీ వచ్చాయి, ఇప్పటికీ వస్తున్నాయి. కొన్నిటిని బాగా చదువుతాం, కొన్నిటిని తిరగేసి వదిలేస్తాం, కొన్నిటిని తిరగెయ్యకుండానే అవతల పడేస్తాం. కొన్ని పుస్తకాలు నిజంగా చదివిస్తాయి, కొన్ని విసిగిస్తాయి.

ఈ పుస్తకం అనేక సమస్యల్ని చర్చిస్తూ, అనేక ప్రశ్నలు లేవనెత్తుతుంది. మొదట రష్యాలో స్టాలిన్ ద్వారా సాగిన సోషలిజానికి కృశ్చేవ్ కాలం నించీ పతనం; తర్వాత చైనాలో మావో కాలంలో కుంటి కుంటిగా ఒంటి కాలితో సాగిన ఆ మాత్రపు సోషలిజం కూడా టెంగు బూర్జువా వల్ల పతనం; తర్వాత, అల్బేనియాలో హాయిగా సాగుతోన్న సోషలిజం కూడా మరో బూర్జువా వల్ల పతనం; ఆ తర్వాత, మార్క్సిజం అంటే, సోషలిజం అంటే, గతి తర్కం అంటే, వ్యక్తి పూజలంటే, ఉత్పత్తి శక్తులంటే, బ్యూరోక్రసీ అంటే, రివిజనిజం అంటే, అభివృద్ధి అంటే, ఆధునీకరణ అంటే, కొమింఫార్మ్ అంటే, నెగేషన్ ఆఫ్ నెగేషన్ అంటే – అలా అవన్నీ అయ్యాక, చివరికి విప్లవకారులు మళ్లీ ఎలా వస్తారో వివరించి, చివరికి ముగింపూ! ఇవన్నీ ఐదారు పెద్ద పెద్ద చాప్టర్లుగా!

పుస్తకాలు తెరిస్తే, భాష పెద్ద సమస్య కదా? కానీ, ఈ పుస్తకంలో భాష చాలా సరళం. కానీ, ఆ సరళాన్ని విరళం చేసే, అత్యవసరమైన చోట్ల కామాలు లేని, విభక్తులు లేని, దీర్ఘాలు లేని, కష్టాలు ఎదురైనా, తెలుగు పాఠకులకు చాలా మంది తెలుగు రచయితల వల్ల అవన్నీ అలవాటే కాబట్టి ఆ కష్టాల్ని అధిగమిస్తే, నిజంగా శైలి చాలా సరళం.

ఫ్రెంచి మార్క్సిస్టు చార్లెస్ బెతల్ హామ్, రష్యా చైనాల్లో చాలా సార్లు పర్యటించి, అక్కడి పార్టీల, గవర్నమెంట్ల పత్రాలు కూడా దొరికించుకుని, చివరికి ఆ సోషలిజాలు సోషలిజాలే కావని తేల్చిన భారీ గ్రంథాలు నాలుగైదు వున్నాయి కదా? కానీ అవి బండ ఇంగ్లీషులు. అవి మనకు తెలిసిన తెలుగులోకి వస్తాయనే ఆశ లేదు. ఇప్పుడు ఈ పుస్తకం, సోషలిజం మీద మళ్లీ ఆశ కలిగించే పేరు వున్న తెలుగు పుస్తకం. ఇందులో బాగా వ్యతిరేకించవలసిన అంశాలూ, చర్చించవలసిన అంశాలూ కొన్ని వున్నా; ఆలోచించ వలసిన, ఆమోదించవలసిన అంశాలు కూడా కొన్ని వున్నాయి. రష్యా చైనాల విషయాలు ఇప్పటికే చాలా మందికి కొట్టిన పిండి. అయినా, ఇందులో కొట్టిన పిండితో పాటు, కొట్టని పిండి కూడా ఉంది. 'స్టాలిన్ మరణం కూడా హత్య వల్లే' అనే వార్త ఈ పుస్తకంలో గాక, ఇంతకు ముందు ఎక్కడైనా చదివారా? ఇలాంటివి ఇంకా ఉన్నాయి.

కార్మిక రాజ్యంగా ప్రారంభమైన పారిస్ కమ్యూన్, రెండు నెలల్లోనే నిశ్శబ్దం అయింది. అయినా, రష్యాకి అలా జరగదని చాలా నమ్మాం. కానీ అక్కడా అదే జరిగింది. అక్కడ కమ్యూనిస్టు పార్టీని నిషేధించెయ్యడం దాకా జరిగిపోయింది (1991లో). ఏమైపోయారు అక్కడి విప్లవ వీరులు? హిట్లర్‌ని కూడా పారదోలిన వాళ్లు! పోనీ చైనాలో మాత్రం? అక్కడ 'లాంగ్ మార్చ్' సాహస వీరులందరూ ఏమైపోయారు? గుండెలు అవిసిపోయే అవమానాలూ అపజయాలూ ఎలా భరించారు? వాళ్లతో పాటు మనమూ భరించాం. అలా ఎందుకు జరిగిందో, అదంతా దూరాల వాళ్లకి అయోమయం! దూరాల వాళ్లకే కాదు, ఆ దేశాల్లోనే, ఆ ఊళ్లల్లోనే, ఆ వీధుల్లోనే తిరిగే జనాలందరికీ కూడా అయో మయమే. 'మీ దగ్గిర అలా ఎందుకు జరిగింది?' అని వాళ్లని అడగండి. చెప్పలేరు. ప్రతీ వాడిదీ తెల్ల మొహమే. వాళ్ల కన్నా దూరాన్న ఉన్న మనమే చాలా నయం. అక్కడేం జరిగిందో తెలుసుకోవాలని ఇక్కడ ఎప్పుడూ ఆరాటపడతాం. తెలిసినా, మళ్లీ దాన్నే చెప్పుకుంటాం. లేకపోతే, ఇలాంటి పుస్తకాలు ఎందుకు వస్తాయి? అందుకే మనం ఈ పుస్తకాలు చదువుకోవాలి. మాట్లాడుకోవాలి.

ఇప్పుడు రష్యాలో 69 కమ్యూనిస్టు పార్టీలు వున్నాయట! (అయితే, 69 సోషలిజాలు వస్తాయి) అవి గాక, ఆ రకం గ్రూపులు కూడా ఉన్నాయట! మరి, 'మళ్లీ వస్తాం' విప్లవకారులు, ఏ పార్టీ నించి వస్తారో!

స్టాలిన్ మీద వాలబోయిన ఈగలకు
అసలు స్థానం మావో వీపే:

ఈ పుస్తకం, స్టాలిన్ మీద ఈగ వాల నివ్వదు. మావో మీద అయితే, వాలిన ఈగల్ని లేవనివ్వదు, తోలనివ్వదు. ఈ రచయిత 'తోలేటి' వారే గానీ, మావో మీద ఈగల్ని తోలరు. 'తోలేటి' వారు కారు.

స్టాలిన్, పొలిట్ బ్యూరోతో అయినా సంప్రదించకుండా ఏక పక్షంగా నిర్ణయాలు చేసే వ్యక్తి అనీ, రక్త పిపాసి అనీ, మార్క్సిజాన్ని అనుసరించిన వ్యక్తి కాదనీ, ఇలాంటి ఆరోపణలు స్టాలిన్ మీద చాలా విని వున్నాం. ఇలాంటి ప్రతీ ఆరోపణ – ఈగనీ, ఈ పుస్తకం పూర్తిగా తోలి పారేస్తుంది. చెప్పాలంటే, ఆ ఆరోపణల్లో మొదటి రకం ఆరోపణ, తర్కానికి నిలబడేది

కాదు. స్టాలిన్ దాకా ఎందుకు? చక్రవర్తికి అయినా, మిలటరీ నియంతకి అయినా, ఏక పక్షంగా నిర్ణయాలు తీసుకోవడం సాధ్యం కాదు. ఆ సమాజంలో వున్న ఏదో ఒక వర్గం అంగీకారం వుంటే తప్ప, ఏ నాయకుడికీ, ఏ నిర్ణయాలూ సాధ్యం కావు. అలాంటప్పుడు స్టాలిన్ మాత్రం ఆ పని ఎలా చేస్తాడు? అతను స్వతంత్ర, ఏక పక్ష నిర్ణయాలు చేసేస్తూ వుంటే, కేంద్ర కమిటీ సభ్యులు ఏం చేశారు? పోలిట్ బ్యూరో సభ్యులు ఏం చేశారు? వాళ్లల్లో ఎక్కువ మంది స్టాలిన్ వాదాన్నే అంగీకరిస్తే, అది మెజారిటీ నిర్ణయమే అవుతుంది కదా? అందులో ఒకే ఒక్క స్టాలిన్ చేసే తప్పో, రైటో, ఎలా వుంటుంది? పార్టీ జనరల్ సెక్రటరీ (ప్రధాన కార్యదర్శి) అనే వాడు, తన గదిలో కూర్చుని తనే ఒక నిర్ణయం రాసి బైటికి తెచ్చాడంటే, దాన్ని పోలిట్ బ్యూరోలో ఎవ్వరూ విమర్శించలేదంటే, అది మెజారిటీ నిర్ణయమే అవుతుంది కదా? స్టాలిన్ నిజంగా ఒక తప్పు చేశాడంటే, దాని బాధ్యత స్టాలిన్‌దీ, ఆ కమ్యూనిస్టు పార్టీదీ, ఆ ప్రజలదీ కూడా. ఒక్క స్టాలిన్ మీదే ఎందుకు నిందలు?

లెనిన్ చాలా అనారోగ్యంతో మరణశయ్య మీద ఉండి, త్వరలో జరగబోయే పార్టీ మహాసభలో పెట్టడానికి తన అభిప్రాయాలుగా కొన్ని పత్రాలు రాయించాడు. (ఈ సమాచారం ఈ పుస్తకం లోది కాదు.) ఆ పత్రాల్లో ముఖ్యమైనది, అప్పటికే పార్టీకి ప్రధాన కార్యదర్శిగా వున్న స్టాలిన్, ఆ పదవికి తగిన లక్షణాలు గల వాడు కాదనీ, అతన్ని మళ్లీ ఆ పదవికి ఎంచుకోవద్దనీ, అది తన సూచన అనీ, చెప్పిన పత్రం. కానీ, ఆ పత్రం మహాసభలో సభ్యుల ముందుకు రాలేదు. అలా రాకపోవడానికి ముఖ్య కారణం స్టాలినే అవుతాడు, నిజమే గానీ, పోలిట్ బ్యూరో వాళ్లందరూ దానికి బాధ్యులు కారా? సభ్యులంతా పిరికి పందలైపోయినప్పుడు, నాయకుడు సాహస వీరుడైపోడా? అంత ముఖ్యమైన పత్రం, అనేక ఏళ్ల తర్వాత స్టాలిన్ పోయాక గానీ బైటికి రాలేదు. స్టాలిన్ చేసిన అంత ఘోరమైన తప్పుని ఈ పుస్తకం ఏ మాత్రమూ తప్పు పట్టలేదు. అసలు ఆ మాట ఎత్తలేదు. ఎత్తని మాటలు ఇంకా వున్నా యనుకోండీ! స్టాలిన్ మీద ఈగల్ని మావో వేపు తోలడమే తోలేటి వారి పని కదా?

సోవియట్ వ్యవసాయ సమిష్టీకరణ కోసం, రైతుల్లో పెద్దా చిన్నా స్థాయిల వాళ్లని కూడా ప్రవాస శిక్షలతో సైబీరియాకి పంపేసిన ఘట్టాల గురించి ప్రస్తావిస్తూ ఈ పుస్తకం, అదంతా సోషలిజం కోసం అత్యవసరంగా జరగవలసింది కాబట్టే అలా జరిగిందని వాదనలు చేసింది.

ప్రభుత్వం, రైతుల నించి వసూలు చేసే ధాన్యానికి అసలు కన్నా తక్కువ ధరలు చెల్లించి, ఆ ధాన్యాన్ని మార్కెట్లో ఎక్కువ ధరలతో అమ్మి, ఆ రకంగా వచ్చిన మిగులుని పరిశ్రమల మీద పెట్టి, పరిశ్రమల్ని అభివృద్ధి చెయ్యడం, సోషలిజం నిర్మాణానికి అత్యవసరమైనదనే వాదం ఈ పుస్తకంలో కొంత సాగింది. అంటే, పరిశ్రమల్ని అభివృద్ధి పరిచేది, రైతుల శ్రమలో కొంత భాగాన్ని లాగడం ద్వారానా – అనే ప్రశ్న కాచుకుని వుంటుంది గానీ, ఈ చర్చల్ని ఇంత అస్పష్టంగా చెయ్యడం ఈ పుస్తకం పట్ల న్యాయం కాదు. ఆ విషయాల్ని ఈ పుస్తకం కొంత తడిమిందే గానీ, చాలా స్పష్టత ఇచ్చేటంతగా చెప్పింది లేదు. ఇలాంటి చర్చలు అనేకం నడిచాయి. కానీ, ఇవి సరిపోవు.

స్టాలిన్‌తోపాటే అనేక సంవత్సరాలుగా పార్టీలో పనిచేస్తూ వచ్చిన అనేక మంది నాయకులకు మరణ శిక్షలే ఎదురవడం గురించి ఈ పుస్తకం ఎక్కడా స్పష్టంగా వివరించలేదు. కానీ, కొందరు నేరస్తులు, తమ నేరాల్ని విచారణల్లో బట్ట బయలుగా ఒప్పేసుకున్నారని చెప్పిన వివరాలు అమితాశ్చర్యం కలిగిస్తాయి. అలాంటి వారికి కూడా మరణ శిక్షలు తప్పకపోవడం ఇంకో ఆశ్చర్యం! అయినా ఈ విషయాల్ని కూడా, వాటిలో మంచి చెడ్డల్ని, ఈ పుస్తకం ఇచ్చిన సమాచారాలతోనే అర్థం చేసుకోలేం. సమాచారాలు చాలవు.

స్టాలిన్ గురించి సదభిప్రాయం లేని మార్క్సిస్టులు, తమ అభిప్రాయాల్ని మార్చుకునే విధంగా చెయ్యాలని ఈ పుస్తకం చాలా ప్రయత్నించింది. కానీ, ఈ విషయంలో తన ప్రయత్నాలు ఫలించేటంత బలమైన వాదాలు ఇది ఇవ్వలేకపోయింది.

తర్వాత, మావో గురించి ఈ పుస్తకం చేసిన విమర్శలు చాలా వున్నాయి. వాటిలో చాలా వరకు గతంలో తెలిసి వున్నవే. కానీ, 'కమ్యూన్ల నిర్మాణం' మీద ఈ రచయిత విమర్శ, చర్చనీయాంశంగా వుంటుంది. (ఇక్కడ దేని చర్చ అయినా అతి క్లుప్తమైన చర్చే. ఇదే ఫైనల్ అవదు.)

చైనాలో, రైతులు తమ భూముల్ని కలుపుకుని కమ్యూన్లుగా ఏర్పర్చుకున్న పద్ధతి మీద ఈ రచయిత విమర్శ ఏమిటంటే, 'ప్రైవేటు ఆస్తిని తీసివెయ్యడం అంటే అలాగేనా? కమ్యూన్ ఆస్తి కూడా దాని సభ్యుల ప్రైవేటు ఆస్తే అవుతుంది కదా? అది ప్రభుత్వ ఆస్తి కాకుండానే సోషలిజం ఎలా అవుతుంది? భారీ యంత్రాలు లేకుండా పారలతో, నాగళ్లతో సమిష్టి వ్యవసాయం మొదలుపెడితే, అదా సోషలిజానికి మార్గం? కమ్యూన్ సోషలిజం, రైతాంగ సోషలిజమే, పెటీ బూర్జువా సోషలిజమే' – ఇలా వుంటుంది విమర్శ.

సోషలిజానికి మార్గంగా మొత్తం ఈ పుస్తకం నిండా చెప్పింది, భూములూ – ఉత్పత్తి సాధనాలూ అన్నీ ప్రభుత్వ ఆస్తులే అవ్వాలనీ; పరిశ్రమలన్నీ, వ్యవసాయ పరిశ్రమతో సహా, భారీ యంత్రాలతో నడిచే విధంగా వాటి ఉత్పత్తి శక్తులు అభివృద్ధి అవుతూ వుండాలి అనీ.

కమ్యూన్ ఆస్తి, కమ్యూన్ సభ్యుల ప్రైవేటు ఆస్తే అవుతుందనేది నిజమే. (కమ్యూన్‌లో కలిసిన రైతుల భూములు, రైతుల ప్రైవేటు ఆస్తులుగా వుండవని ఇతర పుస్తకాల్లో చదివాం.) అక్కడ ప్రారంభంలో భారీ యంత్రాలు లేవనేదీ నిజమే. అయితే, అక్కడ పనిముట్లు ఎలా వుంటే అలాగే, వాటితోనే, సమిష్టి ఉత్పత్తి సంబంధాలు మొదట ప్రారంభం కాకూడదా? భూమిని నాగళ్లతో దున్నాలా, ట్రాక్టర్లతో దున్నాలా అనేదా మొదటి విషయం? ఆ జనాలలో ప్రారంభమైన సమిష్టి భావాలు నాగళ్ల దగ్గిరే అక్కడితోనే ఆగిపోతాయా? క్రమంగా ట్రక్కులు ట్రాక్టర్లూ లారీలూ ఏర్పర్చు కోలేరా? కమ్యూన్‌లో వున్న ఆస్తి హక్కు ఎలా మారితే అది సోషలిజం అవుతుందో అది కూడా తెలుసుకుని, దాన్ని చర్చించుకుని, అలా ఆస్తి హక్కుని మార్చుకునే పని తర్వాత చెయ్యలేరా? సమిష్టి ఉత్పత్తి విధానం ప్రారంభించిన ప్రజలు, క్రమంగా మరింత ఉన్నత భావాలు నేర్చుకోవడానికి, మొదటి మార్పు ప్రారంభం కాకూడదా? వారి సిద్ధాంత జ్ఞానం ఇంకా ఎలా పెరగాలో వారికి కమ్యూనిస్టు పార్టీ బోధించడమూ, వారు కూడా స్వంత కృషితో నేర్చుకోవడమూ, జరగవా? సోషలిస్టు ప్రయాణం కమ్యూన్ ఆస్తి దగ్గిరే ఆగిపోతుందా?

కమ్యూన్ సమిష్టితనాన్ని, ఈ రచయిత, 'రైతాంగ సోషలిజం' అనీ, 'పెటీ బూర్జువా సోషలిజం' అనీ, అంటారు. ఆస్తి 'వ్యక్తి ఆస్తి' గానో, 'కుటుంబ ఆస్తి' గానో లేకుండా, వందల, వేల మందికి సమిష్టి ఆస్తిగా వుండి, అందరూ యజమానీ శ్రామిక సంబంధాలు లేని పద్ధతిలో శ్రమలు చేస్తూ వుంటే, దాన్ని సోషలిజంగానే భావించవచ్చు. కమ్యూన్ ఆస్తినే, కౌళ్లకు ఇచ్చే ప్రైవేటు విధానం మొదలైతే, దాన్ని బాగా తప్పు పట్టాలి. తర్వాత జరిగింది అదే.

అసలు, ఆస్తి అనేది, (భూమీ, ఉత్పత్తి సాధనాల మొత్తం) కమ్యూన్ ఆస్తిగా వుందా, ప్రభుత్వ ఆస్తిగా వుందా – అనేది కాదు ప్రధాన సమస్య.

'ప్రభుత్వం' వున్నంత కాలం, ఆస్తి, 'ప్రభుత్వ ఆస్తి'గా వుండవలసిందే. దానికి సందేహం లేదు. వర్గాలు లేని సమాజంలో ప్రభుత్వంతో అవసరమే పోతుందని చెప్పుకుంటాం. ఆ దశకి చేరినప్పుడు, ప్రభుత్వమే పోయినప్పుడు, ఆ దేశం ఎవరి ఆస్తి అవుతుంది? ఏ దేశం, ఆ దేశం ప్రజల ఆస్తే అయితే, అది కూడా ప్రైవేటు ఆస్తే అవదా? దేశాలన్నీ కలిసిపోయి, ప్రపంచం ఆస్తి, ప్రపంచ ప్రజలదే – అని ఊహిస్తాం. కానీ ప్రారంభంలో వున్నది కమ్యూన్ల దశ. అక్కడి ప్రజల శ్రమే, అక్కడి ఆస్తి. ఎవరి శ్రమ, వాళ్ల ఆస్తే. కమ్యూన్ ప్రజల శ్రమ, కమ్యూన్ ఆస్తే. దోపిడీ వల్ల యజమానుల దగ్గిర ఏర్పడే ప్రైవేటు ఆస్తిని తప్పు పట్టినట్టుగా, స్వంత శ్రమతో ఏర్పడే ఆస్తిని తప్పు పట్టనక్కరలేదు. కానీ, సోషలిజానికి అది కూడా ఆటంకమే కాబట్టి అదీ మారుతుంది, మారాలి. ప్రభుత్వ ఆస్తిగా మారగానే అది సోషలిజం కాదు.

కమ్యూన్లన్నీ, ప్రభుత్వ ఆస్తులుగానే వున్నాయనుకుందాం. సోషలిజం కోసం ఆ మార్పు చాలా? భూమిని భూస్వామి నించి విడదీసి, దాన్ని ప్రభుత్వ ఆస్తిగా చేసిన తర్వాత, ఆ భూస్వామినో ఇంకో వ్యక్తినో ఒక డైరెక్టరుగానో, మేనేజర్‌గానో, పెద్ద పదవిలో పెట్టి, పని స్థలంలో సింహాసనం ఎక్కించి, భారీ జీతం ఇస్తూ వుంటే, అది దోపిడీ శ్రమ సంబంధాల స్వభావాన్ని (యజమానీ శ్రామిక సంబంధాల స్వభావాన్ని) మార్చినట్టూ, సమానత్వం వేపు ఒక్క అడుగైనా వేసినట్టూ, అవదు.

సోషలిజం కోసం జరగవలసిన మార్పుల్లో ఆస్తుల లీగల్ హక్కుల మార్పులతో పాటు, 'యజమానీ శ్రామిక సంబంధాల మార్పు' అత్యవసరం. చర్చలన్నీ ఆ దృష్టితో సాగాలి.

'ఉత్పత్తి శక్తుల' సమస్య:

ఈ పుస్తకం, 'ఉత్పత్తి శక్తుల అభివృద్ధే సోషలిజానికి మూలం' అన్నట్టూ, 'ఉత్పత్తి శక్తుల పెరుగుదల, నిరంతరం జరుగుతూనే వుండాలి' అన్నట్టూ, అర్థాలు వచ్చే విధంగా చెపుతుంది.

మార్క్సు ఎంగెల్సులూ, లెనినూ, ఉత్పత్తి శక్తుల అభివృద్ధికి ప్రత్యేక విలువ ఇవ్వలేదని కాదు. అలా వారు ఇచ్చిన కొటేషన్లని ఈ రచయిత చాలా చూపించారు. కానీ, ఆ కొటేషన్లు, ఉత్పత్తి శక్తులు అతి తక్కువగా వున్న కాలంలో గానీ, అవి కొంత పెరుగుతూ వున్న కాలంలో గానీ, ఆ శక్తుల పెరుగుదల కోసం చెప్పిన మాటలు. రష్యాలో కరెంటు అతి తక్కువగా వున్న కాలంలో, లెనిన్, 'కరంటుతోనే సోషలిజం' అన్నాడు. అది కరెంటు పెరుగుదల కోసం చెప్పడమే గానీ, కరంటే సోషలిజాన్ని తెస్తుందని చెప్పడం కాదు.

పనిముట్లు ఎప్పుడూ ఆదిమ కాలంలో వున్నట్టుగా, చేతి పనిముట్లుగానే వుండడం, వాటి అభివృద్ధి కాదు. భూమిని దున్నడానికి నాగళ్లకు బదులు ట్రాక్టర్లనీ, రవాణా కోసం ఎడ్ల బళ్లకు బదులు బస్సుల్నీ, అలా పనిముట్లని అభివృద్ధి చేసుకోగలిగితే, అది ఉత్పత్తి క్రమాల్లో చాలా సౌఖ్యమే. పెరిగిన సాంకేతికతతో ఉత్పత్తి శక్తులు పెరగడం వల్ల, మనుషులు పనిచేసేటప్పుడు శ్రమ కాలం తగ్గడమూ, పనిలో కష్టం తగ్గడమూ, జరుగుతాయి. అంతేగాక, వస్తువు తయారీకి పట్టే శ్రమ కాలం తగ్గి, దాని మారకం విలువ (ధర) తగ్గుతుంది. వస్తువు తయారవడానికి శ్రమ కాలం తగ్గడమే, ఆ శ్రమలో ఉత్పత్తి శక్తి పెరగడం.

అయితే, ఉత్పత్తి శక్తులు పెరగడానికి సోషలిజంలో, ఒక హద్దు వుండాలా, అక్కరలేదా – అనేది ఒక ప్రశ్న. సైన్సుల వల్ల ఉత్పత్తి శక్తులు మరింత మరింత పెరుగుతూ పోయే కొత్త మార్గాలు తెలుస్తూనే వుండవచ్చు. కానీ ఆ పెరుగుదల వల్ల విపరీతమైన ప్రమాదాలు కలిగే పరిస్థితులేర్పడితే, ఆ శక్తుల పెరుగదలని అక్కడితో ఆపివెయ్యవలసి వస్తుంది. అణు విద్యుత్తు ద్వారా ఎక్కువ విద్యుత్తు దొరికినా, అది ప్రకృతినంతా ధ్వంసం చేస్తుంది కాబట్టి, ఆ శక్తిని వాడుకోలేము, ఆపివెయ్యవలసిందే. వెయ్యి అంతస్తుల ఎత్తు ఇళ్లు నిర్మించుకునే ఉత్పత్తి శక్తులు సైన్సు ద్వారా సాధ్యమైనా, ఆ ఎత్తుల్లో నివసించడం ప్రమాదకరమైతే, ఆ ఉత్పత్తి శక్తుల్ని తిరస్కరిస్తాం. 'పెట్టుబడిదారీ విధానంలో ఉత్పత్తి శక్తులు నిరంతరం అభివృద్ధి చెందుతూ వుంటాయి' అని చెప్పిన మార్క్సు, 'వాటిని ఏదో ఒక హద్దు దగ్గిర ఆపెయ్యాలి' అని కూడా చెప్పి వుండకపోతే, 'వాటిని అనంతంగా పెంచివేస్తూ వుండాలి' అని చెప్పినట్టు అర్థం కాదు. ఆ మంచి చెడ్డల్ని తర్వాత వాళ్లు చూసుకోవాలి.

'ఉత్పత్తి శక్తుల అభివృద్ధి వల్ల ఉత్పత్తి సంబంధాల్లో మార్పులు వస్తాయి' అని వివరించడానికి ఈ రచయిత చాలా ప్రయత్నిస్తారు. నాగలితో భూమిని దున్నే రైతుకి వుండే పనిముట్ల తెలివి కన్నా, ట్రాక్టర్‌ని ఉపయోగించే రైతు తెలివీ, విద్యా జ్ఞానం, పెరుగుతాయనేది నిజమే. ఇంటి పనికి పరిమితమైపోతూ వున్న స్త్రీ, విమానం నడిపే శ్రామికురాలిగా మారితే, ఆమె శక్తులూ భావాలూ మారే మాట నిజమే. అలాంటి మార్పులన్నీ నిజమే. కానీ, ఉత్పత్తి శక్తుల పెరుగుదల వల్ల కలిగే ఆ రకం మార్పులు, కేవలం 'రూపంలో మార్పులు'. అవి 'పని విధానం'లో మార్పులు మాత్రమే. అవి, యజమానీ శ్రామిక సంబంధాల స్వభావాన్ని గానీ, శ్రమ దోపిడీని గానీ, తీసివేసే మార్పులు కావు. భూస్వామి దగ్గిర ఎడ్ల బండి తోలే బండి మనిషి అయినా, ప్రభుత్వం దగ్గిర రైళ్లు నడిపే డ్రైవరు అయినా, యజమానుల దగ్గిర వేతన శ్రామికులుగా వుండేవాళ్లే; అదనపు విలువని పోగొట్టుకునే వాళ్లే. సోషలిజంలో, జీతాలతో వుండేవాళ్లు అదనపు విలువని పోగొట్టుకుంటున్నారా లేదా అనేది, ఆ సమాజపు విలువ లెక్కలన్నీ మన ముందు వుంటే గానీ, తెలుసుకోలేం. అక్కడ ఉత్పత్తి సంబంధాల స్వభావం మారిందో లేదో కూడా తెలుసుకోలేము. అక్కడ 'సోషల్ ఫండ్'గా(సమాజ నిధిగా)ప్రభుత్వం చేతుల్లోకి పోయేది ఎలా వాడకం అవుతోందో తెలిస్తేనే, అది సోషలిజమో కాదో తెలుస్తుంది.

పెట్టుబడిదారీ విధానంలో, ఉత్పత్తి శక్తుల పెరుగుదల, లాభాల కోసం పోటీలతో జరుగుతుంది. అది, శ్రామికులకు అనేక అనర్థాలు తెచ్చిపెడుతుంది. సోషలిస్టు సంబంధాల్లో అయితే, ప్రతీ ఉత్పత్తి శక్తీ, ఒక హద్దు దగ్గిర ఆగిపోవలసిందే. మనుషుల ఆరోగ్యాల్నీ, ప్రకృతి సహజత్వాల్నీ, స్త్రీ పురుష సంబంధాల సహజత్వాల్నీ ధ్వంసం చేసే, వికృతం చేసే ఉత్పత్తి శక్తులు సైన్సుల ద్వారా సాధ్యమైనా, వాటిని తిరస్కరించాలే గానీ వాడుకోనక్కర లేదు. సైన్సు ద్వారా క్లోనింగ్ పేరుతో, తల్లిదండ్రులు లేకుండా బిడ్డల్ని సృజించే నీచత్వం సాధ్యం కావచ్చు. ఒక పురుషుడి నించీ, ఇద్దరు స్త్రీల నించీ, రక రకాల పదార్థాలు కలిపి బిడ్డల్ని పుట్టించే మరో నీచత్వం సాధ్యం కావచ్చు. వస్తువుల తయారీకీ, కల్తీలకీ, ఎన్ని నీచత్వాలైనా సాధ్యం అవుతాయి. 'ఉత్పత్తి శక్తుల్ని పెంచుకోవాలి' అనే దృష్టితో పాటు, 'వాటిని ప్రమాదకరమైన స్థాయికి పెంచకూడదు; వికృత స్థాయిలో వాడకూడదు' అనే దృష్టి కూడా సోషలిజంలో వుండాలి.

ఈ రచయిత, 'ఉత్పత్తి సంబంధాలు, అంటే ఆస్తి సంబంధాలు, ఉత్పత్తి శక్తుల పెరుగుదలకు ఆటంకమవుతాయి' అంటారు(పే. 390).

ఈ వాక్యంలో, ఉత్పత్తి సంబంధాల్ని, 'ఆస్తి సంబంధాలుగా' చెప్పడం పొరపాటు. 'ఆస్తి సంబంధాలు' అనేవి, ఉత్పత్తి సాధనాలకు (భూమికీ, ఇతర సాధనాలకూ) సంబంధించినవి. 'ఉత్పత్తి సంబంధాలు' అనేవి, ఉత్పత్తి తయారయ్యే, శ్రమలు జరిగే క్రమాల్లో, యజమానీ శ్రామికుల మధ్యా, శ్రామికులకూ శ్రామికు లకూ మధ్యా, వుండేవి. సమాజానికి ఉత్పత్తి శక్తుల పెరుగుదల ఎప్పుడూ కావాలా? అసలు ప్రధాన విషయం అదా? – ఇలాంటి ప్రశ్నలు కొన్ని వున్నాయి. ఉత్పత్తి శక్తుల విషయాలు చర్చించేటప్పుడు,

అతి జాగ్రత్తలు గల సోషలిస్టు దృష్టి కావాలి. ఈ విషయంలో లెనిన్ స్టాలిన్లు ఈ జాగ్రత్తలు చెప్పలేదు కాబట్టి, ఈ రచయిత పుస్తకం కూడా దాన్ని చెప్పలేదు. ఉత్పత్తి శక్తుల అభివృద్ధి వల్లే సోషలిజం అభివృద్ధి అవుతుందనే అర్థాన్నే ఈ పుస్తకం ప్రధానంగా ఇచ్చింది.

చైనాలో, మావో, ఉత్పత్తి శక్తుల అభివృద్ధి మీదా, భారీ యంత్రాల మీదా, దృష్టి పెట్టలేదని, మావో మీద ఈ రచయితకి బాగా విమర్శ. అదే కాదు, మావో మీద విమర్శలు చాలా వున్నాయి. కానీ, సాంస్కృతిక విప్లవం, మావో గ్రూపు శక్తిని పెంచుకోవడానికి ప్రారంభించిన ఉద్యమమే అని, ఈ పుస్తకం చెబుతున్నట్టే అను కున్నా, ఆ విప్లవ కాలంలో జరిగిన మేనేజిమెంటులో శ్రామికుల పాత్రా, మేధా శ్రమల వారు కూడా శారీరక శ్రమలు చెయ్యాలనే మార్పూ, మార్క్సిజానికి అనుగుణమైన అత్యద్భుత విషయాలే. అయినా, ఆ మంచి ప్రయత్నాల్ని ఈ పుస్తకం గుర్తించలేదు. అంతే కాదు, వైరుధ్యాల్ని, శత్రు వైరుధ్యాలూ, మిత్ర వైరుధ్యాలూ–అనే తేడాతో చూడాలని మావో ఇచ్చిన అవగాహన, చాలా సరియైనదే. సంబంధాల్ని సరిగా అర్థం చేసుకోవడానికి అది ఉపయోగపడు తుంది. మావో వల్ల ఇలాంటి మంచి వివరణ దొరికితే, దీన్ని కూడా ఈ పుస్తకం గుర్తించలేదు. పైగా వ్యతిరేకించింది.

ముక్కుల మీద వేళ్లేసుకునేలా చేసే సోషలిజం:

మావో చేసిన ప్రతీ పనినీ, ఆ నాయకుడు తన అధికారాన్ని నిలబెట్టుకోవడానికి ఎత్తిన ఎత్తుగడగానే చూస్తుంది ఈ పుస్తకం. కానీ, స్టాలిన్ విషయాల్ని అయితే అలా చూడదు.

ఏ మార్క్సిస్టు నాయకుడైనా, తన మరణం దాకా 33 ఏళ్ల పాటు పదవి కుర్చీకి అతుక్కుపోయాడంటే, ఆ నాయకుడి మీద నమ్మకం సడలిపోవడం ఏం కష్టం? ఆ పార్టీలో ఇంకెవ్వరూ, పదేళ్ల తర్వాతైనా, ఆ కుర్చీని ఎక్కలేనంత ఎత్తుగా వుంటుందా ఆ కుర్చీ? కుర్చీ మీద వాడు మరణిస్తే తప్ప ఆ కుర్చీని తాకగలిగే రెండో సమర్థుడు ఆ పార్టీలో లేడంటే, ఇక అలాంటి డబ్బా పార్టీ వల్ల, రెండో సమర్థుడు లేని పార్టీ వల్ల, జనాలకు ఏం ప్రయోజనం? ఈ రకంగా చూస్తే, రష్యా చైనా పార్టీలు రెండూ డబ్బా పార్టీలే. రెండో వాణ్ణి ఎదగనివ్వని పార్టీలే. ఎంతో పెద్ద తప్పిదం అయిన ఆ కుర్చీ వ్యసనం గురించి మాత్రం ఈ రచయిత మావోని పన్నెత్తు మాట అనలేదు. ఎందుకంటే, స్టాలిన్ ప్రభువు చదివింది కూడా అదే బళ్లో కదా? 'కుర్చీల మాట ఎందుకులే' అనుకున్నట్టున్నారు రచయిత.

ఇతర చాలా విషయాల గురించి మావోని 'కుహనా మార్క్సిస్టు' అనీ, 'గారడీ మావో' అనీ, 'మావో ఆలోచన, పెడ ధోరణి' అనీ, అలా చాలా వర్ణనలు ఈ పుస్తకంలో వున్నాయి. ప్రైవేటు పెట్టుబడిదారీ విధానాన్ని మరింతగా నిర్మించాలని కంకణాలు కట్టుకున్న టిటో, కృశ్చేవ్, టెంగుల్ని ఎప్పుడు గుర్తించాలో అప్పుడు గుర్తించలేనట్టు మావో కూడా వాళ్లతో మొదట్లో జట్టు కట్టిన ఘట్టాలు వున్నట్టు ఈ రచయిత చూపించారు. కానీ, చైనా పార్టీ పుస్తకాలు చూస్తే, చైనా పార్టీ, ఆ ముగ్గురితో, మొదట్లో కూడా అలాంటి సమర్థనలతో లేదని తేలుతుంది. ఒక వేళ, అలాంటి సంఘటనలు వున్నా, అది మొత్తం పార్టీ తప్పు అవుతుంది. ఏ నాయకుణ్ణి ఒంటరిగా నిందించడానికి అవకాశం ఉండదు. మావో బృందం, అనేక సార్లు మైనారిటీలో వుంది. అది, మెజారిటీ ప్రకారం నడవాల్సిన అవసరం వుంటుంది. వ్యక్తి పూజ లాంటి తప్పులైతే, ఆ వ్యక్తి తప్పే అవుతుంది గానీ, మిగతా విషయాలకు, పార్టీ పత్రాలన్నీ వుంటే తప్ప, అందులో నాయకుడి తప్పుని నిర్ధారించలేము.

ఎడ్గార్ స్నో చేసిన ఇంటర్వ్యూలో మావో, 'అనేక పార్టీలు వుండడం మంచిదని ఇప్పుడు మాకు అనిపిస్తోంది' అన్నాడట (పే. 207). 'అనేక పార్టీలు' వుండాలా, 'ఒకే పార్టీ' వుండాలా? – అనే ప్రశ్న ఏ కాలంలో వచ్చిందో వివరాలు లేకపోతే దాన్ని చర్చించలేము.

కమ్యూనిస్టు పార్టీలో, 'గ్రూపుల్ని వుండనివ్వాలన్నది' ట్రాట్స్కీ వాదం అనీ, అటువంటి వాదాలకు వ్యతిరేకంగా స్టాలిన్ గట్టిగా వున్నాడనీ – ఆ రకం విషయాలు చదివినప్పుడు, మార్క్సిస్టులకు స్టాలిన్ నచ్చుతాడు. సంఘాల్లో గానీ, బైట గానీ, ఏదైనా విషయం మీద చర్చించేటప్పుడు, ఆ చర్చించే వాళ్ల భావాలు మొదట్లో వేరు వేరుగానే వుంటాయి. చర్చలో చివరికి సరైన ముగింపు దొరికితే అందరూ ఏకం అవుతారు. లేదా, అది సంఘం అయితే, మెజారిటీ ప్రకారం నడుస్తారు. ఒకే సంఘంలో వేరు వేరు గ్రూపులూ, దేని హక్కులు దానికీ వుంటే, ఆ సంఘం పది సంఘాలకింద లెక్క. అప్పుడా సంఘం ఏ రకంగా పనిచేస్తుంది? ఆ రకం విభేదాల మీద స్టాలిన్ గట్టితనం నిజం అయితే, అది చాలా హేతుబద్ధమైన తర్కమే. కానీ, ఇంకా ఇతర పుస్తకాల ద్వారా కూడా సరైన సమాచారం తెలుసుకోవాలి. స్టాలిన్ భజన పుస్తకాన్నో, మావో భజన పుస్తకాన్నో, అలా ఒక్కొక్కదాన్నే నమ్మితే, నిజాలు దొరకవు – అని సంకోచించాలి. ఆ సంకోచం, చాలా మంచిది.

కమ్యూనిస్టు పార్టీలో బూర్జువా కుట్రలతో నేరాలు చేసే వాళ్లని వెంటనే చంపెయ్యాలని, లేదా ఆలస్యంగా అయినా చంపెయ్యాలని, కమ్యూనిస్టు సిద్ధాంతం చెప్పదు. శ్రామిక జనం, తమ విప్లవ చైతన్యంతో దోపిడీ కుట్రల్ని ఓడించాలనే అది చెపుతుంది. ఆ 'ఓడించడం' ఎలాగో, ఆ కుట్రల్ని బట్టి వుంటుందని కూడా చెపుతుంది.

ఈ రచయిత, 'చైనా సోషలిస్టు ఆర్థిక వ్యవస్థలో కేపిట లిస్టులు' అనే సబ్ టైటిల్ కింద (168 నించీ కొన్ని పేజీల వరకూ) చైనాలో బడా బూర్జువాలతో, జాతీయ బూర్జువాలతో, ఎలాంటి రాజీలు జరిగాయో చాలా వివరాలు ఇచ్చారు. మచ్చుకి ఒకటి రెండు మాత్రమే ఇక్కడ చూడగలం.

'భారీ పరిశ్రమలలో, రైల్వే, సముద్ర రవాణాలో పరిశ్రమలను ప్రభుత్వం నష్ట పరిహారాలు ఇచ్చి స్వాధీనం చేసుకుంది. పరిశ్రమల పాత యజమానులను చాలా ఎక్కువ వేతనాల మీద డైరెక్టర్లుగా నియమించింది' (పే. 170).

కేపిటలిస్టులు తమ పరిశ్రమల్ని అమ్మగా వచ్చిన డబ్బుని చైనా బ్యాంకులో పెట్టి, దాని మీద వడ్డీలు కూడా తీసుకోవడం! ఇది సోషలిజంలో జరిగిందే! పెట్టుబడిదారుల పెట్టుబడులు ఎటూ పోలేదు. వాళ్లకే వున్నాయి భద్రంగా! కానీ, సాంస్కృతిక విప్లవ కాలంలో, పెట్టుబడిదారుల బ్యాంక్ ఎకౌంట్లని ప్రభుత్వ ఖజానాలో కలిపేసినట్టు, వేరే పుస్తకాల్లో చదివాం. అది మళ్లీ టెంగు కాలంలో, పెట్టుబడిదారులకే తిరిగి అందిందని కూడా చదివాం. ఈ విషయాలేవీ, ఈ పుస్తకంలో ఇవ్వలేదు.

'భూ సంస్కరణల చట్టం కింద రైతులకు భూమి పంపకం జరిగినప్పుడు, భూమి విలువలో 5 శాతం ప్రతి సంవత్సరం భూస్వాములకు నష్ట పరిహారంగా చెల్లించబడింది' (పే. 172).

ఎన్ని సంవత్సరాల దాకా అలా చెల్లించారు? సాంస్కృతిక విప్లవ కాలంలో, ఈ చెల్లింపులు కూడా ఆపారా? – ఈ వివరాలేవీ ఇక్కడ లేవు.

భూముల్నీ, పరిశ్రమల్నీ, డబ్బు ఇచ్చి కొనడం ద్వారా స్వాధీనం చేసుకోవలసి వచ్చిందంటే, అది శ్రామిక వర్గ విప్లవమా! దోపిడీ దారుల చేతుల్లోకి భద్రంగా చేరిన డబ్బు, తర్వాత ఏమవుతుంది? పెట్టుబడులుగా మారడానికి ఎదురుచూస్తూ వుండదా? లేకపోతే ఆ డబ్బుతో వాళ్లు ఏం చేస్తారు? ప్రజలకు సిద్ధాంతం తెలియకపోవడం వల్లే కదా, నష్ట పరిహారాలు ఇవ్వడం మీద ప్రశ్నించలేకపోవడం?

(ఇంకా ఉంది)

(రచయిత బహు గ్రంథకర్త, మార్క్స్ 'పెట్టుబడి' పరిచయకర్త) వీ

(...4వ పేజీ తరువాయి)
పెత్తనం. మా చరిత్రను, మా జీవన శైలిని అపహాస్యం చేసిన, మా అమాయకత్వాన్ని ఆట పట్టించిన ముష్కరుల చెర నుండి విముక్తం కావడమే!

విప్లవకారుల దాకా ఎందుకు, ఒక సామాన్య తెలంగాణవాదిగా మీకు విజ్ఞప్తి చేస్తున్నాను నరేంద్రమోహన్ గారూ! ఆ 'ఉన్నతమైన పరిష్కారం' ఎలా ఉంటే బాగుంటుందో మీరే సెలవియ్యండి. నా ఉద్దేశ్యంలో ఉన్నత పరిష్కారం అంటే ఇప్పటికయినా సీమాంధ్రులు తమకంటూ ఓ సొంత రాజధానిని నిర్మించుకోవడం. ఇరవై నాలుగు గంటల్లో మద్రాసు ఖాళీ చెయ్యండని అప్పుడు రాజాజీ తాఖీదు ఇచ్చాడు. అంత తీవ్రంగా కాకపోయినా కెసిఆర్ అదే అన్నాడు. మీరింకా పట్టుకు వేళ్లాడుతాం, బమ్మిని తిమ్మిని చేస్తాం అంటే, రేపు దానం నాగేందరో, ముకేష్ గౌడో లేదా వారి వారసులో అదే అంటారు. భూములు ఆక్రమించుకోవడానికి, నీళ్ల దొంగిలించడానికి ఎప్పుడూ తెలంగాణయో, తమిళ ప్రాంతమో కావాలంటే ఎట్లా? మీరు ఆత్మగౌరవంతో ఇతరుల మీద ఆధారపడకుండా బతకలేరా? ఈ ప్రశ్న వేసుకోవాల్సిన సమయం సీమాంధ్రులకు ఆసన్నమయింది.

– ఎ. రాజేంద్ర బాబు,
అమెరికా నుంచి ఇ-మెయిల్

(పాఠకుల వీక్షణంలో అచ్చయిన ఉత్తరాలకు వెంటనే జవాబు అచ్చువేసే సంప్రదాయం మామూలుగా లేదు. కాని నరేంద్రమోహన్ వీక్షణం బ్లాగ్ మీద రాసిన ఉత్తరానికి రచయిత ఎ. రాజేంద్రబాబు బ్లాగ్ మీదనే వెంటనే స్పందించారు. కనుక రెండు లేఖలు ఒకేసారి వేస్తున్నాం. – సం.)

ఆగస్ట్ వీక్షణం చదివాను. స్నోడెన్ ప్రపంచానికి చేసిన విజ్ఞప్తిపై తెలుగు సమాజం తప్పక స్పందించాలి. గతంలో లాగ అంతర్జాతీయ విషయాలపై స్పందించడం నేడు చాలా తగ్గిపోయింది. స్నోడెన్ సాహసాన్ని మెచ్చుకోవాలి. స్నోడెన్‌ను స్ఫూర్తిగా తీసుకొని ఆంధ్రప్రదేశ్ స్పెషల్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఎపిఎస్ఐబి) అప్రజాస్వామిక, అమానుష చర్యలని బయటపెడతారని తెలుగు సమాజం నుండి ఆశించడం అత్యాశ కాదేమో. ఇక వెనిజులా, నికరాగువా, ఈక్వెడార్ లాంటి చిన్న దేశాలు అమెరికా బెదిరింపులకు భయపడకుండా సాహసంగా స్నోడెన్‌కు ఆశ్రయం ఇవ్వడానికి సిద్ధపడి తమ ప్రజాస్వామిక పిపాసను చాటుకుంటే, భారత పాలక వర్గాలు మాత్రం తన బానిస బుద్ధిని ప్రదర్శించుకోవడం సిగ్గుచేటు. మూడు ప్రపంచాల సిద్ధాంతం గురించి గత రెండు సంచికల్లో సత్యనారాయణ, నరేంద్ర మోహన్, లంక పాపిరెడ్డిల అభిప్రాయాలను చదివాను. పాపిరెడ్డి అన్నట్లు ఈ విషయంపై గతంలోనే పెద్ద చర్చ జరిగి ఉన్నది. ప్రపంచంలో ఏదో ఒక దేశంలోనైనా సోషలిస్ట్ బేస్ లేకుండా, లేదా బలమైన అంతర్జాతీయ కమ్యూనిస్ట్ ఉద్యమం లేకుండా ఐక్య సంఘటన ఎత్తుగడల్ని సరిగ్గా ఉపయోగించుకోలేమని ప్రపంచ అనుభవం చెపుతోంది. అలాంటివి ఏమీలేని నేటి పరిస్థితుల్లో మూడు ప్రపంచాల సిద్ధాంతం గురించి మళ్లీ చర్చించడం సమయం వృథా చేసుకోవడం తప్ప మరేమీ కాదు. ఈ విషయంలో సత్యనారాయణ అభిప్రాయాలను చూస్తే చైనా పట్ల చాలా భ్రమలు, తప్పుడు అంచనాలు ఉన్నట్లు అర్థమవుతోంది. ఇంతకంటే అవసరమైన విషయాలపై చర్చ కొనసాగించడం ఉపయోగకరమేమో.

– నటాషా
(వీక్షణం బ్లాగ్ www.veekshanam.wordpress.com పై పోస్ట్ చేసిన వ్యాఖ్య)

వీక్షణం జూలై సంచికలో వచ్చిన నా ఉత్తరం మీద జె ఆర్ నాగభూషణం, వి వెంకట్రావు, పి వర్మ గార్ల ప్రతిస్పందనలు (ఆగస్ట్ సంచిక) చూశాను. చంద్రుడ్ని చూపిస్తుంటే మూర్ఖుడు చూపించే వేలును చూస్తాడు అని ఏదో దేశపు సామెత ఉన్నదని విన్నాను. ఈ ముగ్గురి తంతూ సరిగ్గా అట్లాగే ఉన్నది. వారు నా ఉత్తరంలో లేవనెత్తిన అంశాల మీద చర్చ చేయకుండా నన్ను ఎన్నో మాటలు అన్నారు. తమ అభిమాన రచయిత్రి మీద తమకు ఎంత మూఢాభిమానం ఉన్నదో తెలుపుకున్నారు. నా ఉత్తరంలో ఏమి రాశానో మరొకసారి వారి కోసం చెప్తాను. అలాగే వారి ఉత్తరాలలో ఉన్న పొరపాట్ల గురించి కూడ చెప్తాను. విలువైన వీక్షణం పేజీలు ఇలా వృథా అవుతున్నందుకు క్షమించండి. నా ఉత్తరంలో మొట్టమొదటనే నేను పూర్తికాని వ్యాసం మీద స్పందించడం సరైన పని కాదని అన్నాను. రంగనాయకమ్మ గారి వ్యాసం మొదటి భాగంలోనే మార్క్స్ మీద చేసిన వ్యంగ్య వ్యాఖ్యలను చూపినాను. లోకసంచారి గారి మీద ఆమె వ్యాఖ్యల మధ్య కన్సిస్టెన్సీ లేదని నా విమర్శ రాసినాను. మొత్తంగా రంగనాయకమ్మగారి రచనా పద్ధతి మీద ఒక విమర్శ రాసినాను. నన్ను ఖండించిన ముగ్గురు మిత్రులూ నేను రాసిన ఈ మూడు విషయాల మీద స్పందించి ఉంటే బాగుండేది. కాని వారు మరొకదారిలో వచ్చినారు. నాకేదో 'తీవ్రమైన వ్యతిరేకతను, విద్వేషాన్ని' అంటగట్టినారు. ఎవరయినా నా ఉత్తరాన్ని మళ్లొకసారి చదివి తేల్చుకోవచ్చును. నాగభూషణం గారు ఆమె రాయని విషయాలు నేను రాశానని అన్నారు. 'ఇలాంటి మాటలు రాసి పాఠకుల్లో ఆమె పట్ల దురభిప్రాయం పెంచడమే ఉద్దేశ్యమే అయితే అది ఫలించదు. ఎందుకంటే రంగనాయకమ్మ గురించి తెలిసినవారు ఎలాగా నమ్మరు. మిగతావారు తెలుసుకున్న తరువాత ఇలాంటి రాతల్ని ఇక మీదట నమ్మగూడదనుకుంటారు' అని నా మీద శాపనార్థాలు పెట్టినారు. పాపం ఆయన రంగనాయకమ్మ గారు రాసినవి చదివినట్టు లేరు. కాపిటల్ పరిచయం రెండో భాగం పే. 448, 509 ఒక్కసారి తెరిచి చూడండి, మార్క్స్ గడ్డం మీద కోపం సంగతీ, చేపలు తినడం తప్పన్న సంగతీ కనబడుతుంది. ఇక వి. వెంకట్రావు గారు మరీనూ, రంగనాయకమ్మ గారు 'ఏమిటి మార్క్స్? ఏమిటిది మరీనూ' అంటే హాస్యం అట. 'ఆమె నోట్లో ఎవరు నోరు పెడతారు అని అందరూ చెప్పుకునే మాట' అంటే తప్పట. నూటయాభై ఏళ్లుగా ఏ బూర్జువా ఆర్థికవేత్తకీ తట్టని గొప్ప వాదన, మార్క్సిస్టులెవరూ జవాబు చెప్పలేని పొరపాటు మార్క్స్ రచనలో ఉందని రంగనాయకమ్మగారికి తట్టిందట. ఆ తర్వాత పి. వర్మ గారి భగవదారాధన, నాస్తిక ఖండన గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. పనిలో పనిగా ఆయన 'వామపక్షాలుగా పిలవబడే పార్టీలకు సంబంధించిన ప్రచురణ సంస్థలూ, ఆ పార్టీల తాలూకు రచయితలూ' చేయని పని రంగనాయకమ్మ గారు చేస్తున్నట్టు, రంగనాయకమ్మ గారే తీవ్రంగా విమర్శించే వ్యక్తిపూజకు కూడ సిద్ధపడ్డారు. ఆమె ఎంతమంది ప్రజా రచయితల మీద, ప్రజా ఉద్యమ నాయకుల మీద అనవసరమైన దాడులు చేసి, అంత పెద్దవారి మీదనే అలా విరుచుకుపడింది, ఇక మనం ఎంత అని అందరూ అనుకునేట్టు చేసిందని నేనంటే వర్మ గారికి మాత్రం అవి 'తప్పుడు వాదాల్ని సైద్ధాంతికంగా అత్యంత ప్రతిభావంతంగా ఖండించి'నవిగా కనబడ్డాయి. మనకు నచ్చినవారు ఏది చేసినా ఒప్పే, నచ్చని వారు ఏది చేసినా తప్పే అనే సూత్రం పెట్టుకున్నవారితో చర్చ చేయడం వృథా ప్రయాస.

– ఎస్ జనార్దన్,
మెదక్

వీక్షణం ఆగస్టు సంచికలో వచ్చిన 'విలువలు లోపిస్తున్న జర్నలిజం' వ్యాసాన్ని అందించిన ఎం.ఆదిశేషయ్యకు నా ధన్యవాదాలు. వ్యాసం చిన్నదే అయినప్పటికీ ఈ వ్యాసంలో చాలా విలువైన మాటను వాడారు. 'నేడు మీడియా ఓ దళారీ పాత్రను పోషిస్తున్నది' అన్నారు. ఇది ఎంత నిజమో గ్రామ స్థాయిలో నివసించే మాబోటి వారికి బాగా తెలుస్తోంది. పత్రికేయుల్లో విలువలు లోపించినాయంటే ఆశ్చర్యపడాల్సిందేమీ లేదు. అలాగే పి. మంగరాజు రాసిన 'ఒక ఆదివాసి ఖైదీ కథ' కూడ చాలా ముఖ్యమైంది. ఎందుకంటే ఇలాంటి నిజాలు ప్రజలకు చేరడం లేదు. ప్రజలకు తెలియవలసిన ఘటనల్ని తొక్కిపెట్టి ఈ ప్రభుత్వాలు అబద్ధాలడుతూ కాలం గడుపుతున్నాయి. మహాకవి శ్రీశ్రీ అన్నట్లు ' నిరపరాధులై చెరసాలల్లో చిక్కేవాళ్లు' ఎంత దూరదృష్టితో ఈ మాటలు రాశాడో గాని ఈనాడు మన కళ్లతో చూస్తున్నాం. మన అనాథలంతా అశాంతులంతా లేచినిలబడి నినదిస్తారనే రోజులొచ్చేసినయి గనుక సందర్భోచితంగా ఈ వ్యాసం కథారూపంగా రావడం సంతోషం. ఇలాంటివి ఇంకా రావాల్సిన అవసరం ఎంతో ఉంది. చరిత్ర గమనం రాజకీయార్థిక పరిచయంతో కొత్తగా శీర్షిక పెట్టి మంచి పనిచేశారు. చాలా అవసరమైంది కూడా.

– కడియాల సుబ్బనాచారి, దుత్తలూరు, నెల్లూరు

ఆగస్టు వీక్షణం సంచికలో 'చెరిపెయ్యలేని గంటి ప్రసాదం ముద్ర' వ్యాసం గంటి ప్రసాదం 45 సంవత్సరాల కన్న ఎక్కువ ప్రజా ఉద్యమాల్లో ఎంతో నిబద్ధతతో, నిస్వార్థంతో ప్రాణాల్ని సైతం లెక్క పెట్టకుండా నిర్విరామంగా బడుగు ప్రజల విముక్తి కోసం చేసిన కృషిని కళ్లకు కట్టింది. ఆయన హత్య నిస్సందేహంగా రాజ్యహింసకూ, క్రూరత్వానికి ఉదాహరణ. స్ఫూర్తి దాయకమైన మానవ సంబంధాలు, బలమైన ప్రజా ఉద్యమాలంటే ఇలాగే ఉండాలనే వారసత్వాన్ని ప్రసాదం వదిలి పోయారు. ఆయన హత్య అత్యంత్య దురదృష్టకర సంఘటన.

ఇదే సంచికలో 'విలువలు లోపిస్తున్న జర్నలిజం' వ్యాసం నేటి పత్రికా యాజమాన్యాల ద్వంద్వ వైఖరిని ఎండగట్టింది. ఒక వైపు సమాజానికి నీతిని భోదిస్తూ, వారి సంస్థల్లో పని చేసే వారికి న్యాయబద్ధంగా వేతనాలు ఇవ్వకపోవడం వారి దుర్నీతిని చెప్పకనే చెపుతుంది. ఈ మధ్య కాలంలో వస్తున్న పెయిడ్ ఆర్టికల్స్ చూస్తే ప్రజాకవి కాళోజీ పత్రికా రచయితను గురించి అన్న మాటలు గుర్తుకొస్తాయి.

'ఆ రోజుల్లో ఖాసా, సురవరం లాంటి జర్నలిస్టులు ప్రజల పక్షాన వాచ్ డాగ్స్‌గా పని చేస్తే, ఈనాటి కొంత మంది జర్నలిస్టులు సర్కారోళ్ల పెట్ డాగ్స్ అయ్యారు. మరికొందరైతే లాప్ డాగ్స్ కూడా'.

– పి. నారాయణరెడ్డి, అధ్యాపకులు, నాగార్జునసాగర్

తెలంగాణ రాష్ట్రానికి ఆమోదం

హైదరాబాద్ రాజధానిగా పది జిల్లాలతో కూడిన ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును ఆమోదిస్తూ యు.పి.ఎ. సమన్వయ కమిటీ, కాంగ్రెస్ వర్కింగ్ కమిటి జూలై 30న తీర్మానాలు చేసి కేంద్రానికి పంపాయి. దీంతో దేశంలో 29వ రాష్ట్రంగా తెలంగాణ ఆవిర్భవించనుంది. రెండు రాష్ట్రాలకు పదేళ్లపాటు హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా ఉంటుందన్నారు. పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇచ్చారు.

ఎన్‌కౌంటర్ తీర్పుల్లో న్యాయం?

ఢిల్లీలో జరిగిన ఎన్‌కౌంటర్ కేసులో ఇండియన్ ముజాహిద్దీన్ సంస్థ మిలిటెంట్‌గా భావిస్తూ షహజాద్ అహ్మద్ (25) కు ఢిల్లీ కోర్టు జీవిత ఖైదు, రు. 95,000 జరిమానా విధించింది. 2008 సెప్టెంబర్ 18న ఢిల్లీలోని జామియానగర్‌లో జరిగిన కాల్పుల్లో ఇన్‌స్పెక్టర్ శర్మ మరణానికి కారకుడనే కారణంతో కోర్టు షహజాద్‌కు జీవిత ఖైదు విధించింది.

కొత్త రాష్ట్రాల డిమాండ్

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు యుపిఎ సమన్వయ కమిటీ, సిడబ్ల్యుసి అంగీకరించడంతో దేశ వ్యాప్తంగా కొత్త రాష్ట్రాల డిమాండ్‌లు మొదలయ్యాయి. మహారాష్ట్రలోని విదర్భ, పశ్చిమబెంగాల్‌లోని గుర్ఖాలాండ్, అస్సాంలోని బోడోలాండ్, ఉత్తరప్రదేశ్‌లోని హరిత్‌ప్రదేశ్, ఉత్తరప్రదేశ్ మధ్యప్రదేశ్‌లలో ఉన్న బుందేల్‌ఖండ్‌లను ప్రత్యేక రాష్ట్రాలు ఏర్పాటు చేయాలని ఉద్యమాలు కొనసాగుతున్నాయి. గూర్ఖా జనముక్తి మోర్చా (జిజెఎం) బోడోలాండ్ పీపుల్స్ ఫ్రంట్ (బిపిఎఫ్) రాష్ట్రీయ లోక్‌దల్ (ఆర్‌ఎల్‌డి) ప్రత్యేక రాష్ట్రాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నాయి.

ఆర్‌టిఐ నుంచి పార్టీలకు మినహాయింపు

సమాచార హక్కు చట్టం పరిధిలోకి రాజకీయ పార్టీలు రాకుండా సెక్షన్ 2లోని 'పబ్లిక్ అథారిటీస్'ను సవరించే ప్రతిపాదనకు ప్రధాని అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రి మండలి ఆగస్టు 1న ఆమోదం తెలిపింది. దేశంలోని ఆరు జాతీయ పార్టీలు కాంగ్రెస్, బిజెపి, బిఎస్‌పి, సిపిఎం, సిపిఐ, ఎన్‌సిపిలు ప్రభుత్వరంగ సంస్థల కిందకే వస్తాయని, సమాచార హక్కుచట్టం కింద అవి ప్రజలకు జవాబుదారీగా ఉండాలని ఆర్‌టిఐ ప్రకటించిన నిర్ణయం రద్దయింది.

ఎఫ్‌డిఐలకు కేంద్రం ఆమోదం

విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆహ్వానిస్తూ కేంద్ర కేబినెట్ ఆగస్టు 1న ఆమోదం తెలిపింది. ప్రధాని మన్మోహన్ సింగ్ అధ్యక్షతన జూలై 16న జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో 12 రంగాల్లో ఎఫ్‌డిఐ నిబంధనలు సడలిస్తూ నిర్ణయం తీసుకున్నారు. బీమా, రక్షణ రంగాల్లో ఎఫ్‌డిఐ పరిమితిని మరింత పెంచడంతో పాటు టెలికాం రంగంలో నూరు శాతం ఎఫ్‌డిఐలకి అనుమతించారు.

ఐదుగురు జవాన్ల కాల్చివేత

కశ్మీర్‌లోని పూంచ్ సెక్టార్ వద్దగల నియంత్రణ రేఖలోకి ఆగస్టు 5న పాకిస్తాన్ సైనికులు కాల్పులు జరపడంతో భారత్‌కు చెందిన ఐదుగురు సైనికులు చనిపోగా, ఒకరు గాయపడ్డారు. భారత భూభాగంలోకి 450 మీటర్ల మేర చొచ్చుకువచ్చి ఈ దాడికి పాల్పడినట్లు జమ్ము రక్షణశాఖ ప్రతినిధి ఎస్ ఎన్ ఆచార్య ఒక ప్రకటనలో తెలిపారు.

దుర్గాశక్తి సస్పెన్షన్ రాజ్యాంగ విరుద్ధం

ఉత్తర ప్రదేశ్ ఐఎఎస్ అధికారిణి దుర్గాశక్తి నాగ్‌పాల్ సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని వేసిన పిటిషన్ ఆగస్టు 6న సుప్రీం కోర్టు ముందుకు వచ్చింది. ఇసుక మాఫియాను అడ్డుకున్నందుకు ఆమెను యుపి ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఈ చర్య అనాగరికం, రాజ్యాంగ విరుద్ధమని ఆమెపై విధించిన సస్పెన్షన్ చార్జిషీటును వెనక్కి తీసుకోవాలని పిటిషనర్ సుప్రీం కోర్టును కోరారు.

జలాంతర్గామి ప్రమాదంలో 18 మంది మృతి

భారత నౌకదళ ఐఎన్‌ఎస్ సింధురక్షక్ జలంతార్గామిలో ఆగస్టు 13 రాత్రి భారిపేలుడు జరిగింది. దీంతో నౌక నీట మునిగి అందులోని 18 మంది సిబ్బంది మృతి చెందారు. ముంబైలోని కాలాబా ఎరియాలోని ఈ డాక్ యార్డ్‌లో ఈ ప్రమాదం జరిగింది. సింధు రక్షక్ ముందు భాగంలో మంటలు అంటుకున్నట్లు నేవీ అధికారులు తెలిపారు. మంటలు ఇందులోని జెనరేటర్లకు, ఎలక్ట్రిక్ బ్యాటరీలకు వ్యాపించడంతో భారీ పేలుడు సంభవించిందన్నారు.

హేతువాది దభోల్కర్ హత్య

'అంధ శ్రద్ధ నిర్మూలన సమితి' వ్యవస్థాపకుడు హేతువాది నరేంద్ర దభోల్కర్‌ను ఆగస్టు 20న హత్యచేశారు. మూఢ విశ్వాసాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్న దభోల్కర్‌ను హత్యచేయడం వెనుక ఫాసిస్టు మతశక్తుల హస్తం ఉందని అనుమానిస్తున్నారు. దభోల్కర్ బాణామతి వంటి మూఢ విశ్వాసాలకు వ్యతిరేకంగా మహారాష్ట్ర ప్రభుత్వాన్ని చట్టం చేయవలసిందిగా డిమాండ్ చేస్తూ ఉద్యమించారు. 1983 నుంచే ఆయన మూఢ విశ్వాసాలకు వ్యతిరేకంగా ఉద్యమం నడుపుతున్నారు. గత 30 సంవత్సరాలుగా ఎంతో మంది బాబాల గుట్టు బయటపెట్టారు.

త్రివేండ్రంలో అమెరికా బేస్ క్యాంప్!

అమెరికా ఎయిర్‌ఫోర్స్ వర్గాలు కేరళ రాజధాని తిరువనంతపురాన్ని తమ ఎయిర్‌క్రాఫ్ట్ బేస్ క్యాంపుగా వినియోగిస్తున్నట్లు అమెరికా ఎయిర్‌ఫోర్స్ పసిఫిక్ కమాండర్ హెర్బర్ట్ కార్లయిల్ ప్రకటించారు. చైనాను అడ్డుకునే కీలకమైన ఆసియా పాలసీలో భాగంగా తమ ఎయిర్ ఫోర్స్ కార్యకలాపాలను విస్తరించాలని భావిస్తున్నామని ఆయన వెల్లడించారు. ఇందులో భాగంగానే సింగపూర్‌లోని తూర్పు చాంగీ, థాయ్‌లాండ్‌లోని కోరట్, భారత్‌లోని త్రివేంద్రం, పిలిప్పీన్స్‌లోని ఇండోనేసియా, మలేసియాల్లోని క్యాంపులకు తమ జెట్‌లు పంపుతున్నామని హెర్బర్ట్ తెలిపారు.

రూపాయి విలువ పతనం

దేశంలో రూపాయి విలువ వేగంగా క్షీణిస్తోంది. ఆగస్టు 16న నాలుగు శాతం కోల్పోయి 62 రూపాయల కనిష్ట స్థాయికి చేరింది. ఒక్క రోజులోనే రెండు లక్షల కోట్ల రూపాయల మేరకు స్టాక్ మార్కెట్‌లో డబ్బుపెట్టిన వారు నష్టపోయారు. గత మూడు నెలలుగా రూపాయి విలువ పతనం కొనసాగుతోంది. రూపాయి పతనాన్ని అనికట్టడానికి ప్రభుత్వం, ఆర్.బి.ఐ తీసుకుంటున్న చర్యలు ప్రతికూల ఫలితాలను ఇవ్వడంతో స్టాక్ మార్కెట్లో షేర్ల ధరలు పడిపోతున్నాయి.

మహిళలపై ఆగని అత్యాచారాలు

దక్షిణ ముంబైలోని దిగువ పారెల్ ప్రాంతంలో 22 ఏళ్ల మహిళా ఫోటో జర్నలిస్ట్‌పై ఐదుగురు దుండగులు ఆగస్టు 22న సామూహిక అత్యాచారం చేశారు. 'లైఫ్ స్టైల్' అనే ఆంగ్లపత్రికలో పనిచేస్తూ పనిలో భాగంగా సహ ఉద్యోగితో 'శక్తి బట్టల మిల్' లోకి వెళ్లిన చోట ఈ దుర్ఘటన జరిగింది. జార్ఖండ్‌లోని లతేహార్‌లో మహిళా పోలీసుపై ఆగస్టు 23న సామూహిక అత్యాచారం చేశారు. గఢ్వాలో బంధువు అంత్యక్రియల కోసం రాత్రి వెలుతుండగా జగల్దాగా వద్ద జాతీయ రహదారిపై వాహనాలను దోచుకుంటున్న దొంగలు ఈమె కారును అడ్డగించి అత్యాచారానికి పాల్పడ్డారు.

ఆహార భద్రత బిల్లు ఆమోదం

లోక్‌సభలో ఆగస్టు 26న ఆహార భద్రత బిల్లు మూజువాణి ఓటుతో ఆమోదం పొందింది. దేశంలోని 82 కోట్ల మంది ప్రజలకు చౌకధరకే ఆహార ధాన్యాలను అందించేందుకు యుపిఎ ప్రభుత్వం ఈ పథకాన్ని తెచ్చింది. ఈ పథకానికి ఏడాదికి రు. 1.30 లక్షల కోట్లు ఖర్చు కానుంది. పథకం అమలుకు ఏటా 6.2 కోట్ల టన్నుల ఆహార ధాన్యాలు అవసరం. ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన 300 సవరణలు వీగిపోయాయి. వీ

ఇరాన్ కొత్త అధ్యక్షుడు

ఇరాన్ కొత్త అధ్యక్షుడిగా హసన్ రోహానీ ఎన్నికయ్యారు. జూలై 5న ప్రమాణ స్వీకారం చేశారు. మాజీ అధ్యక్షుడు మహమ్మద్ అహ్మదినెజాద్ పదవీ కాలం ముగియడంతో జరిగిన ఎన్నికల్లో హసన్ రోహానీ విజయం సాధించారు. అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన హసన్ తన మంత్రివర్గ సభ్యుల జాబితాను ప్రకటించారు.

వాషింగ్టన్ పోస్ట్ అమ్మకం

అమెరికాలోనే కాక ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ది వాషింగ్టన్ పోస్ట్ పత్రికను అమెజాన్.కామ్ కంపెనీ సొంతం చేసుకుంది. ఈ విషయాన్ని వాషింగ్టన్ పోస్ట్ చైర్మన్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ డోనాల్డ్ ఇ. గ్రహం తెలిపారు. గత ఎనిమిది దశాబ్దాలుగా ఈ పత్రికను గ్రహం కుటుంబం నడిపింది. జెఫ్ బెజాస్ ఈ పత్రికను 250 మిలియన్ డాలర్లకు కొనుగోలు చేశాడు.

ఎడ్వర్డ్ స్నోడెన్‌కు- రష్యా ఆశ్రయం

అమెరికా జరుపుతున్న అరాచక, దారుణమైన చట్ట ఉల్లంఘనలకు సంబంధించిన సమాచారాన్ని ప్రపంచానికి తెలిపిన ఎడ్వర్డ్ స్నోడెన్‌కు రష్యాలో సంవత్సరం పాటు ఆశ్రయం పొందడానికి రష్యా ప్రభుత్వం ఆగస్ట్ 1న అంగీకరించింది. దీంతో కొంత కాలంగా మాస్కో విమానాశ్రయంలో తలదాచుకుంటున్న స్నోడెన్ సంవత్సరం పాటు అంటే జూలై 31, 2014 వరకు స్వేచ్ఛగా రష్యాలో తిరగడానికి అనుమతి లభించింది. స్నోడెన్ అనుమతి లేనిదే అమెరికా కోరినా కూడా అతన్ని అప్పగించే అధికారం ఉండదు. స్నోడెన్ మాస్కో విమానాశ్రయంలో జూన్ 23న అడుగుపెట్టాడు.

బ్రాడ్లే మానింగ్‌కు శిక్ష

అమెరికా సైనిక రహస్యాలను వికీలీక్స్‌కు అందించాడనే నేరారోపణ ఎదుర్కొంటున్న బ్రాడ్లే మానింగ్‌కు శిక్షపడింది. 21 నేరాల్లో, 19 నేరాలలో అతడు నిందితుడుగా తేలాడని, అతనికి 136 సంవత్సరాల కారాగార శిక్ష విధిస్తూ జూలై 30న కోర్ట్ మార్షల్‌లో జడ్జ్ కల్నల్ డెనిస్ లిండ్ తీర్పు చెప్పారు. మానింగ్‌కు వేసిన శిక్ష ఇక ముందు అమెరికా రహస్యాలు బయటపెట్టే వారికి ఒక హెచ్చరిక లాంటిదని తెలిపింది.

ఈజిప్ట్ సంక్షోభం

ఈజిప్ట్ సైన్యం చేత పదవీచ్యుతుడైన అధ్యక్షుడు మోర్సీ మద్దతు దారులు, ముస్లిం బ్రదర్‌హుడ్ వర్గాలకు సైనిక ప్రభుత్వ దళాలకు నడుమ ఘర్షణలు యుద్ధరూపం దాల్చాయి. ఆగస్ట్ 14న ప్రభుత్వ వర్గాలు బ్రదర్‌హుడ్ నిరసన శిబిరం మీద దాడి జరపడంతో వందలాది మంది బ్రదర్‌హుడ్ సానుభూతిపరులు మరణించారు. అధికారిక లెక్కల ప్రకారం 173 మంది మాత్రమే అని చెబుతున్నా, అనధికార లెక్కల ప్రకారం దాదాపు ఎనిమిది వందల మంది నిరసనకారులు మరణించారని బ్రదర్‌హుడ్ తెలిపింది. ఇలా ఉండగా, ఈజిప్ట్ మాజీ అధ్యక్షుడు హోస్నీ ముబారక్‌ను న్యాయస్థాన ఆదేశాల మేరకు ఆగస్ట్ 22న జైలు నుండి విడుదల చేశారు. నిరసనకారులపై హత్యలు, అణచివేతలు, అవినీతి, అధికార దుర్వినియోగం ఆరోపణలపై విచారణ ఎదుర్కొంటున్న ముబారక్ గత కొంత కాలంగా జైలు నిర్బంధంలో ఉన్నారు.

సిరియా సంక్షోభం

అధికార అసద్ వర్గాలకు ప్రతిపక్ష తిరుగుబాటు వర్గాలకు మధ్య ఘర్షణలు కొనసాగుతున్నాయి. ఆగస్ట్ 21న ప్రభుత్వ తిరుగుబాటు దారుల ఆధీనంలో ఉన్న డమాస్కస్ పశ్చిమ, దక్షిణ ప్రాంతాల మీద జరిగిన రసాయనాయుధాల దాడిలో 1300 మంది మరణించారు. మరణించిన వారిలో పిల్లలు, మహిళలు కూడా ఉన్నారు. ప్రభుత్వ సైనిక వర్గాలు దాడికి పాల్పడ్డాయని ఆరోపణలుండగా, అసద్ ప్రభుత్వం ఖండించింది. ఈ దాడి ఐక్యరాజ్య సమితి ప్రతినిధుల పరిశోధన బృందాన్ని రానీయకుండా చేయడమేనని అన్నారు.

అల్‌ఖైదా దాడులు

జూలై 29, 30 తేదీల్లో దక్షిణ బాగ్దాద్‌లోని మోసుల్ ప్రాంతంలో అల్‌ఖైదా ఫ్రంట్ గ్రూప్ జరిపిన దాడులలో 22 మంది మరణించారు. ఇందులో ఐదుగురు పోలీసులు ఉన్నారు. జూలై 29న సెంట్రల్ సెతెర్న్ ఇరాక్ వరుస కారు బాంబు దాడులతో అట్టుడికి పోయింది.

పాకిస్తాన్ అధ్యక్ష ఎన్నికలు - తాలిబన్ దాడులు

జూలై 30న జరిగిన పాకిస్తాన్ అధ్యక్ష ఎన్నికల్లో ప్రముఖ వ్యాపారి, ప్రధాని నవాజ్ షరీఫ్ సన్నిహితుడు మామ్నూక్ హుసేన్ (70) అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఎన్నికల రోజునే తాలిబన్‌లు పాకిస్తాన్ డెరా ఇస్మాయిల్ జైలు మీద దాడి జరిపి 250 మంది ఖైదీలను విడిపించుకున్నారు. ఈ దాడిలో 13 మంది జైలు సిబ్బంది మరణించారు. ఆగస్ట్ రెండవ వారంలో జరిగిన దాడులలో ఒక డిఐజి స్థాయి అధికారితో సహా 28 మంది మరణించారు.

కువైట్ పార్లమెంట్ ఎన్నికలు

కువైట్ ప్రజలు ఏడు సంవత్సరాల వ్యవధిలో ఆరవ సారి యాభై మంది సభ్యులు గల పార్లమెంట్ ఎన్నికకు జూలై 27న ఓటు వేశారు. ఈ ఎన్నికలలో 52.5 శాతం పోలింగ్ నమోదైంది.

జింబాబ్వే ఎన్నికలు

జూలై 31న జరిగిన జింబాబ్వే పార్లమెంట్ అధ్యక్ష ఎన్నికలలో రాబర్ట్ ముగాబే (89) విజయం సాధించారు. బ్రిటన్ నుండి 1980లో స్వాతంత్ర్యం పొందిన తరువాత 33 ఏళ్లు నిరంతరాయంగా ముగాబే అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

మధ్య ఆఫ్రికా అధ్యక్ష ప్రకటన

గడిచిన మార్చ్‌లో అప్పటి మధ్య ఆఫ్రికా అధ్యక్షుడు ఫ్రాంకొయిజ్ బొడాజ్‌ను పదవీచ్యుతిడిని చేసిన తర్వాత సెలికా రెబల్ సంకీర్ణ పార్టీ నాయకుడు మైఖెల్ బొటాడియా తనకు తానుగా ఆగస్ట్ 18న అధ్యక్షునిగా ప్రకటించుకున్నారు. మరో 18 నెలల్లో అధ్యక్ష ఎన్నికలు జరగవలసి ఉంది. వీ

అసహజ మరణాల సూచి

సంకలనం : వై. రామచంద్రం

మరణం ఎప్పుడయినా విషాద సూచకమే. మృతుల బంధువులకూ, మిత్రులకూ విచారకరమే కాని అందులోనూ మరణించిన మనిషి నిండు జీవితం గడిపి వయోభారంతోనే మరణిస్తే దాన్ని సహజ మరణంగా అంగీకరించి ఊరట పడవచ్చు. సగటు ఆయు ప్రమాణంలో సగం కూడా అనుభవించక ముందే మరణిస్తున్నారు. ఈ అసహజ మరణాలకు లెక్కలేనన్ని ఆర్థిక, సామాజిక, రాజకీయ కారణాలున్నాయి. మన పక్కనే మనతోనే ఉండే మనుషులు అర్ధాంతరంగా అసహజంగా అకాలంగా అదృశ్యమైపోతున్నారు. ఇటువంటి అసహజ మరణాలు ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇవి సామాజిక సంక్షోభానికి, సమాజం దిగజారుడుకు ఒక చిహ్నం. మన రాష్ట్రంలో సాలీనా ఈ రకంగా చనిపోతున్న వారి సంఖ్య వేలల్లోనే ఉంటుందని అంచనా. నిజానికి అసహజ మరణాలన్నీ అసహజ మరణాలుగా నమోదు కావడం లేదు గనుక ఈ సంఖ్య వాస్తవంలో ఒక భాగం మాత్రమే కావచ్చు. పత్రికలలో అచ్చయిన ఇటువంటి ఘటనలన్నిటినీ ఒక్కచోట నమోదు చేయాలని భావిస్తున్నాం. ఈ శీర్షిక ప్రతి నెల ఉంటుంది. అయితే రాష్ట్రంలో ప్రతి గ్రామంలో జరుగుతున్న సంఘటనలన్నీ ఇక్కడ రిపోర్ట్ కాకపోవచ్చు. కొన్నయినా మనల్ని ఆలోచింపజేస్తే, మనం మనచుట్టూ ఉన్న మనుషులకోసం ఇంకాస్త బాధ్యతగానూ, జాగ్రత్తగాను వ్యవహరిస్తూ మొత్తంగా పరిష్కారాలవైపు వెళ్లడానికి ఏమయినా తోడ్పడితే ఈ శీర్షిక విజయవంతమైనట్లే.

(1 జూలై నుండి 31 జూలై 2013 వరకు 11 జిల్లాలలో అసహజ మరణాల పాలైన వారి సంఖ్య – 1017)

జిల్లా	ఆకలి	ఆత్మహత్యలు				చికిత్స అందక, అనారోగ్యం			గుర్తు తెలియని		హత్యలు		ప్రమాదాలు				పోలీసు కాల్పుల్లో		పోలీసులు, సైన్యం	మిస్సింగ్/ లాకప్ మరణాలు	ప్రకృతి వైపరీత్యాలు
		వ్యవసాయ రంగం	చేనేత రంగం	ఇతరాలు స్త్రీ	ఇతరాలు పు.	స్త్రీ	పు.	పి.	స్త్రీ	పు.	స్త్రీ	పు.	పనిచేసే స్థలంలో	కరెంట్	రహదారి	ఇతరాలు	ఉద్యమ కారులు	ఇతరులు			
(1)	(2)	(3)	(4)	(5)	(6)	(7)	(8)	(9)	(10)	(11)	(12)	(13)	(14)	(15)	(16)	(17)	(18)	(19)	(20)	(21)	(22)
ఆదిలాబాద్	2	3	–	18	14	3	3	–	–	–	3	3	1	1	24	26	–	–	–	2	3
మహబూబ్‌నగర్	–	–	–	18	17	3	3	1	3	1	10	18	18	12	40	21	–	–	1	–	–
హైదరాబాద్	–	–	–	10	14	–	–	–	–	8	3	9	–	–	10	42	–	–	–	8	–
మెదక్	–	2	–	7	8	4	5	1	–	3	–	–	4	2	26	29	–	–	–	–	
నిజామాబాద్	–	–	–	5	11	–	–	2	–	5	–	5	3	6	15	11	–	–	–	–	3
కరీంనగర్	వివరాలు అందలేదు																				
రంగారెడ్డి	–	4	–	10	5	4	5	3	5	6	1	5	7	12	26	11	–	–	–	–	3
వరంగల్	–	6	1	6	7	8	5	6	–	–	–	–	2	8	18	20	–	–	–	–	3
ఖమ్మం	వివరాలు అందలేదు																				
అనంతపూర్	–	4	4	18	4	1	1	2	2	1	1	6	3	3	25	4	–	–	–	–	–
విజయనగరం	–	–	–	5	6	2	1	3	3	10	6	1	–	3	22	10	–	–	–	–	3
శ్రీకాకుళం	–	–	–	1	1	3	5	3	–	5	3	4	–	2	21	6	–	–	–	–	2
నెల్లూరు	వివరాలు అందలేదు																				
విశాఖపట్నం	–	–	–	3	11	2	–	–	–	6	1	1	9	2	15	18	–	–	–	9	–
మొత్తం	2	19	5	101	98	30	28	21	13	45	28	52	47	51	242	198	–	–	1	19	17

వీక్షణం దగ్గర అమ్మకానికి ఉన్న పుస్తకాలు

ఆర్థిక వ్యవస్థ – సామ్రాజ్యవాదం

ఒక దళారీ పశ్చాత్తాపం	జాన్ పెర్కిన్స్	రు. 50
కుట్రాజకీయం	స్టీఫెన్ కింజర్	40
అభివృద్ధిని ఇలా చూద్దాం	ముదునూరి భారతి	80
కొత్తచూపు	ఆర్.ఎస్. రావు	120
ఊరి దారి	ఎన్. వేణుగోపాల్	60
రాబందు వాలిన నేల	ఎన్. వేణుగోపాల్	180
వ్యవసాయం – ప్రపంచీకరణ	కె.ఆర్. చౌదరి	100
సామాజిక విద్య – ఒకమిథ్య	ఎ. నర్సింహారెడ్డి	100
ప్రజా ఎజెండా లేని పార్లమెంటరీ రాజకీయాలు	ఎ. నర్సింహారెడ్డి	40
ఒక ప్రేతాత్మక కథ	అరుంధతీ రాయ్	25
రాజ్యం – సంక్షేమం	కె. బాలగోపాల్	100

తెలంగాణ

లేచినిలిచిన తెలంగాణ	ఎన్. వేణుగోపాల్	120
తిరగబడ్డ తెలంగాణ	ఇనుకొండ తిరుమలి	100
తెలంగాణ రాజకీయాలు	దాగ్మార్ బెర్న్‌స్టార్ఫ్, హ్యూగ్ గ్రే	80

శాస్త్రవిజ్ఞానం

విశ్వాంతరాళం	కొడవటిగంటి రోహిణీప్రసాద్	90
మానవ పరిణామం	కొడవటిగంటి రోహిణీప్రసాద్	90
జీవకణాలూ నాడీకణాలూ	కొడవటిగంటి రోహిణీప్రసాద్	80
ప్రకృతీ – పర్యావరణం	కొడవటిగంటి రోహిణీప్రసాద్	90
అణువుల శక్తి	కొడవటిగంటి రోహిణీప్రసాద్	100
జీవశాస్త్ర విజ్ఞానం – సమాజం	కొడవటిగంటి రోహిణీప్రసాద్	100
మనుషులు చేసిన దేవుళ్లు	కొడవటిగంటి రోహిణీప్రసాద్	100
విజ్ఞాన శాస్త్రం మనిషి విస్తరణ	జెడి బెర్నాల్	80

కులం–మతం

శూద్రవర్ణం ఎలా పుట్టింది	ఆర్.ఎస్. శర్మ	80
కులం వర్గం	బొజ్జా తారకం	30
ఎస్‌సి, ఎస్‌టి నిధులు, విధిలింపు - మళ్లింపు	బొజ్జా తారకం	40
ఎస్‌సి, ఎస్‌టిలపై అత్యాచారాలు	బొజ్జా తారకం	50
ఖైర్లాంజి	ఆనంద్ తేల్‌తుంబ్డే	100
గులాంగిరి	జోతిబా ఫూలే	40
కుల నిర్మూలన	అంబేద్కర్	30
రాముని కృష్ణుని రహస్యాలు	అంబేద్కర్	20
దళితులు – రాజ్యం	అంబేద్కర్	25
శూద్రులు – ఆర్యులు	అంబేద్కర్	8
ఆధునిక భారతదేశంలో అంటరానితనం	అంబేద్కర్	25
దాస్య విముక్తి కోసం	అంబేద్కర్	15
భారతదేశం ప్రజాస్వామ్యం	అంబేద్కర్	12
ఆంగ్లేయపాలకులు – అంటరానివాళ్లు	అంబేద్కర్	20
రాష్ట్రాలు – మైనారిటీలు	అంబేద్కర్	40
రాముని కృష్ణుని రహస్యాలు	అంబేద్కర్	20
మతతత్వంపై బాలగోపాల్	కె. బాలగోపాల్	150
దళిత	కె. బాలగోపాల్	120
దేవుని రాజకీయతత్వం	కంచె ఐలయ్య	70
నేను హిందూవు నెట్లయిత?	కంచె ఐలయ్య	80

సాహిత్య విమర్శ – వ్యాసాలు

గురజాడ దేశభక్తి	ఎన్. వేణుగోపాల్	20
మహోదయం	కె.వి.ఆర్.	200
పరామర్శ	నల్లూరి రుక్మిణి	80
సాహిత్యంపై బాలగోపాల్	కె. బాలగోపాల్	150
విరసం సాహిత్య విమర్శ	విరసం ప్రచురణ	150
కెవిఆర్ సాహిత్య వ్యాసాలు–1	శారదాంబ స్మారక కమిటీ	300
అలిశెట్టి ప్రభాకర్ కవిత	అలిశెట్టి మిత్రులు	150

చరిత్ర–జీవిత చరిత్ర

భారత చరిత్ర పరిచయ వ్యాసాలు	డి.డి. కొశాంబి	40
ప్రాచీన భారత దేశ చరిత్ర	కె. బాలగోపాల్	50
చరిత్రలో ఏం జరిగింది?	గార్డన్ చైల్డ్	రు. 80
తరతరాల భారతదేశ చరిత్ర	రొమిల్లా థాపర్	80
ఆధునిక భారతదేశ చరిత్ర	బిపిన్ చంద్ర	100
బాబాసాహెబ్ అంబేద్కర్	బి. విజయభారతి	70
కన్నబీరన్	వ్యాస సంకలనం	50
చేగువేరా	కాత్యాయని	80
ఒక సెక్స్ వర్కర్ ఆత్మ కథ	నళినీ జమీలా	50
పరాయి పాలనను ఎదిరించిన ఝాన్సీ	మహాశ్వేతాదేవి	150
నిర్జన వారధి	కొండపల్లి కోటేశ్వరమ్మ	100
ఇంట్లో ప్రేమ్‌చంద్	శివరాణీ దేవి	120
పరిచయాలు	ఎన్. వేణుగోపాల్	50
నా ప్రజాజీవితం	పెండ్యాల రాఘవరావు	50
ఆర్.ఎస్.రావు స్మృతిలో	వ్యాస సంకలనం	50
హక్కుల బాటసారి	బుర్ర రాములు రచనలు	50
నిగాహ్	కె. బాలగోపాల్ వ్యాస సంకలనం	200
ఛత్రపతి సాహూ మహరాజ్	కాత్యాయని	40

విప్లవోద్యమం

పోలీసులు అరెస్ట్ చేస్తే	బొజ్జా తారకం	30
భారత్‌పై అరుణతార	యాన్ మిర్డాల్	100
జంగల్‌నామా	సత్నామ్	100
జనహృదయం జనార్దన్	సూరపనేని మోహనరావు	60
కోటి జ్ఞాపకాలు	విరసం ప్రచురణ	50

తత్వశాస్త్రం

మార్క్సిస్ట్ సాహిత్య విమర్శ	డా. శ్రీనివాస్	100
లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్ ప్రచురణలు అన్నీ		

కథ – నవల

గంగానమ్మ	విజయ	15
రుదాలి	మహాశ్వేతాదేవి	45
ఏడుతరాలు	అలెక్స్ హేలీ	80
కథలగూడు	దేవులపల్లి కృష్ణమూర్తి	60
పథేర్ పాంచాలి	బిభూతిభూషన్ బంధోపాధ్యాయ	100
వనవాసి	బిభూతిభూషన్ బంధోపాధ్యాయ	100
చంద్రగిరి శిఖరం	బిభూతిభూషన్ బంధోపాధ్యాయ	50
అపరాజితుడు	బిభూతిభూషన్ బంధోపాధ్యాయ	100
నేల నాగలి – మూడెద్దులు	బొజ్జా తారకం	25
పంచతంత్రం	బొజ్జాతారకం	100
ఇస్మత్ చుగ్తాయి కథలు	ఇస్మత్ చుగ్తాయి	100
పంచమం	చిలుకూరి దేవపుత్ర	100
అజేయుడు	అలెగ్జాండర్ డ్యూమా	160
ఘంటారావం	విక్టర్ హ్యూగో	100
స్పార్టకస్	హోవార్డ్ ఫాస్ట్	80
రేపటి కల	రిచర్డ్ రైట్	50

Fifty Years of Andhra Pradesh	**(1956-2006)**	300
Towards Understanding Semi Feudal - Semi Colonial Society	R.S. Rao	300
In search of Method	Mudunuri Bharathi	200
Individual Sub-groups, Groups and Freedom	Mudunuri Bharathi	75
Crisis and Development in Marxian Framework	Mudunuri Bharathi	80
Methodoly of Social Enquiry	Mudunuri Bharathi	150
On Education	Mudunuri Bharathi, R.S. Rao	100
Understanding Maoists	N. Venugopal	300

వీక్షణం, మైత్రి రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3,
హిమాయత్‌నగర్, హైదరాబాద్ - 500 029.
ఫోన్ : 040-66843495
Email: veekshanam2003@gmail.com, www.veekshanam.wordpress.com

VEEKSHANAM Telugu Monthly Journal of Political Economy and Society - 146 - September 2013 ● **ISSN 2231-6892**
● RNI Regn.No.APTEL/2003/11482 ● Published on 29/8/2013 ● Postal Regn. No. L II/RNP/HD/1100/2011-13

వీక్షణం మీ నుంచి కోరుతున్నది
రచనా సహాయం, ఆర్థిక సహాయం

మీ వంటి వేలాది మంది పాఠకుల ఆదరాభిమానాలతోనే వీక్షణం నానాటికీ అభివృద్ధి చెందుతున్నదని మీకు తెలుసు. వీక్షణం తాను పెట్టుకున్న ప్రజా చైతన్య పురోగమన, విస్తరణ లక్ష్యాలకు మరింతగా చేరుకోవాలంటే మీవంటి అభిమానులు, పాఠకులు, రచయితలు, దాతలు మరింతగా చేయూత నందించవలసి ఉంది. మీ చేయూత రచనల రూపంలో కావచ్చు, ఆర్థిక సహాయం రూపంలో కావచ్చు.

వీక్షణంకు రచయితల నుంచి, అభిమానుల నుంచి రచనలు గణనీయంగానే అందుతున్నప్పటికీ ఇంకా ఎక్కువ, ఇంకా నాణ్యమైన రచనలు రావలసి ఉంది. అందుకు మీ పూనిక అవసరం. వీక్షణం మూడు రకాల రచనలకు ప్రాధాన్యతనిస్తుంది : 1) ప్రధాన స్రవంతి ప్రచార సాధనాలలో విరివిగా సమాచారం వస్తున్నప్పటికీ ప్రజానుకూల విశ్లేషణ లేని అంశాలపై ప్రజా దృక్కోణం నుంచి లోతైన విశ్లేషణలు. 2) ప్రధాన స్రవంతి ప్రచార సాధనాలు సాధారణంగా విస్మరించే ప్రజా జీవన పరిణామాల గురించి సమాచార, విశ్లేషణా రచనలు. 3) ఏ సమాచారాన్నయినా అర్థం చేసుకోవడానికి అవసరమైన పనిముట్లు అందించే దృక్పథ ప్రధానమైన రచనలు.

వీక్షణం ఆర్థిక స్థితి సమస్యాత్మకంగా ఉన్నదని, ఏ నెలకానెల అన్నట్టుగా సాగుతున్నదని మీకు ఎప్పటికప్పుడు నివేదిస్తూనే ఉన్నాం. ప్రతి సంచిక ఆర్థిక లోటుతో నడుస్తున్నది. వ్యక్తిగత చందాలు, సంస్థల చందాలు, పుస్తకాల అమ్మకాలు, విరాళాలు, ప్రకటనలు వంటి వనరులన్నీ ఇంకా పెరిగితే గాని పత్రిక మనుగడ సుస్థిరం కాదు. వీక్షణం అభిమానులు, పాఠకులు ప్రతి ఒక్కరూ పూనుకుని తమ వంతు బాధ్యతగా చందాలు చేర్పించడం, విరాళాలు, ప్రకటనలు సేకరించడం వంటి అన్ని రూపాలలో ఆర్థిక సహాయం అందించడం అవసరం.

తెలుగు సమాజంలో ప్రగతిశీల ఆలోచనాధారలో, ప్రజానుకూల పత్రికల సంప్రదాయంలో

కృషి చేస్తున్న రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక వీక్షణం

తెలుగు సమాజం తనతో తాను చేసుకుంటున్న సంభాషణ వీక్షణం

ఈ సంభాషణను విస్తరిద్దాం! తెగిపోకుండా కాపాడుకుందాం!

Edited, printed, published and owned by N. Venugopal Rao, Printed at Deccan Press for Charitha Impressions, Azamabad, Hyderabad - 500 020
and Published at 3-6-394, Mythri Residency, Street No. 3, Himayatnagar, Hyderabad 500 029. Editor : N. Venugopal Rao